'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 241

శనివారం 22-11-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

## విశ్వ సుందరి ఫాతిమా

మెక్సికో భామ ఫాతిమా బాష్ ఫెర్నాండెజ్ విశ్వసుందరి కిరీటాన్ని దక్కించుకుంది. మిస్ థాయ్‌లాండ్ ప్రవీనర్ సింగ్ మొదటి రన్నరప్‌గాను, మిస్ వెనెజువెలా స్టెఫానీ అడ్రియానా అబాసలీ నసీర్ మూడో స్థానంలో నిలిచారు. భారత సుందరి మణికా విశ్వకర్మ కిరీటం దక్కించుకోలేకపోయారు.

6లో

## కుప్పకూలిన 'తేజస్'

దుబాయ్ వైమానిక ప్రదర్శనలో భారత్ యుద్ధ విమానం 'తేజస్' ప్రమాదవశాత్తూ కుప్పకూలగా.. పైలట్ మృతి చెందారు.

వివరాలు 6లో ▶

## పూర్తి సంతృప్తితో వెళ్తున్నా..

ప్రజలకు తన వంతు సేవలందించానని.. సంతృప్తితో పదవీవిరమణ చేయబోతున్నానని సీజేఐ జస్టిస్ గవాయ్ అన్నారు.

వివరాలు 6లో ▶

## 'గర్భధారణ'కు జెనెటిక్ స్విచ్

మహిళల్లో గర్భధారణకు అంకురార్పణ చేసే అత్యంత మౌలికమైన జెనెటిక్ స్విచ్‌ను మన సైంటిస్టులు కనిపెట్టారు.

వివరాలు 6లో ▶

## మార్చి 16 నుంచి 'పది' పరీక్షలు

ఏపీలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9.30 నుంచి నిర్వహించనున్నారు.

వివరాలు 16లో ▶

నాడు అడ్వాన్స్‌లు తీసుకునేవాన్ని.. నేడు బతిమాలు కుంటున్నా..

నేను 20 ఏళ్ల నుంచి 10-15 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నా. ఈ ఏడాది కూడా ధర బాగుంటుందని 12 ఎకరాల్లో పండించా. రూ.15 లక్షల వరకు పెట్టుబడి అయింది. పంట చేతికొచ్చే సరికి అడిగేవారు లేరు. గతంలో ఇంటి దగ్గరకు వచ్చి అడ్వాన్స్ తీసుకో అని బతిమలాడేవారు. ఇప్పుడు బాబూ ఎంతో కొంత ఇచ్చి గెలలు కొట్టుకోవాలని బతిమాలుతున్నా ఎవరూ పట్టించుకో వడం లేదు. దీంతో తోటను దున్నేశాం. పెట్టుబడిలో రూపాయి కూడా రాలేదు. - గుర్నాథరెడ్డి, చిన్నవంగలి, ఆళ్లగడ్డ, నంద్యాల జిల్లా

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో రైతులు పడేసిన అరటి గెలలను మేస్తున్న పశువులు

# అరటి రైతు ఆశలు 'గెల్ల'ంతు

## పంట ధరలు దారుణంగా పతనంతో కుదేలైన అన్నదాతలు

టన్ను రూ.500.. అంటే కేజీ అర్ధ రూపాయికి పడిపోయిన వైనం

ఎకరాకు రూ.లక్షన్నర పెట్టుబడి... రూ.15 వేలు రావడమూ కష్టమే

మూడేళ్లుగా టన్ను రూ.25 వేలు... ప్రస్తుతం రూ.వెయ్యి లోపే..

ధర అమాంతం పడిపోతున్నా పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం

8లో

- వరి, పత్తి, మిర్చి, టమాట, మామిడి, మొక్కజొన్న, కంది, కొబ్బరి, వేరుశనగ.. 18 నెలలుగా రాష్ట్రంలో పంట ఏదైనా అన్నదాతకు మిగిలేది ఆక్రందనే!
- మద్దతు ధరల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది
- అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని మోసం
- తొలి ఏడాది నిస్సిగ్గుగా ఎగ్గొట్టిన చంద్రబాబు ప్రభుత్వం
- రెండేళ్లకు ప్రతి రైతుకు ఇవ్వాల్సింది రూ.40 వేలు.. కానీ ఇచ్చింది రూ.10 వేలే..
- అడ్డగోలు కోతలతో 7 లక్షల మందికి ఎగవేత.. కౌలు రైతులకు గుండుసున్నా
- ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమాను గాలికొదిలేసిన బాబు సర్కార్
- పరిస్థితి ఇలా ఉండగా అన్నదాతలను ఆదుకోకుండా చంద్రబాబు కొత్త డ్రామా
- రైతన్నా మీ కోసం.. పంచ సూత్రాలు అంటూ మభ్యపెట్టే ఎత్తుగడ

- వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో అరటి రైతుకు మహర్దశ
- ఏటా పెరిగిన సాగు విస్తీర్ణం.. అందుకు తగ్గట్టే భారీగా దిగుబడులు
- రికార్డు స్థాయిలో టన్ను రూ.30 వేలకు పైగా పలికిన ధర.. ఎగుమతుల్లో ఘనత
- ఐదేళ్లలో 3 లక్షల టన్నులు ఎగుమతి
- అనంతపురం నుంచి ముంబైకు ప్రత్యేకంగా కిసాన్ రైలు

కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో

# ఇంత నిర్లక్ష్యమా?

## చంద్రబాబు సర్కారు నిర్వాకాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ లేఖ

కేడబ్ల్యూడీటీ-2లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున దాఖలు చేసిన అఫిడవిట్టే మీ నిర్లక్ష్యానికి నిదర్శనం

బచావత్ ట్రిబ్యునల్ అవార్డును పునఃసమీక్షించడం అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం ప్రకారం చట్టవిరుద్ధం

2లో

- విభజన చట్టం 11వ షెడ్యూల్ బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను యథాతథంగా కొనసాగించాలని చెప్పింది
- కేడబ్ల్యూడీటీ-2కు కేంద్రం 2023లో జారీ చేసిన అదనపు మార్గదర్శకాలు చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టులో కేసు వేశాం
- ఆ కేసులో సమర్థంగా వాదనలు వినిపించ డంలో బాబు ప్రభుత్వం ఘోర వైఫల్యం
- దానివల్లే అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం, విభజన చట్టానికి విరుద్ధంగా కేడబ్ల్యూడీటీ-2 వాదనలు వింటోంది
- కృష్ణా జలాల్లో 763 టీఎంసీలు ఇవ్వాలని తెలంగాణ సర్కార్ వాదిస్తోంది
- ట్రిబ్యునల్ విచారణ చేస్తుండగానే అదనంగా 372.54 టీఎంసీలు తరలించేలా, 16 ప్రాజెక్టులు చేపట్టేందుకు తెలంగాణ ఉత్తర్వులు.. అయినా సరే మీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది
- కేడబ్ల్యూడీటీ-2లో తుది వాదనలనైనా సమర్థంగా వినిపించండి బాబూ..
- బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 512 టీఎంసీలు నికర జలాల్లో.. ఒక్క టీఎంసీ తగ్గినా దానికి మీరే బాధ్యత వహించాలి
- 1995-2004 మధ్య మీ నిర్వాకం వల్లే కర్ణాటక సర్కార్ ఆల్మట్టి ఎత్తును 524.25 మీటర్లకు పెంచేసింది
- ఇప్పుడు నీటి నిల్వ ఎత్తును 519.6 నుంచి 524.25 మీటర్లకు పెంచే దిశగా అడుగులు వేస్తోంది.. దీని వల్ల ఆల్మట్టిలో అదనంగా వంద టీఎంసీలు నిల్వ చేసే అవకాశం
- కేడబ్ల్యూడీటీ-2 అవార్డు అమల్లోకి రాక ముందే ఆల్మట్టి ఎత్తును కర్ణాటక పెంచేస్తున్నా చంద్రబాబు చేష్టలుడిగి చూస్తున్నారు

## న్యూస్‌రీల్

### సీఎస్‌గా విజయానంద్‌కు పొడిగింపు!

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్‌ను మరో మూడు నెలలు కొనసాగించడానికి సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

వివరాలు 12లో ▸

### ఉద్యోగ భద్రత, ఠంచనుగా వేతనాలు

దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం, భద్రతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు కార్మిక కోడ్‌లను అమల్లోకి తీసుకొచ్చింది.

వివరాలు 6లో ▸


నేటి గుడ్డు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| 12 గుడ్ల రిటైల్ ధర ₹90 | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 108 కిలో | డ్రెస్స్‌డ్ స్కిన్‌తో | 196 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 135 కిలో | స్కిన్ లెస్ | 223 కిలో |

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

తిరుమలలోని శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న రాష్ట్రపతి ముర్ము

## శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము

3లో

భక్తులకు ఆత్మీయ పలకరింపు

క్షేత్రసంప్రదాయం పాటిస్తూ తొలుత శ్రీ భూవరాహస్వామిని దర్శించుకున్న ద్రౌపది ముర్ము

## ఆలస్యమైనా న్యాయం గెలుస్తుంది

- ఏసీబీ కోర్టులో చెప్పిన మాటలపై చెవిరెడ్డి బహిరంగ లేఖ
- 3 దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాం.. ఇప్పుడు నా పిల్లలు కొనసాగిస్తున్నారు
- నిజాయితీగానే క్రయ, విక్రయాలు చేశాం
- రియల్ ఎస్టేట్ వ్యాపారానికి.. అన్యాయంగా లిక్కర్‌ను ముడిపెట్టారు
- నా జీవితంలో మద్యం అన్న మాటకు చోటేలేదు.. అవాస్తవాలతో మా కుటుంబంపై బురద చల్లడం దారుణం

12లో

అబద్ధాలు సరికాదన్నందుకు

## ఊస్టింగే బహుమానం

- వైఎస్ వివేకా కేసులో తనపై నిందలేశారన్న సీఐ శంకరయ్య
- తనకు ప్రమోషన్ రాకపోయినా వచ్చిందన్న ప్రచారంపై కలత.. దుష్ప్రచారంతో పరువు నష్టం కలిగించారని ఆవేదన
- మానసిక వేదనకు గురి చేశారని నోటీసులు
- నాకే నోటీసులిస్తావా అంటూ కక్షగట్టిన? కళ్లెర్ర చేసిన సీఎం చంద్రబాబు
- ఫలితంగా పగబట్టి ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు

12లో

# ప్రైవేటుకే 'అసైన్డ్'

## పేదల భూములపై ఉక్కుపాదం

- ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టేలా చట్ట సవరణకు రంగం సిద్ధం
- ఆర్డినెన్స్ జారీకి కసరత్తు.. ఇటీవలే కేబినెట్‌లో ఆమోదం.. ఈ ఫైలును అత్యవసరంగా కేబినెట్ ముందుకు సర్క్యులేట్ చేయించిన సీఎం
- అసైన్డ్ భూములకు హక్కులిచ్చి ఫ్రీ హోల్డ్ చేసిన వైఎస్ జగన్
- వాటిని ఎడాపెడా ప్రైవేటుకు కట్టబెట్టేందుకు చంద్రబాబు సర్కారు పన్నాగం
- ఇందులో భాగంగా ఇప్పటికే ఫ్రీ హోల్డ్ చేసిన అసైన్డ్ భూములను వివాదంగా మార్చిన వైనం.. 16 నెలలుగా వాటిని 22-ఏ జాబితాలో పెట్టిన బాబు సర్కారు
- ఇప్పుడు ఏకంగా వాటిని ఇష్టం వచ్చినట్లు ప్రైవేటుకు ఇచ్చేందుకు బరితెగింపు

12లో


మీ డబ్బు, మీ హక్కు!

భారత ప్రభుత్వ చొరవతో



ప్రతీ LIC పాలసీ - సంరక్షణ, భద్రత, మెరుగైన రేపటి కోసం ఒక హామీని కలిగి ఉంటుంది. కొన్ని సార్లు కొత్త ఇళ్ళు, కొత్త నగరాలు లేదా కొత్త ప్రారంభాలతో జీవితంలో మార్పులు సంభవిస్తుంటాయి. మీరు ఎక్కడవున్నా కష్టపడి సంపాదించిన డబ్బు ఎల్లప్పుడూ మీకే తిరిగి రావాలి.

క్లెయిమ్ చేయబడని మీ డబ్బుని 3 దశల్లో క్లెయిమ్ చేసుకోండి:

- www.licindia.in సందర్శించి
- పాలసీదారుల క్లెయిమ్ చేయని అమోంట్స్ పై క్లిక్ చేయండి
- వివరాలు నమోదు చేయండి

లేదా QR కోడ్‌ని స్కాన్ చేయండి

LIC లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా LIFE INSURANCE CORPORATION OF INDIA

జీవితాంతం - జీవితానంతరం కూడా.

సందర్శించండి: licindia.in

కాల్ సెంటర్ సర్వీసు (022) 6827 6827

మా వాట్సాప్ నం. 8976862090 'Hi' పంపండి

వివరాల కొరకు, మీ ఏజెంట్‌ని/సమీపంలో ఉన్న ఎల్ఐసీ బ్రాంచిని సంప్రదించండి/www.licindia.inని సందర్శించండి.

మమ్మల్ని ఫాలో అవ్వండి: LIC India Forever I IRDAI Regn No.: 512

LIC/R1/2025-26/25/Tel

# కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో ఇంత నిర్లక్ష్యమా?

## సీఎం చంద్రబాబు సర్కారు నిర్వాకాలను ఎండగడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ లేఖ

**సాక్షి, అమరావతి:** కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల పరిరక్షణలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా? అంటూ సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలో జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్ర సభ్యులుగా ఉన్న కేడబ్ల్యూడీటీ–2 (కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్)లో.. కృష్ణా జలాలపై ఏపీ హక్కులను పరిరక్షించడం, ప్రయోజనాలను కాపాడటంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏమాత్రం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని, పేలవమైన వాదనలు వినిపిస్తోందని మండిపడ్డారు. కేడబ్ల్యూడీటీ–2లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అనిల్‌కుమార్ (ఏకే) గోయల్ దాఖలు చేసిన అఫిడవిట్.. తెలంగాణ ప్రభుత్వ సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసినప్పుడు, ఏకే గోయల్ ఇచ్చిన సమాధానాలే అందుకు నిదర్శనమని ధ్వజమెత్తారు. అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం–1956 సెక్షన్–6(2) ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–1) అవార్డు సుప్రీంకోర్టు డిక్రీతో సమానమని.. దాన్ని పునఃసమీక్షించడం చట్టవిరుద్ధమని.. ఇదే అంశాన్ని కేడబ్ల్యూడీటీ–2 కేంద్రానికి ఇచ్చిన తుది నివేదికలో స్పష్టం చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా నదులపై ఉన్న ప్రాజెక్టులకు ట్రిబ్యునళ్లు చేసిన నీటి కేటాయింపులు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టంగా పేర్కొందన్నారు. కేడబ్ల్యూడీటీ–2కు 2023 అక్టోబరు 6న కేంద్ర జల్‌శక్తి శాఖ జారీ చేసిన అదనపు విధి విధానాలు (టీవోఆర్) చట్టవిరుద్ధమని.. అందుకే వాటిని సవాల్ చేస్తూ నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిందని గుర్తు చేశారు. ఈ కేసులో టీడీపీ కూటమి ప్రభుత్వం సమర్థంగా వాదనలు వినిపించకపోవడం వల్లే.. కేంద్రం జారీ చేసిన అదనపు విధి విధానాల ప్రకారం విచారణ చేయాలని, తమ తీర్పునకు అనుగుణంగా తుది నిర్ణయం ఉంటుందని సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికైనా మేల్కొని రాష్ట్ర హక్కులను పరిరక్షించేలా.. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేలా తుది వాదనలు వినిపించటానికి చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబుకు వైఎస్ జగన్ హితవు పలికారు. ఈ మేరకు చంద్రబాబుకు ఆయన శుక్రవారం లేఖ రాశారు. తొమ్మిది పేజీలతో కూడిన ఆ లేఖను తన 'ఎక్స్' ఖాతాలో వైఎస్ జగన్ పోస్టు చేశారు. అందులో ఆయన ఏమన్నారంటే..

### బచావత్ ట్రిబ్యునల్ అవార్డు సుప్రీం కోర్టు డిక్రీతో సమానం..

అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం 1956లో సెక్షన్–6(2) బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–1) అవార్డు సుప్రీంకోర్టు డిక్రీతో సమానం. దాన్ని పునఃసమీక్షించడం చట్ట విరుద్ధమని కేడబ్ల్యూడీటీ–2 కూడా అభిప్రాయపడింది. అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 6, 2023న జారీ చేసిన అదనపు విధి విధానాలకు అనుగుణంగా, కేడబ్ల్యూడీటీ–1 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నికర జలాలు 811 టీఎంసీలు(75% లభ్యత) పునఃపంపిణీ చేయడం, కేడబ్ల్యూడీటీ–2 కేటాయించిన మిగులు జలాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు పంపిణీ చేయడంపై కేడబ్ల్యూడీటీ–2 విచారణ కొనసాగిస్తోంది. దీనిపై కేడబ్ల్యూడీటీ–2 ఎదుట గత సెప్టెంబరు 23, 24వ తేదీల్లో తుది వాదనలు కొనసాగాయి. కృష్ణా జలాల్లో కచ్చితంగా 763 టీఎంసీల నీరు కేటాయించాలని డిమాండ్ చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. అదే వాదనను కేడబ్ల్యూడీటీ–2 ఎదుట బలంగా వినిపిస్తోంది. అదే కనుక జరిగితే ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగినట్లే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా తుది వాదనలు వినిపించే అవకాశం ఉంది కాబట్టి.. కృష్ణా జలాలపై హక్కులను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా.

### చంద్రబాబు సర్కార్ వైఫల్యం వల్లే..

ఇప్పుడు కేడబ్ల్యూడీటీ–2 ఎదుట రాష్ట్రం తరఫున చంద్రబాబు సర్కార్ వినిపిస్తున్న వాదనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కేడబ్ల్యూడీటీ–2 తన తుది నివేదికను 2013 నవంబరు 29న కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తూ.. 'కృష్ణా జలాల కేటాయింపులపై కేడబ్ల్యూడీటీ–1 నిర్ణయాలు ఎలాంటి ప్రభావానికీ లోనై ఉండకూడనివి కావు. కాబట్టి వాటిని సమీక్షించడం అంటే కొత్తగా గందరగోళానికి తెర తీయడమే' అని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లోని 11వ షెడ్యూల్, క్లాజ్–4 ప్రకారం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా నదులపై ఉన్న ప్రాజెక్టులకు ట్రిబ్యునల్ కేటాయించిన జలాలు యథాతథంగా కొనసాగాల్సి ఉంది. ట్రిబ్యునల్ ప్రాజెక్టులకు చేసిన నీటి కేటాయింపుల్లో ఎలాంటి మార్పు ఉండకూడదు. కానీ, అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం, విభజన చట్టం 11వ షెడ్యూల్‌ను తుంగలో తొక్కుతూ కేంద్ర జలశక్తి శాఖ 2023 అక్టోబరు 6న అదనపు విధి విధానాలు జారీ చేస్తూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీలను రెండు తెలుగు రాష్ట్రాలకు పంపిణీ చేయాలని ఆదేశించింది. వెంటనే దాన్ని సవాల్ చేస్తూ, అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023 అక్టోబరు 9న సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఆ తర్వాత 2024 జూన్ 12న ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో సరైన వాదనలు వినిపించలేదు. ఫలితంగా కేంద్రం జారీ చేసిన అదనపు విధి విధానాలకు అనుగుణంగా కృష్ణా జలాల పంపిణీపై విచారణ చేపట్టాలని.. తుది నిర్ణయం తమ తీర్పునకు లోబడి ఉంటుందని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. వాటికి అనుగుణంగా 2024 ఆగస్టు 27న కేడబ్ల్యూడీటీ–2 విచారణ మొదలుపెట్టింది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలను పున:పంపిణీకి సంబంధించి రెండు రాష్ట్రాల వాదనలు ముందుగా వింటామని 2024, ఆగస్టు 29న కేడబ్ల్యూడీటీ–2 స్పష్టం చేస్తే టీడీపీ కూటమి ప్రభుత్వం ఎలా అంగీకరించింది? మొత్తం 36 అంశాలకు సంబంధించి రెండు రాష్ట్రాల సమ్మతికి అనుగుణంగా కృష్ణా జలాల నికర పున:పంపిణీపై విచారణ జరుపుతామని కేడబ్ల్యూడీటీ–2 వెల్లడించింది.

### కేటాయింపులకు బేసిన్ ప్రాతిపదిక కాదు..

కృష్ణా బేసిన్ తమ రాష్ట్రంలో 71 శాతం ఉన్నందు వల్ల 75 శాతం నీటి లభ్యత ఆధారంగా బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల నీటిలో తమకు కచ్చితంగా 71 శాతం జలాలు కేటాయించాల్సిందే అని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. కానీ.. నీటి కేటాయింపులను బేసిన్ ప్రాతిపదికన ఏ ట్రిబ్యునల్ కూడా చేయలేదని గుర్తు చేస్తూ బలంగా వాదనలు వినిపించడంలో టీడీపీ సర్కార్ విఫలమవుతోంది. ఇది దురదృష్టకరం. కృష్ణా జలాల కేటాయింపునకు సంబంధించి, గతంలో తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన అంశాలు ఒక్కసారి చూస్తే.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు కృష్ణా జలాలను పంపిణీ చేసేందుకు ఏప్రిల్ 10, 1969న జస్టిస్ బచావత్ నేతృత్వంలో కేడబ్ల్యూడీటీ–1ను కేంద్రం ఏర్పాటు చేయగా.. ఆ ట్రిబ్యునల్ మే 27, 1976న తుది నివేదిక ఇవ్వగా.. దాన్ని అమలు చేస్తూ నాలుగు రోజుల తర్వాత.. అంటే మే 31, 1976న ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. అప్పుడు కూడా కృష్ణా జలాల కేటాయింపులో కేడబ్ల్యూడీటీ–1 నదీ పరీవాహక ప్రాంతాన్ని పరిగణలోకి తీసుకోలేదు. కృష్ణా పరీవాహక ప్రాంతం 2,58,948 చదరపు కి.మీ కాగా, అందులో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 29.45 శాతం, అంటే 76,252 కి.మీ ఉంది. 75 శాతం నీటి లభ్యత ఆధారంగా నదిలో 2,130 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుందని కెడబ్ల్యూడీటీ–1 నిర్ధారణకు వచ్చింది. ఒకవేళ నదీ పరీవాహక ప్రాంతాన్నే పరిగణలోకి తీసుకుని ఉంటే, నాడు ఆ ప్రాంతం ఉన్న మన ఆంధ్రప్రదేశ్‌కు 2,130 టీఎంసీల నీటిలో 627.29 టీఎంసీలు మాత్రమే కేటాయించేవారు. అన్ని అంశాలు, సమగ్ర అధ్యయనం తర్వాత అంతర్జాతీయస్థాయిలో అనుసరించే ప్రమాణాలను ప్రాతిపదికగా తీసుకుని 'ఫస్ట్ ఇన్‌టైమ్ ఫస్ట్ ఇన్ రైట్' (ఎవరైతే ముందుగా ప్రాజెక్టు నిర్మించి, నీరు వినియోగిస్తారో వారికే తొలి హక్కు)ను అనుసరిస్తూ.. కేటాయింపులు జరిపింది. నాడు మన రాష్ట్రంలో తొలుత 1885–1928 మధ్య కర్నూలు–కడప కాలువ (కేసీ కెనాల్)తో పాటు కృష్ణా ఆయకట్టులో నీటి వినియోగం జరిగింది. ఆ ప్రాతిపదికన రాష్ట్రంలో కృష్ణా నీటి కేటాయింపుపై ప్రాజెక్టులను మూడు వర్గాలుగా విభజించి నిర్ణయం తీసుకున్నారు. 1951 నాటికి పూర్తయిన ప్రాజెక్టులు, 1951 నుంచి 1960 సెప్టెంబరు వరకు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, 1960 తర్వాత చేపట్టిన ప్రాజెక్టులుగా కేడబ్ల్యూడీటీ–1 వర్గీకరించింది. ఆ మేరకు పాత ప్రాజెక్టులకు 749.16 టీఎంసీలు, అప్పటికే ప్రతిపాదనలో ఉన్న జూరాలకు 17.84 టీఎంసీలు, శ్రీశైలం ప్రాజెక్టుకు 33 టీఎంసీలతో పాటు, పునరుత్పత్తి (రీజనరేషన్) అవసరాల కోసం మరో 11 టీఎంసీలు.. అన్నీ కలిపి నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల్లో మొత్తం 811 టీఎంసీలు కేటాయించారు. కేడబ్ల్యూడీటీ–1 కేటాయింపుల మేరకు రాయలసీమకు 144.7 టీఎంసీలు, కోస్తా ఆంధ్రాకు 387.24 టీఎంసీలు, తెలంగాణకు 278.96 టీఎంసీలు లభిస్తాయి. కృష్ణా డెల్టా ఆధునికీకరణతో మిగిలే 20 టీఎంసీలను తెలంగాణలోని భీమా ఎత్తిపోతలకు కేటాయించారు. తుదిగా రాయలసీమకు 144.7 టీఎంసీలు, కోస్తాంధ్రకు 20 టీఎంసీలు తగ్గి 367.24 టీఎంసీలు, తెలంగాణకు ఆ 20 టీఎంసీలు పెరిగి వాటా 298.96 టీఎంసీలకు పెరిగింది. అలా ఏపీకి 512.04 టీఎంసీలు, తెలంగాణకు 298.96 టీఎంసీల నీరు కృష్ణా జలాల్లో దక్కింది. ఆ మేరకే 2015, జూలై 18, 19 తేదీల్లో కేంద్రం, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తాత్కాలిక సర్దుబాటు ఒప్పందం జరిగింది.

### పంపిణీ చేయాల్సింది కేడబ్ల్యూడీటీ-2 కేటాయించిన మిగులు జలాలనే..

కేడబ్ల్యూడీటీ–1 అవార్డు గడువు ముగియడంతో 2004 ఏప్రిల్ 2న కేంద్ర ప్రభుత్వం కేడబ్ల్యూడీటీ–2 ను ఏర్పాటు చేసింది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర వాదనలు కూడా విన్న తర్వాత కేడబ్ల్యూడీటీ–2 ప్రాథమిక నివేదిక 2010 డిసెంబర్ 31న, తుది నివేదికను 2013 నవంబరు 29న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఆ నివేదికపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వేర్వేరుగా సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశాయి. కేడబ్ల్యూడీటీ–2 తుది నివేదికను అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ గెజిట్ ప్రచురించలేదు. 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్‌తోపాటు, తెలంగాణకు కృష్ణా జలాలను పంపిణీ చేసే బాధ్యతను కేడబ్ల్యూడీటీ–2కు అప్పగించింది. అప్పటి నుంచి పలుమార్లు.. 2014 నుంచి 2024 వరకూ కేడబ్ల్యూడీటీ–2 గడువు పొడిగిస్తూనే వచ్చారు. 2024 ఆగస్టు 29న కేడబ్ల్యూడీటీ–2 ఆదేశాలు జారీ చేస్తూ.. నాడు ఉమ్మడి రాష్ట్రంలో కేడబ్ల్యూడీటీ–1 ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీల నీటి పున:పంపిణీపై వాదనలు వింటామని వెల్లడించింది. ఆ తర్వాత నదిలో కేడబ్ల్యూడీటీ–2 తుది నివేదికలో సగటు ప్రవాహాలు, 75% నుంచి 65% మధ్య ఉన్న మిగులు జలాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా కేటాయించిన 194 టీఎంసీల పంపిణీపై వాదనలు వింటామని పేర్కొంది. విభజన చట్టం ప్రకారం కేడబ్ల్యూడీటీ–1 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీల పున:పంపిణీ అనేది పూర్తిగా చట్టవిరుద్ధం. కేవలం కేడబ్ల్యూడీటీ–2 తుది నివేదికలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 194 టీఎంసీల మిగులు జలాల పంపిణీపై మాత్రమే ట్రిబ్యునల్ విచారించాల్సి ఉంది. అందులోనూ విభజన చట్టంలో 11వ షెడ్యూల్‌లో ప్రస్తావించిన హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలిగొండ, తెలుగుగంగతో పాటు, తెలంగాణలోని నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. వాస్తవ పరిస్థితులు ఇలా ఉండగా, చంద్రబాబు ప్రభుత్వం పూర్తి ఉదాసీనత ప్రదర్శిస్తోంది. గతంలో కేటాయించిన 811 టీఎంసీల పున:పంపిణీని సమీక్షిస్తామన్న కేడబ్ల్యూడీటీ–2 నిర్ణయంపై కనీసం అభ్యంతరం కూడా చెప్పడం లేదు. కృష్ణా డెల్టాలో వినియోగించిన నీటిలో 95 శాతం ఆ పరీవాహక ప్రాంతం వెలుపల వినియోగిస్తున్నట్లు అంగీకరించడం వల్ల, కృష్ణా జలాలపై రాష్ట్రం హక్కు, ఆ నీటి వినియోగంలో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడంపై ఈ ప్రభుత్వం ఏ మాత్రం చిత్తశుద్ధి చూపడం లేదన్న విషయం స్పష్టమవుతోంది.

### రాయలసీమకు అన్యాయం..

ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్ నిర్వహణ నియమావళి (ఆపరేషన్ ప్రోటోకాల్)కి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన కేడబ్ల్యూడీటీ–2లో ఏకే గోయల్ దాఖలు చేసిన అఫిడవిట్ చూస్తే.. దేశంలోనే కరవు పీడిత ప్రాంతమైన రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతున్న విషయం స్పష్టమవుతోంది. కరవు ప్రాంతాలైన రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగు నీరందించేలా తెలుగుగంగ (కృష్ణా 29 టీఎంసీలు. పెన్నా 30 టీఎంసీలు), గాలేరు–నగరి (38 టీఎంసీలు), హంద్రీ–నీవా (40 టీఎంసీలు), వెలిగొండ (43.5 టీఎంసీలు) చేపట్టారు. మిగులు జలాలపై ఆధారపడి శ్రీశైలం నుంచి మూడు దశాబ్దాలుగా తెలుగుగంగకు, హంద్రీ–నీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులకు 12 ఏళ్లుగా నీటి విడుదల జరుగుతోంది. వెలిగొండలో మొదటి దశ దాదాపు పూర్తయింది. రెండో దశలో శ్రీశైలం నుంచి కృష్ణా నీటిని నల్లమలసాగర్‌కు తరలించాల్సి ఉంది. కానీ.. కేడబ్ల్యూడీటీ–2 ముందు ఏకే గోయల్ దాఖలు చేసిన అఫిడవిట్ శ్రీశైలం నుంచి తెలుగుగంగ, హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలిగొండ ప్రాజెక్టులకు నీటి విడుదలను ప్రశ్నార్థకం చేసింది. కేడబ్ల్యూడీటీ–1 అవార్డు అమలులో ఉన్నంత కాలం.. బేసిన్‌లోని రాష్ట్రాలు 2130 టీఎంసీలు వినియోగించుకున్న తర్వాతే.. అందులోనూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు 811 టీఎంసీల నికర జలాలను వినియోగించుకున్న తర్వాతే తెలుగుగంగ, హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలిగొండ ప్రాజెక్టులకు నీటిని విడుదల చేస్తామని ఆ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇక పోలవరం కుడి కాలువ ద్వారా కృష్ణా డెల్టాకు మళ్లించిన 80 టీఎంసీల గోదావరి జలాలకుగానూ కృష్ణా జలాల్లో నాగార్జునసాగర్ ఎగువన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 45 టీఎంసీలు వినియోగించుకోవచ్చు. వాటిని కూడా బేసిన్‌లోని రాష్ట్రాలు 2,130 టీఎంసీలను వాడుకున్న తర్వాతే వినియోగించుకుంటామని అఫిడవిట్లో పేర్కొన్నారు. గత ఆరేళ్లలో కృష్ణా నదిలో కొనసాగుతున్న వరద పరిస్థితి చూస్తే.. జూలై, ఆగస్టులో శ్రీశైలానికి ప్రవాహం మొదలవుతోంది. ఏ ఏడాదీ అవసరాలకు మించి వరద రాలేదు. రాయలసీమ ప్రాజెక్టుల విషయంలో తొలి నుంచి టీడీపీ వైఖరి దారుణం. ఏనాడూ అక్కడి ప్రాజెక్టులను పట్టించుకోలేదు.

### మీ పాపం వల్లే.. ఆల్మట్టి ఎత్తు పెంపు..

1995లో చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. 1996లో లోక్‌సభ ఎన్నికల తర్వాత యునైటెడ్ ఫ్రంట్‌కు కన్వీనర్‌గా ఉన్నారు. ఆ ఎన్నికల తర్వాత హెచ్‌డీ దేవెగౌడ ప్రధాని అయ్యారు. అప్పుడు ఆయన తన రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చేలా కర్ణాటకలో కృష్ణా నదిపై ఉన్న ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.25 మీటర్లకు పెంచే పని మొదలుపెట్టారు. దీనివల్ల డ్యామ్‌లో 100 టీఎంసీల అదనపు నిల్వ సామర్థ్యం ఏర్పడుతుంది. అది మన రాష్ట్ర ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బ తీస్తుందంటూ రైతులతో పాటు విపక్షాలు ఎంత ఆందోళన వ్యక్తం చేసినా మీరు (చంద్రబాబు) ఏమాత్రం పట్టించుకోకుండా పెడచెవిన పెట్టారు. ఆ తర్వాత 2000లో బచావత్ ట్రిబ్యునల్ గడువు ముగుస్తుండడంతో కృష్ణా జలాల కేటాయింపునకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేసే అవకాశం ఏర్పడింది. ఆ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులు మొదలుపెట్టాలన్న డిమాండ్ అన్ని వర్గాల నుంచి వచ్చింది. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాకు మేలు చేసేలా హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలిగొండ ప్రాజెక్టు.. తెలంగాణ ప్రాంతంలోని నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ఎత్తిపోతల పథకం, శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) ప్రాజెక్టులు చేపట్టాలన్న డిమాండ్లు వచ్చాయి. కానీ, మీ ప్రభుత్వం అవేవీ పట్టించుకోలేదు. సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో అవన్నీ పునాదిరాళ్లకే పరిమితం అయ్యాయి. అప్పుడు కేవలం మీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచుకునేందుకు కర్ణాటక ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ 2010లో అప్పటి ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది.

### విభజన తర్వాత తెలంగాణకు హక్కులు తాకట్టు..

రాష్ట్ర విభజన తర్వాత 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. అప్పట్లో సీఎంగా ఉన్న మీరు (చంద్రబాబు) హైదరాబాద్‌లో ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయి రాత్రికి రాత్రి అక్కడి నుంచి పారిపోయి వచ్చారు. ఆ కేసు నుంచి బయటపడేందుకు కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టారు. తమ భూభాగంలో ఉన్నాయనే సాకు చూపుతూ శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంతో పాటు పులిచింతల పవర్ ప్రాజెక్టును కూడా 2014లో తెలంగాణ ప్రభుత్వం తమ అధీనంలోకి తీసుకుంది. నాగార్జునసాగర్ కుడి కాలువ రెగ్యులేటర్ ఏపీ భూభాగంలోనే ఉన్నా దాన్ని కూడా తెలంగాణ ప్రభుత్వం తమ అధీనంలోకి తీసుకుంది. ఇంత జరిగినా దేన్నీ మీ ప్రభుత్వం అడ్డుకోలేకపోయింది. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతున్నా అప్పటి మీ ప్రభుత్వం మౌనంగా ఉండిపోయింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో కృష్ణా జలాల కేటాయింపు, వినియోగంలో తమకు చాలా అన్యాయం జరుగుతోందని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఆ నేపథ్యంలోనే కృష్ణా జలాల కేటాయింపునకు సంబంధించి కృష్ణా బోర్డు, దాని పరిధి, విధి విధానాలు ఖరారు చేస్తూ జూలై 15, 2021న కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. విభజన చట్టం 11వ షెడ్యూలులోని హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలిగొండ, తెలుగుగంగ ప్రాజెక్టులను అనుమతి ఉన్న ప్రాజెక్టులుగా ప్రకటించింది. వీటన్నింటి సాధన కోసం నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడకుండా పని చేసింది. ఇప్పుడు టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు అదే చిత్తశుద్ధితో పని చేయాలని కోరుతున్నాం. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల ద్వారా రాష్ట్రానికి దక్కిన 512 టీఎంసీలలో ఇప్పుడు ఒక్క టీఎంసీ కోల్పోయినా అందుకు టీడీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

### ఇప్పటికైనా మేలుకో బాబూ..!

కేడబ్ల్యూడీటీ–2 ఎదుట రెండు తెలుగు రాష్ట్రాల వాదనలు కొనసాగుతుండగానే.. కృష్ణా జలాలు అత్యధికంగా వినియోగించుకునేలా, ఇప్పుడున్నవే కాకుండా, అదనంగా కూడా 372.54 టీఎంసీలు నిల్వ చేసుకునే విధంగా ప్రాజెక్టులు చేపట్టడానికి తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబరు 16, 2025న జీఓ ఎంఎస్ నెం :34 జారీ చేసింది. మరోవైపు అదే రోజు అటు కర్ణాటక ప్రభుత్వం కూడా ఆల్మట్టి డ్యామ్ ఎత్తు 519.16 మీటర్ల నుంచి 524.25 మీటర్లకు పెంచే పనులకు అనుమతి ఇచ్చింది. దీని వల్ల ముంపునకు గురయ్యే 1,33,867 ఎకరాల భూసేకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేడబ్ల్యూడీటీ–2 తుది నివేదిక అమల్లోకి రాక ముందే కర్ణాటక సర్కార్ ఆల్మట్టిలో నీటి నిల్వ ఎత్తును పెంచేస్తున్నప్పటికీ మీరు చేష్టలుడిగి చూస్తుండటం దారుణం. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణ, ప్రయోజనాలను కాపాడటంలో మీ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం, అలక్ష్య ధోరణి వల్లే పొరుగు రాష్ట్రాలు ఆ విధంగా చురుకుగా వ్యవహరిస్తున్నాయి. దీనివల్ల మన రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరాన్ని మళ్లీ ఒకసారి మీ దృష్టికి తెస్తున్నా. గతంలో మీరు ఎప్పుడు అధికారంలో ఉన్నా, రాష్ట్రం తీవ్ర అన్యాయానికి గురైంది. తిరిగి ఈరోజు అదే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అదే సమస్య ఎదురవుతోంది. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో మీరు రాజీ పడతారన్న అభిప్రాయం అందరిలో బలంగా వ్యక్తమవుతోంది.


## సాక్షి పాఠకులకు గమనిక

శ్రీ సత్యసాయి శతవర్ష జన్మోత్సవం ప్రత్యేక సంచిక

పాఠకుల కోసం ది. 23.11.2025 ఆదివారం నాడు శ్రీ సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా బాబా జీవిత విశేషాలు, సేవలు ప్రత్యేక కథనాలతో కూడిన పుస్తకాన్ని ఈ ఆదివారం సంచికగా అందిస్తున్నాం..

ఈ సంచిక.. సాక్షి ఏజెంట్ వద్ద మరియు మార్కెట్ బుక్‌స్టాల్స్‌లో ఆదివారం పేపర్‌తో పాటుగా అందుబాటులో ఉంటాయి.

– సాక్షి దినపత్రిక


## మత్స్యకారులకు అన్ని వేళలా అండగా ఉంటాం

### గంగపుత్రులకు వైఎస్ జగన్ శుభాకాంక్షలు



**సాక్షి, అమరావతి:** మత్స్యకారులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగపుత్రులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. 'సముద్రాన్ని జీవనాధారంగా చేసుకుని, ఎగసిపడుతున్న కెరటాలతో నిత్యం పోరాటం చేస్తూ జీవనం సాగిస్తున్న నా గంగపుత్రులందరికీ ప్రపంచ మత్స్యకార దినోత్సవ శుభాకాంక్షలు. మన ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమం, సాధికారతే లక్ష్యంగా 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండ్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టాం. వివిధ పథకాల ద్వారా మత్స్యకారులకు రూ.4,913 కోట్లు లబ్ధి చేకూర్చాం. గతంలోనే కాదు ఇప్పుడు, ఎల్లప్పుడూ మత్స్యకారులందరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాట ఇస్తున్నా' అని వైఎస్ జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## సాకే గంగమ్మ మృతి పట్ల వైఎస్ జగన్ సంతాపం

### శైలజానాథ్‌కు ఫోన్‌లో పరామర్శ

**సాక్షి, అమరావతి:** శింగనమల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ తల్లి సాకే గంగమ్మ మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం శైలజానాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.

## 25 నుంచి కేడబ్ల్యూడీటీ-2 విచారణ

**సాక్షి, అమరావతి:** కృష్ణా జలాల డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్(కేడబ్ల్యూడీటీ–2) ఈ నెల 25 నుంచి మరోసారి విచారణను కొనసాగించనుంది. కృష్ణా నదిలో 75శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలను రెండు రాష్ట్రాలకు పునఃపంపిణీ చేయడం, సగటు, 65 శాతం నీటి లభ్యత ఆధారంగా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కేటాయించిన 194 టీఎంసీల మిగులు జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు పంపిణీ చేయడంపై ఈ నెల 25 నుంచి 27 వరకూ కేడబ్ల్యూడీటీ–2 విచారణ చేపట్టనుంది. జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలో జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్ర సభ్యులుగా ఉన్న కేడబ్ల్యూడీటీ–2 వాదనలు విననుంది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం తుది వాదనలను ముగించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా తుది వాదనలను కొనసాగించనున్నారు.

## ఇళయరాజా ఫొటోలు వాడొద్దు

### మద్రాసు హైకోర్టు ఆదేశాలు

**తమిళ సినిమా (చెన్నై):** సామాజిక మాధ్యమాల్లో తన ఫొటోలను, ఇసైజ్ఞాని అనే పేరునుగానీ, తనకు సంబంధించిన వార్తలనుగానీ తన అనుమతిలేకుండా వాడొద్దంటూ ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చింది. ఇళయరాజా కోరినట్లుగా ఆయన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో వాడొద్దంటూ హైకోర్టు ఆదేశాలు జారీచేసి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## మంత్రికి చెప్పారుగా.. జీతాలు వస్తాయిలే!

- పార్ట్‌టైమ్ టీచర్లతో ఎస్సీ గురుకులాల కీలక అధికారి వెటకారం
- సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 1,500 మందికి 3 నెలలుగా జీతాల్లేవు
- జీతాలివ్వాలని మంత్రి లోకేశ్‌కి ట్వీట్ చేసిన టీచర్లు
- దీన్ని నేరంగా భావించి.. వేతనాల విషయం పట్టించుకోని అధికారులు

**సాక్షి, అమరావతి:** జీతాలిప్పించండి మహాప్రభో... అని మంత్రి లోకేశ్‌కు మొరపెట్టుకున్నందుకు వారికి చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా మూడునెలల వేతనాలను ఆపేసింది. 1,500 మందికిపైగా పార్ట్‌టైమ్ టీచర్లు వేతనాల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న వీరికి చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక సక్రమంగా వేతనాలు రావడంలేదు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తే న్యాయం జరుగుతుందని భావించిన పార్ట్‌టైమ్ టీచర్లు.. జీతం ఇప్పించాలని ఆయన్ని కోరుతూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. అంతే.. ప్రభుత్వం వారిపై పగబట్టినట్టుగా మూడు నెలలకుపైగా వేతనాలు నిలిపేసింది. ఈ ఏడాది ఆగస్టు నుంచి జీతాలు ఇవ్వలేదు.

**పేరుకే పార్ట్‌టైమ్... పని చేసేది ఫుల్‌టైమ్**

పేరుకే పార్ట్‌టైమ్ అయినా ఫుల్‌టైమ్ పనిచేస్తున్నామని, వేతనాలు రాక అవస్థలు పడుతున్నామని కొద్దిరోజుల కిందట అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల పార్ట్‌టైమ్ టీచర్లు ఒక కీలక అధికారిని కలిసి మొరపెట్టుకున్నారు. మీరు పార్ట్‌టైమ్ టీచర్లు మాత్రమే. ప్రభుత్వం జీతం ఇచ్చినప్పుడే తీసుకోవాలి... అని ఆ అధికారి కటువుగా బదులిచ్చారు. మంత్రి లోకేశ్‌కు ట్వీట్ చేశారుగా.. జీతాలు వచ్చినప్పుడే వస్తాయిలే.. అని వెటకారంగా చెప్పారు. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వర్తిస్తున్నామని, ఆ తర్వాత స్టడీ అవర్స్‌కు తప్పనిసరిగా ఉండాల్సి వస్తోందని పార్ట్‌టైమ్ టీచర్లు తెలిపారు. విద్యార్థుల మొత్తం బాధ్యత, రికార్డుల పర్యవేక్షణతోపాటు రెగ్యులర్ స్టాఫ్ చేసే ప్రతి పనిని తాము కూడా చేస్తున్నప్పటికీ వేతనాలు నెలల తరబడి ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన చెందుతున్నారు. ఆగస్టు నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో తాము కుటుంబ పోషణకు ఇతర ఖర్చులకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని, ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలివ్వాలని, శ్రమ దోపిడీని అరికట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## క్లుప్తంగా...

### నేను అన్ని మతాల అభిమానిని

● సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్

తమిళ సినిమా(చెన్నై): తాను అన్ని మతాలను అభిమానిస్తానని ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ తెలిపారు. తన సంగీత కచేరీలకు పలు మతాలకు చెందిన ప్రేక్షకులు, అభిమానులు వస్తుంటారన్నారు. కచేరీ ప్రాంతాలను పవిత్రమైన స్థలంగా భావిస్తానని చెప్పారు. అప్పుడే అందరూ సమైక్యంగా ఫలాన్ని పొందుతామన్నారు. ఈగోను విడనాడాలని, మత విభేదాలకు పోకుండా ప్రతి వ్యక్తి నమ్మకం, నిజాయితీతో ఉండాలని సూచించారు. అందరం ఆధ్యాత్మిక ధనవంతులం కావాలని రెహ్మాన్ పేర్కొన్నారు.

### ఆయేషామీరా కేసులో విచారణ వాయిదా

**విజయవాడ లీగల్:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసులో సీబీఐ ఫైనల్ రిపోర్టు ఇవ్వాలని కోరుతూ ఆమె తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ డిసెంబర్ 19కి వాయిదా పడింది. విచారణ ముగిసినా కూడా వాస్తవాలను వెల్లడించడం లేదని ఆమె తల్లిదండ్రులు సీబీఐ కోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా.. సీబీఐ కోర్టులో ఆమె తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో హైకోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని సీబీఐ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తెలిపారు.

### రూ.6 కోట్ల అక్రమాస్తులు కూడబెట్టిన ఏపీఎంఎస్ఐడీసీ జీఎం

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర వైద్య మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్( ఏపీఎంఎస్ఐడీసీ) జీఎం మల్లాది వెంకట సూర్యకళ ఆదాయానికి మించి రూ.6కోట్ల విలువైన ఆస్తులు ఆర్జించినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. విజయవాడలోని సూర్యకళ నివాసంతోపాటు ఆమె బంధువుల నివాసాల్లో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు చేశారు. భారీగా అక్రమాస్తులను గుర్తించారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములు కలిపి మొత్తం 27 స్థిరాస్తులు ఉన్నట్టు గుర్తించామని అధికారులు తెలిపారు. అలాగే, బ్యాంకు ఖాతాల్లో రూ.2కోట్ల డిపాజిట్లు, ఇంట్లో రూ.9లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు, రెండు కార్లు ఉన్నట్టు గుర్తించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మొత్తం రూ.6కోట్ల ఆస్తులు ఉన్నట్టుగా లెక్క తేల్చారు. దీంతో జీఎం సూర్యకళను అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ అధికారుల అవినీతిపై ఏసీబీ టోల్ ఫ్రీ నంబరు 1064, మొబైల్ నంబరు 94404 40057కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ విభాగం శుక్రవారం ఓ ప్రకటనలో కోరింది.

# శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

**క్షేత్ర సంప్రదాయం పాటిస్తూ తొలుత శ్రీ భూవరాహస్వామిని దర్శించుకున్న ద్రౌపది ముర్ము**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వామివారి లడ్డూ ప్రసాదాలను అందిస్తున్న టీటీడీ అధికారులు

**తిరుమల:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఉదయం తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కుమార్తె ఇతిశ్రీ ముర్ము, ఇతర కుటుంబసభ్యులతో కలిసి రాష్ట్రపతి తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా శ్రీ భూవరాహస్వామిని దర్శించుకుని శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆమెకు టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం రాష్ట్రపతి శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో రాష్ట్రపతిని వేదపండితులు ఆశీర్వదించారు. టీటీడీ చైర్మన్, ఈవో శ్రీవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను, 2026 క్యాలెండర్, డైరీలను అందజేశారు. రాష్ట్రపతి వెంట దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కాన్వాయి నిలిపి భక్తులకు ఆత్మీయ పలకరింపు

శ్రీవారి దర్శనానంతరం ఆలయం నుంచి శ్రీ పద్మావతి అతిథిగృహానికి బయలుదేరిన రాష్ట్రపతి అకస్మాత్తుగా రాంభగీచా బస్టాండ్ వద్ద కాన్వాయి ఆపారు. శ్రీవారి దర్శనానికి వెళ్లేందుకు వేచి ఉన్న భక్తులను ఆప్యాయంగా పలకరించి, కరచాలనం చేశారు. అక్కడున్న చిన్నారులకు చాక్లెట్లు పంచిపెట్టారు. అనంతరం కొంతదూరం నడుస్తూ భక్తులకు అభివాదం చేశారు. తరువాత అక్కడి నుంచి శ్రీ పద్మావతి అతిథిగృహం చేరుకుని రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని తిరుమలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా వాహనాలను దారిమళ్లించారు.

# బహిరంగ చర్చకు రెడీ

● మంత్రి సుభాష్‌కు మాజీమంత్రి చెల్లుబోయిన వేణు సవాల్

మాట్లాడుతున్న చెల్లుబోయిన వేణు

రాజమహేంద్రవరం రూరల్ : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో బహిరంగ చర్చకు తాను సిద్ధమని వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సవాల్ విసిరారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శెట్టిబలిజలకు గౌడ పేరు కూడా కలిపి ఇస్తున్న కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన జీఓలపై ఈనెల 16న అమలాపురంలో జరిగిన వన సమారాధనలో మంత్రి సుభాష్ వైఎస్సార్‌సీపీపై తప్పుడు సమాచారం ఇచ్చారని మండిపడ్డారు. పత్రికల్లో ప్రకటనల కోసం కాకుండా, జీఓల మీద చర్చకైతే తాను సిద్ధమని వేణు స్పష్టంచేశారు. మీడియా సమక్షంలోనైనా, పెద్దల సమక్షంలోనైనా తాను రెడీ అని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఏం జరిగిందో, టీడీపీ పాలనలో ఏం జరిగిందో చర్చిద్దామని.. తన చాలెంజ్‌ను స్వీకరించాలని మంత్రి సుభాష్‌కు సవాల్ విసిరారు. చర్చ నుంచి మంత్రి తప్పుకున్నా, చేసిన ఆరోపణలు నిరూపించలేకపోయినా శెట్టిబలిజ కులానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి చేసిన ఆరోపణలు వాస్తవం కాదని నిరూపిస్తానని, అలా చేయలేకపోతే తాను క్షమాపణ చెబుతానన్నారు. టైమ్, వేదిక మంత్రి చెప్పాలని, జీఓలను అడ్డంపెట్టుకుని ఆయనేం చేశారో తాను చెబుతానని, కులాన్ని ఎవరు తప్పుదోవ పట్టిస్తున్నారో తేలుద్దామని వేణు అన్నారు.

ప్రతి ఒక్కరిలోనూ ఉండే ఆత్మ ఒక్కటే. ఒకరిని నువ్వు ద్వేషిస్తున్నావూ అంటే నిన్ను నువ్వు ద్వేషిస్తున్నట్లే!

– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 22 నవంబర్ 2025

# మారిన విలువలు

కొస్త ఆలస్యం కావొచ్చు గానీ... పుష్కలంగా డబ్బూ, కండబలం ఉన్నవాడు ఎన్ని నేరాలు చేసినా మర్యాదస్తుడిగా మారడం కష్టమేం కాదని సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌కు బుధవారం అమెరికాలో లభించిన స్వాగత సత్కారాలు చూస్తే తెలుస్తుంది. ఏడేళ్ల క్రితం ఆయన అంతర్జాతీయంగా అంటరానివాడు. సల్మాన్‌ను ఆహ్వానించటానికి అమెరికా జంకింది. సౌదీలో జరిగే పెట్టుబడుల సదస్సును పాశ్చాత్య దేశాలన్నీ బహిష్కరించాయి. కానీ ఇప్పుడంతా మారింది. సల్మాన్‌కు 21 శతఘ్నుల వందనం, అశ్వారూఢులైన నావికాదళ పటాలం మేళతాళాలు, యుద్ధ విమానాల పరేడ్... ఒకటేమిటి ఆయన రాకే పెద్ద వేడుకన్నట్టు అధికార వ్యవస్థ సమస్తం పులకించిపోయింది. అమెరికాలో సల్మాన్ షాపింగ్ తక్కువేం లేదు మరి. దొంగచాటుగా వెళ్లి శత్రు స్థావరంపై దాడిచేయగలిగిన ఎఫ్–35 యుద్ధ విమానాలు, అణుశక్తి సాంకేతికత, చిప్‌లు, అరుదైన ఖనిజాల వేటలో సహకారం వగైరాలన్నీ అందులో ఉన్నాయి. వీటి విలువ అక్షరాలా లక్ష కోట్ల డాలర్లు. అదిగాక ట్రంప్ కుటుంబానికి గల్ఫ్ దేశాల్లో వందల కోట్ల డాలర్ల విలువైన రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో అండదండలందించేందుకు సౌదీ ఇప్పటికే అంగీకరించింది. వీటన్నిటి పర్యవసానంగానే ఈ మర్యాదలు! నిజానికి ఆయనతో మళ్లీ సాన్నిహిత్యం కావాలని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ సైతం ప్రయత్నించకపోలేదు. జెడ్డాలో 2022లో పర్యటించినప్పుడు ఆయన్ను 'భవిష్యత్తు రాజు'గా కీర్తించారు. కానీ ప్రజాభిప్రాయానికి జడిసి అమెరికా ఆహ్వానించటానికి సందేహించారు.

బిన్ సల్మాన్ దుష్కృత్యం సాధారణమైనది కాదు. రాజ కుటుంబానికి సన్నిహితుడిగా, 'వాషింగ్టన్ పోస్ట్' కాలమిస్టుగా ఉన్న జమాల్ ఖషోగ్గీ తనపై తరచు చేసే విమర్శలు ఆయన తట్టుకోలేకపోయాడు. సల్మాన్ బతకనీయడని తెలిసి ఖషోగ్గీ అమెరికా వెళ్లిపోయారు. తన ప్రియురాల్ని పెళ్లాడటానికి అమెరికాలో దాఖలు చేయాల్సిన పత్రాల కోసం సౌదీ వెళ్లాల్సివున్నా, ముప్పు తప్పదన్న ఉద్దేశంతో టర్కీలోని ఇస్తాంబుల్‌లో ఉన్న సౌదీ కాన్సులేట్‌కు వెళ్లారు. తీరా సౌదీ నుంచి వచ్చిన 15 మంది హంతక ముఠా అంతకుముందే అక్కడ మాటువేసి ఆయన్ను మట్టుబెట్టింది. మామూలుగా కాదు... మనిషిని హతమార్చి, ముక్కలుగా కోసి ఎముకలన్నీ యాసిడ్‌లో కరిగిపోయేలా చేశారు. సల్మాన్ ఆదేశాలతోనే ఆ దారుణానికి ఒడిగట్టారని అప్పట్లోనే అమెరికా గూఢచార సంస్థ సీఐఏ తేల్చింది. కాన్సులేట్ వద్దగల సీసీ కెమెరాల్లో ఖషోగ్గీకి ముందే 15 మంది సభ్యులు లోపలికెళ్లటం, కొన్ని గంటల తర్వాత వారంతా నిష్క్రమించటం రికార్డయింది. అంతర్జాతీయ పాత్రికేయుల్లో ప్రతిష్ఠగల ఖషోగ్గీ హత్య అమెరికా, పాశ్చాత్య దేశాల ప్రజల్లో ఆగ్రహావేశాలు రగిల్చింది. అందుకే తన తొలి ఏలుబడిలో సల్మాన్‌ను ట్రంప్ దూరం పెట్టారు. హత్యలో ఆయన ప్రమేయం రుజువైందని వ్యాఖ్యానించారు.

కానీ ఇన్నేళ్లు గడిచాక ట్రంప్ తీరు మారింది. 'మీపై సీఐఏ నివేదిక గురించి ఏమంటార'ని ఏబీసీ చానెల్ మహిళా ప్రతినిధి ఒకరు సల్మాన్‌ను అడిగేసరికి ట్రంప్ మండిపడ్డారు. 'అదంతా ఏం లేదు... ఖషోగ్గీ వివాదాస్పదుడు. ఈ ప్రశ్న వేసి అతిథిని అవమానిస్తావా?' అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఏబీసీ 'ఫేక్ న్యూస్' అంటూ దూషించారు. ఆయనతో పోలిస్తే సల్మాన్ నాగరికంగా మాట్లాడారు. తన ప్రమేయం లేదని వివరించారు. నిజానికి సౌదీ పెట్టుబడుల రాక అంత సులభం కాదు. ఇప్పటికే ఎఫ్–35లను వినియోగిస్తున్న ఇజ్రాయెల్ అభ్యంతరాలను కాదని సౌదీకి ఇవ్వటం అసాధ్యం. పైగా ఆ విమానాల కోసం 20 దేశాలు ఒప్పందాలు కుదుర్చుకున్నా అమెరికన్ కాంగ్రెస్ వాటిని ఖరారు చేయలేదు. అణుశక్తి సాంకేతికత కూడా అంతే. సౌదీకి ఎఫ్–35లిస్తే వాటి సాంకేతికత చైనాకు చేరే ప్రమాదం ఉన్నదని ఇటీవలే అమెరికా రక్షణ గూఢచార సంస్థ హెచ్చరించింది. ఇన్ని అవరోధాలున్న ఒప్పందాల ద్వారా వేలాది ఉద్యోగాలు వచ్చిపడతాయని ట్రంప్ జనాన్ని మభ్యపెడుతున్నారు. అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదవుతున్నా ట్రంప్ తాను ఇంకా ఎన్నికల ప్రచారంలోనే ఉన్నాననుకుంటున్నారు. దేశాల మధ్య సంబంధాలకు లాభాలు, లోపాయికారీ ప్రయోజనాలే తప్ప విలువలు ఎవరికీ అక్కర్లేదని వర్తమాన ప్రపంచంలో కనబడుతూనే ఉంది. సల్మాన్ అమెరికా పర్యటన దాన్నే మరోసారి రుజువు చేసింది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.విదియ ప.2.50 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** జ్యేష్ఠ ప.3.33 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** రా.12.18 నుండి 2.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.57 నుండి 7.38 వరకు, **అమృత ఘడియలు:** లేవు.

సూర్యోదయం : 6.12
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

## సోషల్ టాక్

### ఒత్తిడి తేవొద్దు

పిల్లల మనసులో ఏముందో, వాళ్లేం కోరుకుంటున్నారో గ్రహించకుండానే తమ కలలను, ఆశయాలను పిల్లలపై రుద్దే తల్లితండ్రులు ఇవాళ్టికీ ఉన్నారు. మనం ఏర్పరచిన దారిలోనే విజయం సాధించాలని పిల్లలపై ఒత్తిడి తేవటం వారికో జీవిత గమ్యం లేకుండా చేస్తుంది.

– భద్రన్, సినీ దర్శకుడు

### 'హౌ టు టాక్'

మీరు ఎవరికైనా మీ భావాలను శక్తిమంతంగా వ్యక్తపరచాలని అనుకున్నప్పుడు ఎక్కువగా ఆలోచించకండి. ఆలోచించి మాట్లాడటం వల్ల మీ మాటలు హృదయంలోంచి వచ్చినట్లుగా అనిపించవు. ప్రేమించే వ్యక్తుల దగ్గర 'హౌ టు టాక్'ను పక్కన పెట్టేయండి.

– అనూజ్ తివారీ, 'జర్నీ ఆఫ్ టూ హార్ట్స్' రచయిత

### 'అసలు'కే విలువ

ఎల్లప్పుడూ మీరు మీలాగే ఉండండి. 'అసలు' అనేది 'కాపీ' కంటే ఎంతో విలువైనది. మీరు చేస్తున్న పనిలో మీ ఉత్సాహం సన్నగిల్లిపోతే ఇంకొక పనిలోకి మారండి తప్పితే, ఇంకొకరిలా మారకండి. మీతో మీరు యుద్ధం చేస్తూ గడపటానికి మరొక రోజు లేనంత చిన్నది జీవితం.

– అనీశ్ సూద్, డీజే

### కొలతలు వేరు

ఎంపిక అనేది మన చేతుల్లోనే ఉంటుంది. కొంతమందికి తోట పని, లేదా గోల్ఫ్ ఇష్టం. నాకు టెక్నాలజీపై ఆసక్తి ఉంది. ఇక విజయం సాధించటం అంటారా... నేను ఎంపిక చేసుకున్న వెంచర్ క్యాపిటల్‌లో విజయాన్ని డాలర్లలో లెక్కించరు. సంవత్సరాలలో, దశాబ్దాలలో కొలుస్తారు.

– రవి మాత్రే, వెంచర్ క్యాపిటలిస్ట్

### కేంద్ర బిందువు

జీవితం ఒక బహుమతి. అలాగే ఒక పరీక్ష. ప్రతి విజయం బాధ్యతను తెచ్చి మోపుతుంది. అది మనకు బహుమతిగా వచ్చిన బాధ్యత. దానిని చక్కగా నెరవేర్చటం పరీక్ష. పరీక్ష పాస్ అవ్వాలంటే ఆత్మవిశ్వాసం మనం జీవితానికి కేంద్ర బిందువుగా ఉండాలి.

– షబానా మహమూద్, యూకె హోమ్ శాఖ కార్యదర్శి

### నియంత్రణ



ఒత్తిడి అనేది ఆటలో భాగం. అది మిమ్మల్ని గెలిపించవచ్చు, లేదా ఓడించనూ వచ్చు. అదంతా మీ నియంత్రణలో ఉంటుంది. నా దృష్టిలో ప్రతిభ అనేది లేదు. దానిని సంపాదించుకోవాలి. అందుకోసం పని చేసే ప్రతి ఒక్కరూ ప్రతిభావంతులే!

– జన్నిక్ సిన్నర్, టెన్నిస్ ప్లేయర్

# శాస్త్ర స్వతంత్రతకు గొడ్డలిపెట్టు

విశ్లేషణ

దినేశ్ సి. శర్మ

దేశ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగంలో అనూహ్యమైన, విచిత్రమైన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఏపీజే అబ్దుల్ కలామ్ లాంటి శాస్త్రవేత్తను తమ 'ఫెలో'గా చేర్చుకునేందుకు నిరాకరించిన జాతీయ సైన్స్ అకాడమీ ఇప్పుడు పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి ఆ హోదా కల్పించింది. ఇప్పటివరకూ ఈ సభ్యత్వం విద్య, పరిశోధన రంగాల్లో అద్భుతమైన రాణింపు ఉన్న వారికి మాత్రమే దక్కేది.

ఢిల్లీలోని ఓ అగ్రశ్రేణి సంస్థ ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేకపోయినా కేవలం అక్కడి ప్రభుత్వ కోరిక తీర్చేందుకు వాయు కాలుష్యాన్ని తగ్గిస్తామన్న మిషతో కృత్రిమ వర్షాలు కురిపించే ప్రయత్నం చేసింది. వనరులు లేకపోవడం కారణంగా సైకిల్‌పై రాకెట్లు మోసుకెళ్లారని దేశ అంతరిక్ష రంగానికి పునాదులు వేసిన శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్‌ని ఓ కేంద్ర మంత్రి అగౌరవపరిచారు. ఎందుకు? అంతరిక్ష రంగంలో సాధించిన ఘనతలన్నింటికీ 2014 తరువాత మోదీ ప్రభుత్వం అందించిన సహకారమే కారణమన్న వాదనకు బలం చేకూర్చేందుకు!

ఈ సంఘటనలన్నీ ఒకదానితో ఒకటి సంబంధం లేనివని అనిపించవచ్చు గానీ... శాస్త్ర పరిశోధన సంస్థలు ఒక్కటొక్కటిగా తమ స్వతంత్రతను కోల్పోతున్నాయనేందుకు మచ్చుతునకలు. కొన్నింటిని బలవంతంగా లొంగదీసుకుంటే... మిగిలినవి స్వచ్ఛందంగా చేతులెత్తేశాయి.

### ప్రధాని మాటనే కాదన్న ఇస్రో

ప్రధాని ఇందిరాగాంధీ ఆదేశాన్ని కూడా కాదనే ధైర్యం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కనబరచడం గతకాలపు మాటగానే మిగిలిపోనుంది. 1980లో సోవియట్ యూనియన్ ప్రయోగంలో భారతీయ వ్యోమగామిని భాగం చేయాలని ఇందిర కోరితే, 'ఇస్రో' దాన్ని తన బలమైన వాదనతో తిరస్కరించింది. ధిక్కారం కాదది. దేశ ప్రజలకు మరింత ఎక్కువ ఉపయోగపడే ఉపగ్రహాల తయారీలో నిమగ్నమై ఉన్నందున మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలకు వనరులను ఖర్చు చేయలేమని చెప్పడం! ప్రధాని ఇందిర కూడా దాన్ని అర్థం చేసుకున్నారు. ఆ దశలోనే ఇందిర భారత వ్యోమగామిని అంతరిక్షంలో పెట్టే బాధ్యతను భారతీయ వాయుసేనకు అప్పగించింది. దీని ఫలితమే 1984లో రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి వెళ్లడం! కాగితంపై 'ఇస్రో' ఇప్పటికీ స్వతంత్ర సంస్థే. కానీ సంస్థ వ్యవస్థాపకుడిని కేంద్ర మంత్రి ఒకరు అగౌరవపరిచినా సరిదిద్దలేని స్థితికి చేరింది.

ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఐఎన్ఎస్ఏ) పరిస్థితి కూడా ఇంతే. దశాబ్దాలుగా ఆర్థిక సాయం పొందుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అదుపాజ్ఞల్లోకి చేరింది మాత్రం ఇటీవలే. జన్యుమార్పిడి ఆహారం వివాదం 2010లో పతాక స్థాయిలో ఉన్నప్పటికీ ఈ సంస్థ రెండు ఇతర సైన్స్ అకాడమీలతో కలిసి ప్రభుత్వ అభిలాషకు భిన్నంగా స్పష్టమైన వైఖరి కనబరిచింది. జన్యుమార్పిడి పంటల భద్రత, మానవ ఆరోగ్యంపై వాటి ప్రభావాలపై క్షుణ్ణమైన అధ్యయనం జరిగి తీరాల్సిందేనని భీష్మించింది. 2018లో కేంద్ర మంత్రి ఒకరు డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని ఎగతాళి చేసిన సందర్భంలో కూడా ఐఎన్ఎస్ఏ, ఇతర సంస్థలు దాన్ని తీవ్రంగా ఖండించాయి. బోధనాంశాల నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించాలన్న మంత్రిగారి ఆలోచనను తప్పుబట్టాయి. ఈ రెండు సందర్భాల్లోనూ ఈ సంస్థలు సైద్ధాంతిక వైఖరికి కట్టుబడ్డాయి. తమ స్వతంత్రతపై దాడిని సమర్థంగా ఎదుర్కొన్నాయి.

◆ నూరేళ్ల కింద పి.సి.మహలనోబిస్ స్థాపించిన ఐఎస్ఐని కేంద్ర ప్రభుత్వం తన అధీనంలోకి తెచ్చుకునేందుకు అనువుగా ఒక బిల్లును సిద్ధం చేస్తోంది. సంస్థ ప్రెసిడెంట్, డైరెక్టర్, అకడెమిక్ కౌన్సిల్ సభ్యులందరినీ ఎన్నికల ద్వారా కాకుండా, నేరుగా నియమించే ప్రయత్నం చేస్తోంది. ఇది వ్యవస్థల నిర్మాణాన్ని, స్వాతంత్ర్యాన్ని బలి చేయడమే.

### శాస్త్రవేత్తలు కానివారికి సభ్యత్వమా?

ప్రస్తుతానికి వస్తే.... శాస్త్రవేత్తలు కాని పారిశ్రామికవేత్తలకు కూడా సభ్యత్వం ఇవ్వడం అవసరమని ఐఎన్ఎస్ఏ ఒక అంచనాకు వచ్చింది. సభ్యత్వం ఇవ్వడం కాకుండా... పారిశ్రామిక వేత్తలు, శాస్త్రవేత్తలు కలిసి పనిచేసేందుకు అనువైన కార్యక్రమాలను రూపొందించి ఉంటే, వేదికలను ఏర్పాటు చేసి ఉంటే మరింత మెరుగ్గా ఉండేది. ప్రపంచంలో ఏ శాస్త్ర పరిశోధన సంస్థ కూడా తమ రంగంలో తగిన అర్హతలు లేనివారికి సభ్యత్వం కట్టబెట్టదు. సత్యేన్ బోస్, మేఘనాథ్ సాహా, హోమీ జహంగీర్ భాభా, శాంతి స్వరూప్ భట్నాగర్ వంటి దిగ్గజ శాస్త్రవేత్తల పక్కన ఇప్పుడు అంబానీకి చోటు కల్పిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని సైన్స్ అకాడమీలకు మార్గదర్శకంగా భావించే సంస్థ లండన్‌లోని 'ద రాయల్ సొసైటీ'. ఇది కూడా శాస్త్రవేత్తలు కానివారు, అంటే పారిశ్రామిక రంగంలో పరిశోధనలు చేసేవారికి సభ్యత్వం ఇస్తుంది. అయితే, ఆ యా రంగాల్లో జ్ఞానాభివృద్ధికి వారు తగినంత కృషి చేసి ఉండాలి. ఈ నేపథ్యంలోనే కొందరు పారిశ్రామిక వేత్తలకు ఐఎన్ఎస్ఏ సభ్యత్వం ఇవ్వడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

### కన్ను ఇప్పుడు గణాంక సంస్థపై...

కేంద్రం దృష్టి ప్రస్తుతం కోల్‌కతాలోని ఐఎస్ఐ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్)పై ఉంది. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన భౌతిక శాస్త్రవేత్త ప్రశాంత చంద్ర మహలనోబిస్ వందేళ్ల క్రితం స్థాపించిన ఈ సంస్థను కేంద్ర ప్రభుత్వం తన ప్రత్యక్ష అధీనంలోకి తెచ్చుకునేందుకు అనువుగా ఒక బిల్లును సిద్ధం చేస్తోంది. గణితం, గణాంక శాస్త్రం, అప్లైడ్ సైన్సెస్‌లో ఎన్నదగ్గ పరిశోధనలు చేసిన సంస్థ ఇది. పరిపాలన వ్యవహారాలన్నీ తనంతట తాను నిర్వహించుకుంటుంది. లాభాపేక్ష లేని సంస్థ. అలాంటి ఐఎస్ఐ సొసైటీని రద్దు చేసి కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండే ఒక బోర్డుకు అప్పగించాలని కొత్త బిల్లు ప్రతిపాదిస్తోంది. సంస్థ ప్రెసిడెంట్, డైరెక్టర్, అకడెమిక్ కౌన్సిల్ సభ్యులందరినీ ఎన్నికల ద్వారా కాకుండా, నేరుగా నియమించే ప్రయత్నం చేస్తోంది. ఐఎస్ఐకి చెందిన స్థిరచరాస్తులన్నింటినీ కూడా ఈ బోర్డు తన స్వాధీనంలోకి తీసుకుంటుందని బిల్లు స్పష్టం చేస్తూండటం గమనార్హం. ఇది విద్యా సంస్థల స్వతంత్రతపై దాడే! వ్యవస్థల నిర్మాణాన్ని, స్వాతంత్ర్యాన్ని బలి చేయడమే!!

సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి ఏదో గుప్తమైన ఆలోచన కాదు. బోధనాంశాలపై చర్చలు జరిపి మరింత ప్రభావశీలం చేసేందుకు అవకాశం కల్పించేది. విద్యా ప్రమాణాలను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు ఈ పద్ధతి ఉపయోగపడుతుంది. అలాంటి ఈ వ్యవస్థకు బదులుగా ఢిల్లీ బ్యూరోక్రాట్ల అజమాయిషీ పెట్టడం బోధనాంశాల నాణ్యత, స్వతంత్రతకు గొడ్డలిపెట్టు. 1959 నాటి చట్టం పరిధిలో పనిచేసే ఐఎస్ఐ సొంతంగా డిగ్రీ సర్టిఫికెట్లు జారీ చేయగలదు. కొత్త బిల్లులో ఈ అంశం ప్రస్తావన లేదు. ఐఎస్ఐకి బదులుగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషనే పట్టాలిస్తుందన్న అనుమానాలు కలుగుతున్నాయి. తద్వారా ఇది దేశంలోని అనేక ఇతర విద్యాసంస్థల్లో ఒకటిగా మాత్రమే మారిపోనుంది.

విద్యావేత్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా స్వేచ్ఛగా ఆలోచించేందుకు అకడమిక్ ఫ్రీడమ్ అన్నది ఎంతో కీలకం. ప్రశ్నించడం, భయం, విమర్శలకు బెదరకుండా భావాలను వ్యక్తం చేసేందుకు ఇది అవకాశం కల్పిస్తుంది. పరిశోధనలు, బోధనతాలూకూ సమగ్రతను కాపాడుతుంది. పొలిటికల్, బ్యూరోక్రటిక్, కార్పొరేట్ సంస్థల ప్రమేయం, ప్రభావాలను తొలగించేందుకు వ్యవస్థాగతమైన స్వాతంత్ర్యం అవసరం. ఇది కాదని... పిడుక్కీ, బియ్యానికీ ఒకే మంత్రమన్నట్టు వ్యవహరిస్తే... శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో అంతర్జాతీయంగా భారతకు ఉన్న స్థానానికే చేటు కలిగే ప్రమాదం ఉంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత

# ప్రేమ పూర్వక సేవా మార్గదర్శి

సందర్భం

జహీరా బేగమ్

'రత్నాకరం సత్యనారాయణ రాజు' పేరుతో 1926 నవంబర్ 23న పుట్టపర్తిలో జన్మించిన సత్య సాయిబాబా కోట్లాది మందికి ఆరాధ్యులయ్యారంటే అది ఆయన విశ్వసించిన ప్రేమ, సేవల వల్లే! తన చెంతకు వచ్చిన వారికే కాదు యావత్ ప్రపంచానికి భక్తి, ప్రేమ మార్గాలను చూపి, అందుకు శాశ్వత ఆనవాలుగా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిపి వెళ్లారాయన. సత్య సాయిబాబా 2011 ఏప్రిల్ 24న దివికేగినా ఆయన దివ్య సందేశాన్ని అందుకుని ముందుకు సాగుతున్న వారందరూ ఆయన సజీవ స్పర్శను తాము పంచే ప్రేమ, సేవలలో అనుభూతి చెందుతున్నారు.

స్వార్థరహితమైన ప్రేమ, సేవలే భగవంతుని చేరుకునేందుకు తోవ అని సత్యసాయి చాటిచెప్పారు. కేవలం ప్రసంగాలకే పరిమితం కాక సేవా కార్యక్రమాలెన్నో చేపట్టారు. నిరుపేదలకు ఉచితంగా వైద్యం, విద్య, కరవుతో అల్లాడే గ్రామాలకు తాగునీటి సదుపాయం అందించి, వారి జీవితాలను మార్చారు. ఎక్కడ ఏ ప్రకృతి విపత్తు జరిగినా వెంటనే స్పందించి, అక్కడికి వెళ్లి సాయం అందించే వ్యవస్థను ఏర్పాటు చేశారు.

'అందర్నీ ప్రేమించు... అందర్నీ సేవించు' అనేది సత్యసాయి నిరంతరం చెప్పే మాట. దేవుని పట్ల ప్రేమ, తోటి మానవుడికి సేవ... ఇదే ఆయన బోధించే విద్య. ఇవ్వడం, క్షమించడం వల్ల మనుషుల మధ్య ఆత్మీయత పెరుగుతుందనీ, పొందడం – మర్చిపోవడం వల్ల స్వార్థం పెరుగుందనీ అనేవారు.



'హెల్ప్ ఎవర్... హర్ట్ నెవర్' అనేది అన్ని మతాల సారమనేది ఆయన సందేశం. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు విలువలను మనిషి కలిగి ఉండాలని ఆయన సూచించేవారు. తాను కొత్త మతాన్ని సృష్టించేందుకు రాలేదనీ, హిందువును మరింత మంచి హిందువుగా, క్రైస్తవుణ్ణి మరింత మంచి క్రైస్తవుడిగా, ముస్లింను మరింత మంచి ముస్లింగా మార్చడమే తన ఉద్దేశమనీ బాబా పేర్కొనేవారు. తన సర్వధర్మ చిహ్నాన్ని ఐదు ప్రధాన మతాల చిహ్నాలతో ఆయన రూపొందించారు. ప్రేమ, గౌరవాన్ని చాటే మతంగా ఆయన ఇస్లాంను గుర్తించారు.

1968లో సత్యసాయి బాబా కెన్యా నుంచి ఉగాండా వరకూ ప్రయాణించారు. ఆయన ఇండియాను వదిలివెళ్లిన ఏకైక సందర్భం అదొక్కటే. సత్యసాయి కేంద్రాలు సుమారు 170 దేశాల్లో ఉన్నా బాబా ఏ రోజూ ఏ దేశానికీ వెళ్లలేదు. 'మొత్తం ప్రపంచం నా వద్దకే వచ్చేటప్పుడు, నేనెందుకు ప్రపంచం వద్దకు వెళ్లడం' అని బాబా ఓ మారు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు 20 కోట్ల మంది భక్తులున్నారని అంచనా. బాబాను కలిసిన ఇటలీకి చెందిన వాటికన్ మాజీ ప్రీస్ట్ మరియో మజోలెని 'మొత్తం మతగ్రంథాల్లో ఉన్న సారాన్నంతా బాబా తనలో నింపుకొన్నారు, అదే ప్రేమ' అని అన్నారు.

సత్య సాయిబాబా తన బోధనల్లో మాతృభాషనూ, మాతృభూమినీ సంరక్షించుకోవాలనీ, ప్రజలంతా క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ కలిగి ఉండాలనీ సూచించేవారు. 'హింసను హింస ఆపలేదు', 'నీ శరీరాన్ని కాదు, మనసును మార్చుకో' అని చెప్పేవారు. 'ద్వేషానికి పరిష్కారం ప్రేమ మాత్రమే' అనేది ఆయన మాట. సత్య సాయిబాబా తెలుగువారిగా పుట్టడం తెలుగువారి అదృష్టం. సత్యసాయి శత జయంతి వేడుకల్లో భాగంగా మనందరం ప్రతిన పూనాలి. బాబా చూపిన ప్రేమ, సేవా మార్గాల్లో అందరం కలిసి నడుద్దామని తీర్మానించుకోవాలి. సోదరభావం, సమానత్వంతో మెలగుతూ ముందుకు సాగాలి.

వ్యాసకర్త తాహెరా ట్రస్ట్ స్థాపకురాలు (ఏపీ, తెలంగాణ)
(నవంబర్ 23 సత్యసాయి శతజయంతి వత్సర ఆరంభం)

## మునిగితే... తేలలేం!

జ్యోతిర్మయం

భూలోకంలో మనుషులు చేసే పుణ్యకర్మలన్నీ మరణం తరువాత స్వర్గలోక ప్రాప్తి కోసం, మళ్ళీ భూలోక జన్మ లేకుండా చేసుకోవడం కోసమేనని చెబుతుంటారు. మరణం శరీరానికే తప్ప ఆత్మకు లేదనేది బలమైన భావన. ఈ జన్మలో పుణ్యకర్మల ఫలితంగానే మరుజన్మలో ప్రాణి పొందే ఉన్నత స్థితి లేదా నీచ స్థితి ఆధారపడి ఉంటుందన్నది కూడా అంతే ప్రాచుర్యం పొంది ఉంది. ఈ నేపథ్యంలో, స్వర్గంలో దేవతలు అనుభవించే సుఖాలను పోలిన సుఖాలు భూలోకంలో విజ్ఞులైన మనుషులు కోరుకునేవి కాదని, మూర్ఖ మానవులు మాత్రమే ప్రతిరోజు, ప్రతి క్షణము సుఖంలో మునిగి తేలుతూ కాలం గడపాలని కోరుకుంటారని శాంతిపర్వం, 174వ అధ్యాయం, 37వ శ్లోకంలో వ్యాసమహర్షి చెప్పిన మాటలు ఆలోచింపజేస్తాయి.

**శ్లో. నిత్యం ప్రముదితా మూఢా దివి దేవగణా ఇవ**
**అవలేపేన మహతా పరిభూతా్యా విచేతసః**

'మూర్ఖ మానవులు స్వర్గంలోని దేవగణాల వంటి వారు. నిత్యం విషయ సుఖాలలో మునిగి తేలుతూ ఆనందాన్ని పొందుతూ ఉంటారు' – అని పై శ్లోకంలోని పూర్వార్థం భావం. మనిషి పుణ్యకర్మల ఫలితమైన మోక్షానికి, స్వర్గలోక ప్రాప్తికి సంబంధం ఉన్నది కాబట్టి, దేవతలు నిత్యం సుఖసంతోషాలలో తేలియాడే స్వర్గలోకవాస సౌఖ్యం మూర్ఖుల చిత్తవృత్తితో సమానమైనదిగా చెప్పడం ఎంతవరకు సరైనది అనే ఆలోచనను ఇది రేకెత్తిస్తుంది. అంతే కాకుండా, మనిషి మరి పుణ్యకర్మలను ఆచరించడం ఎందుకు? అనే ప్రశ్నను కూడా ఈ ఆలోచన ముందుకు తెస్తుంది. అయితే, అలా చెప్పినది ఎందుకంటే 'వారి చిత్తం భోగలాలసత్వం అనే బురదలో చిక్కుకుని మోహ శృంఖలాలలో జీవిత పర్యంతం బంధించబడి ఉంటుంది గనుక' అని పై శ్లోకంలోని ఉత్తరార్థంలో చెప్పి స్పష్టత ఇస్తాడు. స్వర్గంలో భోగాలమాట ఎలా ఉన్నా, భూమి మీద మాత్రం నిత్యం సుఖాలలోనే తేలియాడుతూ కాలం గడిపే భోగలాలసత్వంలో చిక్కుకోవడం మనిషికి చేటును కలిగిస్తుందని చెప్పడం ఇందులో వ్యాసభగవానుడి ఉద్దేశంగా గ్రహించాల్సి ఉంటుంది.

– భట్టు వెంకటరావు

## సగం రొయ్యలు అమెరికా, చైనాలకే!

డేటా పాయింట్

మన దేశం నుంచి రొయ్యలు అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశం అమెరికా. 2024–25లో రొయ్యల ఎగుమతుల్లో సగానికి పైగా అమెరికా, చైనాలకే వెళ్లాయి.

దేశాల వారీగా ఎగుమతుల శాతం

| అమెరికా | చైనా | యూరోపియన్ యూనియన్ | ఆగ్నేయాసియా | జపాన్ | పశ్చిమాసియా | ఇతర దేశాలు |
|---|---|---|---|---|---|---|
| 36 | 17 | 15 | 13 | 5 | 4 | 10 |

ఆధారం: కేంద్ర వాణిజ్య శాఖ

## మొన్న అలా! ఇవాళ ఇలా!!

ఇన్ బాక్స్

సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తాను గవర్నరు, రాష్ట్రపతి విధుల్లో వేలు పెట్టేది లేదని పరోక్షంగానైనా స్పష్టంగానే తెలియబర్చింది. రాష్ట్రపతి రిఫరెన్స్ ద్వారా అడిగిన ప్రశ్నలకు ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్ తన అభిప్రాయాల్ని ఏకగ్రీవంగా వెలిబుచ్చింది. కొండొకచో కార్యనిర్వాహక వ్యవస్థ అధికారాన్నీ, వాదననూ బలపర్చింది. శాసన వ్యవస్థకు, కార్య నిర్వాహక వ్యవస్థకు నడుమ ఏర్పడగల వివాదానికి 'మీరూ మీరే చూసుకోండి గానీ నన్ను ఇన్వాల్వ్ చేయొద్దు' అన్న తరహాలో జవాబులిచ్చింది.

ఈమధ్య గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వివాదాలు ఎక్కువవుతున్నాయి. కేంద్రంలో ఒక పార్టీ ప్రభుత్వం, రాష్ట్రంలో తస్మదీయ పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలాంటి వివాదాలు వస్తున్నాయి. రాష్ట్ర శాసన సభ ఆమోదించిన బిల్లు గవర్నర్ సంతకం పెడితేనే చట్టంగా మారుతుంది. ఆయన సంతకం పెట్టాలి, లేదా తిప్పి పంపాలి లేదా రాష్ట్రపతి అభిప్రాయాన్ని కోరుతూ పంపాలి. ఇలా ఏదో ఒక నిర్ణయం ఎప్పటిలోగా తీసుకోవాలన్నది రాజ్యాంగం చెప్పలేదు. అది ఆధారం చేసుకొని కొంతమంది గవర్నర్లు ఎటూ తేల్చకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారు. దాని వల్ల ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం తాను చట్టాన్ని అందివ్వలేని స్థితిలో పడుతుంది.

ఇలాంటి కేసుల్లో గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది ఏమంటే మరీ జాప్యం చేసిన బిల్లుల్ని ఆటోమేటిక్‌గా ఆమోదం పొందినట్లు అనుకోవాలని! అయితే ఇప్పుడు అదే సుప్రీం కోర్టు అలా ఆటోమేటిక్ ఆమోదం (డీమ్డ్ అస్సెంట్) అన్నది రాజ్యాంగ బద్ధం కాదంది. అలాగే రాష్ట్రపతి, గవర్నర్ నిర్ణయం తీసుకోవడంపై ఎలాంటి గడువూ లేదంది. పైగా వారి నిర్ణయాలు న్యాయ సమీక్షకు అతీతం అని కూడా అభిప్రాయ పడింది. అయితే బిల్లులపై జాప్యం చెయ్యడం అన్యాయమని తోస్తే వాటిపై కాల పరిమితి పెట్టే అవకాశం కోర్టు తీసుకుంటుందని చెప్పింది. స్థూలంగా రాష్ట్రపతి, గవర్నర్‌ల అధికారాల పట్ల, కేంద్రం వాదన పట్ల సానుకూల ధోరణితో ఉంది తీర్పు.

– డా॥ డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

# 'కుట్టు'రట్టు!

## అవుట్‌డేటెడ్ స్కీమ్.. అడ్డగోలు స్కామ్!

- పీఎం విశ్వకర్మలో కుట్టు శిక్షణను తొలగించిన కేంద్రం.. రాష్ట్రంలో మాత్రం అమలు ఎవరి ప్రయోజనాల కోసం?
- రెడీమేడ్ పోటీ.. పెరిగిన టైలరింగ్ సెంటర్లతో ఉపాధి ఎండమావే..!
- బీసీ సంక్షేమ శాఖ కుట్టు శిక్షణ స్కీమ్‌పై ఆసక్తి చూపని మహిళలు
- 3 లక్షలకుపైగా ఆన్‌లైన్ దరఖాస్తులు.. శిక్షణకు వచ్చింది అంతంతమాత్రమే
- అరకొర శిక్షణ.. ఆపై మెషిన్ల పంపిణీ పేరుతో బిల్లుల కోసం పైరవీలు
- కీలక నేతల ఆశీస్సులతోనే అంతులేని అవినీతికి కుట్ర

**సాక్షి, అమరావతి:** మార్కెట్‌లో రెడీమేడ్ దుస్తుల తాకిడి పెరిగింది. కుట్టు మెషిన్ సెంటర్లు పెరిగాయి. ఇటువంటి పరిస్థితుల్లో వేలాది మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి మెషిన్లు ఇచ్చినా వాటి ద్వారా వారి కుటుంబాన్ని పోషించుకునేంత ఉపాధి ఉండదనేది ఎవరినడిగినా చెబుతారు. అయినా ప్రభుత్వ పెద్దలు పంతం పట్టి మరీ కుట్టు శిక్షణ, కుట్టు మెషిన్ల పంపిణీ అంటూ రూ.కోట్లు ప్రజాధనం వృథాకు చేస్తున్న యత్నాలు అనుమానాలకు తావిస్తున్నాయి. పదేళ్ల క్రితం పాతబడిన కుట్టు శిక్షణ స్కీమ్‌ను ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ(పీఎం విశ్వకర్మ) స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాల్లోనూ పరిగణనలోకి తీసుకోకపోయినా రాష్ట్రంలో చేపట్టడం వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రాష్ట్రంలోని బీసీ సంక్షేమ శాఖ ద్వారా అవుట్‌డేటెడ్ స్కీమ్‌ను అమలు చేయడం ద్వారా అడ్డగోలు స్కామ్‌కు స్కెచ్ వేశారన్నది తేటతెల్లమవుతోంది. టెండర్ నుంచి శిక్షణ వరకు అనేక లోపభూయిష్ట పద్ధతులు అనుసరించడంతోపాటు నిబంధనలూ ఉల్లంఘించిన ఈ స్కీమ్‌లో ఇప్పుడు బిల్లుల కోసం పైరవీలు ఊపందుకున్నాయి.

**ఒకే కుటుంబానికి చెందిన రెండు సంస్థలకు వర్క్ ఆర్డర్**

కీలక నేతల ఆశీస్సులతో రంగంలోకి దిగిన చిత్తూరు జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ అధికారులతో కుమ్మక్కై భారీ స్కామ్‌కు కుట్ర పన్నినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.257 కోట్లతో ప్రతిపాదించిన కుట్టు శిక్షణ, కుట్టు మెషిన్ల పంపిణీ పథకానికి తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌తోపాటు ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు నిర్వహిస్తున్న రెండు సంస్థలను ఎంప్యానల్ చేసి వర్క్ ఆర్డర్ ఇచ్చారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నుంచి సెక్యూరిటీ డిపాజిట్(టెండర్ మొత్తంలో 2.5శాతం) తీసుకోకుండానే వర్క్ ఆర్డర్ ఇచ్చేయడం మరీ దారుణం. వాస్తవానికి టెండర్ ఖరారైన ఏడు రోజుల్లోగా సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తేనే అగ్రిమెంట్ ఇవ్వాలి.

అధికారుల తప్పిదం బయటకు పొక్కడంతో కాంట్రాక్టర్‌కు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని నోటీస్ ఇచ్చి మసిపూసి మారేడు కాయ చేసే యత్నం చేసినట్టు సమాచారం.

**స్కీమ్ అమలులో డొల్లతనం బట్టబయలు**

బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్ శాఖ ద్వారా రూ.257 కోట్లతో మొత్తం 1,02,832 మంది మహిళలకు ప్రతిపాదించిన ఈ స్కీమ్ అమలులో డొల్లతనం బట్టబయలైంది. అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం చూసినా రాష్ట్రంలో బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు చెందిన 3,43,398 మంది మహిళలు ఉచిత కుట్టు శిక్షణ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 72,080 మంది మాత్రమే శిక్షణ కోసం ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నేషన్) యాప్‌లో నమోదు చేసుకున్నారు. వారిలోనూ 52,513 మంది మాత్రమే శిక్షణ పొందుతున్నారని చెబుతున్నారు. వారిలో 75శాతం హాజరు ఉంటేనే ఉచితంగా కుట్టు మెషిన్ అందిస్తామని అధికారులు చెబుతున్నారు. 90 రోజుల శిక్షణకు హాజరవుతున్న వారిలో 75శాతం హాజరు ఉండేది ఎంత మందికి అనేది అధికారులకే ఎరుక. ఈ లెక్కలు గమనించినా ఈ స్కీమ్ పట్ల మహిళలు ఆసక్తి చూపడంలేదని, శిక్షణ ప్రక్రియ కూడా సక్రమంగా జరగలేదనేది జగమెరిగిన సత్యం.

**బిల్లుల కోసం కాంట్రాక్టర్ ఒత్తిళ్లు.. అధికారుల ససేమిరా**

కుట్టు శిక్షణ స్కీమ్ పేరుతో కాంట్రాక్టర్‌ను ముందు పెట్టి రూ.కోట్లు (బిల్లులు) కొట్టేసేందుకు పెద్ద ఎత్తున పైరవీలు సాగుతున్నాయి. తొలుత మొబిలైజేషన్ అడ్వాన్స్ కోసం యత్నించి భంగపడిన కాంట్రాక్టర్ తాజాగా మొదటి దశ శిక్షణ పూర్తైందని, బిల్లులు చెల్లించాలని రకరకాలుగా అధికారులపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నారు. టెండర్ నుంచి శిక్షణ వరకు నిబంధనల్లో తీవ్ర ఉల్లంఘన ఉండటంతో బిల్లులు చెల్లిస్తే.. అది భవిష్యత్‌లో తమ మెడకు చుట్టుకుంటుందని ఆందోళన చెందుతున్న ఆర్థిక శాఖ అధికారులు అందుకు ససేమిరా అంటున్నారు.

### రంగంలోకి కీలక అధికారులు

ఆర్థిక శాఖ అధికారులు బిల్లుల మంజూరుకు ఒప్పుకోకపోవడంతో అధికారపార్టీ నేతల ఆదేశాలతో రంగంలోకి దిగిన కీలక అధికారులు ఎలాగోలా బిల్లులు ఇప్పించేందుకు శక్తివంచన లేకుండా యత్నిస్తున్నారు. ఇప్పటికే జిల్లాల ఈడీలతో సమావేశం నిర్వహించి కుట్టు శిక్షణ హాజరు, తదితర అంశాలను ఆమోదించేలా ఒత్తిడి తెచ్చారు. ఎంపిక ప్రక్రియలో గ్రామ, మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారుల అనుమతి తీసుకునే రాష్ట్ర స్థాయి అధికారులు, డబ్బులు చెల్లింపు విషయానికి వచ్చేటప్పటికి జిల్లా స్థాయిలో ఒక బీసీ కార్పొరేషన్ ఈడీ సంతకం ఉంటే చాలు అనే నిబంధన విధించారు. ఈ నిబంధన వల్ల తాము ఇరుక్కుంటామని ఈడీలు ససేమిరా అంటున్నారు. తమ నియోజకవర్గంలో శిక్షణ పూర్తి అయ్యిందని కుట్టు మెషిన్లు ఇవ్వాలని ఎమ్మెల్యేల లేఖలు తీసుకుని బిల్లుల కోసం యత్నించడం గమనార్హం. ఇదిలా ఉంటే.. కుట్టు స్కీమ్ బిల్లుల విషయమై ఇటీవల మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు వద్ద కొందరు అధికారులు ప్రస్తావించినప్పుడూ ఆర్థిక శాఖ అధికారులు ససేమిరా అన్నట్టు విశ్వసనీయ సమాచారం.

## మానవాళిని సేవామార్గం వైపు నడిపిన సత్యసాయి

- ఒడిశా గవర్నర్ హరిబాబు
- ప్రశాంతి నిలయంలో రెండోరోజు సత్యసాయి సేవాసంస్థల సదస్సు

**ప్రశాంతి నిలయం:** శ్రీ సత్యసాయిబాబా మానవతా విలువలను బోధించడంతో పాటు 'లవ్ ఆల్.. సర్వ్ ఆల్' అన్న నినాదంతో మానవాళిని సేవామార్గం వైపు నడిపారని, మానవ సమాజానికి ఆయన చేసిన సేవలు ప్రపంచానికే ఆదర్శమని ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు చెప్పారు. శుక్రవారం పుట్టపర్తిలో జరిగిన సత్యసాయి సేవాసంస్థల అంతర్జాతీయ సదస్సులో ఒడిశా గవర్నర్ హరిబాబు, మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ప్రపంచశాంతి స్థాపనకు మార్గాలు' అన్న అంశంపై హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలకు కూడా సాధ్యంకాని సేవా కార్యక్రమాలను సత్యసాయి చేసి చూపించారని చెప్పారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ సత్యసాయి బోధనలు, ఆశయాలు ప్రతి భక్తుడి హృదయంలో నిలిచిపోయాయన్నారు. . ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జీవనోపాధి కార్యక్రమాన్ని ఒడిశా గవర్నర్ హరిబాబు, మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్.. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌రాజుతో కలిసి ప్రారంభించారు. వందమందికి ఆటోరిక్షాలు పంపిణీ చేశారు.

శ్రీ సత్యసాయి జీవనోపాధి పథకం ద్వారా కార్మికుడికి ఆటోను అందిస్తున్న ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తదితరులు

## 250 కిలోల గంజాయి తరలిస్తున్న కారు బీభత్సం

**పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో అదుపు తప్పిన కారు**

**చోడవరం:** గంజాయి అక్రమ రవాణా చేస్తున్న కారు శుక్రవారం అనకాపల్లి జిల్లా చోడవరం మెయిన్‌రోడ్డుపై బీభత్సం సృష్టించింది. పోలీసులు కారును పట్టుకునేందుకు చేజ్ చేయడంతో స్మగ్లర్లు పరారయ్యే ప్రయత్నంలో కారును వేగంగా నడిపి వాహనాలను, విద్యుత్ స్తంభాలను ఢీకొట్టారు. కారు ఢీకొనడంతో ద్విచక్రవాహనం మీద వెళుతున్న భార్యాభర్తలు కూర్మదాసు గోవిందు, చిన్నమ్మ తీవ్రంగా గాయపడ్డారు. పాడేరు ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న కారు వస్తుందన్న సమాచారంతో చోడవరం సీఐ అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఏపీ31 బీఏ 9022 కారును ఆపేందుకు ప్రయత్నించగా పోలీసుల నుంచి ఈతప్పించుకునే ప్రయత్నంలో కారు అదుపు తప్పింది.తర్వాత రోడ్డు పక్కన పెట్రోల్ బంకు సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగింది. కారులో ఉన్న సుమారు 250 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

బీభత్సం సృష్టించిన గంజాయి తరలిస్తున్న కారు

## రాష్ట్రానికి 'సెనియార్' తుపాను ముప్పు

- నేడు అండమాన్ సముద్రంలో అల్పపీడనం
- 27వ తేదీకి తుపానుగా బలపడే అవకాశం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రానికి మరో తుపాను ముప్పు పొంచి ఉంది. ప్రస్తుత ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారానికి దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. ఇది 24వ తేదీ నాటికి దక్షిణ బంగాళాఖాతంలో వాయుగుండంగా, 26, 27 తేదీల్లో తుపానుగా మారే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. తుపానుగా మారిన తర్వాత దీనికి సెనియార్ అని పేరు పెట్టనున్నారు (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్–యూఏఈ ఈ పేరు పెట్టనుంది). ఈ తుపాను ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ బంగ్లాదేశ్ తీరానికి చేరే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ ప్రస్తుతం అంచనా వేసింది. పలు ప్రైవేటు గ్లోబల్ మోడల్స్ మాత్రం ఇది వాయవ్య దిశగా పయనించి ఏపీ, ఒడిశా, తమిళనాడు తీరాలపై ప్రభావం చూపుతుందని చెబుతున్నాయి. సముద్ర ఉష్ణోగ్రతలు అస్థిరంగా ఉండడంతో దీని కదలికలు ఇంకా అస్పష్టంగా ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. అండమాన్ సముద్రం, బంగాళాఖాతంలో ప్రస్తుతం 28 నుంచి 30 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలున్నాయి. కొన్నిచోట్ల తేమ ఎక్కువగా ఉండగా మరికొన్ని ప్రాంతాల్లో ఈ తేమ తగ్గుతోంది. ఫలితంగా దాని గమనంపై అస్పష్టత నెలకొంది. 26వ తేదీ నాటికి దీని గమనంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**26 నుంచి వర్షాలు**

దీని ప్రభావంతో ఈ నెల 26 నుంచి రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. గంటకు 60 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, సముద్రంలో అలలు 3 నుంచి 5 మీటర్ల ఎత్తువరకు ఎగిసిపడతాయని తెలిపింది.

**సెనియార్ అంటే..**

సెనియార్ అనే పేరును యూఏఈ(యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) పెట్టింది. ఈ పదం అరబిక్ భాషకు చెందినది. దీని అర్థం 'చేపలు పట్టేందుకు నావలో చేసే సుదీర్ఘ ప్రయాణం'

## పీపీపీ మెడికల్ కాలేజీలతో ప్రజలకు ప్రయోజనం

- త్వరలో నాలుగింటిని అందుబాటులోకి తేవాలి
- వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి బీమా విధానం అమలు
- వైద్యశాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

**సాక్షి, అమరావతి:** పీపీపీ మెడికల్ కాలేజీలతో ప్రజలు, విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల మెడికల్ కాలేజీలను పీపీపీకి ఇచ్చే ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం వైద్యశాఖపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దేశవ్యాప్తంగా వివిధ మోడళ్లలో ఆస్పత్రులు నిర్వహిస్తున్నారని, వాటిపై అధ్యయనం చేయాలని చెప్పారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా అమలుచేస్తున్న డిజిటల్ నెర్వ్ సెంటర్ సంజీవని ప్రాజెక్టు రాష్ట్రానికి గేమ్‌ఛేంజర్ అన్నారు. జనవరి ఒకటి నుంచి చిత్తూరు జిల్లా మొత్తానికి ఈ ప్రాజెక్టును విస్తరించాలన్నారు.

**ఏప్రిల్ నుంచి బీమా విధానం..**

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న బీమా విధానాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి తేవాలని చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతం 12 లక్షల క్లెయిమ్‌లు ఆస్పత్రుల నుంచి ఆరోగ్యశ్రీ ట్రస్టుకు వస్తున్నాయని, తద్వారా నెలకు రూ.330 కోట్ల వ్యయం చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఏ వ్యాధికి ఎంత వ్యయం చేస్తున్నామో విశ్లేషించాలని సీఎం సూచించారు. ఈ సమీక్ష సమావేశానికి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. సమీక్షలో వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సౌరబ్ గౌర్, వీరపాండియన్, గిరరీశా తదితరులు పాల్గొన్నారు.

**చంద్రబాబుతో బీఎస్ఎన్ఎల్ సీఎండీ భేటీ**

ప్రభుత్వరంగ బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జెరార్డ్ రవి శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో బీఎస్ఎన్ఎల్ సేవల విస్తరణకు సహకారం అందించాల్సిందిగా ఆయన సీఎంని కోరినట్లు బీఎస్ఎన్ఎల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అంతకముందు.. రాష్ట్రంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలపై అధికారులతో జెరార్డ్ సమీక్ష నిర్వహించారు. కాగా వచ్చే మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో సీఎం సమీక్షించారు. 2029 నాటికి హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. వచ్చే ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలన్నారు.

**ఉద్యాన పంటల ధరలు తగ్గొద్దు**

ఉద్యాన ఉత్పత్తుల ధరలు పడిపోకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రైలు, జల రవాణాతో పాటు అవసరమైతే ఎయిర్ కార్గో ద్వారా వాటిని ఎగుమతి చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖపై సచివాలయంలో శుక్రవారం సీఎం సమీక్ష నిర్వహించారు. అరటి రైతుకు మద్దతు ధర లభించేలా చూడాలని అధికారులకు సూచించారు.

**ఆర్ఎస్‌కే సిబ్బంది సేవలు ప్రశంసనీయం..**

రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, ఆక్వా కల్చర్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో మంచి సేవలు అందిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. ఈనెల 24 నుంచి 29 వరకూ, అలాగే డిసెంబరు 3న నిర్వహించనున్న రైతన్నా–మీ కోసం కార్యక్రమాన్ని రైతుల వద్దకు తీసుకెళ్లటంలో వారు ముఖ్యపాత్ర పోషించాలన్నారు.

# విశ్వ సుందరి ఫాతిమా

- మెక్సికో సుందరికి మిస్ యూనివర్స్ కిరీటం
- మొదటి రన్నరప్‌గా థాయ్‌లాండ్ భామ
- మూడో స్థానంలో నిలిచిన వెనెజువెలా సుందరి

**బ్యాంకాక్:** మెక్సికో భామ ఫాతిమా బాష్ ఫెర్నాండెజ్ 2025 సంవత్సరానికి గాను విశ్వసుందరి కిరీటాన్ని దక్కించుకుంది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో 74వ మిస్ యూనివర్స్ పోటీలు కన్నుల పండువగా జరిగాయి. వివిధ దేశాల నుంచి 120 మంది సుందరీమణులు పాల్గొన్నారు. 25 ఏళ్ల ఫాతిమా బాష్ ఫెర్నాండెజ్ అన్ని రౌండ్లలో నెగ్గి విశ్వసుందరిగా అవతరించింది. మిస్ థాయ్‌లాండ్ ప్రవీనర్ సింగ్(29) మొదటి రన్నరప్‌గా ఘనత సాధించింది. మిస్ వెనెజువెలా స్టెఫానీ అడ్రియానా అబాసలీ నసీర్(25) మూడో స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మణికా విశ్వకర్మ కిరీటం దక్కించుకోలేకపోయారు. టాప్–12 స్థానానికి సైతం ఆమె చేరుకోలేకపోయారు. మిస్ యూనివర్స్–2025 పోటీలకు భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ న్యాయనిర్ణేతల్లో ఒకరిగా వ్యవహరించడం విశేషం.

**మేమంతా కలిసికట్టుగా చరిత్ర సృష్టిస్తాం**

మిస్ యూనివర్స్ పోటీల్లో భాగంగా తుది రౌండ్‌లో జడ్జిలు అడిగిన ప్రశ్నకు ఫాతిమా బాష్ ఫెర్నాండెజ్ చెప్పిన సమాధానం అందరినీ మెప్పించింది. ప్రస్తుత ఆధునిక యుగంలో మీరు ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నారు. మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని ఏర్పర్చడానికి ఈ కిరీటాన్ని మీరు ఎలా ఉపయోగిస్తారు? అని ప్రశ్నించగా.. ''భద్రత, సమాన అవకాశాల విషయంలో నేటి మహిళలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ వారు తమ భావాలను వ్యక్తం చేయడానికి ఏమాత్రం వెనుకాడడం లేదు. నేటితరం మహిళలు మార్పును కోరుకుంటున్నారు. మా గళాన్ని వినిపించడానికి, మార్పును ఆహ్వానించడానికి ఇక్కడికి వచ్చాం. మేమంతా కలిసికట్టుగా చరిత్ర సృష్టిస్తాం'' అని ఫాతిమా దృఢంగా బదులిచ్చి విజేతగా నిలిచింది. ఫాతిమా ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు అభ్యసించారు. స్కూల్‌లో చదువుకుంటున్న సమయంలో డిస్లెక్సియా, హైపర్ యాక్టివిటీ డిజార్డర్‌తో బాధపడ్డానని గతంలో ఆమె చెప్పారు. చిన్నప్పుడు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని, చివరకు సేవా మార్గంలో నడిచానని అన్నారు. మిస్ యూనివర్స్ విజేతకు 2.50 లక్షల డాలర్ల నగదు బహుమతి అందజేస్తారని సమాచారం. అంతేకాకుండా ప్రతినెలా 50 వేల డాలర్ల చొప్పున వేతనం కూడా అందుకోవచ్చు.

# కుప్పకూలిన తేజస్

## దుబాయ్ ఎయిర్ షోలో విషాదం

- విన్యాసాల్లో భాగంగా టేకాఫ్ కాగానే ప్రమాదం
- ఫైటర్ జెట్ నేలకూలడంతో చెలరేగిన మంటలు
- ఘటనా స్థలంలోనే పైలట్ దుర్మరణం
- దర్యాప్తు కోసం 'కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ' ఏర్పాటు
- విచారం వ్యక్తం చేసిన భారత వైమానిక దళం
- బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ
- 24 ఏళ్లలో రెండో తేజస్ ప్రమాదం

గాల్లో విన్యాసాలు చేస్తూ...

కిందకి పడిపోతూ..

పేలిపోతూ..

బూడిదగా మిగిలి..

పైలట్ సయాల్ (ఫైల్)

**న్యూఢిల్లీ/దుబాయ్:** దుబాయ్ వైమానిక ప్రదర్శనలో పెనువిషాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్' ప్రమాదవశాత్తూ కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో తేజస్ పైలట్ మృతి చెందినట్లు భారత వైమానిక దళం ప్రకటించింది. తేజస్ ఎంకే1 కూలిపోయి మంటలు చెలరేగిన దృశ్యాలు టీవీ చానళ్లలో ప్రసారమయ్యాయి. శుక్రవారం దుబాయ్ ఎయిర్ షోలో భాగంగా టేకాఫ్ తీసుకున్న ఈ ఫైటర్ జెట్ హఠాత్తుగా కిందికి దిగింది. నేలను తాకగానే బంతి ఆకారంలో మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగ వెలువడింది. పైలట్, వింగ్ కమాండర్ నమాన్ష్ సయాల్ అక్కడికక్కడే మరణించారు. ఈ దృశ్యాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన జనం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు. చాలాసేపటి దాకా షాక్‌లోనే ఉండిపోయామని చెప్పారు. ప్రమాదం జరగ్గానే అగ్నిమాపక, అత్యవసర సేవల సిబ్బంది రంగంలోకి దిగారు. మంటలు ఆర్పేశారు.

**సంతాపం ప్రకటించిన సీడీఎస్**

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దుబాయ్ ఎయిర్ షోలో వివిధ దేశాలకు చెందిన విమానాలు, ఫైటర్ జెట్లు పాల్గొంటున్నాయి. ఐఏఎఫ్‌కు చెందిన లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఎల్‌సీఏ) తేజస్ ఎంకే1 కూడా ఇందులో చేరింది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 2.10 గంటలకు విన్యాసాల్లో భాగంగా అల్ మక్తూమ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ కాగానే ప్రమాదం జరిగినట్లు భారత వైమానిక దళం 'ఎక్స్'లో వెల్లడించింది. తీవ్రంగా గాయపడిన పైలట్ ఘటనా స్థలంలోనే మృతిచెందారని పేర్కొంది. ఈ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నామని, బాధితుడి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నామని, అన్నివిధాలుగా అండగా ఉంటామని వివరించింది. ప్రమాదంపై పూర్తిస్థాయిలో దర్యాప్తుకు 'కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సైతం స్పందించారు. పైలట్ మృతిపట్ల సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తేజస్ విమాన ప్రమాదంలో పైలట్ ప్రాణాలు కోల్పోవడం పట్ల సీడీఎస్‌తోపాటు సైనిక దళాల్లోని అన్ని ర్యాంకుల అధికారులు తీవ్ర విచారం వ్యక్తం చేసినట్లు ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ ప్రధాన కార్యాలయం 'ఎక్స్'లో పోస్టుచేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని దుబాయ్‌లో ప్రతి రెండేళ్లకోసారి ఎయిర్ షో నిర్వహిస్తుంటారు. రకరకాల విమానాలను ఇందులో ప్రదర్శిస్తుంటారు. విమానాల విన్యాసాలు సైతం ఉంటాయి. ఈసారి 150 దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. భారత వైమానిక దళం నేతృత్వంలోని సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ ఈ ఎయిర్‌షోలో విజయవంతంగా విన్యాసాలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చివరి రోజు తేజస్ యుద్ధ విమానం కూలిపోవడం విషాదాన్ని నింపింది.

### ఆయిల్ లీకేజీ వల్లేనా?

తేజస్ ఫైటర్‌జెట్ కూలిపోవడం గత 24 ఏళ్లలో ఇది కేవలం రెండోసారి మాత్రమే. ప్రమాదం ఎలా జరిగిందో గుర్తించడానికి నిపుణులు ప్రయత్నిస్తున్నారు. దుబాయ్ ఎయిర్ షోలో పాల్గొంటున్న తేజస్ ఎంకే1 ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో చమురు లీక్ అవుతున్నట్లు వార్తలొచ్చాయి. అయితే, ప్రభుత్వం ఖండించింది. అలాంటిదేమీ లేదని, అంతా సవ్యంగానే ఉన్నట్లు వివరణ ఇచ్చింది. ఇంతలోనే ప్రమాదం జరగడం చర్చనీయాంశంగా మారింది. చమురు లీక్ వల్లే కూలిపోయినట్లు అనుమానిస్తున్నారు. ఇంజన్‌లో మంటలు అంటుకోవడం వల్లే తేజస్ అదుపుతప్పి నేలకూలినట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ఏమిటీ తేజస్?

తేజస్‌ను బెంగళూరులోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్), ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ) ఉమ్మడిగా చాలావరకు దేశీయ పరిజ్ఞానంతోనే అభివృద్ధి చేశాయి. ఇది సింగిల్–ఇంజన్, మల్టీ–రోల్ ఫైటర్‌జెట్. 2003లో తేజస్ అని అధికారికంగా పేరుపెట్టారు. ఇందులోని ఇంజన్‌మాత్రం విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నదే. భారత వైమానిక దళం ప్రస్తుతం ఎంకే1 వేరియంట్ తేజస్‌ను ఉపయోగిస్తోంది. అత్యాధునిక ఎంకే1ఏ వేరియంట్ కోసం ఎదురు చూస్తోంది. తేజస్ విమానం షార్ట్–రేంజ్ క్షిపణులను, ఆకాశం నుంచి ఆకాశంలోకి ప్రయోగించే క్షిపణులను మోసుకెళ్లగలదు. ఆకాశంలోనే ఇంధనాన్ని నింపుకోగలదు. 2020 అక్టోబర్‌లో తేజస్ విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించారు. తర్వాత సరిచేశారు. తేజస్‌ను వైమానిక దళంలో కీలక అస్త్రంగా పరిగణిస్తుంటారు.

### ఏడాది క్రితం ప్రమాదం

2024 మార్చి నెల లో 'భారత్ శక్తి' ప్రదర్శనలో భాగంగా రాజస్తాన్‌లోని పోఖ్రాన్‌లో విన్యాసాలు నిర్వహించి వెనక్కి తిరిగివస్తుండగా తేజస్ విమానం కూలిపోయింది. జైసల్మేర్ సమీపంలోని ఓ కాలనీ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పైలట్ క్షేమంగా బయటపడ్డాడు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. తేజస్ జెట్లు 2001లో విధుల్లో చేరగా, కూలిపోవడం అదే మొదటిసారి. తాజాగా దుబాయ్‌లో జరిగిన ప్రమాదం రెండోది.

## గర్భధారణకు కారణమయ్యే...
# జెనెటిక్ స్విచ్

కనిపెట్టిన భారత శాస్త్రవేత్తలు • జన్యు శాస్త్ర చరిత్రలోనే మైలురాయి

మహిళల్లో గర్భధారణకు అంకురార్పణ చేసే అత్యంత మౌలికమైన జెనెటిక్ స్విచ్ (జన్యు మీట)ను మన సైంటిస్టులు కనిపెట్టారు! పిండం గర్భాశయ ద్వారంలోకి సజావుగా చేరేందుకు వీలు కల్పించేది ఇదేనట! కనుక ఏ కోణంలో చూసినా దీన్ని జన్యు శాస్త్రంలోనే గాక ప్రసూతి వైద్యంలోనూ అతి పెద్ద మైలురాయిగా భావిస్తున్నారు. జన్యు శాస్త్ర ప్రస్థానాన్నే పునర్ నిర్వచించగలదని భావిస్తున్న ఈ కీలక పరిశోధనకు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), జాతీయ ప్రత్యుత్పత్తి, శిశు వైద్య పరిశోధన సంస్థ (ఎన్ఐఆర్ఆర్‌సీహెచ్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెనారస్ హిందూ యూనివర్సిటీ వంటి అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలు సారథ్యం వహించడం విశేషం. పిండాన్ని తనలోకి స్వీకరించేందుకు గర్భాశయం సన్నద్ధం కావడం వెనక ఇమిడి ఉండే కీలకమైన కణజాల పనితీరును మన సైంటిస్టులు ఈ పరిశోధన ద్వారా వెలుగులోకి తెచ్చారు. గర్భధారణ జరగాలంటే బుల్లి పిండం గర్భ సంచి మార్గంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. వైద్య పరిభాషలో దీన్ని ఇంప్లాంటేషన్ గా పిలుస్తారు. గర్భధారణ దిశగా ఇది తొలి అడుగు మాత్రమే కాదు, ఒకరకంగా పునరుత్పత్తి ప్రక్రియ అంతటిలోనూ ఇదే అత్యంత కీలకం. గర్భ విచ్ఛిత్తికే గాక, చివరికి వంధ్యత్వానికి కూడా ఇంప్లాంటేషన్ లో వైఫల్యమే మూల కారణం!

**ఇలా చేశారు...**

హోక్సా10, ట్విస్ట్2 అనే రెండు కీలక జన్యువులను సైంటిస్టులు తమ పరిశోధన క్రమంలో గుర్తించారు. గర్భధారణ విషయంలో ఇవి రెండూ పరస్పర విరుద్ధ శక్తులుగా పని చేస్తూనే, అంతిమంగా అందుకు వీలు కల్పించడం విశేషం! ఎందుకంటే హోక్సా10 సాధారణంగా గర్భాశయ ద్వారాన్ని రక్షణాత్మక కణజాలాల సాయంతో నిత్యం మూసి ఉంచి కాపాడుతూ ఉంటుంది. ఇందుకోసం అది అనునిత్యం ఏకంగా 1,200 కణాలను నియంత్రిస్తూ ఉంటుంది. కానీ, సరిగ్గా పిండం ఆ ద్వారం వైపు వచ్చే వేళకు హోక్సా10 తాత్కాలికంగా స్విచ్ ఆఫ్ మోడ్ లోకి వెళ్లిపోతుంది. మరోలా చెప్పాలంటే దాని పనితీరు స్తంభిస్తుందన్నమాట. మరుక్షణమే ట్విస్ట్2 ఒళ్లు విరుచుకుని క్రియాశీలకం అవుతుంది. గర్భాశయ కణజాలాన్ని మృదువుగా మార్చి పిండం దాని ద్వారం గుండా సజావుగా లోనికి సాగేలా చేస్తుంది. హోక్సా10, ట్విస్ట్2 నడుమ సంబంధం వల్ల గర్భాశయ ద్వారం గట్టిదనం నుంచి మృదుత్వాన్ని, అవసరం తీరగానే తిరిగి యథాస్థితికి మారుతున్నట్టు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బృందం రూపొందించిన మ్యాథమాటికల్ రీ మోడలింగ్ లో తేలింది. అనంతరం ఎలుకల్లో ప్రయోగాత్మకంగా ట్విస్ట్2 కార్యకలాపాన్ని నిరోధించి చూడగా గర్భధారణ ప్రక్రియే నిలిచిపోవడాన్ని సైంటిస్టులు గుర్తించారు. ఈ పరిశోధన వివరాలు కాల్ డెత్ డిస్కవరీ జర్నల్ లో తాజాగా ప్రచురితమయ్యాయి.

**ప్రయోజనాలు ఎన్నెన్నో!**

ఈ జెనెటిక్ స్విచ్ ఉనికి వెలుగులోకి రావడానికి ఎంతో ప్రాధాన్యం ఉందని సైంటిస్టులు చెబుతున్నారు. ' జన్యువులు, వాటి స్వరూప స్వభావాలు, పనితీరు తదితరాల గురించి మనకు ఇప్పటిదాకా తెలిసింది గోరంత అయితే తెలియాల్సిందేమో కొండంత. కీలకమైన జన్యు నెట్‌వర్క్ తదితరాలపై మరింత అవగాహనకు జెనెటిక్ స్విచ్ వీలు కల్పించగలదు. తద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు మెరుగైన చికిత్సతో పాటు తీవ్ర గాయాలను త్వరితంగా నయం చేయడం వంటివీ వీలు పడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి' అని వారు వివరించారు. 'కొన్నిసార్లు ఆరోగ్యకరమైన పిండం కూడా ఫలదీకరణ చెందడంలో విఫలమవుతుంటుంది. అందుకు కారణాలను అన్వేషించడంలో జెనెటిక్ స్విచ్ వ్యవస్థ ఉనికి ఎంతగానో తోడ్పడుతుంది. ఐవీఎఫ్ వంటి కృత్రిమ గర్భధారణ చికిత్స ప్రక్రియలు మరింతగా విజయవంతం అయ్యేలా చేయగలదు' అని చెప్పుకొచ్చారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

## నూతన ప్రపంచానికి నూతన ఐరాస: రాజ్‌నాథ్

**లక్నో:** ఇజ్రాయెల్–హమాస్, ఉక్రెయిన్– రష్యా వంటి సంక్షోభాలతోపాటు మానవీయ విపత్తులు వంటివి తలెత్తినప్పుడు ఐక్యరాజ్యసమితి మరింత సమర్థవంతమైన పాత్ర పోషించాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నొక్కి చెప్పారు. నూతన ప్రపంచానికి, నూతన ఐక్యరాజ్యసమితి, నూతన అంతర్జాతీయ క్రమత అవసరముందని ఆయన పేర్కొన్నారు. సిటీ మాంటెస్సోరి స్కూల్ నిర్వహించిన ప్రపంచ ప్రధాన న్యాయమూర్తుల సదస్సులో ఆయన మాట్లాడారు. సంక్షోభాలతో నిండిన నేటి ప్రపంచంలో ఐక్యరాజ్యసమితి కీలకంగా వ్యవహరించలేకపోతోందని ఆయన తెలిపారు. అగ్ర రాజ్యాల పలుకుబడి, ప్రపంచ సంక్లిష్ట రాజకీయాల కారణంగా ఐరాస అంతగా రాణించడం లేదని చెప్పారు. ఈ సంస్థ ఉనికే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నూతన ఐరాస అంటే కొత్తగా మరో సంస్థను ఏర్పాటు చేయడం కాదు, నూతన శక్తిని సంతరించుకున్న ఐక్యరాజ్యసమితి అని ఆయన వివరించారు.

## లండన్‌లో చైనా ఎంబసీకి యూకే ప్రధాని పచ్చజెండా

**లండన్:** లండన్ నడిబొడ్డున చైనా నిర్మించతలపెట్టిన వివాదాస్పద సూపర్ ఎంబసీకి బ్రిటిష్ ప్రభుత్వం అనుమతించనుంది. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మరికొద్ది నెలల్లో చైనాలో పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఎంబసీ ప్రణాళికకు ఆమోదం తెలపాలని నిర్ణయించింది. స్టార్మర్ ప్రతిపాదనకు హోం శాఖ, విదేశాంగ శాఖలు అడ్డుచెప్పే అవకాశాలు లేవని ది టైమ్స్ కథనం పేర్కొంది. అయితే, జాతీయ భద్రతా ప్రయోజనాలకు లోబడి ఇందులో కొన్ని మినహాయింపులుండొచ్చని తెలిపింది. డిసెంబర్ 10వ తేదీలోగా అధికారికంగా అనుమతి లభించవచ్చని పేర్కొంది. చైనా నిర్మించాలనుకుంటున్న భారీ దౌత్య కార్యాలయం తమ దేశంలో గూఢచర్యానికేనని యూకే అనుమానిస్తోంది. అయితే, ఎంబసీ ప్రణాళికను ఆమోదించకుంటే తీవ్ర పరిణామాలుంటాయని చైనా హెచ్చరికలు చేయడం గమనార్హం.

## చైనీయులకు భారత్ టూరిస్ట్ వీసాలు

**న్యూఢిల్లీ:** తూర్పు లద్దాఖ్ సంక్షోభం అనంతరం భారత్–చైనా మధ్య సంబంధాలు క్రమంగా గాడిన పడుతున్నాయి. ఇటీవలే కైలాస్ మానస్ సరోవర్ యాత్ర, భారత్ నుంచి నేరుగా చైనాకు విమాన సర్వీసులు మొదలయ్యాయి. అదేవిధంగా, చైనా పౌరులకు భారత్ పర్యాటక వీసాలను మంజూరు చేయాలని నిర్ణయించింది. బీజింగ్‌లోని భారత్ ఎంబసీ, షాంఘై, గ్వాంగ్‌ఝౌ, హాంకాంగ్‌లలోని కాన్సులేట్లలో టూరిస్ట్ వీసాల జారీ ఇప్పటికే ప్రారంభమైందని ఓ అధికారి శుక్రవారం తెలిపారు. లద్దాఖ్ సంక్షోభం నేపథ్యంలో 2020 మేలో టూరిస్ట్ వీసాల జారీ నిలిపివేశారు.

మోదీకి జోహన్నెస్‌బర్గ్ విమానాశ్రయంలో సంప్రదాయ స్వాగతం

# దక్షిణాఫ్రికా చేరుకున్న మోదీ

**నేడు జీ20 సదస్సులో పాల్గొననున్న ప్రధానమంత్రి**

**జోహన్నెస్‌బర్గ్:** ప్రపంచ దేశాల అధినేతలతో ఫలవంతమైన చర్చల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రాధాన్యం కలిగిన కీలక అంశాలపై వారితో చర్చించబోతున్నానని తెలిపారు. జీ20 దేశాల అధినేతల సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ శుక్రవారం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. దక్షిణాఫ్రికా వైమానిక దళం మోదీకి రెడ్‌కార్పెట్ స్వాగతం పలికింది. ఎయిర్‌పోర్టులో సంప్రదాయ నృత్యాలు చేసిన కళాకారులకు మోదీ అభివాదం చేశారు. జీ20 సదస్సు కోసం జోహన్నెస్‌బర్గ్‌కు చేరుకున్నట్లు ప్రధానమంత్రి 'ఎక్స్'లో పోస్టుచేశారు. దక్షిణాఫ్రికా ప్రభుత్వం జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇస్తుండడం ఇదే మొదటిసారి. 2023లో జీ20కి భారత్ సారథ్యం వహించిన సమయంలోనే దక్షిణాఫ్రికా ఈ కూటమిలో భాగస్వామిగా చేరింది. కూటమిలో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవడం, అభివృద్ధి ప్రాధాన్యతలను మరింత ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని మోదీ ఉద్ఘాటించారు. అందరికీ ఉజ్వలమైన భవిష్యత్తులను అందించాలన్నదే ఆశయమని పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బస చేసేందుకు వచ్చిన మోదీకి ప్రవాస భారతీయ చిన్నారులు స్వాగతం పలికారు. గణపతి ప్రార్థన, శాంతి మంత్రంతోపాటు వేద మంత్రాలు పఠించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్, తమిళనాడు, కేరళ, బెంగాల్, రాజస్తాన్, గుజరాత్ తదితర రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలను, కళారూపాలను ప్రదర్శించారు. సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పారు. చిన్నారులను మోదీ అభినందించారు. భారత్–దక్షిణాఫ్రికా మధ్య సంబంధాలకు ప్రవాస భారతీయులే వారధులు అని ప్రశంసించారు. ఆయన ఈనెల 23వ తేదీ దాకా దక్షిణాఫ్రికాలో పర్యటించబోతున్నారు. జీ20 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ శనివారం పలు కార్యక్రమాల్లో పాల్గొనబోతున్నారు. వివిధ దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొంటారు. ఇండియా–బ్రెజిల్–దక్షిణాఫ్రికా(ఐబీఎస్ఏ) ఆరో సదస్సుకు సైతం హాజరవుతారు. దక్షిణాఫ్రికాలోని ప్రవాస భారతీయులతోనూ భేటీ అవుతారు. అయితే, ఈసారి 20 సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరు కావడం లేదు.

# ఉద్యోగ భద్రత తంచనుగా వేతనాలు

- అమల్లోకి వచ్చిన 4 లేబర్ కోడ్స్
- కేంద్ర ప్రభుత్వం ప్రకటన
- ఏడాదిపాటు పనిచేస్తే గ్రాట్యుటీ
- అసంఘటిత రంగంలో పనిచేసేవారికి రక్షణ
- గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకూ లబ్ధి
- వేతనం పొందడం చట్టబద్ధమైన హక్కు
- స్వాతంత్ర్యం తర్వాత అతిపెద్ద సంస్కరణ అంటున్న నిపుణులు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం, భద్రతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు కార్మిక స్మృతులను(కోడ్స్) అమల్లోకి తీసుకొచ్చింది. 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ నాలుగు కోడ్స్ తక్షణమే అమల్లోకి వస్తాయని శుక్రవారం ప్రకటించింది. దశాబ్దాల క్రితం నాటి 29 పాత చట్టాల స్థానంలో వీటిని తీసుకొచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, తంచనుగా వేతనాలు, మహిళా సాధికారత వంటి విషయాల్లో ఇవి ముఖ్యమైన సంస్కరణలుగా నిపుణులు చెబుతున్నారు. అసంఘటిత రంగంలో పనిచేసేవారికి తగిన రక్షణ లభించనుంది. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సైతం లబ్ధి చేకూరనుంది. మరోవైపు ఈ లేబర్ కోడ్స్‌తో కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయని అంటున్నారు. కార్మికులతో యాజమాన్యాలు ఎక్కువ గంటలు పని చేయించుకోవచ్చు. ఉద్యోగానికి నిర్దిష్ట కాలవ్యవధిని నిర్దేశించవచ్చు. గడువు దాటితే విధుల నుంచి తొలగించవచ్చు.

కోడ్ ఆఫ్ వేజెస్–2019, ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్–2020, కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ–2020, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, వర్కింగ్ కండీషనల్ కోడ్–2020 ఐదేళ్ల క్రితమే పార్లమెంట్‌లో ఆమోదం పొందాయి. వీటిని శుక్రవారం ప్రభుత్వం నోటిఫై చేసింది. వెంటనే అమల్లోకి వస్తాయని వెల్లడించింది. లేబర్ కోడ్స్‌లో ముఖ్యాంశాలు..

- ఉద్యోగులు/కార్మికులకు తప్పనిసరిగా అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వాలి. దీనివల్ల వారి కొలువుకు హామీ లభిస్తుంది.
- గిగ్, ప్లాట్‌ఫామ్, కాంట్రాక్టు, వలస కార్మికులు సహా ఉద్యోగులు/కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి. పీఎఫ్, ఈఎస్ఐ, బీమా వంటి ప్రయోజనాలు కల్పించాలి.
- కార్మికులు కనీస వేతనం చట్టబద్ధమైన హక్కు.
- అన్ని రంగాల్లో వేతనాలు నెలనెలా తంచనను చెల్లించాలి. ఐటీ ఉద్యోగులకు ప్రతినెలా 7వ తేదీలోగా వేతనాలు ఇవ్వాలి.
- మహిళలకు హక్కులు విస్తరింపజేయాలి. వారికి నైట్–షిఫ్ట్ పనులు కూడా అప్పగించవచ్చు. అందుకు వారికి అనుమతి అవసరం. వారికి ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీలు ఏర్పాటు చేయాలి. మహిళలకు భద్రత కల్పించాలి.
- 40 ఏళ్లు దాటిన ఉద్యోగులకు ప్రతి సంవత్సరం ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి.
- ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా ప్రయోజనాలు కల్పించాలి.
- ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులు ఒక సంవత్సరం సరీ్వసు పూర్తి చేసుకుంటే గ్రాట్యుటీకి అర్హులే.
- బీడీ, సిగరెట్లు, మైనింగ్ కంపెనీల్లో ఉద్యోగులు 8 గంటల నుంచి 12 గంటలదాకా పనిచేయొచ్చు. వారానికి 48 గంటలు మించకూడదు. 30 రోజులు పనిచేస్తే బోనస్‌కు అర్హత లభిస్తుంది.
- పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే. ట్రాన్స్‌జెండర్లు కూడా సమాన వేతనానికి అర్హులే.
- సాధారణ పని గంటల కంటే ఎక్కువసేపు పనిచేస్తే రెట్టింపు వేతనం ఇవ్వాలి.
- మహిళా ఉద్యోగుల కుటుంబంలో భర్త, పిల్లలు కాకుండా అత్తామామలను చేర్చాలి. తద్వారా వారికి కూడా ప్రయోజనం చేకూరుతుంది.

## ఆత్మ గౌరవమా.. కీలక మిత్రుడా..?

**ట్రంప్ ప్రతిపాదనలపై జెలెన్‌స్కీ వ్యాఖ్య**

**కీవ్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకు తెచ్చిన శాంతి ప్రతిపాదనలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆత్మగౌరవమా లేక కీలకమైన మిత్రుడిని కోల్పోవడమా అనే ప్రశ్న ఇప్పుడు ఉక్రెయిన్ ముందుందని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఇది అత్యంత కష్ట కాలమని ఆయన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఉక్రెయిన్ ప్రస్తుతం అత్యంత తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఇప్పుడు చాలా కష్టమైన ఎంపికను ఎదుర్కోవాల్సి రావచ్చు. దీనివల్ల గౌరవాన్ని కోల్పోవడం లేదా కీలక భాగస్వామిని కోల్పోయే ప్రమాదం ఉంది'అని ఆయన వ్యాఖ్యానించారు. దురాక్రమణను ఆపాలంటే కీలకమైన పారిశ్రామిక ప్రాంతం డోన్బాస్‌ను రష్యాకు వదిలివేయడం వంటి షరతులు ట్రంప్ ప్రతిపాదనల్లో ఉన్నట్లుగా వస్తున్న వార్తల నేపథ్యంలో జెలెన్‌స్కీ ఈ ప్రసంగం చేయడం గమనార్హం.

## పాక్ ఫ్యాక్టరీలో పేలుడు 20 మంది మృతి

**లాహోర్:** పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో శుక్రవారం ఓ రసాయనాల కర్మాగారంలో చోటు చేసుకున్న భీకర పేలుడుతో 20 మంది చనిపోయారు. ఫైసలాబాద్ జిల్లా మాలిక్‌పూర్‌లో ఉన్న ఓ కెమికల్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలిందని అధికారులు తెలిపారు. గ్యాస్ లీకేజీయే పేలుడుకు కారణమన్నారు. ఆ ప్రాంతంలో మొత్తం నాలుగు ఫ్యాక్టరీలున్నాయి. ఒకదానిలో గ్యాస్ లీకేజీ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి, మిగతా ఫ్యాక్టరీలకు అంటుకుంది. దీంతో, పేలుడు చోటు చేసుకుంది. ప్రమాద తీవ్రతకు చుట్టుపక్కలున్న ఏడిళ్లు దెబ్బతిన్నాయి. ఘటనలో ఆరుగురు చిన్నారులు, ఇద్దరు మహిళలు సహా 20 మంది చనిపోయారు. క్షతగాత్రులైన ఏడుగురిని ఆస్పత్రులకు తరలించారు.

# పూర్తి సంతృప్తితో వెళ్తున్నా..

- న్యాయమూర్తిగా దేశానికి చేయగలిగినదంతా చేశాను
- నాలుగు దశాబ్దాల ప్రస్థానం సంతోషాన్ని ఇచ్చింది
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ వెల్లడి
- వీడ్కోలు పలికిన జడ్జీలు, లాయర్లు

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రజలకు తన వంతు సేవలు అందించానని, పూర్తి సంతృప్తితో పదవీ విరమణ చేయబోతున్నానని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా నాలుగు దశాబ్దాల ఈ ప్రస్థానం తనకు ఎనలేని సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. న్యాయరంగ విద్యార్థిగానే తన ప్రయాణానికి ముగింపు పలుకబోతున్నానని తెలిపారు. జస్టిస్ గవాయ్ ఈ నెల 23వ తేదీన పదవీ విరమణ చేయబోతున్నారు. శుక్రవారం చివరి పని దినం పూర్తిచేసుకున్నారు. ఆనవాయితీ ప్రకారం సుప్రీంకోర్టులో సెర్మోనియల్ బెంచ్ నిర్వహించారు. జస్టిస్ గవాయ్‌తోపాటు బెంచ్ సభ్యులైన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది జస్టిస్ గవాయ్‌కి ఘనంగా వీడ్కోలు పలికారు. పూర్తి సంతృప్తి, సంతోషంతో సుప్రీంకోర్టును వీడుతున్నానని ఆయన వ్యాఖ్యానించారు. దేశానికి తాను చేయగలిగినదంతా చేశానని ఉద్ఘాటించారు.

**పదవిని సేవగానే భావించాలి**

ప్రతి న్యాయమూర్తి, ప్రతి న్యాయవాది, ప్రతి ఒక్కరూ రాజ్యాంగ సూత్రాలకు లోబడి పనిచేయాలని జస్టిస్ గవాయ్ సూచించారు. సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాన్ని భారత రాజ్యాంగం బోధిస్తోందని గుర్తుచేశారు. రాజ్యాంగానికి కట్టుబడి తన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించడానికి కృషి చేశానని పేర్కొన్నారు. 1985లో 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రవేశించానని, తద్వారా న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టానని గుర్తుచేసుకున్నారు. ఈరోజు న్యాయరంగ విద్యార్థిగానే పదవీ విరమణ చేస్తున్నానని తెలిపారు.

**రికార్డుకెక్కిన జస్టిస్ గవాయ్**

జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఈ ఏడాది మే 14న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలలకుపైగా సేవలందించారు. రెండో దళిత సీజేఐగా, మొదటి బౌద్ధ మతస్తుడైన సీజేఐగా ఆయన రికార్డుకెక్కారు. వీడ్కోలు కార్యక్రమంలో జస్టిస్ సూర్యకాంత్, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ లాయర్ కపిల్ సిబల్ తదితరులు మాట్లాడారు. జస్టిస్ గవాయ్ మహోన్నతమైన సేవలందించారని కొనియాడారు. ఒక సామాన్యుడు నిరంతర కృషితో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని నిరూపించారని ప్రశంసించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మరో వీడ్కోలు కార్యక్రమంలోనూ జస్టిస్ గవాయ్ పాల్గొన్నారు. షెడ్యూల్డ్ కులాల్లో(ఎస్సీ) క్రీమీలేయర్‌పై ఇచ్చిన తీర్పుతో సొంత సామాజికవర్గం నుంచి ఆగ్రహం ఎదుర్కొన్నానని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ఉద్యోగాల్లో క్రీమీలేయర్ వర్గానికి రిజర్వేషన్లు కల్పించకూడదని తాను ఇచ్చిన తీర్పు ఎస్సీల్లో చాలామందికి నచ్చలేదని అన్నారు.

## కృష్ణా తీరంలో 'కార్తీక' సందడి

తాడేపల్లి (గుంటూరు జిల్లా) : పట్టణ పరిధిలోని సీతానగరం కృష్ణా తీరం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం ముగింపు సందర్భంగా భక్తులు తెల్లవారుజామునే నదీ తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. ఒడ్డున పూజలు చేసి, పోలి పాడ్యమి సందర్భంగా అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. పవిత్ర కార్తీకమాసం చివరిరోజు కావడంతో తీరంలో ఉన్న శ్రీ సోమేశ్వర, శ్రీ రాజరాజేశ్వర, సంగమేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

## గోదావరిలో హోరాహోరీగా పడవ పోటీలు

ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వైనతేయ గోదావరి నదిలో శుక్రవారం పడవ పోటీలు హోరాహోరీగా జరిగాయి. మామిడికుదురు మండలం గోగన్నమఠం రేవు నుంచి పాశర్లపూడిలంకలోని రెబ్బనపల్లి రేవు వరకు 4 కి.మీ. సాగిన ఈ పోటీల్లో 80కి పైగా పడవలు పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు భారీగా స్థానికులు రావడంతో గోదావరి నదీ తీరంలో సందడి నెలకొంది. అగ్నికుల క్షత్రియ సంఘం నేతృత్వంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో పెసింగు భైరవస్వామి ప్రథమ స్థానం సాధించారు. కాటాడి పెద మీరాసాహెబ్ ద్వితీయ, కాటాడి సత్యనారాయణ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున నగదును నిర్వాహకులు చింతా శ్రీనివాసు, అరదాని శ్రీనివాసు అందించారు. – మామిడికుదురు

## జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఏపీ బాలికల సత్తా

సాక్షి, అమరావతి: జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో జరిగిన 69వ అండర్–19 జాతీయ పాఠశాల క్రీడా పోటీల్లో తైక్వాండో విభాగంలో రాష్ట్రానికి చెందిన బాలికల జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచిందని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తి రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలికలు రెండు రజత, కాంస్య పతకాన్ని సాధించారని వివరించారు. అనంతపురం జిల్లా శ్రీ సాయి జూనియర్ కాలేజీ(గుత్తి)కి చెందిన ఎస్.కరిష్మ, విజయనగరం జిల్లా శ్రీనివాస జూనియర్ కాలేజీకి చెందిన వారణాసి హిమశ్రీ, రజత పతకాలు, శ్రీ సాయి జూనియర్ కాలేజీ(గుత్తి) విద్యార్థిని పోతురాజు పూజిత కాంస్య పతకం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పాఠశాల విద్యా శాఖ కమిషనర్ విజయ్ రామరాజు, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అభినందించారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

### పీడీఎస్‌యూ డిమాండ్

ఏలూరు (టూటౌన్): కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరులో నిరసన కార్యక్రమం జరిగింది. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో జరిగిన నిరసనలో సంఘం జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు మంజూరుచేశారని, వాటిలో ఐదు కళాశాలల నిర్మాణ పనులు పూర్తిచేసి తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. అయితే, చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక మిగిలిన కళాశాలల నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించడానికి ప్రభుత్వ–ప్రైవేట్–పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని తీసుకురావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దీని ద్వారా పేద ప్రజలకు ప్రభుత్వ విద్యను, వైద్యాన్ని దూరం చేస్తున్నారని నాని మండిపడ్డారు. ఇప్పటికైనా పీపీపీ విధానాన్ని రద్దుచేసి పెండింగులో ఉన్న మెడికల్ కళాశాలల నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎండీఎంఏ సరఫరా చేస్తున్న నిందితులు అరెస్టు

గుంటూరు రూరల్: నిషేధిత ఎండీఎంఏ డ్రగ్ సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఆ వివరాలను సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ భానోదయ మీడియాకు వెల్లడించారు. అంకిరెడ్డిపాలెం గ్రామం, వైజంక్షన్ సమీపంలో ఎండీఎంఏ మత్తు పదార్థాన్ని సరఫరా చేస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బంది నిఘా పెట్టి, బెంగళూరుకు చెందిన విశాల్‌సింగ్ చౌహాన్, నల్లకుంటకు చెందిన బత్తుల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



# పదిలో ఒకరే..

## వ్యాపారంలోకి అడుగిడుతున్న మహిళల సంఖ్య ఇది

పురుషుల్లో ఎనిమిది మందిలో ఒకరు బిజినెస్ ఎంట్రీ

స్త్రీల వ్యాపార వృద్ధిలో అడ్డంకిగా ఇంటి బాధ్యతలు

గ్లోబల్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ మానిటర్ తాజా నివేదికలో వెల్లడి

**అన్నింటా మేము అన్నట్టు వ్యాపారాల్లోనూ మహిళామణులు రాణిస్తున్నారు. పెట్టుబడి స్థాయి ఎంతదైనా తాము ప్రారంభించిన వ్యాపారాన్ని నిలబెట్టడమే కాదు.. ఆవిష్కరణల్లోనూ తీసిపోమని నిరూపిస్తున్నారు. ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. చిన్న దుకాణమైనా, స్టార్టప్ అయినా.. కుటుంబ బాధ్యతలు, పెట్టుబడి కొరత రూపంలో నిరంతర అడ్డంకులను మహిళా వ్యాపారులు ఎదుర్కొంటున్నారు. ఏ ఒక్క దేశానికో ఈ సవాళ్లు పరిమితం కాలేదు. దాదాపు ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు ఇలాగే ఉన్నాయి.**

**51 దేశాల్లో సర్వే**

బాబ్సన్ కాలేజ్, లండన్ బిజినెస్ స్కూల్ ప్రపంచవ్యాప్తంగా వ్యాపార కార్యకలాపాల తీరుతెన్నులను అంచనా వేసేందుకు నిర్వహిస్తున్న పరిశోధన ప్రాజెక్టు అయిన 'గ్లోబల్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ మానిటర్ (జీఈఎం)'తాజాగా 2024/2025 ఉమెన్స్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ రిపోర్ట్‌ను విడుదల చేసింది. సర్వేలో భారత్, చైనా, యూఎస్, యూకే, జర్మనీ సహా 51 దేశాలకు చెందిన లక్షలాది మంది పాలుపంచుకున్నారు. మహిళలు వ్యాపారం ప్రారంభించడంలో, కొనసాగించడంలో సవాళ్లను ఎదుర్కొంటున్న తీరును ఇందులో సమగ్రంగా వివరించింది. ప్రపంచ దేశాల జాతీయ ఆర్థిక విధానాలను ప్రభావితం చేయడానికి జీఈఎం డేటా ఉపయోగకరమైన సాధనంగా స్థానం సంపాదించింది. ఐక్యరాజ్యసమితి, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్, ప్రపంచ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థలు విశ్వసించే వనరుగా నిలిచింది.

### ఉద్యోగ ప్రత్యామ్నాయంగా..

అనేక మంది మహిళా వ్యవస్థాపకులకు వ్యాపారం ఒక ఉద్యోగ ప్రత్యామ్నాయం. ఒకే వ్యక్తి నిర్వహించేలా వారు చిన్న వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నారు. మహిళలను వ్యాపారం వైపు నడిపించడానికి గల కారణాల్లో.. ఉద్యోగ కొరత 71.1%, సంపదను పెంచుకోవడం 57.3%, ప్రత్యేకత చూపించుకోవడానికి 49.8%, వారసత్వ వ్యాపారం 31.5% కారణాలుగా చెప్పారు. వృద్ధి అవకాశాలు అధికంగా ఉన్న వ్యాపారాలను నడుపుతున్న చాలా మంది మహిళలు అధిక ఆదాయ దేశాలకు చెందినవారని నివేదిక తెలిపింది. వారు డిగ్రీలను కలిగి ఉండటంతోపాటు అధిక ఆదాయ కుటుంబాల నుంచి వచ్చారు. డిజిటల్ మాధ్యమాలను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. స్థిరత్వ లక్ష్యాలను చేరుకుంటారని నివేదిక వివరించింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

**23వ స్థానంలో మనం..**

ఒక ఆర్థిక వ్యవస్థలో 18–64 సంవత్సరాల వయసు గల జనాభాలో.. కొత్తగా వ్యాపారాన్ని ప్రారంభించే ప్రయత్నాల్లో ఉన్నవారు లేదా కొత్తగా బిజినెస్ మొదలుపెట్టిన వారి (42 నెలలలోపు) సంఖ్య ఆధారంగా టోటల్ ఎర్లీ స్టేజ్ ఆంట్రప్రెన్యూరియల్ యాక్టివిటీ (టీఈఏ) రేట్‌ను ఇస్తారు. 10% టీఈఏ రేటుతో భారత్ 23వ స్థానంలో ఉంది. మన దేశంలో టీఈఏ రేట్ మహిళల్లో 10.3%, పురుషుల్లో 14% ఉంది. ఇక 32% రేటుతో తొలి స్థానంలో ఈక్వెడార్ నిలిచింది.

| 18–35 ఏళ్లలోపు ఉన్న వ్యాపారుల్లో.. | మహిళలు | పురుషులు |
|---|---|---|
| | 43.9% | 42.4% |

- పురుషులతో పోలిస్తే మహిళా పెట్టుబడిదారులు 2.5 రెట్లు ఎక్కువగా స్త్రీలు నిర్వహిస్తున్న వ్యాపారాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు.
- అనధికారిక పెట్టుబడులలో మూడింట రెండు వంతులు పురుష వ్యాపారులకే వెళ్లాయి.
- పెట్టుబడిదారులు, పెట్టుబడి గ్రహీతలు.. ఈ రెండు విభాగాల్లోనూ మహిళల సంఖ్య తక్కువ.
- 2024లో ఎనిమిది మంది పురుషులలో ఒకరు, పది మంది స్త్రీలలో ఒకరు కొత్త వ్యాపారాన్ని ప్రారంభించారు.
- నూతన ఆవిష్కరణలను తెచ్చే స్టార్టప్స్‌లో 18 దేశాలలో మహిళా వ్యాపారులు పురుష వ్యాపారులతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా ఉన్నారు.
- 19 దేశాలలో మహిళల స్టార్టప్ రేట్లు పెరిగాయి. జోర్డాన్, మొరాకోలో రేట్లు రెట్టింపు అయ్యాయి.

**వ్యాపారాన్ని మూసేసేందుకు మహిళలు ఉదహరించిన ప్రధాన కారణాలు**

| కారణం | శాతం |
|---|---|
| వ్యాపారం లాభదాయకంగా లేదు | 29.4% |
| కుటుంబ, వ్యక్తిగత కారణాలు | 21% |
| ఆర్థిక సహాయం పొందడంలో సమస్యలు | 16.2% |

**పురుషులు చెప్పిన మొదటి మూడు కారణాలు**

| కారణం | శాతం |
|---|---|
| వ్యాపారం లాభదాయకంగా లేదు | 30.3% |
| ఉద్యోగం, పదవీ విరమణ వంటి మరొక అవకాశం | 17.1% |
| ఆర్థిక సహాయం పొందడంలో సమస్యలు | 16.1% |

**కుటుంబానికే ప్రాధాన్యత..**

2024లో ప్రపంచవ్యాప్తంగా 3.4% మంది మహిళలు వ్యాపారాన్ని మూసివేశారు. పురుషుల విషయంలో ఈ సంఖ్య 3.8% ఉంది. కుటుంబ, వ్యక్తిగత కారణాల వల్ల వ్యాపారాన్ని మూసివేసినట్టు 21% మహిళలు, 14.3% మంది పురుషులు వెల్లడించారు. అంటే కుటుంబ, వ్యక్తిగత కారణాల వల్ల వ్యాపారానికి దూరం అవుతున్న మహిళల సంఖ్య పురుషుల కంటే 47% ఎక్కువ. వ్యాపారాన్ని కాపాడుకోవడం ఒకవైపు, గృహ బాధ్యతలు మరోవైపు.. ఈ రెండింటినీ సమతుల్యం చేయడంలో చాలా మంది మహిళలు సమస్యలను ఎదుర్కొంటున్నారని నివేదిక వెల్లడించింది. వ్యాపార రంగంలో మహిళల పురోగతి మందగించడానికి ప్రధాన అడ్డంకి ఏమిటంటే.. చాలా మంది మహిళలు స్టార్టప్‌లను ప్రారంభించి అభివృద్ధి చేస్తున్నప్పుడు ఇంటి పనులు కూడా వారి భుజాలపై పడటమే.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- పాఠశాలలో కళావేదిక స్లాబ్ వేస్తుండగా ప్రమాదం
- కాంక్రీట్ తొట్టె మీదపడి ఉపాధ్యాయిని మృతి

మృత్యువాత పడ్డ టీచర్ జ్యోత్స్న

ప్రమాదానికి కారణమైన కాంక్రీట్ తొట్టె

పాయకరావుపేట: అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరం గ్రామంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా కారణంగా కాంక్రీట్ తొట్టె తలపై పడి ఉపాధ్యాయిని దుర్మరణం పాలైంది. రాజానగరం పాఠశాలలో సీఎస్సార్ నిధులతో డెక్కన్ కంపెనీ కళావేదిక నిర్మిస్తోంది. ఈ వేదికకు శుక్రవారం స్లాబ్ వేసే పనులు ప్రారంభమయ్యాయి. కాంక్రీట్‌ను ట్రాలీతో స్లాబ్‌పైకి తరలిస్తున్నారు. ఈ క్రమంలో స్లాబ్ కోసం ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కర్రలు పడిపోయాయి. ట్రాలీ కోసం ఏర్పాటు చేసిన తాడు తెగిపోయింది. ఇదే సమయంలో కళావేదిక పక్కన ఉన్న ఉపాధ్యాయ సిబ్బంది గదిలోకి సంతకం చేసేందుకు వెళ్తున్న ఇంగ్లిషు ఉపాధ్యాయిని ఎన్.జ్యోత్స్నబాయి (47) తలపై 50 కిలోల బరువున్న ట్రాలీ పడింది. తలకు తీవ్ర గాయమై ఆమె అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ఆమెను తుని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలు తుని వీరవరపు పేటలో నివసిస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు. జ్యోత్స్న భర్త రెండేళ్ల క్రితం గుండెపోటుతో మరణించారు. ఈ ప్రమాదానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణని టీచర్లు ఆరోపిస్తున్నారు. సహచర ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు కాంట్రాక్టర్, సూపర్‌వైజర్, మేస్త్రీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అప్పన్న చెప్పారు.

## గణితానికి బదులు అసభ్య పాఠాలు!

- పీలేరు అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఘటన
- ఉపాధ్యాయురాలిని తొలగించాలి అంటూ తల్లిదండ్రుల డిమాండ్

ఉపాధ్యాయురాలిని ప్రశ్నిస్తున్న ప్రిన్సిపాల్ కరుణ

పీలేరు రూరల్: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఓ ఉపాధ్యాయురాలు ఏకంగా సమాజం తలదించుకునేలా విద్యార్థినులకు అసభ్య పాఠాలు చెప్పిన ఉదంతం అన్నమయ్య జిల్లా పీలేరులో వెలుగులోకి వచ్చింది. విద్యార్థినులు తెలిపిన వివరాలు.. పీలేరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న సి.పరిమళ 8, 9, 10 తరగతులకు గణితం బోధించేవారు. ఈ క్రమంలో తరగతి గదిలో గణిత పాఠ్యాంశాలు పక్కన పెట్టి.. పదే పదే శృంగార విషయాలు చెబుతుండేవారు. దీంతో పలువురు విద్యార్థినులు ఈ విషయాన్ని తెలియజేస్తూ పాఠశాలలోని ఫిర్యాదు బాక్సులో లేఖ వేశారు. తమ తల్లిదండ్రులకు కూడా ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయురాలిని నిలదీశారు. తనది తప్పేనని.. క్షమించాలంటూ వేడుకున్నారు. ఆమెను వెంటనే తొలగించాలని ప్రిన్సిపాల్ కరుణను కోరారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా.. గణితం ఉపాధ్యాయురాలు పరిమళపై తమకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వాటిని ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

## బస్సులో 550 కిలోల పశు మాంసం స్వాధీనం

**విశాఖ నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సులో పట్టుకున్న 'ప్రకాశం' పోలీసులు**

**గో మాంసమా, కాదా అనే విషయం నిర్ధారణకు శాంపిల్స్ హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు..**

మాంసాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ హజరత్, ఎస్సై

సింగరాయకొండ: ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 550 కిలోల పశు మాంసాన్ని ప్రకాశం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖపట్నం నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఎస్‌వీడీ వేదాంశ్ ట్రావెల్స్ బస్సులో గో మాంసాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్సై బి.మహేంద్ర శుక్రవారం తెల్లవారుజామున సింగరాయకొండ సమీపంలో తనిఖీలు చేశారు. అదే సమయంలో వచ్చిన ఎస్‌వీడీ వేదాంశ్ ట్రావెల్స్ బస్సును తనిఖీ చేయగా.. 11 థర్మాకోల్ బాక్సుల్లో ప్యాకింగ్ చేసిన మాంసం బయటపడింది. దీంతో విజయవాడకు చెందిన బస్సు డ్రైవర్ గుజ్జుల కిరణ్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల పశువైద్యాధికారి హజరత్ మాంసాన్ని పరిశీలించి.. శాంపిల్స్ సేకరించారు. వాటిని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపి.. గో మాంసమా, కాదా అన్నది నిర్ధారించుకోవాల్సి ఉందని పోలీసులు తెలిపారు. దీనిని ఎవరు పంపిస్తున్నారో.. ఎవరు బుక్ చేసుకున్నారనే సమాచారం కోసం విచారణ చేయాల్సి ఉందని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర వెల్లడించారు.

ANDHRA PRADESH POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA VIJAYAWADA-520004
APGENCO
TENDER NO. e-610002116/IT & ERP/Desktop PCs/APGENCO/2025
APGENCO invites Online tenders for "Supply, Installation, Commissioning of 500 Nos. HP/Dell make Desktop PCs under buyback option for utilization at various Generating Stations of APGENCO and Vidyuth Soudha" through APGENCO e-procurement platform. Estimated Value of Contract: Rs. 4.21 crores (Including Taxes). Tender Schedule Available Date & Time: 19-11-2025, 19.00 Hrs Onwards. Schedule Closing Date & Time: 10-12-2025, 15.00 Hrs. For Prequalification requirements, Tender specifications, schedules and further Details visit website: www.apgenco.gov.in or https://etender.apgenco.gov.in
DIPR Ro.No. 4589PP/CL/Advt/1/1/2021-22, Dt: 21.11.2025

## మావోయిస్టుల మృతదేహాల కోసం బంధువుల నిరీక్షణ

పోస్టుమార్టం చేయడంలో తీవ్ర జాప్యం

మృతదేహాలు పాడైపోతాయంటూ బాధిత కుటుంబాల ఆవేదన

మృతదేహాల కోసం బంధువుల నిరీక్షణ

రంపచోడవరం: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్లు జరిగి నాలుగు రోజులు అవుతున్నా పలువురు మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడంలో చేయడంలో జరుగుతోంది. రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద పంచనామా నిర్వహించి తమవారి మృతదేహాలను అప్పగిస్తారని మూడ్రోజులుగా ఎదురుచూస్తున్నామని, అయితే, ఆ పరిస్థితులు కనిపించడం లేదని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయి మూడ్రోజులు అవుతున్నందున మృతదేహాలు పాడయ్యే అవకాశాలున్నాయని.. ఇంకా కాలయాపన చేస్తే అవి మరింత పాడై చివరిచూపునకు కూడా అవకాశం ఉండదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మృతదేహాలకు త్వరగా పంచనామా పూర్తి చేసి అప్పగిస్తే స్వగ్రామాలకు వెళ్లి అంత్యక్రియలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్‌లలో మొత్తం 13 మంది మావోయిస్టులు చనిపోగా మూడ్రోజుల్లో ఇప్పటివరకు హిడ్మా, అతని భార్య రాజే, టెక్ శంకర్, దేవే మృతదేహాలకు మాత్రమే పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్పగించారు. తాజాగా.. జ్యోతి మృతదేహాన్ని శుక్రవారం అప్పగించారు. మిగతావారి మృతదేహాలకు పోస్టుమార్టం ఇప్పటికీ చేయలేదు. ఇంతవరకు ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

## 'టెక్ శంకర్'కు కన్నీటి వీడ్కోలు

- శ్రీకాకుళం జిల్లా బాతుపురంలో అంత్యక్రియలు పూర్తి
- భారీగా తరలివచ్చిన ప్రజలు..
- అంతిమయాత్రను అడ్డుకున్న పోలీసులపై జనం ఆగ్రహం



అంత్యక్రియలు చేస్తున్న సోదరుడు మధుసూదన్ (ఇన్‌సెట్‌లో) టెక్ శంకర్

వజ్రపుకొత్తూరు రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి వద్ద ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ కీలక నేత మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ అంత్యక్రియలు శుక్రవారం ఆయన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురంలో నిర్వహించారు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం ఉదయం 9 గంటలకు గ్రామానికి తీసుకొచ్చారు. టెక్ శంకర్ మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు బోరున విలపించారు. ప్రజాసంఘాల నాయకులు విప్లవ జోహార్లు అర్పిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం గ్రామస్తులు చేపట్టిన అంతిమయాత్రను కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అడ్డుకోవడంతో గ్రామంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానికులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో అంతిమయాత్రకు అనుమతించారు. అక్కుపల్లి శివసాగర్ సమీపంలో శంకర్ దహన సంస్కారాలు నిర్వహించారు. ఆయన సోదరుడు మధుసూదన్ అంతిమసంస్కారాలు పూర్తి చేశారు. అడుగడుగునా పోలీసు ఆంక్షల మధ్యే టెక్ శంకర్ అంత్యక్రియలు జరిగాయి. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో న్యాయ విచారణ జరపాలని అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర సభ్యులు అంజమ్మక్క, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ కోరారు.

भारतीय कपास निगम लिमिटेड
THE COTTON CORPORATION OF INDIA LTD.
(A Government of India Undertaking)
C.C.I.
Branch Office: Kapas Bhavan, 4/2, Ashok Nagar, P.B.227, Guntur-522002, AP
Tele.No.0863-2233472, Fax No.0863-2357472, E-mail:guntur@cotcorp.com
Website: www.cotcorp.org.in, Ministry Website: www.ministryoftextiles.gov.in

పత్తి రైతులకు విజ్ఞప్తి

2025–26 పత్తి సీజన్లో కాటన్ కార్పొరేషన్ లిమిటెడ్ (CCI) ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభించబడింది. పత్తి రైతుల హక్కులను రక్షించడానికి, కార్పొరేషన్ తన పరిధిలోని జిల్లాల్లో మొత్తం 30 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది అని పత్తి రైతులకి తెలియజేయుచున్నాము, కాటన్ కార్పొరేషన్ లిమిటెడ్ పత్తి పంట సంవత్సరం 2025–26 కనీస మద్దతు ధర (MSP) పథకంతో పత్తి అమ్మడానికి Kapas Kisan App అభివృద్ధి చేసింది. Kapas Kisan App గూగుల్ ప్లే స్టోర్ మరియు ఆపిల్ iOSలో అందుబాటులో ఉంది. ప్రస్తుతం ముమ్మరంగా దేశవ్యాప్తంగా Kapas Kisan App ద్వారా సుమారు 5 లక్షల క్వింటాల పత్తి కొనుగోలు రోజువారీగా జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్లో Kapas Kisan App రాష్ట్ర ప్రభుత్వ CMAPP తో అనుసంధానం చేయబడింది.

అందువలన, రాష్ట్రంలోని పత్తి రైతులకూ అభ్యర్థన ఏంటంటే వారు kapas kisan app డౌన్లోడ్ చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యొక్క CMAPP పోర్టల్లో నమోదు చేసిన తమ మొబైల్ నంబర్ OTP ద్వారా లాగిన్ చేయగలరు. లాగిన్ అయిన తర్వాత భారతీయ పత్తి సంస్థకు (CCI) పత్తి అమ్మడానికి సమీప కేంద్రంలో తమ స్లాట్ బుక్ చేసుకుని కనీస మద్దతు ధర (MSP) లాభాన్ని పొందగలరు. నాణ్యత ప్రమాణాల ప్రకారం పత్తిలో తేమ 8% కంటే ఎక్కువ కాకపోతే రైతులకు MSP యొక్క మొత్తం చెల్లింపు ఇవ్వబడుతుంది. కానీ తేమ 8% కంటే ఎక్కువగా 12% వరకు ఉన్నచో, 8% మించిపోయిన తేమ ఉంటే సారూప్యంగా MSP చెల్లింపు తగ్గించబడుతుంది. అందువలన, పత్తి రైతులు CCI కి మద్దతు ఇస్తూ ఆరబెట్టిన పత్తిని మాత్రమే కేంద్రానికి తీసుకురావాలని సూచన ఇస్తోంది, తద్వారా అదనపు తేమ కారణంగా ఏమైనా తగ్గింపులు చేయకుండా ఉంటాయి. ఏ పరిస్థితులలోనైనా పత్తిలో తేమ 12% కంటే ఎక్కువ ఉండకూడదు. ఏ విధమైన సహాయం అవసరమైనా, రైతులు గుంటూరులోని శాఖ కార్యాలయానికి WhatsApp హెల్ప్ లైన్ నంబర్ 7659954529 ద్వారా సంప్రదించవచ్చు.
– శాఖాధికారి

# బిడ్డ సహా తల్లి ఆత్మహత్య

**మృతురాలు ఆవులపల్లెలో ఎంఎల్‌హెచ్‌పీ**

చౌడేపల్లె: చిత్తూరు జిల్లాలో ఓ తల్లి తొమ్మిది నెలల బిడ్డతో శుక్రవారం తెల్లవారుజామున చెక్‌డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే... చౌడేపల్లె మండలంలోని వెంగళపల్లెకు చెందిన పి.నరసింహులు పెద్దకుమార్తె పి.ఆదిలక్ష్మి(37)కి దిగువపల్లె పంచాయతీ గాజులవారిపల్లెకు చెందిన గంగాధర్‌కు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆదిలక్ష్మి సోమల మండలం ఆవులపల్లెలో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్–లెవెల్ హెల్త్ ప్రొవైడర్)గా విధులు నిర్వహిస్తోంది. ఆమె భర్త గంగాధర్ మదనపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ దంపతులకు ఓ కుమార్తె క్రితిక (9నెలలు). ప్రసూతి సెలవులో ఉన్న ఆదిలక్ష్మి పుట్టినిల్లు వెంగళపల్లెలో ఉంటోంది. చిన్నారికి అనారోగ్యంగా ఉండటంతో మదనపల్లె, తిరుపతి, బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాల్లో వైద్యం చేయించారు. పాప ఆరోగ్యం కుదుటపడకపోవడం, ఎల్లప్పుడు బిడ్డ గురించే ఆలోచిస్తూ ఆదిలక్ష్మి తరచూ బాధపడుతూ ఆందోళన చెందేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఆరునెలల మెటర్నిటీ సెలవు ముగుస్తుండగా అధికారులకు సమస్యను చెప్పి, మరో రెండు నెలలు అదనపు సెలవు మంజూరు చేయించుకుంది. ఈనెల 20న విధులకు హాజరు కావాల్సి ఉండగా కుమార్తె ఆరోగ్య పరిస్థితుల కారణంగా విధులకు హాజరుకాలేదు. ఈక్రమంలో ఆదిలక్ష్మి శుక్రవారం రాత్రి 2 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగా, సమీపంలోని కొండామర్రి వెళ్లే వంకకు అడ్డంగా నిర్మించిన చెక్‌డ్యాం వద్దకు చేరుకుంది. కుమార్తెను నడుముకు కట్టుకుని నీళ్లలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. వేకువజామున లేచిన కుటుంబ సభ్యులకు ఆదిలక్ష్మి, ఆమె బిడ్డ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల గాలించగా, చెక్‌డ్యాంలో మృతదేహాలను గుర్తించి, వెలికి తీశారు.

## సాగర్ కుడి కాలువ ఎస్కేప్ ఛానల్ కరకట్టకు గండి



కారెంపూడి: పల్నాడు జిల్లాలో వినుకొండ రోడ్డు బ్రిడ్జి అక్విడెక్ట్ వద్ద ఉన్న సాగర్ కుడి కాలువ ఎస్కేప్ ఛానల్ కరకట్టకు శుక్రవారం రాత్రి గండి పడింది. పల్నాటి ఉత్సవాల నీటి అవసరాలు తీర్చేందుకు కరకట్టకు అమర్చిన తూము ద్వారా నాగులేరుకు నీటి సరఫరా జరుగుతోంది. ఏటా ఉత్సవాల సమయంలో భక్తులు స్నానాలు చేసేందుకు, అలాగే ఇతర అవసరాలకు వాగుకు నీరు విడుదల చేస్తున్నారు. అయితే కరకట్ట దిగువన అమర్చిన తూముల వద్ద నీరు లీక్ అయింది. అది రాత్రి పెద్దది అయినా ఎవరూ గమనించలేదు. ఉదయం గండి నుంచి నీరు ఉధృతంగా నాగులేరుకు ప్రవహిస్తోంది. ఒక దశలో నాగులేరు ఒడ్డున ఉన్న ఉత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లోకి నీరు వచ్చేంతగా ఉధృతి కొనసాగింది. ఇది గమనించిన ఎన్ఎస్పీ ఎస్ఈ, ఇతర ఉన్నతాధికారులు ఘటనా స్థలికి చేరుకుని టిప్పర్ల ద్వారా రాళ్ల మట్టి తరలించి గండి పూడ్చారు. శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా తోడ్పాటునందించింది. సకాలంలో గండి పూడ్చడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. గండి పెద్దదై ఉంటే నాగులేరు పరీవాహక ప్రాంతం ముంపునకు గురయ్యేది. అప్పటికే వాగు ఒడ్డున వేసిన వరి పంట నీట మునిగింది.

### ఛానల్ గేట్లకు మరమ్మతులు లేక అనర్థం

ఎస్కేప్ ఛానల్ గేట్లను ఇప్పటికి కూడా మరమ్మతులు చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. చాలా కాలంగా గేట్లు రిపేరు చేయకపోవడంతో కట్ట అలాగే ఉంటోంది. పల్నాటి ఉత్సవాలకు నీరు అవసరమైనప్పుడు ఎస్కేప్ ఛానల్‌కు అడ్డగా వేసిన మట్టి కట్టకు తూము ఏర్పాటు చేసి నీటి విడుదల చేయాల్సి వస్తోంది. ఇది చాలా ప్రమాదకరమని అందరికి తెలిసినా ఇలాగే నీటిని వాడుతున్నారు. గేట్లకు మాత్రం మరమ్మతులు చేయడం లేదు.

పశువులకు వదిలేసిన అరటి తోట

తోటలో వృథాగా ఉన్న అరటి గెలలు

# అరటి రైతు ఆశలు 'గెల్ల'ంతు

## పంట ధరలు దారుణంగా పతనంతో కుదేలైన అన్నదాతలు

## ఎకరాకు రూ.లక్షన్నర పెట్టుబడి... రూ.15 వేలు రావడమూ కష్టమే

**సాక్షి, అమరావతి, నెట్‌వర్క్:** కంటికి రెప్పగా సాకిన పంటను అరటి రైతు ట్రాక్టర్‌తో దున్నేస్తున్నాడు..! కన్నబిడ్డలా పెంచిన తోటను తమ చేతులతోనే తొలగిస్తున్నాడు..! చంద్రబాబు ప్రభుత్వ అసమర్థతతో సంక్షోభంలో చిక్కుకొని విలవిల్లాడుతున్నాడు..! అనంత రైతు ఆక్రందన వ్యక్తం చేస్తుంటే... అన్నమయ్య జిల్లా రైతు అల్లాడుతున్నాడు..! వైఎస్సార్ కడప రైతు కుదేలవుతుండగా.. నంద్యాల రైతు నిలువునా మునిగిపోయామని వాపోతున్నాడు..! సర్కారు పట్టించుకోకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో ఎగుమతులు నిలిచిపోయి అరటి రైతు మొత్తానికి దివాళా తీసే పరిస్థితిలో ఉన్నాడు. అరటి ఒక్కటే కాదు... రాష్ట్రంలో దాదాపు ఏడాదిన్నరగా పంట ఏదైనా అన్నదాతకు మిగులుతున్నది ఆక్రందనే! మొక్కజొన్న, పత్తి, మిర్చి, కంది, టమాట, కొబ్బరి, వేరుశనగ, మామిడి, ఉల్లి, సజ్జ.. ఆలా పంట ఏదైనా సరే రైతుల పరిస్థితి అగమ్య గోచరమే. మద్దతు ధర మాటే లేదు.. ప్రభుత్వం ఆదుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం అరటి రైతు పరిస్థితి అయితే అడకత్తెరలో పోక చెక్క మాదిరిగా మారింది. పెట్టుబడులూ రాని దైన్యంలో ఉన్నారు. రైతులకు భరోసాగా నిలవాల్సిన చంద్రబాబు సర్కార్ ఆ ఆలోచనే చేయడం లేదు. కనీసం మార్కెటింగ్ కల్పించే ప్రయత్నం చేయడం లేదు. తోటలు టిల్లర్లతో దున్నేస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. ఇలాంటి సమయంలో అన్నదాతలను ఆదుకోకుండా చంద్రబాబు ప్రభుత్వం కొత్త డ్రామాకు తెరతీసింది. రైతన్నా మీ కోసం.. పంచ సూత్రాలు అంటూ మభ్యపుచ్చే ఎత్తుగడలు వేస్తోంది. దీంతో ఇదేనా? కాలర్ ఎగరేసుకునేలా చేయడం అని రైతులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌లో అన్నదాత ఆవేదన వెలుగులోకి వచ్చింది. వైఎస్సార్ కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల, చిత్తూరు జిల్లాల్లో ఏ పల్లెకు వెళ్లినా అరటి రైతుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. రూ.లక్షలు ఖర్చు చేసి సాగుచేసిన పంటను కొనేవారు లేక దున్నేస్తున్న ఘటనలు దర్శనమిస్తున్నాయి. అరటికే కాదు.. మొన్నటికి మొన్న మామిడి, ఆ తర్వాత ఉల్లి, టమాట, మొక్కజొన్న ఇలా పంటలన్నీ మద్దతు ధరలు లేక చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దున్నేస్తున్న పరిస్థితులు కేవలం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే నెలకొన్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### 'అనంత' రైతన్న ఆక్రందన..

చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో అనంతపురం జిల్లా నుంచి అరటి ఎగుమతులు నిలిచిపోయాయి. వ్యాపారులు అరటి తోటల వైపు కన్నెత్తి చూడకపోవడంతో దళారులు చొరబడుతున్నారు. టన్నుకు రూ.వెయ్యిలోపే ఇస్తుండడంతో రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఎకరాకు రూ.లక్షన్నర పెట్టుబడి పెడితే రూ.15 వేలు రావడం కూడా కష్టంగా ఉందని, కూలీల ఖర్చులూ వెళ్లడం లేదని వాపోతున్నారు. అనంతపురం జిల్లాలో 40 వేల ఎకరాలలో అరటి సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్షన్నర పెట్టుబడులు పెట్టారు. మూడేళ్లుగా టన్ను రూ.25 వేలు పలికిన ధర ఇప్పుడు ఒక్కసారిగా రూ.వెయ్యి లోపు పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది అసాధారణ వాతావరణ పరిస్థితులు, తుపాను తదితర కారణాలతో అరటి పంటను తెగుళ్లు చుట్టుముట్టాయి. దీంతో ఎగుమతి చేసే కంపెనీలు కొనడం లేదు. ఇదే అదనుగా దళారులు రైతులను నట్టేట ముంచుతున్నారు. రైతుల నుంచి కేజీ రూపాయికి కొని మార్కెట్‌లో రూ.30–రూ.50కి అమ్ముతున్నారు.

అనంతపురం జిల్లా యాడికి వద్ద అరటి గెలలను మేస్తున్న గొర్రెలు

### తోటల్లోనే మాగిపోతున్న గెలలు

వైఎస్సార్ కడప జిల్లాలో 20,231 ఎకరాల్లో అరటి సాగులో ఉంది. పులివెందుల, వేంపల్లె, వేముల, లింగాల, సింహాద్రిపురం, కాశినాయన, మైదుకూరు మండలాల్లో సుమారు 16 వేల ఎకరాల్లో పంట చేశారు. ఈసారి అంచనాలకు తగ్గట్లు దిగుబడులున్నా పంటను అమ్మలేని దుస్థితి. విదేశాలకు ఎగుమతి నిలిచిపోగా ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండ్ లేదని వ్యాపారులు చెబుతున్నట్లు రైతులు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో మామిడి రైతులు సీజన్‌లో ధరలు లేక అల్లాడిపోగా ప్రస్తుతం అరటి రైతులు కడగండ్లు ఎదుర్కొంటున్నారు. టన్ను రూ.2–4 వేల లోపే అంటుండడంతో ఏం చేయాలో పాలుపోక పడరాని కష్టాలు పడుతున్నారు. జిల్లాలో 12 వేల ఎకరాలకు పైగా పంట సాగులో ఉండగా 9 వేల ఎకరాల్లో మొదటి, రెండు, మూడో క్రాప్ కోతకు సిద్ధంగా ఉంది. 20 రోజులుగా ధరలు గణనీయంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాజంపేట, రైల్వేకోడూరు నుంచి నిత్యం నాందేడ్, మహారాష్ట్ర, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాలకు పదుల సంఖ్యలో లారీల్లో లోడు వెళ్లేవి. ప్రస్తుతం ధరలు లేకపోవడంతో లారీలు రైల్వేకోడూరులో పక్కన పెట్టేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో రూ.15–18 వేల వరకు ధరలు పలకగా ప్రస్తుతం టన్ను అరటి రూ.2–4 వేలకు పడిపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. కొనేవారు లేక తోటల్లో చెట్లపైనే కాయలు మాగుతున్నాయి.

### అర్ధ రూపాయికే కిలో

నంద్యాల జిల్లాలో ఉద్యానశాఖ లెక్కల ప్రకారం 40 వేల ఎకరాల్లో అరటి సాగు అవుతోంది. ఎకరాకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షలు ఖర్చు చేశారు. గతంలో గెలల చొప్పున విక్రయించగా ఇటీవల కిలోల్లో అమ్ముతున్నారు. మొన్నటివరకు విజయవాడ, గుంటూరు, వినుకొండ తదితర చోట్లకు ఎగుమతులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం అడిగేవారు లేకపోవడంతో భువనేశ్వర్, ఒడిశా, బిహార్‌కు తరలిస్తున్నారు. అంతదూరం తరలిస్తే రైతులకు మిగిలేది శూన్యమేనని వాపోతున్నారు. ప్రస్తుతం కేజీ అర్ధ రూపాయి (టన్ను రూ.500)కి పడిపోయింది. దీంతో రైతులు తోటలను దున్ని వేస్తున్నారు.

### ఉల్లితో మొదలైన ధరల పతనం..

ఈ సీజన్‌లో ఉల్లితో మొదలైన ధరల పతనం అరటి వరకు కొనసాగుతున్నా చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ధరల స్థిరీకరణ నిధి ద్వారా మార్కెట్‌లో జోక్యం చేసుకుని వ్యాపారులతో పోటీ పడి ధరలు పడిపోయిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి మద్దతు ధరలు దక్కేలా చేయడంలో ఘోరంగా విఫలమైంది. మొక్కుబడి సమీక్షలతో సరిపెట్టడం తప్ప రైతులను ఆదుకునే దిశగా అడుగు కూడా వేయని దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది.

### 18 నెలలుగా అన్నదాత గుండెకోత

అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామంటూ సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీకి తూట్లు పొడుస్తూ తొలి ఏడాది నిస్సిగ్గుగా ఎగ్గొట్టారు సీఎం చంద్రబాబు. కనీసం ఈ ఏడాదైనా పూర్తి స్థాయిలో ఇస్తారనుకుంటే అదీ లేదు. అడ్డగోలు కోతలు పెడుతూ అరకొరగా విదిల్చి ఏడు లక్షల మందికి ఎగనామం పెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు పైసా భారం పడకుండా నోటిఫై చేసిన ప్రతి పంటకు సాగు చేసిన ప్రతి ఎకరాకు యూనివర్శల్ కవరేజీ కల్పిస్తూ అండగా నిలిచిన ఉచిత పంటల బీమా పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వం వచ్చీరాగానే అటకెక్కించేసింది. మరోపక్క వరుస వైపరీత్యాల వల్ల లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్న రైతులకు కనీసం ఇన్‌పుట్ సబ్సిడీ (పంట నష్టపరిహారం) సకాలంలో ఇవ్వడంలో చేతులెత్తేసింది. మద్దతు ధరకు కొనేవారు లేక రూ.వేల కోట్ల పెట్టుబడులు నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతూ వందలాది మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ఆదుకున్న దాఖలాలు లేవు.

### ప్రత్యేక రైలు నిలిచిపోయింది...

వైఎస్ జగన్ హయాంలో అరటి ఎగుమతుల కోసం ప్రత్యేకంగా అనంతపురం నుంచి ముంబైకు ఏటా ప్రత్యేక రైళ్లు నడిపితే.. చంద్రబాబు సర్కార్ వచ్చాక ఒక్క రైలు కూడా నడపలేని దుస్థితి. వైఎస్ జగన్ హయాంలో టన్ను రూ.30 వేలకుపైగా పలకగా, నేడు రూ.వెయ్యికి కూడా కొనేవారు లేక తోటలను రైతులు దున్నేస్తున్న పరిస్థితి నెలకొంది.

### వైఎస్ జగన్ హయాంలో అరటి రైతుకు మహర్దశ

వైఎస్ జగన్ హయాంలో అరటి రైతుకు సువర్ణ యుగమనే చెప్పాలి. నాణ్యమైన దిగుబడులు లక్ష్యంగా ఏటా ఫ్రూట్ కేర్ యాక్టివిటీస్‌ను ప్రోత్సహిస్తూ సబ్సిడీపై కవర్లు ఇవ్వడమే కాదు. తోట బడుల ద్వారా వ్యవసాయ క్షేత్రాల వద్దే ప్రి ప్రాసెసింగ్ టెక్నిక్స్‌పై అరటి రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అరటికి ప్రత్యేక మద్దతు ధర ప్రకటించడమే కాదు. ధరలు పతనం కాకుండా ప్రతి ఏటా పంట మార్కెట్‌కు వచ్చే ముందే ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రైతులకు అండగా నిలిచారు. వ్యాపారులతో పాటు ఎగుమతిదారులతో రైతులను అనుసంధానం చేసి మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేవారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విదేశాలకు ఎగుమతి కోసం తాడిపత్రి నుంచి ముంబైకు ప్రత్యేకంగా ఏటా కిసాన్ రైళ్లు నడిపారు. ఫలితంగా ఐదేళ్లలో ఏ ఒక్క ఏడాది ధరలు పతనం కాలేదు. రాష్ట్రంలో 2018–19లో 1.75 లక్షల ఎకరాల్లో సాగవుతూ 45 లక్షల టన్నుల దిగుబడులు వచ్చాయి. అలాంటిది 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో విస్తీర్ణం 2.74 లక్షల ఎకరాలకు పెరగగా, దిగుబడులు 70 లక్షల టన్నులకు చేరాయి. ఎగుమతులైతే 2014–19 మధ్య 23 వేల టన్నులు జరిగితే.. 2019–24 కాలంలో ఏకంగా 3 లక్షల టన్నులు దాటాయి. సౌదీ అరేబియా, కువైట్, ఖతర్, బహ్రెయిన్, యూఏఈ, యూరోప్ దేశాలతో పాటు అమెరికాకు సైతం ఎగుమతయ్యాయి. 2018–19లో టన్ను రూ.5వేలకు మించని ధర 2023–24లో ఏకంగా రూ.30 వేలకు పైగా పలికింది. నాడు ఐదేళ్లలో అరటి సాగు, దిగుబడులు, ఎగుమతుల్లో ఏపీ సాధించిన ప్రగతిని గుర్తిస్తూ బనానా ఎక్స్‌పోర్టు ప్రమోషన్ అవార్డు–2020, ది బెస్ట్ స్టేట్ ఇన్ బనానా అవార్డు–2022 వంటి ఎన్నో అవార్డులు ఏపీని వరించడం వైఎస్ జగన్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొనవచ్చు.

కోనసీమ జిల్లా రైతుల వద్ద పేరుకుపోయిన కొబ్బరి

## కొబ్బరి ధర.. మరింత దిగజారి...

పక్షం రోజుల్లో రూ.9 వేలు పతనం
కోనసీమ జిల్లాలో రూ.17 వేలు
రైతులు, వ్యాపారుల ఆందోళన

**సాక్షి, అమలాపురం/అంబాజీపేట:** కొబ్బరి ధరలు రోజు రోజుకు పతనమవుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్‌లో నెల వ్యవధిలో పచ్చి కొబ్బరి వెయ్యి కాయల ధర రూ.9 వేల వరకు తగ్గింది. గత నెలలో ఇదే సమయంలో రూ.23 వేలు–రూ.25 వేలు ఉంది. సెప్టెంబర్‌లో రూ.28 వేల దాక పలికింది. కానీ, గత వారం రూ.19 వేలకు, ఇప్పుడు రూ.16 వేలకు పడిపోయింది. పండగలు పూర్తి కావడం, తమిళనాడు, కేరళలో కొబ్బరి దిగుబడి పెరగడంతో మన పంటకు డిమాండ్ తగ్గింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరలు పడిపోయి, ఎగుమతులు తగ్గడంతో కాయల రాశులు పేరుకుపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. చలికాలంలో ఇతర రాష్ట్రాల్లో ఆలయాలకు వెళ్లే భక్తుల సంఖ్య తక్కువగా ఉంటుంది. ఇక సంక్రాంతి వరకు పండగల సీజన్ లేకపోవడంతో రైతుల్లో గుబులు పట్టుకుంది.

- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 1.80 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతుండగా, ప్రస్తుతం సగటున దింపునకు (45 రోజులకు) 14 కోట్ల కాయలు దిగుబడిగా వస్తోందని, రోజుకు 30 లారీల వరకు ఎగుమతి జరుగుతోందని అంచనా. సెప్టెంబరులో ఇది 90 లారీల వరకూ ఉండేది.
- ధరల పతనం ప్రభావం కురిడీ కొబ్బరిపై కూడా కనిపిస్తోంది. గత నెల కన్నా కురిడీ కొబ్బరి పాత కాయలో గండేరా (పెద్దకాయ), గటగట (చిన్న కాయ) ధరలు రూ.వెయ్యి చొప్పున తగ్గాయి. రూ.30 వేలు ఉన్న గండేరా రకం రూ.29 వేలు, గటగటా రూ.28 వేల నుంచి రూ.27 వేలకు తగ్గింది. కొత్త కాయలు రూ.29 వేలు ఉన్న గండేరా రకం రూ.27,500కు, రూ.27 వేలున్న గండేరా రకం ధర రూ.25 వేలకు పడిపోయాయి. కొత్త కాయ కురిడీ రకం రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు తగ్గడం గమనార్హం. ''దిగుబడి ఆశాజనకంగా ఉన్న సమయంలో మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా తగ్గాయి. మంచి ధర వస్తుందనే ఆశతో నిల్వ చేసిన మాలాంటి రైతులం నష్టపోతున్నారు'' అని పోతవరం గ్రామానికి చెందిన రైతు పాటి శేఖర్ వాపోయాడు.

### ధర లేక, వ్యాపారులూ రాక 8 ఎకరాల్లో అరటి తొలగించా

నాకున్న 20 ఎకరాలలో 14 ఎకరాల్లో అరటి సాగు చేశా. ఎకరాకు రూ.1.20 లక్షల చొప్పున రూ.16 లక్షలు పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగా రావడంతో ఆశలు పెట్టుకున్నా. కానీ, కోతకు వచ్చే సమయానికి మార్కెట్‌లో ధరలు పడిపోయాయి. వ్యాపారులు తోటల వైపే రావడం లేదు. టన్ను రూ.1,500కు ఇస్తామన్నా ఆసక్తి చూపడం లేదు. ధర లేక, వ్యాపారులూ రాక 8 ఎకరాల్లో అరటి పంట తొలగించా. 6 ఎకరాలలో నెల రోజుల్లో పంట కోతకు రానుంది. అప్పటికైనా ధర దక్కుతుందన్న ఆశ లేదు. ఇప్పటికే రూ.15 లక్షల మేర నష్టపోయా. 15 ఏళ్లుగా అరటి సాగు చేస్తున్నా ఇంతటి అధ్వాన పరిస్థితి ఎన్నడూ చూడలేదు.

– ఓబుళరెడ్డి రామచంద్రారెడ్డి, వేముల మండలం భూమయ్యగారిపల్లె, వైఎస్సార్ కడప

### తెగనమ్ముదామని చూస్తున్నా ఎవరూ రావడం లేదు



ఆరు ఎకరాలలో అరటి సాగు చేశా. ఎకరాకు రూ.1.30 లక్షల మేర రూ.8 లక్షల వరకు ఖర్చు చేశా. దిగుబడి ఎకరానికి 25 టన్నులు తక్కువ ఉండదనుకున్నా. ధరలు పూర్తిగా పడిపోయాయి. కాయలు మాగితే నష్టపోతామని ఉన్న రేటుకే అమ్ముదామని చూస్తున్నా... అరటి గెలల కొనుగోలుకు వ్యాపారులు దరిదాపులకు కూడా రావడం లేదు.

– కల్లూరు ఓబుళరెడ్డి, వైఎస్సార్ కడప వేల్పుల గ్రామం, వైఎస్సార్ కడప

### పెట్టుబడులు కూడా వచ్చేలా లేదు

నాలుగు ఎకరాల్లో అరటి సాగు చేశా. పెట్టుబడులు కూడా లభించే పరిస్థితి లేదు. నా ఆశలు గల్లంతయ్యాయి. మా అబ్బ (తాత), నాన్న కూడా అరటినే పండించారు. 30 ఏళ్లుగా ఈ పంటనే నమ్ముకుని ఉన్నాం. గతంలో పులివెందుల అరటిని విదేశాలకు ఎగుమతి చేసేవారు. ఇప్పుడు అసలు రైతుల వద్దకు వచ్చి వ్యాపారులు కొనే పరిస్థితి లేదు. ధర లేక చాలామంది తోటలోనే కాయలను వదిలేస్తున్నారు. పరిస్థితులు చూస్తుంటే కడుపు మండిపోతోంది.

– ప్రసాద్, నల్లపురెడ్డిపల్లె గ్రామం, పులివెందుల మండలం, వైఎస్సార్ కడప

### పరిస్థితి అత్యంత దయనీయం

గత 25 ఏళ్ల నుంచి 5 ఎకరాలలో అరటి పండిస్తున్నా. ఎకరాకు రూ.లక్ష ఖర్చు పెట్టా. కానీ, పరిస్థితి దయనీయంగా ఉంది. గతంలో టన్ను రూ.30 వేలు కూడా పలికింది. ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం టన్ను రూ.1,500–రూ.2,500 మాత్రమే ఉంది. పెట్టుబడులూ రావడం లేదు.

– విష్ణు, నల్లపురెడ్డిపల్లె, పులివెందుల మండలం, వైఎస్సార్ కడప

### రూ.20 లక్షల ఆదాయం ఊహిస్తే పెట్టుబడీ వచ్చేలా లేదు

పది ఎకరాలలో ఏడేళ్లుగా అరటి సాగు చేస్తున్నా. పెట్టుబడికి రూ.లక్షలు అయింది. కానీ, పంటను అడిగే నాథుడు లేడు. టన్ను రూ.3 వేలకు కూడా అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. కరోనా సమయంలోనూ ఇలాంటి పరిస్థితి లేదు. పంట అమ్మితే రూ.20 లక్షలపైన ఆదాయం వస్తుందని అనుకుంటే, పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

– కుమ్మెత నాగార్జునరెడ్డి, లింగాల, వైఎస్సార్ కడప

### చీనీ తీసేసి మరీ అరటి వేశాను.. మునిగిపోయాను

ఏడు ఎకరాలలో చీనీ తొలగించి అరటి సాగు చేశాను. కానీ, దానికంటే దారుణంగా నష్టపోయాను. గత మూడేళ్లు అరటికి మంచి ధరలు రావడంతో ఈ పంట వైపు మొగ్గాను. కానీ, ఈ ఏడాది ధరలు భారీగా పతనమయ్యాయి. పంటను అమ్ముకునేందుకు వ్యాపారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. తీవ్రంగా నష్టపోతున్నాం. ఇలాంటి దారుణ పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు.

– అలవలపాటి నాగేశ్వర్‌రెడ్డి, లింగాల, వైఎస్సార్ కడప

### కనీసం కౌలు కూడా వచ్చేలా లేదు..

పొలాలు కౌలుకు తీసుకుని అరటి సాగు చేస్తున్నా. సుమారు 30 వేల అరటి చెట్లు వేశా. మార్కెట్‌లో ధరలు చూస్తే పెట్టుబడుల మాట దేవుడెరుగు, కనీస కౌలు కూడా వచ్చేలా లేదు. కష్టపడి పండిస్తే తుఫాను, అకాల వర్షాలు మరింత నష్టం కలిగించాయి.

– గాజుల నాగయ్య, అబ్బీపురం, మహానంది, నంద్యాల జిల్లా

# అన్నదాతలంటే చంద్రబాబుకు పగ

**అన్ని వర్గాల ప్రజలతో పాటు రైతులకూ మొండిచేయి**

**మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం**

**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట):** సీఎం చంద్రబాబు అన్నదాతల మీద పగబట్టారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. అన్ని వర్గాలతోపాటు రైతులను కూడా మోసం చేశాడని ఆక్షేపించారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైందని చెప్పారు. అన్ని విధాలుగా నష్టపోతున్న రైతులన్నా, వ్యవసాయమన్నా చంద్రబాబుకు చిన్నచూపేనన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయంలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు రైతులకు మంచి ఫలితాలిచ్చాయని చెప్పారు. జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందేమోనన్న దుగ్ధతో చంద్రబాబు ఆ వ్యవస్థలన్నింటినీ ఒక్కొక్కటిగా అటకెక్కిస్తున్నారని మండిపడ్డారు. గత ఏడాది జూన్ నుంచి సూపర్ సిక్స్ అమలు చేస్తానన్న చంద్రబాబు, రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఈ రెండేళ్లలో రూ.40 వేలు బాకీ పడితే.. కొద్దిమందికే అరకొరగా రెండుదఫాలు రూ.5 వేల వంతున ఇచ్చి ఉదారంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పడం సిగ్గుచేటన్నారు. వైఎస్ జగన్ హయాంలో కౌలు రైతులకు, అటవీ భూములు, అసైన్డ్ భూములు, డీకేటీ భూముల్లో సాగుచేస్తున్న వారికి కూడా రైతుభరోసా ఇచ్చినట్లు గుర్తుచేశారు. తమ ప్రభుత్వంలో ఈ పథకం లబ్ధిదారు చనిపోతే వారసులకు రైతు భరోసా ఇచ్చామన్నారు. ఇప్పుడు చంద్రబాబు వారందరికీ ఎగ్గొట్టాడని చెప్పారు. మరోవైపు 7 లక్షలమంది రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వకుండా ఎగ్గొట్టిన చంద్రబాబు ఆత్మస్తుతి, పరనిందతో బతుకుతున్నాడని విమర్శించారు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతుకు అండగా ఉండే రైతు భరోసా కేంద్రాలను రైతుసేవా కేంద్రాలని మార్చి నిర్వీర్యం చేశాడని చెప్పారు.

### అరటి కిలో రూపాయా?

చంద్రబాబు సర్కురు మిర్చి, పొగాకు, మామిడి, టమోటా, ఆక్వా, వరి ఇలా ఏ పంటలకూ కనీస మద్దతుధర లేదని చెప్పారు. రైతులు దీనస్థితిలో ఉన్నారని మొత్తుకుంటున్నా పట్టించుకునేవాడు లేడన్నారు. అరటి రైతులకు సంబంధించి టీడీపీ కరపత్రికలోనే కిలో రూపాయికే అరటి అని రాశారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అరటి టన్ను రూ.25 వేలు ఉంటే.. ఇప్పుడు టన్ను రూ.2 వేల నుంచి రూ.వెయ్యికి పడిపోయిందన్నారు. హామీలు నెరవేర్చకుండా రైతుల నడ్డివిరుస్తూ మళ్లీ రైతుల కోసం పంచ సూత్రాల పథకం అంటూ చంద్రబాబు చెబితే దానికి ఆయన కరపత్రికలు బాకా ఊదుతున్నాయని ఎద్దేవా చేశారు. ఇవి పంచసూత్రాలు కావని, పంచక్షోభలని మండిపడ్డారు.

### పచ్చమీడియాకి కడుపుమంట

వైఎస్ జగన్ సీబీఐ కోర్టులో హాజరుకావడానికి హైదరాబాద్ వెళ్లారని, ఆయన కోసం తరలివచ్చిన జనాన్ని అందరూ చూశారని, ఆ జనాన్ని చూసి నిన్నటి నుంచి ఎల్లో మీడియాకు కడుపుమంట మొదలైందని చెప్పారు. ఓ ప్రజానాయకుడి మీద ప్రజలకున్న విశ్వాసం, నమ్మకం, అభిమానంతో చూడ్డానికి వస్తే నిస్సిగ్గుగా దానిమీద డిబేట్లు పెట్టిన ఘనత మన రాష్ట్రంలోని పచ్చ చానళ్లలో మాత్రమే చూడగలమని కాకాణి పేర్కొన్నారు.

## ఈవీఎంల గోదాము పరిశీలన

బాపట్ల: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈవీఎంలు భద్రపరిచిన గోదామును శుక్రవారం బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పరిశీలించారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 584.60 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 47,508 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

## మహాలక్ష్మిగా బగళాముఖి

చందోలు(కర్లపాలెం): మార్గశిర మాసం మొదటి శుక్రవారం రోజున చందోలు బగళాముఖి అమ్మ వారు శ్రీ మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అర్చనలు, పూజలు చేశారు.



## న్యూస్‌రీల్

### జిల్లా కోర్టులో న్యాయదేవత విగ్రహావిష్కరణ

గుంటూరు లీగల్: జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద న్యాయదేవత విగ్రహాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సబ్‌జైలును తనిఖీ చేసిన జైళ్ల శాఖ డీజీపీ

నరసరావుపేట టౌన్: ప్రత్యేక ఉప కారాగారాన్ని రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అంజన్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీల యోగక్షేమాలు విచారించారు. ఆహారం, వైద్యం, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది క్రమశిక్షణ తదితర అంశాలపై ఆరా తీశారు. సబ్ జైలు నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సబ్ జైలర్ అంజయ్య, సిబ్బంది ఉన్నారు.

### ఆలయ రాతి నిర్మాణానికి రూ.2 లక్షలు విరాళం

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డు పులపులవారి వీధిలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ సహిత శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ రాతి నిర్మాణానికి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ కార్యదర్శి కొత్తమాసు వెంకటప్పయ్య, ప్రేమలత దంపతులు రూ.2,01,116 విరాళంగా అందించారు. ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించిన దాతలు విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు వనమా సాంబశివరావు, కోవూరి శివశ్రీనుబాబు, గజవల్లి మురళిలకు అందించారు. మోదుగుల చంద్రం రూ.11,116 విరాళంగా అందించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు వనమా కృష్ణ, రాచూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కార్తికమాసం కోటప్పకొండ ఆదాయం రూ.2.18 కోట్లు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానానికి కార్తిక మాసంలో రూ.2.18 కోట్లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో డి.చంద్రశేఖర్ తెలిపారు. ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆదాయ వివరాలను ఈవో వెల్లడించారు. ఆస్ట్రేలియా డాలర్స్ 10, సింగపూర్ డాలర్స్ 10, అమెరికా డాలర్, 28 గ్రాముల బంగారం, 115 గ్రాముల వెండి హుండీల ద్వారా లభించినట్టు తెలిపారు.

### గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకున్న స్థానికులు

యడ్లపాడు: గ్రావెల్ అక్రమ తవ్వకాలను ఉప్పరపాలెం గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. వంకాయలపాడు రెవెన్యూ పరిధిలో గురుకుల పాఠశాల సమీపంలో తవ్వకాలు నిర్వహిస్తున్న ప్రాంతానికి చేరుకుని గ్రావెల్ లోడుతో వెళ్తున్న వాహనాలను నిలుపుదల చేశారు. తమ గ్రామం పరిధిలోని ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేస్తే సహించబోమంటూ ఆగ్రహించారు. అడ్డుకున్న వారిలో గ్రామస్తులు పల్లపు వీర్ల అంకమ్మ, పల్లపు వెంకట్రావు, గుంజి శ్రీనివాసరావు, వల్లెపు అంకమ్మబాబు ఉన్నారు.

# రైతులకు మద్దతు దక్కేనా?

- ఇప్పటికే తగ్గిన ధాన్యం దిగుబడులు
- ఎకరాకు 5–10 క్వింటాళ్ల వరకు దెబ్బ
- వర్షాలు, తుఫాన్‌తో తప్పని కష్టాలు
- మార్కెట్‌లో మచ్చుకైనా దక్కని 'మద్దతు'
- బస్తాకు రూ.300 వరకు వ్యత్యాసం
- కొనుగోలు కేంద్రాల్లో గతంలో నాణ్యతపై కొర్రీలు
- ఈ ఏడాది పరిస్థితులపై అన్నదాతలకు ఆందోళన
- రైతులను ఆదుకోని చంద్రబాబు ప్రభుత్వం

## చంద్రబాబు సర్కారు తీరుతో అన్నదాతలు లబోదిబో

నూర్పిడి చేయగా వచ్చిన ధాన్యం

మాగాణి రైతులు సందేహించినట్టే ఈ సారి ధాన్యం దిగుబడులు తగ్గాయి. మార్కెట్‌లో 'మద్దతు' ధర కూడా లేదు. నేలవాలిన వరి పొలాల్లో నూర్పిడులకు అదనపు ఖర్చులు తప్పటం లేదు. వెరసి ఖరీఫ్ సీజను అన్నదాతలకు ఆవేదనే మిగిల్చింది. పంట నష్టం నమోదు చేయని చంద్రబాబు ప్రభుత్వం... నూర్పిళ్లు మొదలయ్యేసరికి హడావుడిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ధర లేక రైతులు ఆవేదన చెందుతున్నారు.

తెనాలి/కొల్లిపర: కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో 2025–26 ఖరీఫ్ సీజనుకు ఆసాంతం రైతులకు కష్టాలు తప్పడం లేదు. తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల పరిధిలోని సబ్ డివిజనులో వ్యవసాయ పంటల విస్తీర్ణం 52,721 ఎకరాలు. ఇందులో వరి 50,586 ఎకరాల్లో సాగు చేశారు. సీజను ఆరంభంలో వర్షాలు ఆలస్యమయ్యాయి. తీరా వెద పెట్టాక ప్రతాపం చూపించాయి. దీంతో పల్లపు ప్రాంతాల్లోని రైతులు నష్టపోయారు. ఒక్కోచోట రెండు, మూడుసార్లు వెదజల్లాల్సి వచ్చింది. కొందరైతే దూర ప్రాంతాల నుంచి అధిక ధరకు వరినారు కొనుగోలు చేసి నాటించారు. ఫలితంగా ఈ పర్యాయం సీజను మొదట్లోనే పెట్టుబడులు అధికమయ్యాయి. అక్టోబరు ఆఖరులో వచ్చిన మోంథా తుఫాన్ దెబ్బకు ఏపుగా పెరిగిన వరి పలుచోట్ల నేల వాలింది. అయిదు శాతానికి మించి నష్టం లేదన్న సాకుతో చంద్రబాబు సర్కారు కనీసం నష్టం లెక్క కూడా చూడలేదని రైతులు వాపోతున్నారు.

తూములూరులో నూర్పిడి చేస్తున్న యంత్రం

### దిగుబడిపై ప్రభావం

ప్రస్తుతం నూర్పిళ్లు మొదలయ్యాయి. రెండు మూడురోజులుగా జరుగుతున్నాయి. కూలీలతో కోతలకు రేట్లు అధికంగా ఉండటంతో ఏటా తరహాలోనే రైతులు హార్వెస్టింగ్ యంత్రాల వైపు చూస్తున్నారు. ఎక్కువ విస్తీర్ణం ఒకేసారి కోతకు రావటంతో తగినన్ని యంత్రాలు అందుబాటులో లేవు. దీంతో ఒత్తిడి అధికంగా ఉంది. నూర్పిడి చేసిన పొలాల్లో దిగుబడి ఎకరాకు సగటున 25–35 బస్తాలు వస్తున్నాయి. కొల్లిపర ప్రాంతంలో 30–35 బస్తాలు, తెనాలి మండలంలో 25–20 బస్తాలే వస్తోందని రైతులు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ సారి 5–10 క్వింటాళ్ల దిగుబడి తగ్గిపోయిందని తెలుస్తోంది.

### అదనపు ఖర్చు

ఒకేసారి పంట ఎక్కువ విస్తీర్ణంలో నూర్పిళ్లకు సిద్ధం కావటంతో హార్వెస్టర్లకు డిమాండ్ పెరిగింది. నూర్పిడికి గంటకు రూ.3 వేలు, తీసుకొచ్చిన మనిషికి రూ.200 చొప్పున తీసుకుంటున్నారు. వరి పొలం బాగున్నచోట ఎకరాకు గంట వ్యవధి పడుతోంది. పైరు నేలవాలిన చోట గంటన్నర నుంచి రెండు గంటలు పడుతోంది. ఆ ప్రకారం మరో రూ.1,500 నుంచి రూ.3 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చినట్టుగా ప్రభుత్వమే నూర్పిళ్లు చేసేందుకు సబ్సిడీ అద్దెపై హార్వెస్టర్లను సమకూర్చాల్సిందిగా దావులూరులో రైతులు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విజ్ఞప్తి చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీనిచ్చారు. త్వరగా సమకూర్చాలని రైతులు కోరుతున్నారు.



### ధరలతో నిరాశ

మరోవైపు మార్కెట్‌లో మద్దతు ధర లభించడం లేదు. ధాన్యం 75 కిలోల బస్తాకు ప్రభుత్వ మద్దతు ధర సాధారణ రకం రూ.1,777 కాగా, గ్రేడ్–ఏ రకం రూ.1,792గా ఉంది. అయితే మార్కెట్‌లో వ్యాపారులు రూ.1,450 – 1,480 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. గతేడాది ఖరీఫ్ సీజనులో కోతలు ఆరంభించేనాటికి వ్యాపారులు బస్తా ధాన్యం రూ.1,300లకే కొనుగోలు చేశారు. నూర్పిళ్లు పూర్తయ్యే దశలో రూ.1,500 వరకు ధర లభించింది. ప్రస్తుతం కూడా మద్దతుకు చేరువలో మార్కెట్ ధర లేకపోవటం అన్నదాతలకు ఆవేదన కలిగిస్తోంది. నూర్పిళ్లు మొదలయ్యే సరికి తొలి కొనుగోలు కేంద్రాన్ని తెనాలి నియోజకవర్గంలోని దావులూరులో ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాల పేరుతో గతేడాది మద్దతు ధరకు కూడా సర్కారు ధాన్యం కొనలేదు. నాణ్యంగా ఉన్నా పూర్తిస్థాయిలో కొనకపోవడంతో రైతులు మిల్లర్లు, వ్యాపారులకు అయినకాడికి విక్రయించాల్సి వచ్చింది. దీంతో భారీగా నష్టపోయారు. ఈ సారి ఎంతమేరకు కొనుగోలు చేస్తారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### డిసెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు లీగల్: జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్ట్ ప్రాంగణాల్లో డిసెంబరు 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సివిల్ కేసులు, రాజీ పడ దగిన క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇచ్చిన సర్కులర్ ప్రకారం కొన్ని రాజీ పడదగిన కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎల్‌ఏఓపీ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కక్షిదారులు, పోలీస్ అధికారులు, స్టేక్ హోల్డర్లు ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలన్నారు.

### ఎస్‌ఆర్‌ఎం వర్సిటీకి కార్మిక శాఖ నోటీసులు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి శుక్రవారం కార్మిక శాఖ అధికారులు నోటీసులు అందజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా లేబర్ సెస్ రూ. 5.13 కోట్లు పెండింగ్‌లో ఉందని, వసూలు చేయాలని ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. 2016 నుంచి రూ. 580 కోట్ల ఎస్టిమేషన్‌తో భవనాలు నిర్మిస్తోందని, దీనికి గాను లేబర్ సెస్ 5.80 కోట్లు చెల్లించాల్సి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటి వరకు కేవలం రూ. 71.72 లక్షలు మాత్రమే చెల్లించారని, మిగిలినది కూడా చెల్లించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 24న విచారణకు రావాలంటూ వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు నోటీసులు అందించారు.

## కర్షకులను ఇబ్బంది పెట్టవద్దు

గుంటూరు ఏడీఏ మోహన్‌రావు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: డీఏపీ, యూరియా విక్రయించే సమయంలో వ్యాపారులు రైతులను ఇబ్బంది పెట్టడానికి వీల్లేదని గుంటూరు ఏడీఏ ఎన్.మోహన్‌రావు అన్నారు. జీడీసీఎంఎస్‌ల్లో డీఏపీ, యూరియా ఎరువులు కావాలంటే నానో యూరియా అంటగడుతున్న వైనంపై ఈ నెల 20న 'సాక్షి'లో 'ఇవేం కష్టాలు నాయనో' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో శుక్రవారం ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదనందిపాడు మండలాల్లోని ఫెర్టిలైజర్ డీలర్లతో ఏడీఏ ఎన్. మోహన్‌రావు సమావేశం నిర్వహించారు. యూరియా, డీఏపీ విక్రయాలకు ఇతర ఉత్పత్తులతో ముడి పెట్టడానికి వీల్లేదన్నారు. ఇకపై ఎక్కడా ఇలాంటి సమస్య ఉత్పన్నం కాకూడదని పేర్కొన్నారు. రబీ పంటలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ తెలిపారు. వ్యాపారులు ఎమ్మార్పీ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదనందిపాడు మండలాల వ్యవసాయాధికారులు షేక్ సుగుణబేగం, సునీత, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రావు

## పాడ్యమి పూజలతో ముగిసిన కార్తిక మాసం

అమరావతి: పంచ రామక్షేత్రాలలో ప్రథమారామక్షేత్రమైన అమరావతి క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక మాసం చివరి రోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక అమావాస్య అనంతరం పాడ్యమి పర్వదినాన ఆలయాన్ని సందర్శించిన భక్తులు పవిత్ర కృష్ణానదిలో కార్తిక పుణ్య స్నానాలు చేసి ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద కార్తిక దీపాలను వెలిగించారు. కార్తిక దీపాలను పవిత్ర కృష్ణానదిలో వదిలి పోలిని స్వర్గానికి పంపే కార్యక్రమం నిర్వహించారు. అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీ అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్తిక మాసంలో ఆఖరిరోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమరేశ్వరాలయాన్ని సందర్శించారు. ఆలయ ఈఓ రేఖ మాట్లాడుతూ కార్తిక మాసం పర్వ దినాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిర్వహించటానికి సహకరించిన అన్ని శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ఆలయ సిబ్బందికి, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

అమరేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

అమరావతి అమరేశ్వర ఘాట్‌లో పాడ్యమి స్నానాల అనంతరం అరటి దొన్నెలలో దీపాలను వెలిగించి కృష్ణాదిలో వదిలి పోలిని స్వర్గానికి పంపుతున్న భక్తులు

## లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

తెనాలిరూరల్: బాలికపై లైంగిక దాడి చేసిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు ... గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన ఆరేళ్ల బాలిక 2021 జనవరి 1వ తేదీన బహిర్భూమికి ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలోకి వెళ్లింది. అదే ప్రాంతానికి చెందిన బిళ్లా డేవిడ్‌రాజు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులకు ఈ విషయాన్ని బాలిక చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. కేసును అప్పటి డీఎస్పీ కె. స్రవంతిరాయ్, నరసరావుపేట దిశ డీఎస్పీ యు.రవిచంద్ర దర్యాప్తు చేశారు. కేసు శనివారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి.... నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి రూ. నాలుగు లక్షల ప్రభుత్వ సాయం నెల రోజుల్లోగా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలినేని రాఘవయ్య వాదనలు వినిపించారు.

## ఏఎన్‌యూలో డ్రాఫ్టింగ్ అండ్ ప్లీడింగ్స్ సర్టిఫికెట్ కోర్సు

ఏఎన్‌యూ (పెదకాకాని): ఏఎన్‌యూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డ్రాఫ్టింగ్ అండ్ ప్లీడింగ్స్ సర్టిఫికెట్ కోర్సు బ్రోచర్‌ను శుక్రవారం వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధర్ రావు, రెక్టార్ ఆర్. శివరాం ప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ న్యాయవిభాగం విద్యార్థులకు సరికొత్త కోర్సుల ద్వారా నాణ్యమైన న్యాయవిద్యను అందించేందుకు ఇవి దోహదపడతాయన్నారు. రెక్టార్ ఆర్. శివరాం ప్రసాద్, న్యాయ విభాగపు అధిపతి ప్రొఫెసర్ ఎస్. విజయలక్ష్మి మాట్లాడుతూ... డిసెంబర్ 29వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఈ కోర్సు కొనసాగుతుందన్నారు. ఫీజును రూ.10 వేలుగా నిర్ణయించామని తెలిపారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా కూడా చెల్లించవచ్చని, వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఈ నెల 5వ తేదీన విడుదల చేసిన ప్రకటన ద్వారా పొందవచ్చన్నారు.

బ్రోచరు ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య కె.గంగాధర్‌రావు తదితరులు

# తమ్ముళ్ల 'అధికార' దోపిడీ

- అడ్డదారిలో టెండర్లు దక్కించుకున్న టీడీపీ
- దుమారం రేగడంతో అక్రమంగా బిల్లులకు యత్నం
- పనులు పూర్తయిన వాటికి తిరిగి జీఎంసీ టెండర్లు
- ఎవరూ పాల్గొనవద్దంటూ కాంట్రాక్టర్లకు బెదిరింపులు
- అక్రమాలపై మొద్దు నిద్రలో విజిలెన్స్ అధికారులు

**అధికార పార్టీకి చెందిన తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. నగరపాలక సంస్థలో దొడ్డిదారిలో టెండర్లు దక్కించుకోవడంతోపాటు టెండర్లలోని లొసుగులు తెలుసుకుని తమ జేబులు నింపుకొంటున్న విషయాలపై 'సాక్షి' పలుమార్లు వరుస కథనాలు ప్రచురించింది. దీనిపై కమిషనర్ పులి శ్రీనివాసులు సదరు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటున్నట్లు హడావుడి చేసినప్పటికీ చివరికి చతికిలపడ్డారు. దీంతో వారు ఆ పనులకు బిల్లులు చేయించుకుంటున్నారు. పైగా జీఎంసీ నుంచి అవే పనులకు తిరిగి టెండర్లు పిలుస్తుండటం గమనార్హం.**

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగు తమ్ముళ్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్‌లో పాల్గొనకుండానే పాల్గొన్నట్లు దొంగ డాక్యుమెంట్లు సృష్టించారు. అడ్డదారిలో టెండర్లు దక్కించుకుని రూ.కోట్లు కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులో కొంతమంది కాంట్రాక్టర్లు వర్కులు కూడా పూర్తి చేసి బిల్స్ కూడా ప్రాసెస్ అవుతున్న సమయంలో 'సాక్షి'లో కథనాలు రావడంతో బిల్లుల ప్రాసెస్ ఆగిపోయింది. వీటిని ఎలాగైనా దక్కించుకునేందుకు తెలుగు తమ్ముళ్లు చేసిన వర్కుకే మళ్లీ టెండర్లు పిలిపించుకుంటున్నారు. ఇందుకు అధికారులు కూడా తమ వంతు సహకారం అందిస్తున్నారు. కాంట్రాక్టర్ల వాట్సాప్ గ్రూప్‌లో 'మేము చేసిన వర్కుకు అధికారులు తిరిగి టెండర్లు పెడుతున్నారు. ఈ వర్కులో ఎవరూ పాల్గొన వద్దంటూ' పరోక్షంగా బెదిరింపులకు దిగుతున్నారు. ఒకవేళ ఎవరైనా పాల్గొంటే సదరు కాంట్రాక్టర్ల బిల్లులు ప్రాసెస్ కాకుండా చేస్తారనే భయం ఉండటంతో వేరేవారు వీటి వైపు కన్నెత్తి చూడటం లేదు.

వాట్సాప్ గ్రూపులో టీడీపీకి చెందిన వారు పెట్టిన మెసేజ్

### చాలా మంది దొంగలు..

అడ్డదారిలో 70కిపైగా టెండర్లు దక్కించుకుని రూ.10 కోట్లకు పైగా కార్పొరేషన్‌కు నష్టం కలిగించే జాబితాలో ఏడుగురు కాంట్రాక్టర్లు ఉన్నట్లు సమాచారం. 'మేమే కాదు. మా తరహాలో చాలా మంది దొంగ టెండర్లు వేశారు. కొందరు కాంట్రాక్టర్లు చేసిన వర్కులకు సంబంధించిన జాబితా ఇవ్వాలని' సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు పెడుతున్నారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు వాటికి సమాధానాలు ఇచ్చుకోలేక తలలు పట్టుకుంటున్నారు. మరో పక్క ఎలాగైనా బిల్లులు చేయించుకుని తమ జేబులు నింపుకొనేందుకు ప్రజాప్రతినిధుల చుట్టూ కాంట్రాక్టర్లు ప్రదక్షిణలు చేసి నగరపాలక సంస్థ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

### నిద్రావస్థలో విజిలెన్స్

ప్రభుత్వ శాఖల్లో ఏదైనా అవినీతి జరిగితే వెంటనే స్పందించి ఆయా శాఖలపై దాడులు జరిపి విచారణ చేపట్టాల్సిన విజిలెన్స్ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో రూ.కోట్ల అక్రమాలు వెలుగుచూస్తున్నా, ప్రజల సొమ్ము తమ్ముళ్ల జేబుల్లోకి అడ్డదారిలో వెళుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రతి నెల విజిలెన్స్ అధికారులకు నెలవారీ మామూళ్లు కార్పొరేషన్ నుంచి వెళుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే కార్పొరేషన్ వైపు చూడటం లేదని సమాచారం.

## ఫుడ్ టెక్నాలజీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

**గుంటూరు రూరల్:** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఏపీ ఈఏపీసెట్ 2025 ర్యాంకుల ద్వారా బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ ప్రవేశాలకు చివరి విడత మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి గానూ బైపీసీ విభాగంలో ఏపీ ఈఏపీసెట్ 2025 ర్యాంకుల ద్వారా బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ ప్రవేశాలకు ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు చివరి విడత మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ను సంప్రదించాలని కోరారు.

## స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా పారేపల్లి

**మంగళగిరి టౌన్:** గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా పారేపల్లి మహేష్‌ను రాష్ట్ర స్వర్ణకార సంఘం నియమించింది. విజయవాడ పున్నమి ఘాట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి వేణుమాధవ్ హాజరై గుంటూరు జిల్లా నూతన స్వర్ణకార సంఘ ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ పారేపల్లి మహేష్ గతంలో కూడా జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారని, మరోసారి అవకాశం ఇవ్వడం రాష్ట్ర సంఘం తీసుకున్న సానుకూల నిర్ణయమన్నారు. స్వర్ణకారుల అభ్యున్నతికి నూతన కమిటీ అండదండలుగా ఉండి పనిచేయాలని సూచించారు.

## 24న ఏఎన్‌యూలో అస్మిత అథ్లెటిక్స్ లీగ్

**గుంటూరు ఎడ్యుకేషన్:** అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 24న ఏఎన్‌యూ క్రీడా మైదానంలో గుంటూరు జిల్లా అస్మిత అథ్లెటిక్స్ లీగ్ నిర్వహించనున్నట్లు హిందూ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పీఎం ప్రసాద్ తెలిపారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని కళాశాలలో అండర్–14, అండర్ 16 బాలికల ఈవెంట్లకు సంబంధించిన పోస్టర్లను ప్రిన్సిపాల్ సీహెచ్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వి.నర్సిరెడ్డిలతో కలసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ సౌజన్యంతో అస్మిత్ అథ్లెటిక్స్ లీగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన బాలికలను దేశవ్యాప్తంగా ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, విభాగాధిపతులు సుస్మితా చౌదరి, నాగాంజనేయులు, ఫిజికల్ డైరెక్టర్ కె.రవి పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో ఆక్సిజన్ అందక రోగి మృతి..!

**గుంటూరు మెడికల్:** పేదల పెద్ద ఆసుపత్రి గుంటూరు జీజీహెచ్‌లో గురువారం రాత్రి ఆక్సిజన్ అందక ఓ రోగి మృతిచెందినట్లు మృతుడి బంధువులు ఆరోపించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 50 ఏళ్ల వ్యక్తి మధుమేహంతో బాధపడుతూ కాలికి రక్తనాళాల సమస్య ఏర్పడి తీవ్ర ఇబ్బందితో ఈనెల 12న గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం అడ్మిట్ అయ్యాడు. జనరల్ సర్జరీ వైద్యులు ఈనెల 16న ఆపరేషన్ చేసి కాలు తొలగించారు. ఆపరేషన్ అనంతరం ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. గురువారం ఐసీయూ నుంచి వార్డుకు తరలించగా, వార్డులో ఆరోగ్యం విషమించి ఆక్సిజన్ పెట్టాలని వైద్యులు సూచించారు. అయితే ఆక్సిజన్ పెట్టేందుకు కావాల్సిన మాస్క్‌ను బయట నుంచి కొని తెచ్చుకోమని బంధువులకు సూచించడంతో వారు రాత్రి కొనుగోలు చేసి వార్డుకు వెళ్లేసరికి సదరు వ్యక్తి మృతిచెందాడు. తక్షణమే మళ్లీ ఐసీయూకు తరలించి కొంతసేపు ఉంచి, చనిపోయినట్లు నిర్ధారించి తమకు అప్పగించారని మృతుడి బంధువులు వాపోయారు. వార్డులో వైద్యులు ఎవరూ అందుబాటులో లేరని, రాత్రి సమయంలో మహాప్రస్థానం వాహనం కూడా అందుబాటులో లేకపోవడంతో సొంత వాహనంలో గ్రామానికి తరలించినట్లు చెబుతున్నారు. ఆక్సిజన్ మాస్క్‌లు అందుబాటులో ఉంటే సకాలంలో ఆక్సిజన్ పెట్టి ఉంటే చనిపోయేవాడు కాదని, నిర్లక్ష్యంతోని చనిపోయాడని ఆరోపించారు. కాగా ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను 'సాక్షి' వివరణ కోరగా వార్డులో ఆక్సిజన్ మాస్క్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. అయినప్పటికీ బయట రోగి బంధువులతో కొనుగోలు చేయించిన వారికి మెమో జారీ చేస్తామని వెల్లడించారు.

# మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి పటిష్ట కార్యాచరణ

**జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా**

చేపపిల్లలను నీటిలోకి వదులుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

**తాడేపల్లి రూరల్:** మత్స్య సంపదను వృద్ధి చేసి మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని పడవల రేవు వద్ద ప్రకాశం బ్యారేజ్ జలాశయంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2047 స్వర్ణాంధ్ర విజయ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య రంగాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ప్రకాశం బ్యారేజ్ జలాశయంలో 23,50,000 చేప పిల్లలను వదిలినట్లు వివరించారు. జిల్లాలో ఉన్న 202 గ్రామాల మంచినీటి చెరువుల్లో మత్స్య సంపదను వృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఫిషరీస్, ఆక్వా ఉత్పత్తులకు రానున్న రోజుల్లో మంచి డిమాండ్ ఉంటుందని, నాణ్యమైన మత్స్య సంపదను సాగు చేయాలని కోరారు. మత్స్యకారులందరూ ఏపీ ఎస్ఏడీఏలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యకారులకు మార్కెటింగ్ సౌకర్యం కోసం ఫిష్ వెండిగ్ యూనిట్లను అందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం జిల్లాలో ఆరు మత్స్యకారుల సహకార సంఘాలకు నూరుశాతం రాయితీతో మంజూరు అయిన రూ. 10,11,978 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి కిరణ్, జిల్లా మత్స్యశాఖ సంఘం అధ్యక్షులు భూ శంకర్, ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి, ఎంటీఎంసీ అధికారి శివకుమారి, ఎంపీపీ కృష్ణ, తహసీల్దార్ సీతారామయ్య పాల్గొన్నారు.

## విజ్ఞాన్‌ను సందర్శించిన అమెరికా వర్సిటీ బృందం

గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నే, కే.రోజర్స్‌లతో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, సీఈఓ మేఘన, వీసీ నాగభూషణ్

**చేబ్రోలు:** మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీని యూఎస్ఏ–ఓహియోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ(బీజీఎస్‌యూ) ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. బీజీఎస్‌యూ ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నే కే. రోజర్స్, అడ్వకేట్ డాక్టర్ సాండ్రా బీ.ఎర్లే, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి క్రోవి, అకడమిక్ అఫైర్స్ వైస్ ప్రొవోస్ట్ డాక్టర్ రోడ్నే కే. రోజర్స్, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్– ఇన్నోవేషన్ డీన్ డాక్టర్ వేల్ మోక్తర్ సందర్శించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ విజ్ఞాన్– బీజీఎస్‌యూ మధ్య ఉన్న అవగాహన ఒప్పందం కేవలం విద్యార్థి మార్పిడికి మాత్రమే కాకుండా అంతర్జాతీయ విద్యా– పరిశోధనా సహకారం అని తెలిపారు. రెండు యూనివర్సిటీల అధ్యాపకులు ఒకరికొకరు వర్సిటీల్లో తాత్కాలికంగా బోధించే అవకాశం ఉంటుందని చెప్పారు. రెండు వర్సిటీల మధ్య సంయుక్త ఇన్నోవేషన్ సెంటర్లు, ల్యాబ్‌లు, శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. విమానయాన రంగానికి గ్లోబల్ ప్రమాణాలతో కూడిన మేనేజ్మెంట్ కోర్సులను సంయుక్తంగా రూపొందిస్తామని వివరించారు. డ్రోన్ మాన్యుఫాక్చరింగ్, వ్యవసాయం– సర్వేయింగ్, డిఫెన్స్ అప్లికేషన్లపై రీసెర్చ్ ల్యాబ్‌లను కలిసి అభివృద్ధి చేయనున్నట్టు పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్లు, ఐవోటీ సెన్సర్లు, స్మార్ట్ ఇరిగేషన్ వంటి టెక్నాలజీల అభివృద్ధిపై రెండు వర్సిటీలు కలిసి పనిచేయనున్నట్టు తెలిపారు. బీజీఎస్‌యూ ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నే కే. రౌజర్స్ మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీతో మా భాగస్వామ్యం కేవలం విద్యా మార్పిడికే పరిమితం కాదు, రాబోయే టెక్నాలజీ ప్రపంచానికి భారత– అమెరికా విద్యార్థులను సిద్ధం చేసే సమగ్ర అకడమిక్ మిషన్ అని అన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, సీఈఓ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

## చోరీల మిస్టరీని ఛేదించిన పోలీసులు

- నలుగురు సభ్యుల ముఠా అరెస్ట్
- నిందితుల నుంచి రూ.80 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- నరసరావుపేట, వినుకొండ ప్రాంతాల్లో ఆరుచోట్ల చోరీలు
- వివరాలు వెల్లడించిన నరసరావుపేట ఎస్పీ బి.కృష్ణారావు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

**నరసరావుపేటరూరల్:** నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో వరుస చోరీల మిస్టరీని పోలీసులు ఛేదించారు. చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.80 లక్షల విలువైన బంగారు వస్తువులు, ఆటో, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వివరాలు వెల్లడించారు. నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రకాష్‌నగర్ ఆర్అండ్‌బీ ఆఫీసు సమీపంలో నివసిస్తున్న గడిపూడి సుబ్బారావు దంపతులు ఈనెల 4వ తేదీన ఇంటికి తాళాలు వేసి రాజుపాలెం మండలం గణపవరం గ్రామంలోని తమ కుమార్తె వద్దకు వెళ్లారు. ఈనెల 9వ తేదీన తిరిగి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులకొట్టి బంగారు నగలు దొంగిలించారు. దీనిపై కేసు నమోదు చేసి వన్‌టౌన్ పోలీసులు సీఐ ఎస్కే టి ఫిరోజ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్, డాగ్ స్కాడ్ పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఇంటి సమీపంలోని సీసీ టీవీ పుటేజ్‌ను పరిశీలించి నలుగురు నిందితులను గుర్తించారు. నరసరావుపేట బరంపేటకు చెందిన పేరేచర్ల వంశీ, మాచర్లకు చెందిన బండారు బాలయ్య, నరసరావుపేట పెదచెరువుకు చెందిన వేముల తిరుపతిరావు, మీసాల రాజేష్‌లను ఈనెల 20వ తేదీన గురువారం అరెస్ట్ చేశారు.

**కూలి పనులు చేసుకుంటూ రెక్కీ**

చోరీ కేసులు పోలీసులు అరెస్ట్ చేసిన నలుగురు నిందితులపై ఇప్పటి వరకు ఎటువంటి నేరచరిత్ర లేదని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. భవన నిర్మాణ పనుల్లో నలుగురు కూలీలుగా పనిచేస్తుంటారని వివరించారు. పనులకు వెళ్లే సమయంలో తాళాలు వేసి ఉన్న ఇంటిని గుర్తించడం తరువాత రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. ఆరు నెలల్లో ఆరు చోరీలకు నలుగురు ముఠా పాల్పడినట్టు తెలిపారు. నరసరావుపేట టూటౌన్, నరసరావుపేట వన్‌టౌన్, నరసరావుపేట రూరల్‌లో రెండు, వినుకొండలో రెండు చోరీలకు ఈ ముఠా సభ్యులు పాల్పడ్డారని వివరించారు.

### 610 గ్రాముల బంగారం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

చోరీ కేసులో నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. రూ.80 లక్షల విలువైన 610 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. రెండు ల్యాప్‌టాప్‌లు, ఐదు గడియారాలతోపాటు చోరీ చేసిన సొత్తుతో కొనుగోలు చేసిన ఆటోలు, నేరాలకు ఉపయోగించిన ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజుల్లోనే చోరీ కేసును ఛేదించిన ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.హనుమంతరావు, వన్‌టౌన్ సీఐ ఫిరోజ్, ఎస్ఐ పి.వంశీకృష్ణ, ఏఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, ఇతర సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

## నెల్లూరు జిల్లాలో పట్టుబడిన గంజాయి ధ్వంసం

**యడ్లపాడు:** ప్రజా ఆరోగ్య భద్రత కోసం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ ఎం శంకరయ్య తెలిపారు. నెల్లూరు జిల్లాలో భారీగా పట్టుబడిని గంజాయి, నిషేధిత మాదక ద్రవ్యాలను శుక్రవారం అధికారులు ధ్వంసం చేశారు. యడ్లపాడు మండలం కొండవీడు రెవెన్యూ పరిధిలో జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ పవర్ ప్లాంట్‌లో మాదక ద్రవ్యాలను ధ్వంసం చేసిన తర్వాత డిప్యూటీ కమిషనర్ ఎం శంకరయ్య వివరాలను తెలిపారు. నెల్లూరు జిల్లాలో 61 కేసులు ద్వారా ఎక్సైజ్‌శాఖ స్వాధీనం చేసుకున్న నిషేధిత మాదక ద్రవ్యాలను ఈ ఏడాది జూలై 9న నిర్వహించిన డీడీసీ సమావేశంలో వీటిని ధ్వంసం చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ మేరకు తాము స్వాధీనం చేసుకున్న డ్రై గంజాయి 751.586 కిలోలు, 3.2 మీటర్ల పొడవు 1 మీటర్ వెడల్పు కలిగిన గంజాయి మొక్కలు, 950 గ్రాములు హషీష్ ఆయిల్ ప్లాంట్‌కు తరలించి ధ్వంసం చేశారు. పర్యావరణ ప్రమాణాలు పాటిస్తూ విజయవాడలోని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు వీటిని శాస్త్రీయ పద్ధతిలో నాశనం చేసినట్లు అధికారులు తెలిపారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులుగా నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ ఎం శంకరయ్య, అసిస్టెంట్ కమిషనర్ పి దయాసాగర్, ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ కె విజయ్ వ్యవహరించారు. ఏపీపీసీబీ పర్యావరణ ఇంజినీర్ ఎం అజీనాబేగం, నెల్లూరు అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జె రమేష్, అదే జిల్లాలోని తొమ్మిది ఎక్సైజ్ స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు, సిబ్బంది, ఏపీ ఆపరేషన్ టీం ప్రెసిడెంట్ ఎంవీ చారి, సిబ్బంది, కొండవీడు వీఆర్వో దండా కృష్ణ చైతన్యం, వీఆర్ఏ కూచిపూడి గోపిచంద్ పాల్గొన్నారు.

### పసుపు ధరలు (శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు :79

కొమ్ములు : 56+ బస్తాలు (ధర రూ॥ల్లో)

| కనిష్ట : | గరిష్ట : | మోడల్ : |
|---|---|---|
| 9,000 | 9,000 | 9,000 |

కాయలు : 137 బస్తాలు

| కనిష్ట : | గరిష్ట : | మోడల్ : |
|---|---|---|
| 9,000 | 12,400 | 9,000 |

మొత్తం అమ్మకాలు : 59.25 క్వింటాళ్లు

–దుగ్గిరాల

### వాణిజ్యం — నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 600 గరిష్ఠం : రూ. 700

మోడల్ ధర రూ. 800

### మిర్చి యార్డు సమాచారం (శుక్రవారం ధరలు)

| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 38,257 |
| అమ్మకాలు | 42,133 |
| నిల్వ | 6,334 |

**నాన్ ఏసీ కామన్ రకం** క్వింటా (రూ.)

| | |
|---|---|
| 334 | 10,000–18,500 |
| నంబరు–5 | 11,500–16,000 |
| 341 | 10,000–17,500 |

**ఏసీ కామన్ రకం** క్వింటా (రూ.)

| | |
|---|---|
| 334 | 10,500–18,000 |
| నంబరు–5 | 12,000–16,400 |
| 341 | 11,500–18,000 |
| 4884 | 11,000–14,500 |

**నాన్ ఏసీ ప్రత్యేక రకాలు** క్వింటా (రూ.)

| | |
|---|---|
| తేజ | 10,000 – 16,000 |
| బాడిగ–355 | 11,000 – 18,300 |
| దేవనూరు డీలక్స్ | 11,000 – 17,500 |
| ఆర్మూర్ | 11,500 – 14,300 |
| తాలుకాయలు | 5,500 – 9,000 |

**ఏసీ ప్రత్యేక రకాలు** క్వింటా (రూ.)

| | |
|---|---|
| తేజ | 10,000–16,000 |
| బాడిగ – 355 | 10,000–18,500 |
| దేవనూరు డీలక్స్ | 10,500–17,500 |
| తాలు | 5,300 – 9,000 |

–కొరిటెపాడు (గుంటూరు)

## ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా..

- పదిలో నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక
- డిసెంబర్ 6 నుంచి 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు
- ఎస్ఏ, ఎఫ్ఏ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు గ్రేడ్లు
- సి.డి. గ్రేడ్ విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని ప్రత్యేక బోధన
- 'సాక్షి'తో గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక

**గుంటూరు ఎడ్యుకేషన్:** మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో గుంటూరు జిల్లాలో నూరు శాతం ఉత్తీర్ణత నమోదు చేసే విధంగా డిసెంబర్ 6వ తేదీ నుంచి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక చెప్పారు. ఆమె డీఈవో కార్యాలయంలో 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, సాంఘిక సంక్షేమ ఉన్నత పాఠశాలల నుంచి 10,492 మంది విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ, ఎస్ఏ) పరీక్షల్లో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థులను గ్రేడ్లుగా విభజించి, సీ.డీ గ్రేడ్లలో ఉన్న విద్యార్థులను ఆయా పాఠశాలల్లోని సబ్జెక్టు ఉపాధ్యాయులు దత్తత తీసుకుని ప్రత్యేక బోధన అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారని, వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి ఒక్క విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, ప్రభుత్వ పాఠశాలల నుంచి పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధించేలా పర్యవేక్షణ చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అధిక మార్కులు సాధించేందుకు జెడ్పీ నుంచి ఉచితంగా అందించనున్న స్టడీ మెటీరియల్ డిసెంబర్ మొదటి వారంలో పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు.

**పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెలాఖరు వరకు గడువు**

టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫీజు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించేందుకు ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందని డీఈవో సీవీ రేణుక చెప్పారు. నామినల్ రోల్స్ సమర్పించే ముందుగానే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వివరాలు సక్రమంగా ఉన్నవీ, లేనివీ నిర్ధారించుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

## షార్ట్ ఫిల్మ్‌ల పోటీలు

**నగరంపాలెం:** ఏపీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్‌లో భాగంగా ఏపీలోని యువతకు షార్ట్ ఫిల్మ్‌ల పోటీలు నిర్వహించనున్నట్లు మా– ఏపీ వ్యవస్థాపకులు, దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. పొన్నూరు రోడ్డులోని ఓ హోటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. సమాజంపై విషం చిమ్ముతున్న వ్యవస్థలపై, దేశ భద్రతపై, సృజనాత్మకతతో కూడిన కథాంశాలపై షార్ట్ ఫిల్మ్‌లను చిత్రీకరించాలని అన్నారు. ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. షార్ట్ ఫిల్మ్‌ల నిడివి పదిహేను నిమిషాలు మించరాదని స్పష్టంచేశారు.


**Indian Bank — ఇండియన్ బ్యాంక్, నరసరావుపేట బ్రాంచి.**
6/1/211/212, బ్యాంక్ స్ట్రీట్, అరండల్‌పేట, నరసరావుపేట, ఆంధ్రప్రదేశ్-522601. ఫోన్: 08647-222064

APPENDIX-IV-A [See Provision to rule 6(2) & 8(6) / 9(1)]

**స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 ... సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(2) & 8(6) / 9(1) ... [illegible]

రుణగ్రహీత: 01) మెస్సర్స్ ... హోటల్స్, డ.నెం. 7-136, ... నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522601 ... 02) శ్రీ ... ఫ్లాట్ నెం. 101 ... 03) శ్రీ ... ఫ్లాట్ నెం. 401 ... ఆంధ్రప్రదేశ్–522601 ... ఇండియన్ బ్యాంక్, నరసరావుపేట బ్రాంచికి ... తేది.20.11.2025 తేదీనాటికి రూ.3,66,16,996/– ... తేది.21.11.2025 ... తేది.11.12.2025 తేదీన "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అది" మరియు "ఎవ్వరి ఉన్నట్లుగా" ... [illegible]

ఇ–వేలం విధానం ద్వారా విక్రయించదానికి ఉద్దేశించిన ఆస్తి యొక్క సంక్షిప్త వివరాలు దిగువ పేర్కొనబడినవి:

**స్థిరాస్తి యొక్క వివరణ**

ఆస్తుల యొక్క షెడ్యూలు (ఆస్తి వారీగా)

[illegible] ... డ.నెం.515/... 2222.5 ... 1858.27 ... 371.65 ... 314.87 ... [illegible]

ఐటమ్ నెం.1 ... ఐటమ్ నెం.8 ... [illegible]

| | |
|---|---|
| ఆస్తిపై ఎన్‌కంబరెన్స్ | బ్యాంకుకు తెలిసినంత వరకు ఏమిలేవు |
| రిజర్వు ధర (రూ.) | రూ.3,43,00,000/- [illegible] |
| ధరావతు మొత్తం | రూ.34,30,000/- [illegible] |
| బిడ్ పెంపుదల మొత్తం | రూ.50,000/- [illegible] |
| ఇ–వేలం యొక్క తేదీ మరియు సమయం | తేది: 11.12.2025, సమయం: ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు |
| ఆస్తి ఐడి నెం. | IDIB702807278A |

... PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ (https://baanknet.com) ... PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ హెల్ప్‌డెస్క్ నెంబర్ 8291220220, email ID: support.baanknet@psballiance.com ... support.baanknet@psballiance.com ... https://baanknet.com ... 8291220220 ... 7013433093/08647222064 ... https://baanknet.com ... [illegible]

తేది: 21.11.2025, ప్రదేశం: నరసరావుపేట — సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్



**సాక్షి క్లాసిఫైడ్స్**

**REAL ESTATE**

**TOLET**

■ గుంటూరు సిద్ధార్థ నగర్ 3వలైన్ నందు ఉత్తరం ఫేసింగ్ డూప్లెక్స్ 4BHK Fully Furniture, 3 కార్ పార్కింగ్ ఇల్లు అద్దెకు కలదు. అద్దె నెలకు రూ.60,000/- సం॥ 9849719999

**SERVICES**

**GOLD FINANCE**

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

**WANTED**

■ ప్రముఖ మార్కెటింగ్ సంస్థ వెంకటేశ్వర ఎస్టేట్ నందు నరసరావుపేటలో మార్కెటింగ్ చేయుటకు యువతీ యువకులు కావలెను. మంచిజీతం+ ఇన్సెంటివ్స్. 8978057827, 8106264847

■ Wanted MBA Marketing / Business Development / supply chain management to work a reputed company at Guntur. mini 2 years experience. Contact: 91333 99257

■ అకౌంట్స్ మేనేజర్ కావలెను. బీకాం, 5 సం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్ రిటర్న్స్‌పు ప్రిపేర్ చేయగలిగి, GST రిటర్న్ వేయగలిగిన వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌చార్జ్‌స్, క్లాసు ఇన్‌చార్జ్‌స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము 14వేలు నుండి 21వేలు వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు : ఇంటర్ నుండి పీజీ వరకు వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 8978480429

■ గుంటూరు సిటీలోని సత్యదయ అసోసియేట్స్ నందు జాబ్ చేయుటకు మండలాల వారీగా స్త్రీ/ పు కావలెను. 9912059165

■ సివిల్ కాంట్రాక్ట్ కంపెనీ నందు పని చేయుటకు సివిల్ ఇంజనీర్ మరియు సైట్ లో పనిచేయుటకు ఐటిఐ ఇంజనీర్ కావలెను. 9951052345

■ గుంటూరు అంకిరెడ్డిపాలెంలో రోడ్డు ప్రక్కనే 150 గజాల స్థలం అమ్మకమునకు కలదు. తక్షణమే ఇల్లు నిర్మించుకోవచ్చు. 9390011971, 9396242802

■ నరసరావుపేట లోని ప్రముఖ అడ్వకేట్ ఆఫీస్ నందు Field work మరియు Legal Opinions టైప్ చేయుటకు అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. ✆ 9398335959

■ Paparao High School, K.Uppalapadu, Prakasam(dt). Wanted High School telugu Teacher & Primary Hindi Teacher & PET (Male & Female), Female Wardens. Free Boarding & Lodging. Salary Negotiable. Cont.7019326579,9392182210

■ త్రివేణీహోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి భోజనం జీ: 18K-20K . Ph: 9640400073, 9160900024

■ Dabbawalaaలో సేల్స్ మేనేజర్స్/ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Salary : 24,000–36,000 (ఫీల్డ్ వర్క్) Ph : 9494324112

సాక్షి క్లాసిఫైడ్స్ ... గుంటూరు 7075167663 7075167541

## క్లుప్తంగా

### జలపాలేశ్వరుడికి విశేషార్చనలు

**ఫిరంగిపురం:** ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకూ శివనామ ఏకాహం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం జలపాలేశ్వరుడికి అర్చకులు ఉమాపతి శాస్త్రి నమకచమకాలతో అభిషేకాలు నిర్వహించారు. విశేష అర్చనలు, హోమం నిర్వహించి పూర్ణాహుతి జరిపారు. అయ్యప్పలు, భవానీలు, శివస్వాములు, భక్తులు శివనామ ఏకాహంలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

**ఫిరంగిపురం:** మండల కేంద్రం నుంచి వేములూరిపాడు గ్రామశివారు వరకూ గుంటూరు–కర్నూలు రాష్ట్ర రహదారిపై రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని శాంతిపేటలో గల తన నివాసంలో ఆమె మాట్లాడారు. గడిచిన మూడు నెలలలో ఈ దారిలో చాలా ప్రమాదాలు జరిగాయని.. కొందరు మృతిచెందగా, మరికొందరు క్షతగాత్రులయ్యారని అన్నారు. ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పలు ప్రాంతాల్లో ప్రమాదసూచిక బోర్డులు లేకపోవడం, వేగ నియంత్రణ చర్యలు తీసుకోనందు వల్ల ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అధికారులు ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**దుగ్గిరాల:** స్థానిక 33–11 కేవీ దుగ్గిరాల సబ్‌స్టేషన్‌లో పిరియాడికల్ మేంటినెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కె.గోపి శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ దుగ్గిరాల, చింతలపూడి, పెనుమూలి, మోరంపూడి, కంఠంరాజుకొండూరు, మంచికలపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

**మంగళగిరి టౌన్:** మంగళగిరి పట్టణ పరిధి శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మంగళగిరి విద్యుత్‌శాఖ ఏడీఈ జి.సురేష్‌బాబు శుక్రవారం పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణ పరిధిలోని గండాలయ్యపేట, కొత్తపేట, ఆర్‌అండ్‌బీ బంగ్లా రోడ్, హాస్పిటల్ రోడ్, మెయిన్ బజార్, ఎయిమ్స్ గేట్, ఎకో పార్క్, పెదకోనేరు, హుస్సేన్ కట్ట, గౌతమబుద్ధ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

### ఉచిత శిక్షణ, ఉపాధి కల్పనకు దరఖాస్తు

**తాడికొండ:** నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పనకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ సీఆర్డీయే స్కిల్ హబ్ శిక్షణాధికారి రాఘవేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసున్న నిరుద్యోగ యువతకు నిర్మాణ రంగంలో 45 నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 98483 41749, 81213 06680, 91001 07699, 99662 30506, 95057 19172 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

### విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

**ఫిరంగిపురం:** పంట వేసే ముందుగా విత్తన శుద్ధి చేయడం ద్వారా అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు ఐ.సునీత అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో శుక్రవారం రబీ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై ఆత్మవారి సహకారంతో రైతులకు అవగాహన కార్యక్రమం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సునీత మాట్లాడుతూ.. శనగ పంట వేసే ముందు కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలని చెప్పారు. రబీ సీజన్‌లో మొక్కజొన్న, శనగ వంటి ఇతర పంటలపై తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. విత్తనశుద్ధి చేసుకొనే విధానం రైతులకు చూపించారు. కార్యక్రమంలో ఏవో వాసంతి, వ్యవసాయ విస్తరణాధికారి షేక్ సుబానీ, షహనాజ్, వేణుబాబు, హకీం, రైతులు పాల్గొన్నారు.

# బస్‌షెల్టర్‌లు అపరిశుభ్రం.. నిరుపయోగం!

ఉపయోగానికి అనువుగా లేని.. అపరిశుభ్రంగా చింతలపూడి బస్‌షెల్టర్

నిరుపయోగంగా.. వ్యాపార కేంద్రంగా దుగ్గిరాల బస్‌షెల్టర్

**దుగ్గిరాల:** తెనాలి–విజయవాడ ప్రధాన రహదారి వెంబడి గల దుగ్గిరాల మండలంలో సుమారు ఏడు బస్‌షెల్టర్లు ఉన్నాయి. ఇందులో కొన్ని వినియోగంలో.. మనికొన్ని అపరిశుభ్రంగా.. నిరుపయోగంగా ఉన్నాయి. కాగా ప్రజల అవసరాల దృష్ట్యా నూతనంగా పలు ప్రాంతాల్లో బస్‌షెల్టర్‌లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. చింతలపూడి గ్రామంలో ఉన్న బస్‌షెల్టరు దాతల సహాయంతో 1985లో నిర్మించారు. ఇటీవల ఆ బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరగా కొత్త ఇనుప రేకులు ఏర్పాటు చేసి కొంత మరమ్మతులు చేశారు. ఇక్కడ ఇంజినీరింగ్ కళాశాల ఉండటం వల్ల రోజూ అధిక సంఖ్యలో విద్యార్థుల రద్దీ తీవ్రంగా ఉంటోంది. రోడ్డుకు రెండు వైపులా బస్సు ఎక్కేందుకు షెల్టరు అవసరం ఉంది. దీంతో కొత్తగా మరో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**దుగ్గిరాల బస్‌షెల్టర్ వద్ద వ్యాపారాలు..**

దుగ్గిరాల బయట ఉన్న బస్‌షెల్టర్ ప్రయాణికుల అవసరానికి అనుగుణంగా లేదు. దీంతో స్థానిక బస్‌షెల్టర్ వద్ద పలువురు వ్యాపారులు ప్రతిరోజూ కూరగాయలు, పండ్లు వ్యాపారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా దుగ్గిరాల బయట నుంచి విజయవాడ, మంగళగిరి, తెనాలి వెళ్లేందుకు రోజూ ప్రయాణికులు ప్రమాదకరంగా లాకులు మీద బస్సును ఆపి ఎక్కుతున్నారు. కాగా లాకుల మీద బస్సు ఆపడం ప్రమాదం. దీంతో పలు సందర్భాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయి. దుగ్గిరాల బయట నుంచి సుమారు 8 గ్రామాల ప్రయాణికులు రోజూ వస్తుంటారు. కానీ సరైన బస్‌షెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**బస్సు సమయాలు తెలిపేలా బోర్డులు..**

దుగ్గిరాల నుంచి ఇటు తెనాలి.. అటు విజయవాడ వెళ్లే బస్సు సమయాలను పూర్తి స్థాయిలో తెలిపేలా అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. మంచికలపూడి బస్‌షెల్టర్‌లో రోజూ దిచక్రవాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ బస్‌షెల్టర్ ఉపయోగించేందుకు అనువుగా ఉండడం లేదు. దుగ్గిరాల నుంచి ఈమని ప్రయాణించే ప్రజలకు నిలువనీడ కరువయ్యింది. దీంతో ప్రయాణికులు రోడ్డు పక్క చెట్లకింద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. అధికారులు, నాయకులు త్వరితగతిన స్పందించి ప్రయాణికుల ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈమని వెళ్లేందుకు ఎండలో ప్రయాణికుల పడిగాపులు

# మంగళగిరి–తెనాలి రోడ్డు విస్తరణ ఆపాలని వినతి

సీఆర్డీయే అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

**మంగళగిరి టౌన్:** మంగళగిరి–తెనాలి రోడ్డు విస్తరణ ఆపాలని ఏపీ సీఆర్డీయే కమిషనర్‌కు తెనాలి రోడ్డు చేనేత వ్యాపార పరిరక్షణ, విస్తరణ బాధితుల సంఘం శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. తెనాలి రోడ్డు విస్తరణతో జీవనోపాధి కోల్పోతామని, తక్షణమే రోడ్డు విస్తరణను ఆపాలని కోరారు. ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా తీసుకువచ్చిన గజిట్‌ను రద్దుచేయాలన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని.. ఇది ప్రజా వ్యతిరేక నిర్ణయమని అన్నారు. తెనాలి రోడ్డును 60 అడుగులుగా విస్తరణ చేస్తే వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయని, చేనేత పరిశ్రమ, చిరు వ్యాపారులకు అనుబంధంగా పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కబరస్తాన్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ మొహమ్మద్ యూసఫ్ మాట్లాడుతూ.. 200 ఏళ్ల చరిత్ర కలిగిన కబరస్తాన్‌ను రోడ్డు విస్తరణలో భాగం చేయడం ముస్లిం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. కబరస్తాన్ వక్ఫ్ నోటిఫై చేసిన చట్టబద్ధమైన ఆస్తి అని.. దీనిని వేరే అవసరాలు, రోడ్డు విస్తరణకు వినియోగించడం పూర్తిగా నిషిద్ధమని.. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు జాతీయ అధ్యక్షులు, గుంటూరు జిల్లా ముస్లిం ధార్మికపండితులు ఫత్వాలను జారీ చేశారని పేర్కొన్నారు. ముస్లిం ప్రజల మనోభావాలను, మత విశ్వాసాలను గౌరవిస్తూ తెనాలి రోడ్డును విస్తరణ నుంచి మినహాయించాలని కోరారు.

# 'పొరుగువారి హక్కులు' ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జమాఅతె ఇస్లామీ హింద్

**మంగళగిరి టౌన్:** మంగళగిరి నగర పరిధిలోని జమాఅతె ఇస్లామీ హింద్ పట్టణ కార్యాలయంలో శుక్రవారం 'పొరుగువారి హక్కులు' ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు హాఫీజ్ సయ్యద్ షౌకత్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 30వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని.. ఆదర్శవంతమైన పొరుగువారు, ఆదర్శవంతమైన సమాజం కోసం ప్రజల వద్దకు వెళ్లి ఖురాన్‌లో సూచించిన విధానాన్ని ప్రజలకు సూచిస్తామని పేర్కొన్నారు. మన ఇరుగు పొరుగు వారితో ప్రేమను పంచుకుంటూ ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే మనస్తత్వం ఉన్నవారే ముస్లిం సోదరులని వివరించారు. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పడం ద్వారా శాంతి నెలకొంటుందని అన్నారు. కార్యక్రమంలో మంగళగిరి అధ్యక్షులు అబ్దుల్ అజీమ్, ఉపాధ్యక్షులు నిజాముద్దీన్, నాయకులు షరీఫ్, రషీద్, హుస్సేన్, గని తదితరులు పాల్గొన్నారు.

# సత్రం దుకాణాల వ్యవహారంలో మళ్లీ వివాదం

దుకాణంలో సామాన్లు బయటపడేసిన నిర్వాహకులు

**తాడికొండ:** తుళ్లూరులో సత్రం దుకాణాల వ్యవహారం మళ్లీ రాజుకుంది. ఈ విషయం కోర్టులో ఉండగా ఓ దుకాణంలో టీస్టాల్ ఏర్పాటు చేసేందుకు శుక్రవారం తుళ్లూరుకు చెందిన ఓ వ్యక్తి యత్నించడంతో ఇది తన స్థలం అంటూ నిర్వాహణ చేస్తున్న శ్రీనివాసరావు అనే వ్యక్తి వచ్చి లోపల పెట్టిన సామాన్లు బయట పడేశారు. తనకు చెందిన స్థలంలో ఆక్రమిస్తున్నారంటూ శ్రీనివాసరావు చెబుతుండగా ఇది కోర్టులో ఉన్న స్థలం అంటూ పలువురు చెబుతున్నారు. అధికారులెవరూ అటు తొంగి చూడకపోవడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు రంగప్రవేశం చేసి వివాదం సద్దుమణిగేలా చేశారు. కాగా ఇరువర్గాలకు వివాదం జరుగుతుందనే యోచనతో పోలీసులు పహారా ఏర్పాటు చేశారు.

# రాజధాని గ్రామాల్లో పర్యటించిన మంత్రి నారాయణ

అంగన్‌వాడీ కేంద్రంలో ఆట వస్తువులు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

**తాడికొండ:** రైతులకు ఇచ్చిన హామీలన్నీ 100% పూర్తి చేస్తామని మంత్రి నారాయణ అన్నారు. శుక్రవారం ఉదయం రాజధాని గ్రామాలైన వెంకటపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. రైతులకు ఏ సమస్య ఉన్నా రాజధానిలోని సీఆర్డీయే కార్యాలయంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. అమరావతిలో సిటీస్ ప్రాజెక్ట్ ద్వారా చేపట్టిన ఈ–హెల్త్ సెంటర్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్స్‌ను పరిశీలించిన ఆయన నిర్మాణం జరుగుతున్న 15 అంగన్‌వాడీ భవనాలు, 14 పీహెచ్‌సీ భవనాలు, 14 స్కూల్, ఒక మల్టీ పర్పస్ శ్మశాన వాటిక, మౌలిక సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీటి ద్వారా రాజధాని గ్రామాలలో నాణ్యమైన విద్య వైద్య సదుపాయాలు కలగనున్నాయని, వీలైనంత త్వరగా మిగిలి ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న దివ్యతేజోమూర్తి

**మంగళగిరి టౌన్:** ప్రతి విద్యార్థి సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దివ్యతేజోమూర్తి అన్నారు. స్థానిక వీజే డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏడు రోజుల ప్రత్యేక శిబిర కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఆత్మకూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా ఆరోగ్యం గురించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజమైన విద్య సేవలోనే ఉంటుందని, గ్రామంలో పనిచేసే అనుభవం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, మానవ విలువల పెంపునకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు శంకర్, సురేష్‌బాబు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు సజావుగా జరిగేలా చర్యలు

సీసీఐ కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

**మేడికొండూరు:** జిల్లాలో రైతులకు ఇబ్బంది లేకుండా సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు సజావుగా జరిగేలా పూర్తిస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. శుక్రవారం మేడికొండూరు మండలం డోకుపర్రు గ్రామంలోని శ్రీ విజయ వెంకటేశ్వర కాటన్ మిల్స్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రైతుల నుంచి పత్తి కొనుగోలు ప్రక్రియకు సంబంధించి తేమశాతం పరిశీలన, లాట్ జనరేషన్, సేల్స్ ఇన్వాయిస్ విధానం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల పనితీరు, పత్తి దిగుబడులు తదితర వివరాలను జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పత్తి రైతులు కలెక్టర్‌కు తమ సమస్యలు వివరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, సెక్రటరీ శివశంకర్ రెడ్డి, సీసీఐ బయ్యర్ ఉమామహేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం

13వ వార్డు సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న వేమారెడ్డి

వెంకటపాలెం కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు

**మంగళగిరి టౌన్:** పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం, వైద్యవిద్యను అందించాలని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుడితే ప్రైవేటీకరణ పేరుతో సీఎం చంద్రబాబు పేదలకు దూరం చేస్తున్నారని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళగిరి పట్టణ పరిధిలోని 13 వార్డు జామియా మసీదు వద్ద శుక్రవారం మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేస్తోందని విమర్శించారు. మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా మైనార్టీ విభాగ అధ్యక్షులు పఠాన్ సైదా ఖాన్, పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నియోజకవర్గ మైనార్టీ విభాగ అధ్యక్షులు షేక్ జానీ బాషా, పట్టణ మైనార్టీ విభాగ అధ్యక్షులు షేక్ మాలక్ బాబు, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి ఫిరోజ్, జిల్లా మైనార్టీ విభాగ ఉపాధ్యక్షులు అబ్దుల్ రజాక్, ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, పట్టణ ఉపాధ్యక్షులు షేక్ మహబూ, మంగళగిరి మండల అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షురాలు రత్నకుమారి, నాయకులు డేవిడ్‌రాజు, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, ఫిలోమినా, తమ్మిశెట్టి గౌతమి, పద్మ, మాతంగి బాబు, ఈపూరి ఆదాం, చిన్నబోతుల దుర్గారావు, చిట్టిమళ్ల సుబ్బు, రాజారత్నం, దర్శి రమేష్, సయ్యద్ గౌజ్ మొహిద్దీన్, అగస్టీన్, నూతక్కి జోష్ తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యమంలా సంతకాల సేకరణ..**

మంగళగిరి పట్టణ పరిధిలో 32వ వార్డులో మంగళగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు విక్టర్ ఇమ్మానియేల్, సురేష్, ప్రదీప్, బషీర్, భూషణం, షరీఫ్, చిన్ని, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. నవులూరు, కాజా గ్రామాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం గురువారంతో విజయవంతంగా పూర్తయ్యింది. సంతకాలు సేకరణ పత్రాలను నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వేమారెడ్డికి నాయకులు శుక్రవారం అందజేశారు. నవులూరు గ్రామ అధ్యక్షులు గంగయ్య, కాజా గ్రామ అధ్యక్షులు బొమ్మా శంకర్‌రెడ్డి, నాయకులు కృష్ణ, బాపయ్య, సాల్మన్ రాజు, ఫణి, జిలాని, వెంకట నారాయణ, గౌతమ్, తిరుపతయ్య, రాము, వాసు, బాజి, శ్రీను, వీరయ్య, చిట్టి, రాజు, ఆర్ల నాగేశ్వరరావు, శేషు, విజయ్‌బాబు, శ్రీనివాసరావు, సుభాకర్, ఈపూరి ఆదాం, రవీంద్ర, నాగభూషణం, కిషోర్ పాల్గొన్నారు.

**వెంకటపాలెం(తాడికొండ):** ప్రైవేటీకరణ పేరుతో చంద్రబాబు సర్కారు పేదలకు వైద్య విద్యను దూరం చేస్తుందని తుళ్లూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మైనేని నాగమల్లేశ్వరరావు అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని వెంకటపాలెం గ్రామంలో శుక్రవారం కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలు వైద్యులుగా స్థిరపడితే కార్పొరేట్‌కు కష్టాలు తప్పవని గ్రహించిన చంద్రబాబు ప్రభుత్వ వైద్యాన్ని నీరుగార్చి ప్రైవేటీకరణకు మొగ్గు చూపుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వెంకటపాలెం, దొండపాడు గ్రామపార్టీ అధ్యక్షులు బెజ్జం ప్రకాశరావు, కాకుమాను బ్రహ్మయ్య, తుళ్లూరు మండల గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు డీజే శ్రీనివాసరావు, షేక్ జానీ బాషా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

**మంగళగిరి టౌన్:** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి పట్టణంలో చిన్నారులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పట్టణ పరిధిలోని సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద గల ఎయిర్‌టెల్ షోరూమ్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆయేషా, చూరిష్మా, సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మహిళా కమిషన్ చైర్పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ శుక్రవారం సందర్శించారు. పెనుమాకలోని 3, 7 అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి ఆమె తనిఖీలు చేశారు. ఆ కేంద్రాలలో 6 ఏళ్ల లోపు తక్కువ బరువు ఉన్న చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని సీడీపీవోను ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది, చిన్నారుల తల్లులతో మాట్లాడారు. రక్తహీనత గల చిన్నారులకు ఐరన్ సప్లిమెంట్లను ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషన్ అడ్వయిజర్ రావూరి సూయజ్, సెక్షన్ ఆఫీసర్ శైలజ, మంగళగిరి సీడీపీవో సరిత, ఏసీడీపీవో సౌమ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

### ఇబ్బందికరంగా ఎఫ్ఆర్ఎస్ సర్క్యులర్

**మంగళగిరి టౌన్:** వైద్య, ఆరోగ్యశాఖలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ముఖగుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) రోజులో మూడుసార్లు వేస్తేనే రూ.5 వేలు ఇస్తామని సర్క్యులర్ విడుదల చేయడం ఇబ్బందికరంగా ఉందని, ఇది ఆమోదయోగ్యం కాదని, ఎన్టీఆర్ జిల్లా ఏపీ ఎంసీఏ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్, సెక్రటరీ వర్షిణి, నీలిమలు పేర్కొన్నారు. దీనిపై మంగళగిరి నగరపరిధి గల ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయానికి శుక్రవారం వినతిప్రతం అందించేందుకు వచ్చారు. సీఏవో ప్రకాశరావును కలిసి వారి వినతిని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ఇతర ఇన్సెంటివ్స్, అద్దె బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# నచ్చజెప్పబోతే మద్యం సీసాతో దాడి

దాడిలో గాయపడిన విద్యార్థి రాఘవేంద్ర

**మేడికొండూరు:** మండల పరిధిలోని విసదల గ్రామ సమీపంలో గల ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల వద్ద శుక్రవారం సాయంత్రం విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ కలకలం రేపింది. గొడవను ఆపడానికి ప్రయత్నించిన ఓ విద్యార్థిపై మరో విద్యార్థి మద్యం సీసాతో విచక్షణారహితంగా దాడి చేశాడు. సేకరించిన వివరాల ప్రకారం.. ప్రియదర్శిని కళాశాలకు చెందిన రాఘవేంద్ర, ఎన్ఆర్ఐ కళాశాలలో చదువుతున్న తన మిత్రుడు ఖాజావలిని తీసుకువెళ్లేందుకు శుక్రవారం సాయంత్రం విసదల అడ్డరోడ్డు వద్దకు వచ్చాడు. ఆ సమయంలో ఎన్ఆర్ఐ కాలేజీలో మొదటి ఏడాది విద్యార్థుల మధ్య తోపులాట జరుగుతుండగా గొడవ మొదలైంది. ఎన్ఆర్ఐ కళాశాలకు చెందిన పాములపాటి భార్గవ్ అనే విద్యార్థి ఒక వర్గానికి మద్దతుగా నిలిచి, అవతలి వర్గంపై దాడిని ప్రోత్సహించాడు. ఇది గమనించిన రాఘవేంద్ర.. గొడవలు వద్దంటూ హితవు పలికాడు. రాఘవేంద్ర జోక్యం చేసుకోవడంతో ఆగ్రహించిన భార్గవ్.. 'నీకెందుకురా...?' అంటూ వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరగడంతో భార్గవ్ ఆవేశంతో మద్యం సీసాతో రాఘవేంద్ర ముఖం, ఛాతీపై బలంగా దాడి చేశాడు. దీంతో రాఘవేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాఘవేంద్ర తండ్రి ఈ ఘటనపై స్పందిస్తూ.. 'పోలీసు కేసులు పెడితే పిల్లల చదువులు, భవిష్యత్తు పాడవుతాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఫిర్యాదు చేసేందుకు నిరాకరించినట్లు సమాచారం.

## సంక్షిప్త వార్తలు

**■ ఏపీ సీఆర్డీయే 'గ్రీవెన్స్ డే'లో 25 అర్జీలు**

**తాడికొండ:** రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీయే కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో మొత్తం 25 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. పలువురు రాజధాని ప్రాంత వాసులు, రైతు కూలీలు తమ అర్జీలను రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్(జీఆర్ఎం) నోడల్ అధికారిణి పి.జయశ్రీకి అందజేశారు. అర్జీదారులు అందజేసిన అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.ఎస్.భాగ్యరేఖ, జి.భీమారావు, పి.పద్మావతి, జి.రవీందర్, బి.శ్రీనివాస్ నాయక్, ఎస్టేట్స్ విభాగ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే(ఎల్ఏ) ఎస్.రవీంద్రప్రసాద్, డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగ జోనల్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్.మధుసూదనరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**■ గుండెపోటుతో విలేకరి మృతి**



**మేడికొండూరు:** నిన్నటి వరకూ ఆ ఇంట మంగళ వాయిద్యాలు మోగాయి. విధి ఆడిన వింత నాటకానికి మేడికొండూరు మండలం డోకిపర్రులోని మృతుని కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. ఓ పత్రికలో విలేకరిగా పనిచేసే దావాల వెంకటరావు(47) హఠాన్మరణం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. దావాల వెంకటరావు గురువారం తెనాలిలో తన రెండో కుమార్తె వివాహాన్ని జరిపించారు. కొత్త అల్లుడు, కుమార్తె వస్తున్నారని మురిసిపోతున్న ఆ తండ్రి గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో ఆయన శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన పేరిచర్ల ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి గుంటూరుకు తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే ఆయన మృతిచెందారు.

**■ పంచాయతీలో రికార్డుల తనిఖీ**

**దుగ్గిరాల:** పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు తమ రికార్డులు, పీఆర్ యాప్‌లో సర్వే వివరాలు నమోదు, ఇంటి పన్నుపై ప్రజలకు అవగాహన కల్పించి ఆశించిన స్థాయిలో పన్ను వసూలు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో కె.జె.నెహ్రూ పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. శుక్రవారం దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో పంచాయతీ సిబ్బందికి సమీక్షా నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

**■ అనాథలను ఆదరించడం అభినందనీయం**

**మంగళగిరి టౌన్:** ఆదరణ లేని బాలబాలికలను ఆదరించడం అభినందనీయమని మంగళగిరి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వేమూరి బాలకృష్ణ శరణాలయం సభ్యులను కొనియాడారు. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం షైన్ ఆనంద శరణాలయం వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. శరణాలయ చైర్మన్ నాయక్ గత కొన్నేళ్లుగా శరణాలయాన్ని నడుపుతూ బాలబాలికలకు మంచి విద్యను అందించడం గొప్ప విషయమని బాలకృష్ణ అన్నారు. కార్యక్రమంలో నన్నపనేని నాగేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, మన్నెం రమేష్, శరణాలయ నిర్వాహకురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### 6,688 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

మహారాణిపేట: రాష్ట్రంలో ఇప్పటి వరకు 6,688 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని, సుమారు 7 లక్షల అభ్యంతరాలు వచ్చాయని రాష్ట్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల విభాగం డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు 2లక్షల అభ్యంతరాలను పరిష్కరించామని, మిగిలిన 2లక్షల అభ్యంతరాలను డిసెంబర్ 31లోగా పరిష్కరిస్తామన్నారు. 4,400 ఫిర్యాదులు కోర్టుల పరిధిలో ఉన్నాయని తెలిపారు. 2027 డిసెంబర్ 31 నాటికి అన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తి చేస్తామని చెప్పారు.

### పొదుపు సంఘాల మహిళలకు రూ. 32,322 కోట్ల బ్యాంకు రుణాలు

సాక్షి, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల ద్వారా రూ. 32,322 కోట్లు రుణాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికి రూ.16,846 కోట్లు రుణాలు అందజేసినట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విజయవాడలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కార్యాలయంలో శాఖాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

### సీఎస్‌గా విజయానంద్‌కు పొడిగింపు!

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కే విజయానంద్‌ను మరో మూడు నెలలు కొనసాగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీనిపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నెలాఖరుతో సీఎస్ విజయానంద్ సర్వీసు ముగియనుండటంతో మరో మూడు నెలలు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఆ తర్వాత జీ సాయిప్రసాద్‌ను సీఎస్‌గా చేసి ఆయన పదవీ కాలాన్ని కూడా పెంచుతామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

### గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య

కావ్య (ఫైల్)

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పొడపాటి కావ్య (15) తన తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తాడువాయి పంచాయతీ జొన్నవారిగూడేనికి చెందిన గంగాధరరావు, ఉషారాణి దంపతుల పెద్ద కుమార్తె కావ్య జంగారెడ్డిగూడెం గురుకుల పాఠశాలలో హాస్టల్‌లో ఉంటూ టెన్త్ చదువుతోంది. తోటి విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం భోజనానికి వెళ్లినా ఆమె క్లాస్‌రూమ్‌లోనే ఉండిపోయింది. మెస్ ఇన్‌చార్జి ఆమెను తీసుకురావాలంటూ కావ్య స్నేహితురాలిని పంపించారు. వెళ్లి చూడగా కావ్య ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. భయంతో కేకలు వేయగా, ప్రిన్సిపాల్ టి.గంగాభవాని, సిబ్బంది వచ్చి కావ్యను కిందికి దించి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 'నాన్న.. అమ్మను బాగా చూసుకో.. ఏమీ అనొద్దు.. ఐ మిస్ యూ.. మావయ్య.. సారీ.. ఐ మిస్ యూ.. మా ప్రిన్సిపాల్, హౌస్ టీచర్ చాలా మంచివాళ్లు.. ఏమీ అనొద్దు..' అని తండ్రిని ఉద్దేశించి కావ్య సూసైడ్ నోట్ రాసినట్లు తెలిసింది. పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### స్కిల్ గేమ్స్ అనుకొని ప్రమోట్ చేశాం!

- బెట్టింగ్ యాప్స్ కేసుపై హీరోయిన్ నిధి అగర్వాల్, యాంకర్ శ్రీముఖి, అమృతా చౌదరి





సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేసిన కేసులో హీరోయిన్ నిధి అగర్వాల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అమృత చౌదరి, యాంకర్ శ్రీముఖి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సీఐడీ సిట్ విచారణకు హాజరయ్యారు. జీత్ విన్ అనే బెట్టింగ్ సైట్‌ను నిధి అగర్వాల్, ఎమ్88 అనే యాప్‌ను శ్రీముఖి, యోలో 247, ఫెయిర్‌ప్లే యాప్‌లను అమృత చౌదరి ప్రమోట్ చేసినట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు. దర్యాప్తులో భాగంగా శ్రీముఖిని సుమారు గంటన్నరపాటు, నిధి అగర్వాల్, అమృత చౌదరిని సాయంత్రం 5:30 గంటల వరకు విచారించి వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. స్కిల్ బేస్డ్ గేమింగ్ యాప్స్ అనే భావనతోనే వాటిని ప్రమోట్ చేసినట్లు నిధి అగర్వాల్, అమృత చౌదరి, శ్రీముఖి వెల్లడించినట్లు సమాచారం. బెట్టింగ్ యాప్‌లతో కుదుర్చుకున్న ఒప్పందాలు సహా ఆయా సంస్థల నుంచి తీసుకున్న పారితోషకాలు, బ్యాంకు ఖాతాల వివరాలను అధికారులు పరిశీలించారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్లకు సంబంధించి నమోదైన కేసుల్లో పలువురు నటులు, యాంకర్లు, యూట్యూబర్లు సహా మొత్తం 29 మందిని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

# ప్రైవేటుకే 'అసైన్డ్'

## పేదల నుంచి లాక్కుని ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టేలా చట్ట సవరణకు రంగం సిద్ధం

- ఆర్డినెన్స్ జారీకి కసరత్తు.. ఇటీవలే కేబినెట్‌లో ఆమోదం
- ఈ ఫైలును అత్యవసరంగా కేబినెట్ ముందుకు సర్క్యులేట్ చేయించిన సీఎం
- అసైన్డ్ భూములకు హక్కులిచ్చి ఫ్రీ హోల్డ్ చేసిన వైఎస్ జగన్
- వాటిని ఎడాపెడా ప్రైవేటుకు కట్టబెట్టేందుకు చంద్రబాబు సర్కారు పన్నాగం
- ఇందులో భాగంగా ఇప్పటికే ఫ్రీ హోల్డ్ చేసిన అసైన్డ్ భూములను వివాదంగా మార్చిన వైనం
- 16 నెలలుగా వాటిని 22–ఏ జాబితాలో పెట్టిన బాబు సర్కారు
- ఇప్పుడు ఏకంగా వాటిని ఇష్టం వచ్చినట్లు ప్రైవేటుకు ఇచ్చేందుకు బరితెగింపు
- ఇప్పటికే కారు చౌకగా పలు ప్రైవేట్ కంపెనీలకు విలువైన భూములు
- తాజాగా పేదలకు మంచి చేయకపోగా వారి భూములకే ఎసరు

సాక్షి, అమరావతి : చంద్రబాబు సర్కారు ప్రైవేటీకరణ దాహం ఎంతకీ తీరడం లేదు. విలువైన ప్రభుత్వ భూములు, మెడికల్ కాలేజీలు, టూరిజం శాఖ హరిత రిసార్టులను ఇష్టానుసారంగా ప్రైవేటు కంపెనీలు, వ్యక్తులకు కట్టబెడుతున్న ప్రభుత్వ పెద్దలు.. తాజాగా గత ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములపై పడ్డారు. ఆ భూములను వెనక్కు తీసుకుని ప్రైవేటు కంపెనీలకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ అసైన్డ్ భూములపై రైతులకు హక్కులిచ్చి, ఫ్రీ హోల్డ్ చేసి.. వారి జీవితాల్లో వెలుగులు నింపారు. కానీ 2024 జూన్‌లో చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక వాటిని మళ్లీ 22–ఏ జాబితాలో పెట్టి వారి నడ్డి విరిచారు. ఇప్పుడు ఏకంగా ఆ భూములను ప్రైవేటుకు ఇచ్చేందుకు అసైన్డ్ భూముల చట్టాన్ని సవరణ చేయనున్నారు. పేదలకు మేలు చేయకపోగా, వారి హక్కులను కాలరాస్తూ వారి నోటి దగ్గర కూడు లాక్కునేలా అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుని, ప్రైవేటు కంపెనీలకు ఇచ్చేందుకు 1977 అసైన్డ్ భూముల చట్టాన్ని సవరిస్తూ ఈ నెల 10వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

### గంటల వ్యవధిలో సర్క్యులేట్.. ఆమోదం

తాజాగా టీడీపీ ప్రభుత్వ పెద్దలు పేదల అసైన్డ్ భూములను సైతం కంపెనీల పరం చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటుండటం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. మెడికల్ కాలేజీలు, టూరిజం శాఖ హరిత రిసార్టులు, పలుచోట్ల విలువైన భూములను ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలకు యథేచ్ఛగా పంపిణీ చేస్తున్న చంద్రబాబు సర్కారు.. ఇప్పుడు పేదల భూములను లాక్కునేందుకు మరింతగా బరి తెగించింది. ఈ చట్ట సవరణకు సంబంధించిన ముసాయిదా బిల్లుకు గత నెల 3వ తేదీన మంత్రివర్గ సమావేశంలో ఆమోద ముద్ర వేశారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు లేకపోవడంతో ఆర్డినెన్స్ జారీకి ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రివర్గ సమావేశంలో ఈ ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపేందుకు వీలుగా సీఎం చంద్రబాబు అత్యవసరంగా ఈ ముసాయిదా బిల్లును సర్క్యులేట్ చేయించారు. ఆ తర్వాత వెంటనే దాన్ని ఆమోదించేశారు. ఇదంతా గంటల వ్యవధిలోనే జరిగిపోయింది. త్వరలో ఇందుకు సంబంధించిన ఆర్డినెన్స్ జారీ అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

### ఇళ్లు కట్టుకునేందుకు ఇచ్చిన భూములు సైతం..

1977 అసైన్డ్ భూముల చట్టం ప్రకారం పేదలకు అసైన్ చేసిన భూములను అమ్మడం గానీ, లీజుకివ్వడం కానీ చేయకూడదు. ప్రజోపయోగ అవసరాలకు సైతం ఈ భూములను తీసుకోవడం కష్టమే. కానీ ఇప్పుడు జారీ చేయబోయే ఆర్డినెన్స్ ద్వారా ఈ భూములను ప్రభుత్వం వెనక్కు తీసుకునే వెసులుబాటు లభిస్తుంది. ఇళ్లు కట్టుకోవడానికి ఇచ్చిన భూములను సైతం అసైన్డ్ పరిధి నుంచి మినహాయించవచ్చు. ప్రభుత్వం నామమాత్రంగా డబ్బులు కట్టించుకుని ఇచ్చిన భూములు, హౌసింగ్ బోర్డు లాంటి వాటి ద్వారా ఇచ్చిన భూములను అసైన్డ్ చట్టం పరిధి నుంచి తొలగించే అవకాశం ఉంటుంది. అసైన్డ్ భూములను ఎవరికీ బదలాయించకూడదనే నిబంధనను ఉల్లంఘిస్తే గతంలో తిరిగి వెనక్కు తీసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు చట్ట సవరణ ద్వారా వెనక్కు తీసుకోవడంతోపాటు ఆ భూములను ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం వినియోగించుకునే ఏర్పాట్లు చేసుకున్నారు. అసైన్డ్ రైతులు తమ భూములను అమ్ముకోవడంపై నిషేధం ఉండగా, ప్రభుత్వం అనుమతిస్తే ఆ అమ్మకం చట్టబద్ధమయ్యేలా మార్పు చేశారు. ఇందుకోసం అసైన్డ్ చట్టంలోని సెక్షన్ 2(6), సెక్షన్ 3 (2), సెక్షన్ 3 (2ఎ)ని సవరించారు. ఈ సవరణల ద్వారా తమకు అవసరమైన చోట అసైన్డ్ భూములను వెనక్కు తీసుకుని, ప్రజోపయోగం పేరుతో ప్రైవేటు కంపెనీలకు ఇచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైంది. గ్రీన్ ఎనర్జీ, ప్రైవేటు పరిశ్రమలు, ప్రైవేటు పార్కులకు 99 సంవత్సరాల లీజుకు అసైన్డ్ భూములు ఇచ్చేందుకే సీఎం చంద్రబాబు అత్యవసరంగా ఈ ఆర్డినెన్స్ తెచ్చారని స్పష్టమవుతోంది. రోజుల వ్యవధిలోనే పలుచోట్ల అసైన్డ్ భూములను ఈ పరిశ్రమలకు ఇచ్చేందుకు ఇప్పటికే ఫైళ్లు వాయు వేగంతో నడుస్తున్నాయి.

### జగన్ హక్కులిస్తే.. బాబు లాక్కుంటున్నారు

భూమి లేని నిరుపేదలు బతకడం కోసం ప్రభుత్వాలు వారికి భూములు అసైన్ చేశాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో 35 లక్షల ఎకరాల భూములను వివిధ ప్రభుత్వాలు పేదలకు కేటాయించాయి. అయితే ఆ భూములను సాగు చేసుకుని జీవనోపాధి పొందడం మినహా అమ్మడానికి వారికి హక్కులు లేవు. దీంతో తమకు వాటిపై హక్కులు కల్పించాలని ఎన్నో దశాబ్దాలుగా పేదలు ప్రభుత్వాలను కోరుతూ వస్తున్నారు. అయితే ఏ ప్రభుత్వం వారి అభ్యర్థనను మన్నించలేదు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు పేద దళిత రైతులకు మేలు చేసేందుకు అసైన్డ్ భూములపై సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. విస్తృత అధ్యయనం తర్వాత ప్రజా ప్రతినిధుల కమిటీ సిఫారసుల ఆధారంగా.. అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాత ఆ భూములను సంబంధిత రైతులు, లేదా వారి వారసులు అమ్ముకునేందుకు 1977 అసైన్డ్ భూముల చట్టానికి సవరణ చేశారు. తద్వారా రాష్ట్రంలో అసైన్డ్ భూముల వివాదాలకు చరమగీతం పాడారు. అసైన్డ్ రైతుల చిరకాల కోరికను నెరవేర్చి, వారిని అందరి మాదిరిగా సగర్వంగా నిలబెట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఏకంగా 9.35 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పించారు. రాష్ట్రంలో అసైన్డ్ భూములకు సంబంధించి జరిగిన తొలి సంస్కరణ ఇదే కావడం గమనార్హం.

### తప్పుదారి పట్టించి.. పేదల నోట్లో మట్టి

చంద్రబాబు అధికారంలోకి వచ్చాక దీన్ని తప్పుదారి పట్టించి.. ఫ్రీ హోల్డ్ భూముల్లో అక్రమాలు జరిగాయని 16 నెలలుగా వాటిని 22ఏ జాబితాలో పెట్టారు. అనేక సంవత్సరాల తర్వాత తమ భూములపై తమకు హక్కులు వచ్చాయనే ఆనందం పేద రైతులకు లేకుండా చేశారు. ఆ భూముల అక్రమాలు తేలుస్తామంటూ మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి సమీక్షలు, సమావేశాలు, వెరిఫికేషన్ల పేరుతో లక్షలాది మంది రైతులను త్రిశంకు స్వర్గంలోకి నెట్టారు. తమ భూములను 22–ఏ జాబితా నుంచి తీసి వేయాలని వారు వేడుకుంటున్నా, పట్టించుకోకుండా ఇప్పుడు ఏకంగా వాటిని లాక్కునేందుకు గుట్టుచప్పుడు కాకుండా అసైన్డ్ చట్టాన్ని సవరించడానికి సిద్ధమయ్యారు. దీన్నిబట్టి ఇన్నాళ్లూ ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో చంద్రబాబు సర్కారు ఆడిన నాటకం అంతా ఆ భూములను లాక్కునేందుకేనన్న విషయం స్పష్టమవుతోంది.

# ఆలస్యమైనా న్యాయం గెలుస్తుంది

**అక్రమ కేసులన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది**

తిరుపతి రూరల్/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఆలస్యంగానైనా న్యాయం గెలుస్తుందని, న్యాయస్థానాలపై నమ్మకం ఉందని.. చంద్రబాబు సర్కార్ తనపై మోపిన కేసులన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. తన జీవితంలో మద్యం అనే మాటకు చోటు లేకున్నా, అన్యాయంగా తప్పుడు కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం అక్రమ కేసులో నిందితుల రిమాండ్ ముగియడంతో శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. వారికి కోర్టు వచ్చే నెల 5వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా తనను ఈ కేసులో అక్రమంగా ఇరికించడంతో 157 రోజులుగా జైలు శిక్ష అనుభవిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. తన గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం నిందితులను తిరిగి జైలుకు తరలిస్తున్న సమయంలో కోర్టు ఆవరణలో ఆ వివరాలన్నింటినీ చెవిరెడ్డి ఓ లేఖ ద్వారా మీడియాకు విడుదల చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

**రూ.8 కోట్ల ఆస్తిని రూ.60 కోట్లు అంటున్నారు**

- ఒక మారుమూల పల్లెలో, 100 శాతం ప్రభుత్వ మాస్టర్ ప్లాన్ రోడ్డులో పోయిన, ఎందుకూ పనికిరాని రెండు ఎకరాల స్థలం విలువ రూ.35 కోట్లు అని రాసి, జప్తు చేయమంటున్నారు. మా రియల్ ఎస్టేట్ వృత్తిలో భాగంగా ఎప్పుడో కొని అమ్మేసిన ప్లాట్లను కూడా జప్తు చేయమంటున్నారు. మా మొత్తం ఆస్తుల ప్రభుత్వ విలువ రూ. 8 కోట్లు అయితే, వాటి మార్కెట్ విలువ రూ.60 కోట్లు అంటున్నారు. ఆ రూ.8 కోట్లు మాకు ఇస్తే, మనస్ఫూర్తిగా ఆ మొత్తం ఆస్తి ఇచ్చేస్తాం.
- ఉన్నత చదువులు చదివి పారదర్శకంగా ఉండాల్సిన ఉన్నతాధికారులు అధికార పార్టీ వారిని సంతృప్తి పరచడానికి ప్రతిపక్ష పార్టీలో యాక్టివ్‌గా ఉన్న నాలాంటి వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం బాధాకరం. 'సిట్' పరిశీలనలో మా వ్యాపారాలకు, మా ఆస్తులకు లిక్కర్‌తో సంబంధం లేదని తేలిన తర్వాత కూడా, అవాస్తవాలతో మా కుటుంబం మొత్తంపై బురద చల్లడం అన్యాయం.
- అబద్ధపు రాతలు, అసత్యపు ప్రచారాలతో మా కుటుంబంపై బురద చల్లడం అన్యాయం. ఈ ప్రభుత్వం ఎంత కాలం నన్ను జైల్లో పెట్టి, బాధ పెట్టాలని అనుకున్నా అంత కాలం జైల్లో ఉండే ధైర్యం, శక్తి నాకు ఆ భగవంతుడు ఇచ్చాడు. అయితే అందులోని వాస్తవాలు బయటకు చెప్పి, శిక్ష అనుభవించాలన్నదే నా సంకల్పం. ప్రభుత్వం చెబుతున్న అవాస్తవాలను 100 శాతం ప్రచురిస్తున్న మీడియా.. మేము చెబుతున్న వాస్తవాలకు కూడా అదే స్థాయి ప్రాధాన్యత ఇవ్వాలన్నది మా విన్నపం. ఆలస్యంగానైనా న్యాయం గెలుస్తుందన్నదే మా నమ్మకం.

### లిక్కర్ వ్యాపారం చేయలేదు.. చేయబోము

- బతకడానికి మూడు దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నా. నాకు తెలిసిందల్లా రికార్డులు పక్కాగా ఉన్న భూములను కొనడం, అమ్మడం మాత్రమే. అందులో కూడా నీతిగానే క్రయ, విక్రయాలు సాగించాం తప్ప ఎవ్వరినీ మోసం చేయలేదు. ఎవరికీ అన్యాయం చేయలేదు. అదే వ్యాపారం ఇప్పుడు నా పిల్లలు కొనసాగిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఎంతో కొంత సంపాదిస్తే దానిని లిక్కర్ వ్యాపారంతో సంపాదించామని, రూ.కోట్లు కూడబెట్టుకున్నామని కట్టుకథలు అల్లడం.. ఎవ్వరికి నచ్చినట్టు వారు పత్రికల్లో పతాక శీర్షికల్లో ప్రచురించడం మనసుకు బాధ కలిగిస్తోంది.
- భగవంతుని మీద, భగవద్గీత మీద ప్రమాణం చేసి చెబుతున్నా.. నా కుటుంబంలో తండ్రిని, తమ్ముడిని మా నుంచి దూరం చేసిన లిక్కర్ జోలికి జీవితంలో వెళ్లనని మా అమ్మకు మాట ఇచ్చా. ఎవరు ఎన్ని చెప్పినా లిక్కర్ ముట్టలేదు.. లిక్కర్ వ్యాపారం చేయలేదు.. లిక్కర్ వల్ల వచ్చే ఆదాయం పొందలేదు.. ఏదైతే నా జీవితంలోకి రాకూడదని భావించానో అదే లిక్కర్ కేసులో అక్రమంగా ఇరికించి అన్యాయంగా హింసిస్తున్నారు.
- 2019–2024 మధ్య ఐదేళ్లలో రూ.60 కోట్ల ఆస్తులు లిక్కర్ ఆదాయంతో సంపాదించామని, వాటిని జప్తు చేయాలంటున్నారు. ఇందులో ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే మా తాతల కాలం నుంచి (100 ఏళ్లకు పైగా) ఐదు తరాలుగా వారసత్వం కింద వస్తున్న తుమ్మలగుంటలోని మా ఇళ్లను కూడా జప్తు చేస్తున్నట్టు చెబుతున్నారంటే.. ఎవరిని అడగాలి.. ఏమనుకోవాలి? ఇదంతా ఎవరి కళ్లలో ఆనందం కోసం చేస్తున్నారో తెలియడం లేదు.

# రెడ్‌బుక్ రాజ్యాంగం.. సీఐపై క్రమశిక్షణ చర్యలు

- మంత్రి అండతో రెచ్చిపోయిన సీఐ ఇస్మాయిల్
- క్రమశిక్షణ చర్యలకు ఆదేశించిన జిల్లా పోలీస్ కంప్లైంట్ అథారిటీ

సాక్షి, నంద్యాల: కూటమి రెడ్‌బుక్ రాజ్యాంగానికి పోలీసులు బలవుతున్నారు. అక్రమ కేసులు బనాయించి రౌడీషీట్ ఓపెన్ చేసిన ఓ సీఐను జిల్లా పోలీస్ కంప్లైంట్ అథారిటీ తీవ్రంగా మందలించింది. దీనికి సంబంధించిన వివరాలివీ.. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గన్ని కరీం తన స్నేహితుడు, నంద్యాలలోని అలీనగర్‌కు చెందిన చికెన్ షాప్ నిర్వాహకుడు మెహతార్ జాహీద్‌కు గతేడాది రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చారు. డబ్బులు తిరిగివ్వాలని అడగడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ దాడిపై గతేడాది డిసెంబర్‌లో కరీం రెండో పట్టణ సీఐగా పనిచేస్తున్న ఇస్మాయిల్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేదు. మరోవైపు జాహీద్ మంత్రి అనుచరులను ఆశ్రయించడంతో టీడీపీ కార్యాలయం నుంచి సీఐకి సిఫారసు వెళ్లింది. దీంతో సీఐ ఇస్మాయిల్ ఆగమేఘాల మీద కరీంపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేశారు. బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి ఎదుట కరీంను హాజరుపరచగా సెక్షన్ల చూసిన జడ్జి, కరీంకు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించాలని ఆదేశించారు. దీంతో చేసేదేమీ లేక కరీంను వదిలేశారు. దీనిపై మంత్రి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనికి రెచ్చిపోయిన సీఐ ఇస్మాయిల్, సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు షేర్ చేశారనే కారణంతో పాటు అనుమతి లేకుండా ధర్నాలు చేశారనే అభియోగాలు నమోదుచేసి కరీంపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. దీంతో తనపై అక్రమంగా తప్పుడు కేసులు నమోదు చేశారని సీఐ ఇస్మాయిల్‌పై చర్యలు తీసుకోవాలని జనవరిలో జిల్లా పోలీస్ కంప్లైంట్ అథారిటీని కరీం ఆశ్రయించారు. నలుగురు జడ్జీలతో కూడిన ధర్మాసనం కేసును విచారించింది. అనంతరం సీఐ ఇస్మాయిల్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ధర్మాసనం చైర్మన్ వెంకట రమణారెడ్డి ఈనెల 14న తీర్పు ఇచ్చారు. ఇస్మాయిల్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు రాష్ట్ర హోంశాఖ కార్యదర్శికి ఆదేశాలిచ్చారు.

# చంద్రబాబుకు నోటీసులు ఇచ్చిన సీఐ డిస్మిస్

**మానసిక వేదనకు గురిచేశారంటూ సీఎంకు నోటీసులు ఇచ్చిన శంకరయ్య**

సాక్షి ప్రతినిధి కడప: తమను ఎవ్వరూ ప్రశ్నించకూడదంటూ నిరంకుశంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు ప్రభుత్వ దమననీతికి మరో నిదర్శనమిది. తనపై అబద్ధాలు ప్రచారం చేసి మానసిక వేదనకు గురిచేసినందుకు రూ. 1.45 కోట్లు చెల్లించాలని సీఎం చంద్రబాబుకు నోటీసులు ఇచ్చిన సీఐ జె.శంకరయ్యను బాబు సర్కార్ శుక్రవారం ఉద్యోగం నుంచి తొలగించింది. కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశాల ప్రకారం ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు.

**సీఎం అబద్ధాల ప్రచారం నిలదీత..**

ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్టగా నిలిచిన ఈ వ్యవహారం వివరాల్లోకి వెళితే 2019 మార్చి 15వ తేదీన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురయ్యారు. అప్పట్లో పులివెందులలో సీఐగా పనిచేసిన శంకరయ్య నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలతో పోలీసు అధికారులు ఇటీవల సస్పెండ్ చేశారు. తదనంతర క్రమంలో మళ్లీ విధుల్లో చేరిన శంకరయ్య అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయంలో పనిచేస్తూ కడప వీఆర్‌కు వచ్చారు. అయితే వైఎస్ వివేకా హత్యకు సంబంధించి అనుసరించిన వైఖరి ఫలితంగానే సీఐగా ఉన్న శంకరయ్యకు డీఎస్పీగా పదోన్నతి లభించిందని సీఎం చంద్రబాబు పదేపదే అసెంబ్లీతోపాటు పార్టీ నేతల సమావేశాల్లోనూ ప్రస్తావించారు. చంద్రబాబు మాటలను శంకరయ్య తీవ్ర అవమానంగా భావించారు. తన వ్యక్తిత్వ హననంపై ఆవేదన చెందారు. పదేపదే తన పేరు ప్రస్తావించడంపై శంకరయ్యతో పాటు ఆయన కుటుంబం మొత్తం మానసిక వేదనకు గురయ్యింది. ఈ నేపథ్యంలో ఉద్యోగం కంటే విలువలే ముఖ్యమని భావించిన శంకరయ్య... తనకు తీవ్ర పరువు నష్టం జరిగిందని తన న్యాయవాది ద్వారా సీఎం చంద్రబాబుకు నోటీసులు పంపారు. తనకు పదోన్నతి కల్పించకపోయినా కల్పించినట్లు పదేపదే అబద్ధాలు చెప్పడాన్ని నోటీసుల్లో ప్రశ్నించారు. తనను మానసిక వేదనకు గురి చేసినందుకు రూ. 1.45 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు.

**ప్రశ్నిస్తే.. శిక్ష!**

తనకు పదవులు దక్కకపోయినా దక్కినట్లు సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రస్తావించిన వైనాన్ని ఎండగట్టిన శంకరయ్యను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంచలనం సృష్టించింది. శంకరయ్య వైఎస్సార్ జిల్లాలోని వేంపల్లెతోపాటు పలు ప్రాంతాల్లో ఎస్ఐగా పనిచేశారు. ఆ తర్వాత సీఐగా కర్నూలు జిల్లాతోపాటు వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల, కడప వీఆర్, అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయంలో పనిచేశారు. అంతేకాకుండా విధినిర్వహణలో రాజీలేకుండా నిజాయితీగా పనిచేసే వ్యక్తిగా పోలీసుశాఖలో ఆయనకు గుర్తింపు ఉంది.

# డిప్యుటేషన్ గుప్పెట్లో భూపరిపాలన

- సీసీఎల్ఏలో బయట ఉద్యోగుల హవా
- 70 శాతం మంది డిప్యుటేషన్‌పై వచ్చిన వారే
- కీలకమైన సీఎంఆర్‌వో విభాగం అంతా వాళ్లే
- వెబ్‌ల్యాండ్‌లో అవకతవకలకు ఇక్కడి నుంచే బీజం
- ఆరోపణలపై ఒక కాంట్రాక్టు ఉద్యోగిని వెనక్కిపంపిన వైనం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భూముల వ్యవహారాలు అస్తవ్యస్థంగా మారడానికి భూపరిపాలన ప్రధాన కార్యాలయం (సీసీఎల్ఏ) మొత్తం డిప్యుటేషన్ ఉద్యోగులతో నిండిపోవడమే కారణమనే ఆందోళన వ్యక్తమవుతోంది. మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల్లో 70 శాతం మంది వివిధ జిల్లాల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన వారే ఉన్నారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కనుసన్నల్లో డిప్యుటేషన్ ఉద్యోగులు కీలకస్థానాల్లో ఉండటంతో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఉద్యోగులు అప్రాధాన్య స్థానాలకు పరిమితమయ్యారు. రాష్ట్రంలోని భూముల రికార్డులను కంప్యూటరీకరించి, నిర్వహించే అత్యంత కీలకమైన బాధ్యత సీసీఎల్ఏ కార్యాలయంలో కంప్యూటరైజేషన్ ఆఫ్ ఎంఆర్‌వో ఆఫీసెస్ (సీఎంఆర్‌వో) విభాగానిది. రాష్ట్రస్థాయిలో వెబ్‌ల్యాండ్ నియంత్రణ అంతా ఈ విభాగం చేతుల్లోనే ఉంటుంది. అలాంటి కీలక విభాగంలో రెవెన్యూ చట్టాలు, వ్యవహారాలు తెలిసిన ఒక్క డైరెక్ట్ ఉద్యోగి లేరు. ముగ్గురు సూపరింటెండెంట్లు, ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లు సహా సుమారు 12 మంది డైరెక్ట్ రిక్రూటెడ్ ఉద్యోగులు పనిచేయాల్సి ఉన్న సీఎంఆర్‌వోలో చాలాకాలంగా ఒక్కరంటే ఒక్కరు కూడా వారు లేకపోవడంతో ఆ విభాగం సీసీఎల్ఏ నియంత్రణలోనే లేదనే చర్చలు నడుస్తున్నాయి. జిల్లాల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చినవారు ఏళ్ల తరబడి అక్కడ పనిచేస్తూ వెబ్‌ల్యాండ్‌ను వారి చేతుల్లో ఉంచుకున్నారనే విమర్శలున్నాయి. కడప నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఒక ఉద్యోగి ఆన్ డ్యూటీగా అక్కడ ఏళ్ల తరబడి కీలకమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వెబ్‌ల్యాండ్‌లో అక్రమాల ఆరోపణలతో ఇటీవలే ఎలక్ట్రానిక్ డివిజన్ మేనేజర్ (కంప్యూటర్ ఆపరేటర్)గా పనిచేసే ఒక కాంట్రాక్టు ఉద్యోగిని తిరిగి కృష్ణాజిల్లా కలెక్టరేట్‌కు పంపించేశారు. నిజానికి సీసీఎల్ఏలో ఆ పోస్టు లేకపోయినా అదే పేరుతో అతను పనిచేస్తూ వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మద్దతుతో డిప్యుటేషన్ ఉద్యోగులు ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుని అన్ని విభాగాల్లో కీలక బాధ్యతల్లో పనిచేస్తున్నారు. వారి ద్వారానే జిల్లాలకు సంబంధించిన భూముల వ్యవహారాలతోపాటు డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు ఇతర రెవెన్యూ ఉద్యోగుల సర్వీస్ వ్యవహారాలన్నీ సీసీఎల్ఏలో నడుస్తున్నాయి. వెబ్‌ల్యాండ్‌లో అక్రమాలకు బీజం పడింది డిప్యుటేషన్ ఉద్యోగుల వల్లేనని చెబుతారు. వాస్తవానికి డిప్యుటేషన్‌పై సీసీఎల్ఏకి వచ్చిన ఉద్యోగులకు అసిస్టెన్సీ పని మాత్రమే అప్పగించాలని, కీలకమైన బాధ్యతలు అప్పగించకూడదని గతంలో ఒక సర్క్యులర్ ఇచ్చినా అది అమలు కావడంలేదు. కొద్దినెలల కిందట సీఎంఆర్‌వో విభాగానికి సూపరింటెండెంట్‌గా ఒక మహిళా రెగ్యులర్ ఉద్యోగినిని వేసినా.. ఆమెను రెండునెలలు కూడా అక్కడ పనిచేయనీయలేదు. ఆ రెండునెలలు కూడా ఫైళ్లు ఆమె దగ్గరకు వెళ్లకుండానే డిప్యుటేషన్ ఉద్యోగులు మేనేజ్ చేశారు. డిప్యుటేషన్ ఉద్యోగుల చెరనుంచి బయటపడితేనే సీసీఎల్ఏ కార్యాలయం బాగుపడుతుందనే చర్చలు వినవస్తున్నాయి.

# నిబంధనల పేరుతో ప్రభుత్వ డాక్టర్ల కాలయాపన

**నెల్లూరి శేషగిరమ్మ కేసులో హైకోర్టు వ్యాఖ్యలు**

సాక్షి, అమరావతి: ప్రభుత్వ డాక్టర్లు నిబంధనల పేరుతో కాలయాపన చేస్తున్నారని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. పబ్లిక్ సర్వెంట్లుగా నిర్వర్తించాల్సిన విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని పేర్కొంది. వివరాల్లోకి వెళితే రాయపూడి గ్రామానికి చెందిన 90 ఏళ్ల శేషగిరమ్మకు చెందిన భూమిని సీఆర్‌డీఏ భూసేకరణలో తీసుకోగా.. ఆమెకు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న మనుమరాలు శ్యామలకు జీవనోపాధి లేకుండా పోయింది. దీంతో ఇద్దరూ కారుణ్య మరణం కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిని విచారించిన న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ ప్రభుత్వ పథకం కింద ఆర్థిక సాయం అందించేందుకు శ్యామలకు ఎంత మేర మానసిక వైకల్యం ఉందో తేల్చాలని గతంలో వైద్య శాఖను ఆదేశించారు. శుక్రవారం విచారణలో శ్యామలకు 95 శాతం మానసిక వైకల్యం ఉందని సంబంధిత అధికారి నివేదించారు. అయితే, శారీరక వైకల్యం పరిస్థితి పరీక్షించలేదని చెప్పడంతో న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శ్యామల ఇంటికి నిపుణులను పంపి పూర్తి పరీక్షలు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు.తదుపరి విచారణను డిసెంబర్ 1కి వాయిదా వేశారు. కాగా, ఈ వ్యాజ్యంలో సీఆర్‌డీఏ తరఫు న్యాయవాది సింగమనేని ప్రణతి స్పందిస్తూ.. శేషగిరమ్మ, శ్యామల ప్రస్తుతం ఉంటున్న ఇల్లు, అక్కడి నిర్మాణాల విలువను అధికారులు రూ.6 లక్షలుగా అంచనా వేశారని, ఈ మొత్తానికి మరో రూ.6 లక్షలు కలిపి మొత్తం రూ.12 లక్షలు వారికి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. వారిద్దరిని అక్కడి నుంచి మరోచోటుకు తరలించిన పక్షంలో వారికి అక్కడ 5 సెంట్ల భూమిని కూడా ఇవ్వాలని కూడా నిర్ణయించామన్నారు. ఈ వ్యాజ్యంలో న్యాయమూర్తి గతంలో స్వయంగా తన కారు డ్రైవర్‌ను ఇచ్చి అడ్వకేట్ కమిషనర్‌ను బాధితుల ఇంటికి పంపి వారి వివరాలు తెలుసుకున్న సంగతి తెలిసిందే.

# ఉమెన్ పవర్
# ఏ.ఐ. కెరీర్

రిత్విక చౌదరి

**ఏ.ఐ. (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అంటేనే పవర్. ఆ పవర్‌కు ఉమెన్ పవర్ తోడైతే ఎలా ఉంటుంది? సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతుంది. ఏ.ఐలో సరికొత్త కోణాలు ఆవిష్కారం అవుతాయి. ఇందుకు సాక్ష్యం...**
**రిత్విక చౌదరి (అన్‌స్క్రిప్ట్), నిధి (నెమ ఏఐ),**
**అశ్వినీ అశోకన్ (మ్యాడ్ స్ట్రీట్ డెన్),**
**గీతా మంజునాథ్ (నిరామై హెల్త్ అనాలటిక్స్)....**

కాలేజీ రోజుల నుంచే ఏఐ పరిశోధనల్లో ఇష్టంగా తలమునకలయ్యేది రిత్విక చౌదరి. ఐఐటీ–ఖరగ్‌పూర్ స్టూడెంట్ అయిన రిత్వికాకు ఎంటర్‌ప్రెన్యూర్ కావాలనేది కల. కాలేజీ రోజుల్లో ఏ.ఐ.కి సంబంధించి రిసెర్చ్ వర్క్ చేస్తున్నప్పుడు వీడియో క్రియేషన్‌కు సంబంధించి ఇ–కామర్స్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను గ్రహించింది. ఇన్‌ఫ్లూయెన్సర్‌లు, సెలబ్రిటీలతో హైక్వాలిటీ వీడియోలను క్రియేట్ చేయడం ఖరీదైన ప్రక్రియ. అలాగే బాగా సమయం తీసుకునే వ్యవహారం. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'అన్‌స్క్రిప్ట్' అనే ఏఐ స్టార్టప్‌కు స్వీకారం చుట్టింది రిత్విక.

వ్యక్తిగతీకరించిన (పర్సనలైజ్డ్) సింథటిక్ వీడియోలను ఉపయోగించి తమ కస్టమర్‌లతో ఎంగేజ్ కావడానికి ఇ–కామర్స్ బ్రాండ్‌లకు 'అన్‌స్క్రిప్ట్' ఉపయోగపడుతుంది. బ్రాండ్స్‌కు డబ్బు, సమయం ఆదా అవుతుంది.

సెలబ్రిటీల నేతృత్వంలోని మార్కెటింగ్ వీడియోలను రూపొందించడానికి పేటెంట్‌తో కూడిన ఏఐ మోడల్స్‌ను నిర్మించింది అన్‌స్క్రిప్ట్ కంపెనీ ప్రారంభం నుంచి ఫండింగ్. పార్ట్‌నర్‌షిప్స్, టెక్, ప్రాడక్ట్స్... ఇలా రకరకాల విభాగాల బాధ్యతలను చూస్తోంది రిత్విక.

'నేను ఆలోచిస్తున్నదే కరెక్ట్ అని ఎప్పుడూ అనుకోకూడదు. మన నిర్ణయాలకు సంబంధించి ఇతరుల అభిప్రాయాలు తెలుసుకోవాలి. సరైన మార్గంలో నెట్‌వర్క్ చేయడం నేర్చుకోవాలి. ఎంటర్‌ప్రెన్యూర్‌గా నా ప్రయాణంలో నా ఆలోచనలు, నిర్ణయాలకు సంబంధించి స్నేహితులు, నిపుణుల సలహాలు, సూచనలు తీసుకున్నాను' అంటుంది రిత్విక చౌదరి.

## సాంకేతిక కళ!

అశ్వినీ అశోకన్

చెన్నైలోని విద్యావంతుల కుటుంబంలో పుట్టిన అశ్వినీ అశోకన్ డ్యాన్సర్ కావాలనుకునేది. అయితే ఆ కల ఫలించలేదు. విజువల్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసిన అశ్వినీకి సాంకేతిక ప్రపంచంలో కళ, సృజనాత్మక దారులను వెదుక్కునే అవకాశం వచ్చింది. కళతో సాంకేతికతను జోడీ కట్టించిన వినూత్న విధానం ఆమె భవిష్యత్ కెరీర్‌కు గట్టి పునాది వేసింది. అమెరికాలో ఇంటరాక్షన్ డిజైన్‌లో మాస్టర్స్ చేసిన అశ్విని ప్రాడక్ట్ డిజైన్, ప్రాడక్ట్ డెవలప్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన సాధించింది. దిగ్గజ సంస్థ 'ఇంటెల్' లో ఎనిమిది సంవత్సరాలు పనిచేసిన అశ్విని కొత్తగా ఏదైనా చేయాలనుకొని ఇండియాకు వచ్చేసింది. 'మ్యాడ్ స్ట్రీట్ డెన్'ను లాంచ్ చేసింది. క్లయింట్స్‌కు ఆర్టిషియల్–డ్రివెన్ సొల్యూషన్స్ అందించే రిటైల్ ఆటోమేషన్ ప్లాట్‌ఫామ్... మ్యాడ్ స్ట్రీట్ డెన్.

'రాబోయే కాలమంతా ఏ.ఐ. దే. ప్రజలు ఏదో ఒక రకంగా ఏ.ఐ.తో టచ్‌లో ఉంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఏ.ఐ. ప్లాట్‌ఫామ్‌ను నిర్మించాలనే ఆలోచనతో మ్యాడ్ స్ట్రీట్ డెన్ ప్రారంభించాం' అంటుంది అశ్విని.

కట్టింగ్–ఎడ్జ్ ఏఐ టెక్ ప్రాడక్ట్‌ల రూపకల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది మ్యాడ్ స్ట్రీట్ డెన్. వ్యూ.ఏఐ అనే వర్చువల్ ఏఐ–ఆధారిత ప్లాట్‌ఫామ్‌ను తొలిసారిగా ప్రారంభించింది.

'మ్యాడ్ స్ట్రీట్ డెన్'లో సగం మంది ఉద్యోగులు మహిళలే.

## సామాజిక శ్రేయస్సుకోసం ఏ.ఐ.

నిధి

సామాజిక శ్రేయస్సు కోసం కృత్రిమ మేధను ఉపయోగించుకోవాలనే లక్ష్యాన్ని తన స్టార్టప్ 'నెమ ఏఐ'తో నెరవేర్చుకుంది నిధి. న్యూరోడైవర్జెంట్ (మెదడు పనితీరు ఇతరుల కంటే భిన్నంగా ఉండడం) గుర్తించడానికి, దాని గురించి అవగాహన కలిగించడానికి, మార్గనిర్దేశం చేయడానికి 'నెమ ఏఐ' సాంకేతికత తోడ్పడుతుంది.

'నెమ ఏఐ' ద్వారా న్యూరోడైవర్జెంట్ వెనుక ఉన్న శాస్త్రాన్ని లోతుగా పరిశోధించడంలోని ప్రాముఖ్యతను వెలుగులోకి తెచ్చింది నిధి.

'విద్యార్థుల మెదడు నమూనాలను అర్థం చేసుకోవడం, వారికి సమర్థవంతమైన అభ్యాస మార్గాలను అందించడంపై పనిచేస్తున్నాం. ప్రతి విద్యార్థికి ప్రత్యేక విద్య అవసరాలను తీర్చడంపై దృష్టి పెట్టాం. బోధనకు సంబంధించి మా ప్లాట్‌ఫామ్ ఉపాధ్యాయులకు ప్రత్యేక సూచనలు ఇస్తుంది. మాన్యువల్ వర్క్‌ను తగ్గిస్తుంది. వారు మరింత సమర్థంగా పని చేసేలా ఉపకరిస్తుంది' అంటుంది దిల్లీకి చెందిన నిధి.

గత సంవత్సరం 'షార్క్ ట్యాంక్ ఇండియా' టెలివిజన్ షోలో పాల్గొంది. షార్క్స్(ఇన్వెస్టర్‌లు) నుంచి ఆమె స్టార్టప్‌కు మంచి స్పందన వచ్చింది. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డీ), డిస్లెక్సియా, అటెన్షన్–డెఫిసిట్/హైపర్ యాక్టివ్ డిజార్డర్ లాంటి వైకల్యాల గురించి తన స్టార్టప్ ద్వారా అవగాహన పెంచాలనేది నిధి లక్ష్యం.

## ఖర్చు తక్కువ... ఫలితం ఎక్కువ...

గీత మంజునాథ్

డీప్–టెక్ స్టార్టప్ 'నిరామై హెల్త్ అనాలటిక్స్'తో విజయపథంలో దూసుకుపోతోంది బెంగళూరుకు చెందిన గీత మంజునాథ్. వైద్య సాంకేతిక రంగంలో 'నిరామై' ప్రత్యేక గుర్తింపు సాధించింది. బయటి మార్కెట్‌తో పోల్చితే సగం కంటే తక్కువ ఖర్చుతో క్యాన్సర్‌ను గుర్తించడంలో సహాయపడే కొత్త క్యాన్సర్ స్క్రీనింగ్ సాఫ్ట్‌వేర్ థర్మాలిటిక్స్ రూపొందించింది.

'మా ఫలితాలు మామోగ్రఫీ కంటే 25 శాతం ఎక్కువ ప్రభావవంతంగా ఉన్నాయని వివిధ అధ్యయనాలు చెబుతున్నాయి' అంటుంది గీత.

తమ క్లౌడ్‌బేస్డ్ టెక్నాలజీని ఇతర వ్యాధులను గుర్తించడంలో కూడా ఉపయోగించవచ్చు. కొన్నిరకాల క్యాన్సర్‌లను గుర్తించడానికి ట్రయల్స్ మొదలయ్యాయి. గతంలో కోవిడ్–19 స్క్రీనింగ్ అప్లికేషన్‌ను కూడా కంపెనీ లాంచ్ చేసింది. ఆసియాతో పాటు యూరప్ దేశాల్లో తమ ప్రాడక్ట్‌ను విక్రయించడానికి కంపెనీకి అనుమతి లభించింది.

**● బ్యూటిప్**

## చర్మం నిగారింపు కోసం...

క్యారట్, టీ స్పూన్ నిమ్మరసం, చిన్న ముక్క బొప్పాయి, టొమాటో అన్నీ కలిపి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమం ముఖానికి పట్టించి వేళ్లతో వృత్తాకారంలో మసాజ్ చేయాలి.

**● ఇంటిప్స్**

- కాకరకాయ కూరలో సోంపు గింజలు, బెల్లం వేస్తే చేదు తగ్గుతుంది. కూర రుచిగా ఉంటుంది.
- అప్పడాల వంటివి వేయించే ముందు, కొద్దిసేపు ఎండలో ఉంచితే, నూనె ఎక్కువ లాగకుండా ఉంటుంది.
- దోసెల కోసం బియ్యం నానబెట్టే ముందు, బియ్యాన్ని కొద్దిసేపు వేయించి నానబెడితే దోసె కరకరలాడుతూ వస్తుంది.
- దంచిన పసుపు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే డబ్బాలో కొద్దిగాఎండు మిర్చి, రాళ్ల ఉప్పు వేసి ఉంచాలి.
- పకోడీ, జంతికలు వంటివి చేసేటప్పుడు పిండిలో కొద్దిగా పాలు పోసి కలిపిన తర్వాత ఉప్పు వేస్తే, వంటకాలు కరకరలాడుతూ వస్తాయి.

**వంటిల్లు**

**క్యాల్షియం, ఐరన్, ఇతర పోషకాలు సమృద్ధిగా ఉండే ఆకుకూరలు అన్ని వయసుల వారికీ మేలు చేస్తాయి. సంప్రదాయ వంటలుగానే కాదు పిల్లలు ఇష్టపడేలా ఆకుకూరలతోనూ వంటిల్లును టేస్టీగా సిద్ధం చేయండి..**

# ఆకలేసి ఆకేసి...

## పాలక్ హమ్మస్

**కావల్సినవి:** పాలకూర – కప్పు; కాబూలి చనా (తెల్లశనగలు) – 1/2 కప్పు (4–5 గంటలు సేపు తగినన్ని నీళ్లలో నానబెట్టాలి); నువ్వులు – 2 టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్లు; వెల్లుల్లి రెబ్బలు – 4; జీలకర్ర – టేబుల్ స్పూన్; ఆలివ్ ఆయిల్ – 2 టేబుల్ స్పూన్లు; నిమ్మరసం – టేబుల్ స్పూన్; ఉప్పు – తగినంత.

**తయారీ:** ● నానబెట్టిన తెల్ల శనగలను ఉడికించాలి ● శనగలు చల్లారాక మిక్సర్‌లో శనగలతో పాటు పై అన్ని పదార్థాలను వేసి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ● ఉప్పు సరిచూసుకుని, ఒక గిన్నెలోకి తీసుకొని, బ్రెడ్, చిప్స్, ఇతర వెజిటబుల్ సలాడ్‌తో సర్వ్ చేయాలి. సాండ్‌విచ్ స్ప్రెడ్‌గానూ పాలక్ హమ్మస్‌ను ఉపయోగించవచ్చు.

## గోంగూర అవకాడో రైస్

**కావల్సినవి:** అన్నం – 2 కప్పులు; గోంగూర (సన్నగా తరిగినది) – 2 కప్పులు; అవకాడో ముక్కలు – కప్పు; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీ స్పూన్; ఇంగువ – చిటికెడు; ఆవాలు – అర టీ స్పూన్; మెంతులు – పావు టీ స్పూన్; కరివేపాకు రెమ్మలు – 2; ఎండుమిర్చి – 4; పచ్చిమిర్చి – 2; శనగపప్పు – టేబుల్ స్పూన్; మినప పప్పు – టీ స్పూన్; ఉప్పు – తగినంత; పసుపు – పావు టీ స్పూన్; పల్లీలు – పావు కప్పు.

**తయారీ:** ● బాణలిలో నూనె వేడి చేసి, జీలకర్ర, ఆవాలు, మెంతులు, ఇంగువ, కరివేపాకు వేసి కలపాలి ● నిలువుగా కట్ చేసిన పచ్చిమిర్చి, శనగపప్పు, మినప్పప్పు వేసి, బంగారు రంగులోకి మారే వరకు వేయించాలి ● గోంగూర ఆకులను వేసి, పేస్ట్ అయ్యేవరకు కలపాలి. దీంట్లో ఉప్పు, పసుపు వేసి కలపాలి. ● అన్నంలో గోంగూర మిశ్రమం, అవకాడో ముక్కలను బాగా కలిపి, వడ్డించాలి.

## తోటకూర పెస్టో పాస్తా

**కావల్సినవి:** పాస్తా – ఉడికించి పక్కనుంచాలి; తోటకూర (సన్నగా తరిగిన ఆకులు) – కప్పు; ఆలివ్ ఆయిల్ – 2 టేబుల్ స్పూన్లు; బాదం, జీడిపప్పు పలుకులు – 2 టేబుల్ స్పూన్లు; వెల్లుల్లి – 4 రెబ్బలు; మిరియాల పొడి – రుచికి సరిపడా; ఉల్లిపాయ తరుగు – టేబుల్ స్పూన్; వెన్న లేదా బటర్ – టేబుల్ స్పూన్; చీజ్ – తగినంత; ఉప్పు – తగినంత.

**తయారీ:** ● మిక్సర్ జార్‌లో తోటకూర, జీడిపప్పు, బాదంపప్పు, వెల్లుల్లి, తురిమిన చీజ్, ఉప్పు, మిరియాల పొడి వేయాలి. ● ఆలివ్ ఆయిల్‌ను కొద్ది కొద్దిగా వేస్తూ, మెత్తని పేస్ట్ అయ్యే వరకు బ్లెండ్ చేయాలి ● ఉడికించిన పాస్తాలో తోటకూర పెస్టో సాస్ వేసి బాగా కలపాలి ● తరిగిన ఉల్లిపాయలు, వెన్న లేదా నూనెలో వేయించి పాస్తాలో కలపాలి ● పైన మిరియాల పొడి చల్లి వేడివేడిగా వడ్డించాలి.

**చర్చ**

# పిల్లలను ఏ వయసులో కంటే మంచిది?!

**ఏ వయసుకు ఆ ముచ్చట అంటుంటారు పెద్దలు. పెళ్లి, పిల్లల విషయంలోనే ఈ ప్రస్తావనను తీసుకు వస్తుంటారు. కానీ, మారిన రోజులు స్త్రీని తన కెరీర్ వైపు మొగ్గు చూపేలా చేస్తున్నాయి. ఉన్నత చదువులు, ఉద్యోగం, ఆర్థిక స్థిరత్వం, సరైన భాగస్వామి.. ఈ ఎంపికలతో పెళ్లి, పిల్లలను కనడం సాధారణంగానే ఆలస్యం అవుతోంది. ఇవి అమ్మాయిల ఆరోగ్యరీత్యా, సామాజిక రీత్యా ఇబ్బందులకు లోనయ్యే అంశం అని సర్వత్రా వినిపిస్తున్న మాటలు. ఇటీవల ఐఐటి హైదరాబాద్ విద్యార్థులతో ముచ్చటించిన ఉపాసన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.**

'పెళ్లి చేసుకుంటున్నారా...?!' అని అడిగిన ప్రశ్నకు అమ్మాయిల కంటే అబ్బాయిలే ఎక్కువగా చేతులు పైకెత్తారని, మహిళలు కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టారని దీనిని బట్టి అర్థమైంది. ఇది సరికొత్త భారత్' అని పోస్ట్‌లో ఉపాసన పేర్కొన్నారు. అమ్మాయిలు తమ అండాలను మెడికల్ పద్ధతిలో ఫ్రీజ్ చేసుకోవచ్చని, ఆర్థికంగా స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకోవడం మంచిదని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. దీనిపై ఎంతోమంది నెటిజన్లు తమ భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు. దీనిపై ఉపాసన రియాక్ట్ అవుతూ మరో పోస్టు పెట్టారు. 'నా దృష్టిలో పెళ్లి, కెరీర్ ఒకదానితో మరొకటి పోటీ కాదు. కానీ, ప్రతిదానికీ ప్రత్యేక సమయం ఉంటుందని భావిస్తున్నా. సరైన భాగస్వామి ఎదురయ్యే వరకు అమ్మాయి వేచి చూడటం తప్పా? పిల్లలకు ఎప్పుడు జన్మనివ్వాలన్నది పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం తప్పా?' అంటూ కొన్ని ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా ఏ వయసులో పిల్లలకు జన్మనివ్వడం మంచిది, దీనిపైన నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం..

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

## ఒక అవకాశం మాత్రమే!

దేనికుండే అవకాశాలు దానికి ఉన్నాయి. 30 ఏళ్లు దాటక ముందే పిల్లలను కనడం మంచిదే. 35 ఏళ్ల తర్వాత అంటే కష్టం. ఈ వయసులో అండాల విడుదల వేగం తగ్గిపోతుంటుంది. ప్రీ మెనోపాజ్ సమస్యలు తలెత్తుతుంటాయి. కెరీర్‌ను దృష్టిలో పెట్టుకొని... పెళ్లి, పిల్లల సంగతి తర్వాత చూద్దాం అనుకున్న అమ్మాయిలు వయసులో ఉన్నప్పుడే ఎగ్ ఫ్రీజ్ చేసుకోవచ్చు. క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలకు చికిత్సలు తీసుకుంటున్నవారూ ఈ పద్ధతిని అనుసరించవచ్చు. అందరూ చేయించుకోవాలనేం లేదు. అండాన్ని నిల్వ చేయడానికి ముందు చేసే మెడికల్ ప్రొసీజర్ కాస్ట్, ఎగ్ ఫ్రీజింగ్‌కి ఫీజు చెల్లించి, ప్రతియేడూ రెన్యువల్ చేసుకోవచ్చు. అయితే, ఇది ఒక ఆప్షన్ మాత్రమే. బయలాజికల్‌గా పిల్లలను కనడమే సరైన పద్ధతి. ఏదైనా సమస్యను అధిగమించేంతవరకే ఆలోచించాలి. కొంతమంది అమ్మాయిలు పై చదువులకు, ఉద్యోగాలకు విదేశాలకు వెళ్లాలి అనే ఆలోచనలో ఉంటారు. ఇలాంటప్పుడు పెళ్లి, పిల్లలను కనడంలో ఆలస్యం అవుతుంటుంది. తమ లక్ష్యంపై ఫోకస్ చేసుకోవడానికి ఎగ్ ఫ్రీజ్ చేసుకోవడంలో తప్పేమీ లేదు. కానీ, ఎక్కువ సమయం తీసుకోకూడదు. ఎందుకంటే ఫ్రీజింగ్ టెక్నాలజీ ఉన్నప్పటికీ సక్సెస్ రేట్ వంద శాతం ఎప్పుడూ ఉండదు. వందమందికి ఐవిఎఫ్ చేస్తే పది శాతం సక్సెస్ కావచ్చు. ప్రభుత్వ రూల్స్ ప్రకారం అమ్మాయిలు 21 ఏళ్ల నుంచి ఎగ్ ఫ్రీజ్ చేసుకోవచ్చు. 35 ఏళ్ల తర్వాత ఎగ్ ఫ్రీజింగ్ అంటే దాని సక్సెస్ రేట్ ఊహించలేం. విదేశాలలో కొన్ని ఆఫీసులలో తమ మహిళా సిబ్బందికి కంపెనీలే ఎగ్ ఫ్రీజింగ్ వెసులుబాటు కల్పిస్తున్నాయి. దీర్ఘకాలం కాకుండా నిర్ణీత సమయంలో తమ లక్ష్యాన్ని పూర్తి చేసుకోవాలనేవారికి ఇదొక అవకాశం మాత్రమే.

– డాక్టర్ సుధారాణి బైర్రాజు,
ఇన్‌ఫెర్టిలిటీ (ఐవిఎఫ్) స్పెషలిస్ట్,

## ఆరోగ్య సమస్యలూ పట్టించుకోవాల్సిందే!

చాలా మంది ఎగ్ ఫ్రీజింగ్ గురించే ఆలోచిస్తున్నారు. వయసులో ఉన్నప్పుడు అండాలు నిల్వ చేసుకోవడం ఓకే. కానీ, వయసు పెరుగుతున్నప్పుడు వచ్చే డయాబెటిస్, థైరాయిడ్, గర్భాశయ సమస్యలు.. ఇవన్నీ కూడా గుర్తుపెట్టుకోవాలి. ఫ్రీజ్ చేయడం ఒకటే చూడటం సరికాదు. పెరిగిన వయసు సపోర్ట్ చేయకపోతే గర్భస్రావాలు, నెలలు నిండకముందే బిడ్డ పుట్టడం, దీనివల్ల మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశాలూ ఎక్కువే. సాధారణంగా వయసులో ఉన్నప్పుడు మొదటి బిడ్డ పుట్టి, ఆ తర్వాత గ్యాప్ తీసుకున్న జంటలు మరో బిడ్డకోసం 40 ఏళ్ల తర్వాత వైద్యులను సంప్రదిస్తుంటారు. ఆ వయసులో వచ్చే ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడం పెద్ద టాస్క్ అవుతుంది. అందువల్ల కృత్రిమ గర్భధారణ పద్ధతులనే వారికి సూచిస్తుంటాం. వర్కింగ్ ఉమెన్ మల్టీటాస్కింగ్ చేయడంలో తప్పులేదు. అయితే, అన్నింటికీ మించి ఆరోగ్యం ముఖ్యం. ఎగ్ గురించి మాత్రమే చెప్పలేం. ఒవేరియన్, ఎండోమెట్రియల్ డిసీజెస్ కూడా ఉంటాయి. మెడికల్ డిజార్డర్స్ వల్ల పుట్టిన పిల్లల్లో రకరకాల హెల్త్ సమస్యలతో పాటు ఆటిజం కూడా రావచ్చు. నా కూతురు నన్ను చూసి, అలాగే తయారవుతుంది. కానీ, ఎప్పుడో వయసు అయిపోయాక పిల్లలను కని, మన గురించి వారికేం తెలియకుండా పెంచడం కూడా కరెక్ట్ కాదు. యుక్త వయసులో ఉన్నప్పుడే పిల్లలు పుడితే వారి ఆరోగ్యంతో పాటు తల్లుల హెల్త్ కూడా బాగుంటుంది. అంత త్వరగా కుదరదు అనుకున్నవారు 35 ఏళ్ల లోపు అన్నీ కంప్లీట్ చేసుకుంటే మంచిది. కెరియర్‌తో పాటు వ్యక్తిగత జీవితాన్నీ బ్యాలెన్స్ చేసుకోవాలి.

– డాక్టర్ పూజితా దేవి సురనేని, అబ్‌స్టెట్రీషియన్, గైనకాలజిస్ట్

## వయసైపోయాక పెంపకం కష్టమే!

ముందు తరాలను చూస్తే పాతికేళ్లకే పెళ్లిళ్లు, పిల్లలు పుట్టడం పూర్తయిపోయేది. ఇప్పుడు లేటు వయసులో పిల్లలను కనేవారు త్వరగా అలసిపోతున్నారు. పిల్లలను చూసుకోవడంలో ఓపిక ఉండటం లేదు. ఎక్కువగా కెరీర్ మీద దృష్టి పెట్టినప్పుడు పిల్లల పెంపకానికి అంత టైమ్ కేటాయించలేకపోతుంటారు. గతంలో ఉమ్మడి కుటుంబాలలో అమ్మమ్మ, నానమ్మలు పిల్లల పెంపకంలో సహకరించేవారు. ఇప్పుడు లేటు వయసులో పెళ్లిళ్లు చేసుకుంటే, సపోర్ట్ చేయాల్సిన అమ్మలు ఇంకా వృద్ధులైపోవడం వల్ల పిల్లలకు సహకరించే స్థితి ఉండదు. అంతేకాదు, వయసైపోయాక తల్లి అయినా, ఉద్యోగ బాధ్యతలతో మాతృత్వాన్ని ఆనందించలేరు. అందరి విషయంలో ఇలాగే జరుగుతుందని కూడా చెప్పలేం. గర్భధారణ సమయంలో తల్లి ఎంత యాక్టివ్‌గా ఉంటుందో ఆ ప్రభావం కూడా ఆ పిండంపైన పడుతుంది. ఇలాంటప్పుడు పుట్టే బిడ్డ మానసిక ఎదుగుదల ఎలా ఉంటుందో ఒక అంచనాతో చెప్పలేం. ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు ఎగ్ ఫ్రీజింగ్ ఒక ఆలోచన, అవకాశం మాత్రమే. ఎప్పుడైనా కనచ్చు అనేదానికి మన శరీరం సహకరించకపోతే అది ఫెయిల్యూర్ అవక తప్పదు. మెడికల్ పరంగా శరీరాన్ని కష్టపెట్టి, సామాజికంగా, కుటుంబపరంగా నష్టపోవడం కన్నా సరైన వయసులో సరైన నిర్ణయం తీసుకోవడం ఈ కాలం అమ్మాయిలు తప్పక చేయాల్సిన పని.

– ప్రొఫెసర్ జ్యోతిరాజ, సైకాలజిస్ట్

**బులియన్** (బంగారం 10 గ్రా.: వెండి కిలో) నవంబర్ 21న ముగింపు రూ.లలో

| | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,24,910 | 1,24,890 | 1,23,980 | 1,26,230 | 1,24,300 | 1,25,020 |
| బంగారం (22 క్యారెట్లు) | 1,12,430 | 1,14,480 | 1,13,650 | 1,17,520 | 1,14,360 | 1,14,600 |
| వెండి | 1,56,500 | 1,60,000 | 1,69,000 | 1,56,600 | 1,55,700 | 1,69,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ఫిట్ నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యం. అయితే రకరకాల కారణాల వల్ల ఈ రోజుల్లో చాలామంది ఫిట్ నెస్, ఆరోగ్యంపై తగినంత శ్రద్ధ చూపలేకపోతున్నారు. కొంతమంది సినిమా సెలబ్రిటీలు మాత్రం తమ ఫిట్ నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలితో ఎంతో మందికి స్ఫూర్తినిస్తున్నారు. వారెవరో, వారి ఆరోగ్య రహస్యాలేమిటో తెలుసుకుందాం.



# సెలబ్రిటీల ఫిట్‌నెస్ మంత్ర

దీపికా పదుకోన్, అక్షయ్ కుమార్, శిల్పా శెట్టి వంటి సినీ తారలు తమ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామాలతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈ సెలబ్రిటీలు శరీరాన్ని ఫిట్ గా ఉంచుకోడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి అసలు ఏం తింటారు, ఏం చేస్తారో తెలుసుకుందాం.

**శిల్పాశెట్టి..** ఒకప్పుడు భారత సినీ ఇండస్ట్రీని ఓ ఊపు ఊపేసిన నటి శిల్పాశెట్టి. ఈ మంగుళూరు భామ తరచు తన ఫిట్ నెస్ వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది. శిల్పా శెట్టి ఆహారపు అలవాట్లు, వ్యాయామ నియమాలు చాలా మందికి స్ఫూర్తినిస్తున్నాయి. దాదాపుగా ఐదుపదుల వయస్సులో కూడా శిల్పాశెట్టి ఫిట్ గా ఉండటానికి ఆమె ఆహారపుటలవాట్లే కారణం.



ఉదయాన్నే నిమ్మరసం, తేనె కలిపిన గోరువెచ్చని నీరు తాగే శిల్పాశెట్టి.. బ్రేక్ ఫాస్ట్ గా ఓట్స్, పోహా, పప్పు చీలా వంటి ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకుంటుంది. లంచ్‌లో బ్రౌన్ రైస్, కూరగాయలు, పండ్లు, చికెన్, చేపలు వంటివి తీసుకుంటుంది. చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉంటానంటుంది శిల్పాశెట్టి.

**శిల్పాశెట్టి ఆరోగ్య యోగం:** రెగ్యులర్‌గా యోగా చేయడంతోపాటు వెయిట్ ట్రైనింగ్, కార్డియో వ్యాయామాలు కూడా చేస్తూ చురుగ్గా ఉండటమే ఆమె ఆరోగ్య రహస్యం.

**అక్షయ్ కుమార్..** ఆరుపదుల వయస్సుకు చేరువ అవుతున్నా కూడా ఫిట్ నెస్ విషయంలో ఈ బాలీవుడ్ హీరోని మించినవాళ్లు లేరంటే అతిశయోక్తి లేదు. క్రమశిక్షణకు మారుపేరైన అక్షయ్ కుమార్‌వ్యాయామం, యోగా, కార్డియోలకు ప్రాధాన్యతనిస్తారు. ఇవి ఆయన శరీరాన్ని ఎప్పుడూ ఫిట్‌గా, టోన్‌గా ఉంచుతాయి. ఆహారం విషయానికొస్తే అక్షయ్ కుమార్.. శరీరానికి కావాల్సిన ప్రోటీన్లను, శక్తిని అందించేలా ఉదయాన్నే పాలు, పరాటాలు తీసుకుంటారు.

**దీపికా పదుకోన్..** భారత సినీ పరిశ్రమలోనే కాకుండా విదేశాల్లో కూగా తన నటనతో అద్భుతమైన ప్రశంసలు,ఫ్యాన్ ఫాలోయింగ్ కలిగిన దీపికా పదుకొణె ఫిట్ నెస్ విషయంలో అసలేమాత్రం రాజీపడదు. త్వరలోనే నాలుగవ పదిలోకి అడుగు పెట్టనున్న దీపికా పదుకోన్ ఫిట్ నెస్, అందం వెనుక ఆరోగ్యకరమైన ఆహారమే అసలు రహస్యం.

దీపికా పదుకొణె ఉదయం ఆహారంలో గ్రీన్ టీ, ఓట్ మీల్ తీసుకుంటుంది. దీపికాకి సౌత్ ఇండియన్ ఫుడ్ అంటే బాగా ఇష్టపడే దీపికా బ్రేక్ ఫాస్ట్ లోకి దక్షిణ భారతీయ వంటకాలైన ఇడ్లీ, దోసెలను తీసుకుంటుంటుంది. క్రమం తప్పకుండా యోగా, వ్యాయామం చేస్తుంది.



**రణ్‌వీర్ సింగ్..** తన డిఫరెంట్ లుక్స్, స్టైల్, స్మైల్‌తో అందరినీ ఆకట్టుకునే బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్.. తన రోజును వ్యాయామం, కార్డియోతో ప్రారంభిస్తాడు, ఇది అతని శరీరాన్ని ఎల్లప్పుడూ చురుగ్గా, ఫిట్‌గా ఉంచడంలో తోడ్పడతాయి. ఉదయాన్నే ఎనర్జీ డ్రింక్స్ తాగుతాడు. ఆ తర్వాత అల్పాహారంలోకి ఓట్స్, డ్రై ఫ్రూట్స్, స్మూతీలు తీసుకుంటానంటున్నాడు.

నిజానికి వీరు అనుసరించేవన్నీ చాలా చిన్న చిన్న ఆరోగ్య నియమాలే. అయితే వాటినే మనం ఫాలో కాము అసలు. ఇక్కడే వచ్చింది అసలు తేడా.

## లైఫ్@360

# డ్రైఫ్రూట్స్.. అతిగా తింటే ముప్పే!

డ్రై ఫ్రూట్స్ సరైన మోతాదులో తీసుకోవడం వలన ఇందులో ఉండే పోషకాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. కానీ కొందరు వీటిని ఆరోగ్యానికి మంచిదని అతిగా తింటుంటారు. కానీ వీటిలో అధిక చకకెర ఉండటం వలన ఎక్కువ మోతాదులో తీసుకోవడం వలన ఇది ఆరోగ్య సమస్యలను కలిగించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఎంత వరకు తీసుకోవచ్చు?**

డ్రై ఫ్రూట్స్ సాధారణంగా, ప్రతి రోజు 20 నుండి 30 గ్రాముల తీసుకోవడం చాలా మంచిది. ఈ మోతాదులో తీసుకోవడం వలన శరీరానికి మంచి పోషకాలు అందుతాయి. కానీ డ్రై ఫ్రూట్స్ ఎక్కువగా తీసుకుంటే ఇందులోని అధిక చక్కెర, ఫ్యాట్ అధికంగా ఉండి ఇవి అధికబరువుకు కారణం అవుతాయి.

# ఔనా?

చాలా మంది చలి కాలం వస్తే పెరుగును దూరంగా పెడతారు. ఎందుకంటే పెరుగు తినడం వల్ల, మజ్జిగ తాగడం వల్ల జలుబు, ఫ్లూ, గొంతి నొప్పి వంటివి వస్తాయని నమ్ముతూంటారు. మరి ఇది నిజమేనా..? పెరుగులో అనేక పోషక విలువలు ఉన్నాయి. ముఖ్యంగా చెడు బ్యాక్టీరియాను తొలగించి.. మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ఇంకా పలు విటమిన్లు, ప్రోటీన్లు, మెగ్నీషియం, క్యాల్షియం, పొటాషియం వంటివి ఉంటాయి. సైన్స్ ప్రకారం పెరుగులో పేగులకు అవసరమయ్యే మంచి బ్యాక్టీరియా ఉంటుంది. అంతే కాకుండా పెరుగుతో పులియ బెట్టిన ఆహారం కూడా రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. పెరుగులో క్యాల్షియం, విటమిన్ బి12, ఫాస్పరస్ పుష్కలంగా ఉంటాయి. పెరుగు తీసుకోవడం వల్ల మొత్తం ఆరోగ్యం మెరుగు పడుతుంది. పెరుగులో విటమిన్ సి ఉంటుంది కాబట్టి.. ఇది జలుబుతో బాధ పడేవారికి సహాయం చేస్తుందని, గది ఉష్ణోగ్రత వద్ద ఉంచిన పెరుగును తింటే మంచిదని చెబుతున్నారు.దీని ప్రకారం.. పెరుగును మొత్తానికే దూరంగా ఉంచాల్సిన అవసరం లేదు. శీతా కాలంలో పెరుగును పరిమితంగా తీసుకోవచ్చు.

# మైగ్రేన్‌కు పండంటి ఉపశమనం

జీవనశైలి సరిగా లేకపోవడం, అసమతుల్య ఆహారం, శరీరంలో తగినంత నీరు లేకపోవడం, పని ఒత్తిడి వంటి ఎన్నో కారణాలు మైగ్రేన్‌కు దారి తీస్తాయి. ఈ తలనొప్పి నుంచి ఉపశమనం పొందడానికి డాక్టర్ ఇచ్చే మందులతోపాటు కొన్ని రకాల పండ్లు తినడం వల్ల ఈ సమస్య నుంచి వేగంగా బయటపడొచ్చు. అవేంటో తెలుసుకుందాం..

**మైగ్రేన్ బాధితులు తినవలసిన పండ్లు ఇవే**

**పుచ్చకాయ:** మైగ్రేన్ బాధితులకు పుచ్చకాయ చాలా ప్రయోజనకరం. అందుకే మైగ్రేన్ బాధితులకు వైద్యులు పుచ్చకాయను సిఫార్సు చేస్తుంటారు. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, దీన్ని తినడం వల్ల తలనొప్పిని తగ్గించడంలో, కండరాలను సడలించడంలో సహాయపడుతుంది. నీటితో పాటు, పుచ్చకాయలో పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.

**అరటిపండు:** అరటిపండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిని తినడం వల్ల శరీరానికి తగినంత పోషకాలు లభిస్తాయి. అనారోగ్యంతో పోరాడే శరీర సామర్థ్యం పెరుగుతుంది. అరటిపండ్లలోని పొటాషియం, మెగ్నీషియం తలనొప్పి నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి.

**యాపిల్:** యాపిల్ లోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, పెక్టిన్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లు మైగ్రేన్ తలనొప్పిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి.

**అవకాడో:** అవకాడో తినడం కూడా మైగ్రేన్ బాధితులకు చాలా మంచిది. ఇది తలనొప్పి, మైగ్రేన్ లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. అవకాడోలో మంచి మొత్తంలో రిబోఫ్లేవిన్, నియాసిన్, ఫోలేట్, పొటాషియం, లుటీన్, బీటా కెరోటిన్ వంటి విటమిన్లు ఉంటాయి. ఇవి తలనొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. ఈ పండ్లతో పాటు మైగ్రేన్ బాధితులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించడం కూడా చాలా ముఖ్యం. అలాగే యోగా, ధ్యానం, వ్యాయామం కూడా మైగ్రేన్ సమస్యను వేగంగా తగ్గిస్తాయి.

# గలగలలతో ఆరోగ్యం

మన సంప్రదాయాలను చాదస్తం అనకుండా తరచి చూస్తే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంటాయి. ముఖ్యంగా స్త్రీకి గాజులు అందాన్ని, చేతులకు కళను ఇవ్వడమే కాదు... అనేకమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా ఇస్తాయి.

చేతులకు గాజులు వేసుకున్నవారికి శరీరంలో రక్త ప్రసరణ బాగుంటుందని నిపుణులు చెబుతున్నారు. గాజులు మణికట్టు ప్రదేశంలో కిందకి పైకి జరుగుతూ రక్త నాళాలకు మసాజ్ అందించి రక్త ప్రసరణను సజావుగా చేస్తాయి. అంతేకాదు గాజులు వేసుకోవడం వల్ల మన శరీరంలో శక్తి స్థాయులు పెరగడంతో పాటు అలసట తగ్గుతుంది. గాజులు ధరించినవారికి ఒత్తిడి. నొప్పిని భరించే శక్తి లభిస్తుందని కొన్ని పరిశోధనలలో తేలింది. అదెలాగంటే, గాజులు చేతి మీద కదులుతూ మసాజ్ చేయడం వల్ల ప్రెషర్ పాయింట్స్ యాక్టివేట్ అయ్యి శక్తి జనరేట్ అవుతుంది. గాజులు శరీరంలో వేడిని తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుతాయని తేలింది.

ప్రస్తుతం చాలామంది అమ్మాయిలకు హార్మోన్ల అసమతౌల్యత సమస్య ఎదురవుతోంది. దీనివల్ల రుతుక్రమం కూడా క్రమం తప్పుతుంది. ప్రతి స్థాయిలో మహిళలు ఈ సమస్యతో బాధపడుతుంటారు. గాజులు వేసుకోవడం వలన చాలా వరకూ ఈ సమస్య దరిచేరదట.

గాజులు శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాదు.. మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయని రుజువైంది. హార్మోన్లు సమతుల్యంగా ఉండడం వల్ల, శరీరంలో అన్ని జీవక్రియలు ఆరోగ్యంగా సాగడం వల్ల మానసికంగానూ ఆరోగ్యంగా ఉండే వీలుంటుంది. అందుకే పూర్వకాలంలో గర్భిణులకు శ్రీమంతం చేసి చేతి నిండా గాజులు వేసి ప్రసవం అయ్యేవరకూ ఉంచుకోవాలని చెప్పేవారు. గర్భం ధరించిన వారికి ఐదో నెల తర్వాత పెరిగే బిడ్డ బరువు వల్ల అలసట ఎక్కువగా ఉంటుంది. అంతేకాదు.. ప్రసవం సమయంలో నొప్పిని భరించే శక్తి కూడా వీటివల్ల అందుతుందని విశ్వాసం.

అందుకే గాజులు వేసుకోవడాన్ని కూడా ఫ్యాషనబుల్‌గా భావించడం మంచిది.

## సాక్షి సినిమా

# పాటకి వేళాయె



ప్రభాస్

ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న తాజా పాన్ ఇండియా చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి తొలి పాటని ఈ నెల 23న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ మేరకు ప్రభాస్ డ్యాన్స్ చేస్తున్న పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'ది రాజా సాబ్'ని తెరకెక్కిస్తున్నారు మారుతి. ప్రేక్షకులతో పాటు ట్రేడ్ వర్గాల్లోనూ మా మూవీ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకులు మా చిత్రాన్ని మొదటి రోజు మొదటి ఆట చూసేందుకు వేచి చూస్తున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకి కెమెరా: కార్తీక్ పళని, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ఎస్‌కేఎన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: టీజీ కృతీ ప్రసాద్.

# స్వతంత్ర సినిమాకు ప్రోత్సాహం కరువైంది - 'ఇఫీ'లో కమల్‌హాసన్

'ఇఫీ'లో కమల్‌హాసన్, సాయి పల్లవి, శివ కార్తికేయన్...

''స్వతంత్ర సినిమా స్వతంత్రంగానే ఉంటుంది. దాన్ని వాణిజ్య సినిమాలతో పోల్చి పరిమితుల్లో పెట్టకండి. స్వతంత్ర సినిమా కూడా స్వతంత్ర భారత్ లాగే స్వేచ్ఛగా ఉంటుంది'' అని నటుడు-దర్శక-నిర్మాత కమల్‌హాసన్ తెలిపారు. గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో (ఇఫీ) శుక్రవారం కమల్‌హాసన్ పాల్గొన్నారు. 'ఇండిపెండెంట్ సినిమాలు ఇంకా థియేటర్లలో స్థానం సంపాదించుకోవడానికి పోరాడుతున్నాయి... థియేటర్లలో స్వతంత్ర సినిమాలకు సరైన ప్రదర్శన అవకాశాలు లభించడం లేదు కదా?' అనే ప్రశ్నకు కమల్‌హాసన్ బదులిస్తూ- ''అవును... ఇది నిజమే. గత 40 ఏళ్లుగా నేను లేవనెత్తుతున్న సమస్య ఇది'' అని స్పష్టం చేశారు. శివ కార్తికేయన్, సాయి పల్లవి జోడీగా కమల్‌హాసన్ నిర్మించిన 'అమరన్' చిత్రం ఈ ఏడాది భారతీయ పనోరమా విభాగంలో ప్రారంభ చిత్రంగా ఎంపిక అయింది. ఈ నేపథ్యంలో చిత్రబృందాన్ని ప్రత్యేకంగా అభినందించిన అనంతరం కమల్‌హాసన్ మాట్లాడుతూ- ''నేను నిర్మించిన 'అమరన్ ' చిత్రం 'ఇఫీ'లో ప్రదర్శనకు ఎంపిక కావడం, అత్యున్నత పురస్కారం అయిన గోల్డెన్ పీకాక్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు. 'అర్ధంతరంగా ఆగిపోయిన 'మరుదనాయగమ్' ప్రాజెక్ట్‌ను తిరిగి ప్రారంభించే చాన్స్ ఉందా?' అనే ప్రశ్నకు కమల్ బదులిస్తూ- ''ప్రస్తుత సాంకేతిక విప్లవ యుగంలో ఉన్న అవకాశాల దృష్ట్యా ఆ చిత్రం పూర్తి కావచ్చుననే ఆశాభావం ఉంది'' అన్నారు.

**మాస్టర్ క్లాసెస్ ప్రారంభం**

'ఇఫీ'లో భాగంగా నిర్వహిస్తున్న మాస్టర్‌క్లాస్ సిరీస్‌ను శుక్రవారం కేంద్ర సమాచార- ప్రసారశాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డా. ఎల్. మురుగన్ ప్రారంభించారు. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు ముజఫర్ అలీ మాస్టర్‌క్లాస్ సిరీస్‌లో తొలి సెషన్‌ను నిర్వహించారు.

**సినీ ప్రముఖులతో క్లాసెస్...**

ఈ మాస్టర్‌క్లాస్ విభాగంలో ప్యానల్ డిస్కషన్లు, వర్క్‌షాపులు, రౌండ్‌టేబుల్ ఇంటరాక్షన్లు, ఇంటర్వ్యూ సెషన్లు, ఫైర్‌సైడ్ చాట్స్ వంటి వర్క్‌షాపులు ఉంటాయి. భారతీయ సినీ ప్రముఖులు విధు వినోద్ చోప్రా, అనుపమ్ ఖేర్, షాద్ అలీ, శేఖర్ కపూర్, రాజ్‌కుమార్ హిరానీ, ఆమిర్ ఖాన్, విశాల్ భరద్వాజ్, సుహాసినీ మణిరత్నం వంటి వారు ఈ ఫెస్టివల్‌లో వివిధ సెషన్లు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా కృత్రిమ మేధ (ఏఐ) మనుగడ, సినిమాటోగ్రఫీ, వీఎఫ్ఎక్స్, ఎస్ఎఫ్ఎక్స్ వంటి సాంకేతిక విభాగాలపై ప్రత్యేక వర్క్‌షాపులను ప్లాన్ చేశారు. రంగస్థల నటనపై ప్రముఖ నిపుణులు అందించే మాస్టర్‌క్లాస్‌లు కూడా జరగనున్నాయి.

– గోవా నుంచి 'సాక్షి' ప్రతినిధి

# ప్రేమ ప్రేమలో పడుతుంది!

సిద్ధాంత్, మృణాల్

సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న మ్యూజికల్ లవ్‌స్టోరీ సినిమాకు 'దో దీవానే షెహర్ మే' అనే టైటిల్ ఖరారైంది. రవి ఉడయార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శుక్రవారం ప్రకటించారు. సంజయ్ లీలా భన్సాలీ ప్రొడక్షన్స్, రవి ఉడయార్ ఫిలిమ్స్‌పై సంజయ్ లీలా బన్సాలీ, ప్రేరణా సింగ్, ఉమేష్ కుమార్ బన్సల్, భరత్ కుమార్ రంగ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమాను ఫిబ్రవరి 20న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ''రెండు హృదయాలు... ఒక నగరం... అసంపూర్ణమైన పరిపూర్ణ ప్రేమకథే ఈ చిత్రం. ఈ ప్రేమికుల దినోత్సవానికి 'ఇష్క్ షే ఇష్క్ హో జాయేగా..' (ప్రేమ ప్రేమలో పడుతుంది). విభిన్నమైన ఒక మంచి ప్రేమకథను ప్రేక్షకులకు అందించనున్నాం'' అని పేర్కొన్నారు మృణాల్ ఠాకూర్.

# మరోసారి విజయం సాధించాం - బన్నీ వాసు

వంశీ, సాయికృష్ణ, తేజస్విని, అఖిల్, బన్నీ వాసు, సాయిలు

''రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను ప్రతి ఒక్కరూ ఓన్ చేసుకుంటున్నారు. ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకుల దగ్గరకు బాగా చేరువ చేయడానికి ప్రయత్నించాం. కంటెంట్‌ను జడ్జ్ చేయడంలో మేమంతా మరోసారి విజయం సాధించాం'' అన్నారు నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాసు. అఖిల్ ఉడ్డెమారి, తేజస్విని జంటగా నటించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. సాయిలు కంపాటి దర్శకత్వంలో డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో ఈటీవీ విన్ ఒరిజినల్స్, వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. వంశీ నందిపాటి, బన్నీ వాసు విడుదల చేసిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో సాయిలు కంపాటి మాట్లాడుతూ- ''మా మూవీ సక్సెస్ కావడంతో మాటలు రావడం లేదు'' అని చెప్పారు. ''ప్రతి ప్రేమ జంట, ప్రతి కుటుంబం చూడాల్సిన సినిమా ఇది'' అన్నారు డా.నాగేశ్వరరావు. ''ఈ స్టోరీ ప్రేక్షకులకు నచ్చుతుందన్న మా నమ్మకం నిజమైంది'' అని రాహుల్ మోపిదేవి పేర్కొన్నారు. ''నా పదేళ్ల కష్టానికి ఈ చిత్రంతో ఫలితం దక్కింది'' అన్నారు అఖిల్ రాజ్. ''మా మూవీ ఎమోషనల్‌గా ఉందని ప్రేక్షకులు చెబుతున్నారు'' అని వేణు ఊడుగుల చెప్పారు. ''ప్రేక్షకాదరణ, ప్రేమ ఇలాంటి మరెన్నో మంచి చిత్రాలు చేసే ఎనర్జీని అందిస్తోంది'' అన్నారు వంశీ నందిపాటి. సురేష్ బొబ్బిలి, చైతన్య జొన్నలగడ్డ పాల్గొన్నారు.

# ప్రేక్షకుల స్పందన సంతోషాన్నిస్తోంది - ప్రియదర్శి

నవనీత్, ప్రియదర్శి, ఆనంది, జాన్వీ

ప్రియదర్శి, ఆనంది హీరో హీరోయిన్లుగా, సుమ కనకాల ముఖ్య పాత్రలో నటించిన సినిమా 'ప్రేమంటే..'. రానా దగ్గుబాటి సమర్పణలో నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో పుస్కూర్ రామ్మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న (శుక్రవారం) విడుదలైంది. కాగా, సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి పాజిటివ్ రెస్పాన్స్ లభిస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రియదర్శి మాట్లాడుతూ – ''ప్రేక్షకులు మా సినిమాను చూసి, థియేటర్స్ నుంచి హ్యాపీగా నవ్వుకుంటూ బయటకు రావడం సంతోషంగా ఉంది'' అని తెలిపారు. ''చాలా క్లీన్ సినిమా అని ఆడియన్స్ చెబుతుంటే హ్యాపీగా ఉంది. మా చిత్రాన్ని థియేటర్స్‌లో చూడాలని ఆడియన్స్‌ను కోరుకుంటున్నాను'' అని చెప్పారు నవనీత్. ''ప్రేక్షకులు వారి టెన్షన్స్‌ను మర్చిపోయి, హ్యాపీగా మా సినిమాను చూసి ఎంజాయ్ చేయాలని తీసిన చిత్రం ఇది'' అన్నారు ఆనంది. ''ప్రేమంటే..' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన నిర్మాతగా నాకు సంతోషాన్నిస్తోంది'' అని చెప్పారు జాన్వీ నారంగ్.

## ఓటీటీ ఇది చూడొచ్చు

# ఇది సూపర్ జాలీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం జాలీ ఎల్ఎల్‌బి 3 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

పక్కవాడు బాగుంటే ఆనందపడేవాళ్ళు కొందరైతే... మనవాళ్ళైనా సరే బాగుపడుతుంటే చూసి ఈర్ష్య పడేవాళ్ళు మరికొందరు. ఆ మరికొందరిపై అల్లుకున్న కథే ఈ 'జాలీ ఎల్ఎల్‌బి 3' సినిమా. వాదన ప్రతివాదన అనేది నిత్యం ఎక్కువగా జరిగేది న్యాయవాదుల మధ్యనే కదా. అంటే... న్యాయస్థానాలు దాదాపుగా గంభీర వాతావరణంలో ఉంటాయి. కానీ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న ఈ 'జాలీ ఎల్ఎల్‌బి 3' సినిమా చూస్తే మాత్రం మీకు కితకితలు ఖాయం. 'జాలీ ఎల్ఎల్‌బి' సిరీస్‌లో వచ్చిన మూడవ భాగమిది. మొదటి భాగం నుండి ఇప్పటివరకు ప్రతి సిరీస్‌లో కనిపించిన నటుడు అర్షద్ వార్సీ, ఇతని కాంబినేషన్‌లో అక్షయ కుమార్ నటించిన ఈ చిత్రానికి సిరీస్‌లో అన్ని చిత్రాలను తెరకెక్కించిన సుభాష్ కపూరే దర్శకత్వం వహించారు. నిజజీవిత ఆధారిత ఘటనల చుట్టూ కథలను అల్లుకొని రూపొందించిన ఈ ప్రతి సిరీస్ లోని హ్యూమర్ స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అలరిస్తుంది. ఈసారి కూడా అలాంటి ప్రయత్నమే చేసి, ప్రేక్షకుల దగ్గర మార్కులు కొట్టేశారు ఈ జాలీ ఎల్ఎల్‌బి. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... దేశాన్ని కుదిపేసిన రైతుల ఉద్యమం చుట్టూ ఈ కథ నడుస్తుంది. రాజస్థాన్ రాష్ట్రంలోని రాజారాం సోలంకి అనే రైతుకి సంబంధించిన ఓ పొలం వివాదం పై కోర్టులో జానకి అనే ఆవిడ కేసు వేసి ఉంటుంది. బికనీర్ టు బోస్టన్ ప్రాజెక్టు కోసం పరసూల్ ప్రాంతంలో ఉన్న పొలాలన్నిటినీ కేతన్ అనే వ్యాపారవేత్త అక్రమంగా లాక్కుంటాడు. జానకితో పాటు చాలా మంది రైతులు ఇదే వివాదంపై కోర్టు మెట్లెక్కుతారు. ఢిల్లీ సెషన్స్ కోర్టు ప్రాంగణంలో మీరట్‌కు చెందిన జగదీష్ త్యాగి, కాన్పూర్‌కి చెందిన జగదీష్ మిశ్రా 'లా' ప్రాక్టీస్ చేస్తుంటారు. ఇద్దరి పేర్లు దాదాపుగా ఒకటవడం వల్ల ఒకరంటే ఒకరికి అస్సలు పడదు. ఇదే నేపథ్యంలో జానకి తన పిటిషన్‌తో వీళ్ళిద్దరి మధ్యకు చేరుతుంది. ఒకరంటే ఒకరికి పడని ఇద్దరు లాయర్లతో అవతల కోట్లకు పడగెత్తిన ప్రముఖ వ్యాపారవేత్తపై తాను చేస్తున్న ఈ న్యాయ పోరాటంలో జానకి గెలుస్తుందా? లేదా అన్నది 'జాలీ ఎల్ఎల్‌బి 3' సినిమాలోనే చూడాలి. చాలా సీరియస్ సబ్జెక్ట్ అయినా సరదా సరదాగా సాగిపోతుంది సినిమా. ఓ పక్క మెయిన్ పాయింట్ నుండి పక్కకు వెళ్ళకుండా... అలా అని ప్రేక్షకుడిని మరీ సీరియస్ మోడ్‌లోకి తీసుకెళ్ళకుండా చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది సినిమా. మస్ట్ వాచ్.




– హరికృష్ణ ఇంటూరు

**స్టాక్ మార్కెట్లు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 401 | 124 |
| 85,232 | 26,068 |

**విదేశీ సూచీలు**

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 22,235 | ▲ | 256 |
| డోజోన్స్ | 46,461 | ▲ | 671 |
| ఎఫ్‌టీఎస్‌ఈ100 | 9,534 | ▽ | 7 |
| డాక్స్ | 23,088 | ▽ | 191 |
| షాంఘై | 3,835 | ▽ | 96 |
| నిక్కీ | 48,626 | ▽ | 1,198 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** (రూ.లలో)

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 88.25 | 89.27 |
| £ | బ్రిటిష్ పౌండ్ | 114.70 | 117.61 |
| € | యూరో | 101.80 | 103.79 |
| ¥ | జపాన్ యెన్ (100) | 46.00 | 59.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | 55.28 | 59.12 |
| S$ | సింగపూర్ డాలర్ | 66.10 | 69.81 |
| SAR | సౌదీ రియాల్ | 22.98 | 24.47 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 23.47 | 24.73 |
| ¥ | చైనా యువాన్ | 11.71 | 13.53 |

# డిజిటల్ గోల్డ్‌ను నియంత్రించం

**సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే**




న్యూఢిల్లీ: డిజిటల్ బంగారం లేదా ఈ-బంగారం వంటి ఉత్పత్తులను నియంత్రించాలనుకోవడం లేదని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టం చేశారు. అవి తమ పరిధిలోకి రావన్నారు. రీట్, ఇన్విట్-2025 జాతీయ స్థాయి సమావేశంలో పాల్గొన్నందుకు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మ్యూచువల్ ఫండ్స్ అందించే గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) లేదా ట్రేడింగ్‌కు వీలయ్యే ఇతర బంగారం సెక్యూరిటీలనే సెబీ నియంత్రిస్తున్నట్టు చెప్పారు. నియంత్రణ పరిధిలో లేని డిజిటల్ గోల్డ్ లేదా ఈ-గోల్డ్‌లో లావాదేవీలతో రిస్క్ ఉంటుందని, వీటికి దూరంగా ఉండాలంటూ ఇటీవలే సెబీ హెచ్చరిక జారీ చేయడం గమనార్హం. 'ఆ తరహా డిజిటల్ గోల్డ్ ఉత్పత్తులు సెబీ నియంత్రించే బంగారం ఉత్పత్తులకు భిన్నమైనవి. వాటిని సెక్యూరిటీలుగా లేదా కమోడిటీ డెరివేటివ్‌లుగా నోటిఫై చేయలేదు. అవి పూర్తిగా సెబీ నియంత్రణకు వెలుపల పనిచేస్తున్నాయి. అటువంటి డిజిటల్ బంగారం సాధనాలతో ఇన్వెస్టర్లు గణనీయమైన రిస్క్‌ను ఎదుర్కోవాల్సి రావచ్చు'' అని సెబీ తన ప్రకటనలో పేర్కొంది. భౌతిక బంగారానికి ప్రత్యామ్నాయమంటూ కొన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు డిజిటల్ గోల్డ్‌పై ప్రచారం చేస్తున్నట్టు సెబీ దృష్టికి రావడంతో ఈ హెచ్చరిక జారీ చేసింది. దీంతో డిజిటల్ గోల్డ్‌ను ఆఫర్ చేసే ప్లాట్‌ఫామ్‌లు తమను సైతం సెబీ నియంత్రణ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశాయి.

# రూపాయి భారీ క్రాష్..!

- 98 పైసలు క్షీణించి చరిత్రాత్మక కనిష్టం 89.66కు పతనం
- ఒక్కరోజులో అత్యంత పతనమూ ఇదే

ముంబై: చరిత్రలో అత్యంత కనిష్టానికి రూపాయి విలువ పడిపోయింది. జాతీయ, అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు డాలర్ కరెన్సీపై తీవ్ర ఒత్తిడి పెంచాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ ఒక్కరోజులో అత్యధికంగా 98 పైసలు కుప్పకూలి చరిత్రాత్మక కనిష్టం 89.66 స్థాయి వద్ద ముగిసింది. అంతకుముందు అక్టోబర్ 14న 88.91 జీవితకాల కనిష్టంగా ఉంది. అంతర్జాతీయ టెక్నాలజీ షేర్లలో అనూహ్య అమ్మకాలు, అమెరికా-భారత్‌ల వాణిజ్య డీల్‌పై స్పష్టత లేమి కూడా రూపాయి కోతకు కారణమయ్యాయి. ఇంట్రాడేలో 97 పైసలు క్షీణించి 89.65 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30న 88.85 వద్ద ఇంట్రాడేలో రికార్డు కనిష్టాన్ని తాకిన సంగతి తెలిసిందే. అలాగే జూలై 30న ఒక్కరోజులో 89 పైసల పతన రికార్డును చెరిపివేసింది. 'క్రిప్టో భారీ పతనం, ఏఐ షేర్లలో వెల్లువెత్తిన విక్రయాలతో అంతర్జాతీయంగా కరెన్సీ మార్కెట్లలో రిస్క్ సామర్థ్యం ఒక్కసారిగా తగ్గింది. ఈ పరిణామం భారత్ వంటి వర్ధమాన దేశాల కరెన్సీలపై తీవ్ర ఒత్తిడి పెంచింది' అని ఇంట్రెస్ట్ రేట్ డెరివేటివ్స్ అండ్ కమోడిటీ, కరెన్సీ హెడ్ అనింద్య బెనర్జీ తెలిపారు.

# గ్రో లాభం గ్రో

**క్యూ2లో రూ. 471 కోట్లు**

న్యూఢిల్లీ: స్టాక్ బ్రోకింగ్ ప్లాట్‌ఫామ్ గ్రో మాతృ సంస్థ బిలియన్‌బ్రెయిన్స్ గేరేజ్ వెంచర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 12 శాతం పుంజుకుని రూ. 471 కోట్లను ఆర్జించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 420 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 1,125 కోట్ల నుంచి రూ. 1,019 కోట్లకు క్షీణించింది. కంపెనీ ఇటీవలే ఐపీవో ముగించుకుని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయిన సంగతి తెలిసిందే. తొలిసారి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కాగా.. మొత్తం యాక్టివ్ యూజర్ల సంఖ్య వార్షికంగా 27 శాతం ఎగసి 1.9 కోట్లకు చేరినట్లు గ్రో వెల్లడించింది. కస్టమర్ల ఆస్తులు 33 శాతం జంప్‌చేసి రూ. 2.7 లక్షల కోట్లను తాకినట్లు తెలియజేసింది. మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీలలోకి ప్రవహించిన పెట్టుబడులు ఇందుకు సహకరించినట్లు పేర్కొంది. 2016లో ఏర్పాటైన కంపెనీ దేశీయంగా 26 శాతం మార్కెట్ వాటాతో అతిపెద్ద స్టాక్‌బ్రోకింగ్ ప్లాట్‌ఫామ్‌గా ఆవిర్భవించడం గమనార్హం. రూ. 100 ధరలో ఐపీవో చేపట్టిన కంపెనీ ఈ నెల 12న లిస్టయిన సంగతి తెలిసిందే. తదుపరి షేరు ధర బలపడుతూ వచ్చి వారాంతాన బీఎస్‌ఈలో 1 శాతం లాభంతో రూ. 158 వద్ద ముగిసింది.

# ఆరోగ్య బీమా పరిశ్రమ నష్టం రూ. 10,000 కోట్లు

న్యూఢిల్లీ: క్లెయిమ్‌లలో మోసాలు, దుర్వినియోగం (ఎఫ్‌డబ్ల్యూఏ) తదితర కారణాలతో బీమా పరిశ్రమ ఏటా రూ. 10,000 కోట్ల నష్టాన్ని చవి చూడాల్సి వస్తోంది. దీని వల్ల వ్యవస్థపై నమ్మకం సడలుతోంది. మోసపూరిత ధోరణులు, ప్రక్రియల్లో సమర్థత లోపించడం, నిబంధనల ఉల్లంఘనలు మొదలైనవి వ్యవస్థవ్యాప్తంగా వేళ్లూనుకుపోయి, మరింతగా పెరుగుతున్నాయని ఆరోగ్య బీమాపై బీసీజీ, మెడి అసిస్ట్ రూపొందించిన ఓ నివేదిక వెల్లడించింది. ముందస్తుగా నివారించడం, మోసాలను గుర్తించడం, మోసాలకు పాల్పడకుండా కఠినచర్యలు తీసుకోవడంలాంటి మూడంచెల వ్యూహాన్ని పాటించాల్సి ఉంటుందని పేర్కొంది. అదే సమయంలో నిర్దిష్ట ప్రమాణాలను రూపొందించేందుకు, సాంకేతికత వినియోగాన్ని పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వివరించింది. క్లెయిమ్స్ ప్రాసెసింగ్‌లో మోసాలను రియల్ టైమ్‌లో నిరోధించేందుకు కృత్రిమ మేధ, జనరేటివ్ ఏఐ (జెన్‌ఏఐ) ఉపయోగపడగలవని నివేదిక తెలిపింది. రిపోర్టులో మరిన్ని విశేషాలు..

- ఆరోగ్య బీమా పరిశ్రమ గత అయిదేళ్లుగా ఏటా 17 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తోంది. 2025లో రూ. 1.27 లక్షల కోట్లకు చేరింది.
- రాబోయే అయిదేళ్ల వ్యవధి చాలా ఆశావహంగా ఉండనుంది. పరిశ్రమ సగటున 16–18 శాతం మేర వృద్ధి చెందుతూ, 2030 నాటికి రూ. 2.6 – రూ. 3 లక్షల కోట్లకు చేరనుంది. కాంపోజిట్ లైసెన్సులు, వ్యాల్యూ యాడెడ్ సర్వీసులు మొదలైనవి మార్కెట్ ముఖచిత్రాన్ని మార్చివేయనున్నాయి.
- ఎలాంటి రిస్కులు లేని క్లెయిమ్‌లు 90 శాతం ఉంటున్నాయి. అయితే, రెండు శాతం మాత్రం పూర్తి మోసపూరితమైనవిగా ఉంటున్నాయి. ఇక మరో 8 శాతం క్లెయిమ్‌లు కాస్త అటూ ఇటుగా ఉంటున్నాయి. నిఖార్సయిన పాలసీదారులకు అసౌకర్యం కలిగించకుండా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఈ తరహా క్లెయిమ్‌లలో కొంత అవకాశం ఉంటుంది.
- ప్రతి సంవత్సరం మోసపూరిత క్లెయిమ్‌లకు సంబంధించి ఎఫ్‌డబ్ల్యూఏ రూపంలో రూ. 8,000–10,000 కోట్ల చెల్లింపులు ఉంటున్నాయని అంచనా. దీని వల్ల బీమా సంస్థల మార్జిన్లు తగ్గుతున్నాయి. కస్టమర్లకు ప్రీమియం భారం పెరుగుతోంది.
- డిజిటల్ ఇంటెలిజెన్స్, కొత్త తరం టెక్నాలజీని వాడి ఈ సెగ్మెంట్లో మోసాలను అరికట్టవచ్చు. విశ్వసనీయతను పెంపొందించుకోవచ్చు. ఇలాంటి చర్యలతో, అందరికీ బీమా రక్షణ కల్పించాలని ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అయిదేళ్లు ముందుగానే సాధించడానికి వీలవుతుంది. అలాగే ఆరోగ్య బీమా వ్యవస్థను పారదర్శకమైనదిగా, టెక్నాలజీ ఆధారితమైనదిగా తీర్చిదిద్దేందుకు సాధ్యపడుతుంది.

| 'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో .. | |
|---|---|
| ఇండెక్సులలో రీట్స్‌కు చోటు | రష్యా చమురుకు రిలయన్స్ సెలవు |

# ప్రపంచ సంకేతాలు పడేశాయ్

- ఫెడ్ రేట్ల కోతపై సన్నగిల్లిన ఆశలు
- రెండు రోజుల లాభాలకు బ్రేక్
- సెన్సెక్స్ 401 పాయింట్లు మైనస్
- 26,100 దిగువకు నిఫ్టీ

ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, ఫెడరల్ రిజర్వ్ డిసెంబర్‌లో వడ్డీరేట్ల తగ్గింపు ఆశలు సన్నగిల్లడంతో దేశీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం అరశాతం నష్టపోయింది. సెన్సెక్స్ 401 పాయింట్లు నష్టపోయి 85,232 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 124 పాయింట్లు పతనమై 26,068 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 445 పాయింట్లు క్షీణించి 85,188 వద్ద, నిఫ్టీ 140 పాయింట్లు కోల్పోయి 26,052 వద్ద కనిష్టాన్ని తాకాయి. ట్రేడింగ్‌లో అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా మెటల్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్, ఇండస్ట్రియల్స్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. చిన్న, మధ్య తరహా షేర్ల భారీ పతనంతో బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1.50% క్షీణించాయి.

**ఆసియా మార్కెట్ల భారీ పతనం**

అమెరికా వ్యవసాయేతర పేరోల్ డేటా అంచనాలను మించి నమోదు కావడంతో డిసెంబర్‌లో ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతపై ఆశలు సన్నగిల్లాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ(ఏఐ) సంబంధిత షేర్లలో బబుల్ ఆందోళనలు రేకెత్తాయి. దీంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. ఆసియాలో మార్కెట్లలో జపాన్, చైనా, హాంగ్‌కాంగ్ సూచీలు 2,50%, కొరియా, తైవాన్ ఇండెక్సులు 4%, సింగపూర్, ఇండోనేషియా సూచీలు 1% వరకు నష్టపోయాయి.

- లిస్టింగ్ రోజు క్యాపిలరీ టెక్నాలజీస్ ఇండియా షేరు మెప్పించింది. ఇష్యూ ధర(రూ.577)తో పోలిస్తే బీఎస్‌ఈలో 3% డిస్కౌంటుతో రూ.560 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో బౌన్స్‌బ్యాక్ అయ్యింది. ఒక దశలో 10% పెరిగి రూ.633 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 5% లాభంతో రూ.607 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4,813.43 కోట్లుగా నమోదైంది.

- ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్‌లో మిగిలిన 7% వాటాను బ్లాక్ డీల్ ద్వారా అదానీ గ్రూప్ విక్రయించింది. సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి ఈ డీల్‌కు అధిక ఆసక్తి లభించింది. వ్యాంగార్డ్, ఛార్లెస్ శ్వాబ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్, ఎస్‌బీఐ ఎంఎఫ్, టాటా ఎంఎఫ్, క్వాంట్ ఎంఎఫ్, బంధన్ ఎంఎఫ్‌లు వాటాను కొన్నాయి. పలువురు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు కూడా ఈ పూర్తి వాటా విక్రయంలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అదానీ గ్రూప్ అదానీ విల్మర్‌లో తమకున్న 44% వాటాను వదులుకున్నట్లయ్యింది.

## సెమీఫైనల్లో లక్ష్య సేన్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత నంబర్‌వన్ షట్లర్ లక్ష్య సేన్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 14వ ర్యాంకర్ లక్ష్య సేన్ 23-21, 21-11తో భారత్‌కే చెందిన ప్రపంచ 32వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టిపై గెలుపొందాడు. 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఆయుశ్ తొలి గేమ్‌లో ఒక గేమ్ పాయింట్ చేజార్చుకున్నాడు. తొలి గేమ్‌ను నెగ్గిన ఉత్సాహంలో రెండో గేమ్‌లో లక్ష్య సేన్ జోరు పెంచగా, ఆయుశ్ తడబడ్డాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంకర్ చౌ టియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో లక్ష్య సేన్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో లక్ష్య సేన్ 3-4తో వెనుకంజలో ఉన్నాడు. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 19-21, 15-21తో ఐదో సీడ్ ఫజర్ -షోహిబుల్ ఫిక్రి (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది.

# సిరీస్ కాపాడుకుంటారా!

**తీవ్ర ఒత్తిడిలో భారత్ • అమితోత్సాహంతో దక్షిణాఫ్రికా • నేటి నుంచి రెండో టెస్టు • గిల్ అవుట్, కెప్టెన్‌గా పంత్**

**ఉదయం 9 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం**

**పుష్కర కాలం పాటు సొంతగడ్డపై ఆడిన ప్రతీ టెస్టు సిరీస్ గెలిచిన భారత్ ఇప్పుడు ఏడాది వ్యవధిలో రెండో సిరీస్‌ను చేజార్చుకునే ప్రమాదంలో పడింది. తొలి టెస్టులో దక్షిణాఫ్రికా చేతిలో అనూహ్యంగా ఓడిన జట్టు సిరీస్ గెలుచుకునే అవకాశం లేకపోగా, ఇప్పుడు దానిని కాపాడుకునే ప్రయత్నంలో బరిలోకి దిగుతోంది. కోల్‌కతా పిచ్ మనకు పూర్తి ప్రతికూలంగా మారి చర్చకు దారి తీసిన నేపథ్యంలో... ఈసారి ఎలాంటి పిచ్ భారత్‌కు అనుకూలిస్తుందో చెప్పలేని పరిస్థితి ఉంది. మరోవైపు పదిహేనేళ్ల తర్వాత భారత గడ్డపై టెస్టు మ్యాచ్ గెలిచిన వరల్డ్ చాంపియన్ దక్షిణాఫ్రికా అదే ఉత్సాహంతో మరోసారి తమ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి పైచేయి సాధించాలని భావిస్తోంది. ఇలాంటి స్థితిలో రెండో టెస్టు ఎంత హోరాహోరీగా సాగుతుందనేది ఆసక్తికరం.**

గువాహటి: భారత్, దక్షిణాఫ్రికా మధ్య సిరీస్ ఫలితాన్ని తేల్చే రెండో టెస్టు మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. మూడు రోజుల్లోపే ముగిసిన తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా అనూహ్య విజయం సాధించగా, ఇప్పుడు దానికి ప్రతీకారం తీర్చుకోవాలని టీమిండియా పట్టుదలగా ఉంది. గత టెస్టులో మెడ నొప్పితో అర్ధాంతరంగా తప్పుకున్న శుబ్‌మన్ గిల్ ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో రిషబ్ పంత్ తొలిసారి జట్టు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. పక్కటెముకల గాయంతో తొలి టెస్టు ఆడని దక్షిణాఫ్రికా పేసర్ రబడ ఇంకా కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్ నుంచి కూడా తప్పుకున్నాడు. చివరిసారి దక్షిణాఫ్రికా 2000లో భారత గడ్డపై టెస్టు సిరీస్ గెలుచుకుంది.

**సుదర్శన్‌కు అవకాశం!**

గత టెస్టు రెండు ఇన్నింగ్స్‌లలో మన బ్యాటర్లెవరూ కనీసం అర్ధసెంచరీ కూడా నమోదు చేయలేకపోయారు. ఆ వైఫల్యాన్ని దాటి ఓపెనర్లు జైస్వాల్, రాహుల్ శుభారంభం ఇవ్వాల్సి ఉంది. గిల్ గాయం కారణంగా ఒక తప్పనిసరి మార్పుతో జట్టు బరిలోకి దిగనుంది. గిల్ స్థానంలో వచ్చే సాయి సుదర్శన్ ఎలాంటి ప్రభావం చూపిస్తాడనేది చెప్పలేం. ధ్రువ్ జురేల్ మరింత జాగ్రత్తగా ఆడాల్సి ఉండగా, ఇప్పుడు కొత్తగా కెప్టెన్సీతో పంత్‌పై బాధ్యత మరింత పెరిగింది. అతని ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగితే భారత్ పటిష్ట స్థితికి చేరుతుంది. జడేజా, సుందర్‌ల బ్యాటింగ్ మరోసారి కీలకం కానుంది. పేసర్లుగా బుమ్రా, సిరాజ్ ఖాయం కాగా, పిచ్‌ను బట్టి మూడో పేసర్‌కు అవకాశం దక్కవచ్చు. అదే మేనేజ్‌మెంట్ ఆలోచన అయితే నితీశ్ కుమార్ రెడ్డి తుది జట్టులోకి వస్తాడు. ఈడెన్‌లో నలుగురు స్పిన్నర్లతో ఆడి విమర్శలపాలైన జట్టు నితీశ్‌ను ఆడిస్తే అక్షర్‌ను పక్కన పెట్టవచ్చు. ఆఫ్ స్పిన్నర్ హార్మర్ చెలరేగుతున్న నేపథ్యంలో ఆరుగురు లెఫ్ట్ హ్యాండర్లతో ఆడటం మరింత ఇబ్బందికరం అనుకుంటే కూడా నితీశ్‌కు చాన్స్ లభిస్తుంది.



**గువాహటిలో తొలి టెస్టు**

భారత్‌లో టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న 30వ వేదికగా గువాహటి నిలుస్తోంది. ఇక్కడి బర్సపర స్టేడియంలో ఇప్పటి వరకు 2 వన్డేలు, 4 టి20లతో పాటు ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగాయి. ఇటీవల మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా ఐదు మ్యాచ్‌లకు ఈ మైదానం ఆతిథ్యం ఇచ్చింది. బర్సపరలో కొత్త మైదానం ప్రారంభానికి ముందు 1983 నుంచే గువాహటి నెహ్రూ స్టేడియంలో వన్డేలు జరిగాయి.

**బ్రెవిస్‌కు చోటు!**

కోల్‌కతా టెస్టు ఘన విజయం ఇచ్చిన జోష్‌తో దక్షిణాఫ్రికా బరిలోకి దిగుతోంది. బ్యాటింగ్‌లో ఆ జట్టు తడబడినా బౌలర్లు గెలుపును అందించారు. ఈసారి కూడా హార్మర్, మహరాజ్ కీలకం కానున్నారు. పిచ్ స్పిన్‌కు అనుకూలిస్తే వీరిద్దరు చెలరేగిపోగలరు. అవసరమైతే మూడో స్పిన్నర్‌గా ముత్తుసామిని కూడా ఆడించాలని టీమ్ భావిస్తోంది. తొలి మ్యాచ్‌లో ప్రభావం చూపలేకపోయిన ముల్డర్ స్థానంలో అతనికి స్థానం దక్కవచ్చు. పిచ్ స్పిన్‌కు అనుకూలంగా లేకపోతే ముల్డర్ స్థానంలో మరో బ్యాటర్ బ్రెవిస్‌కు చాన్స్ దక్కవచ్చు. దూకుడుగా ఆడే బ్రెవిస్ కొద్ది సేపట్లోనే ఆట గమనాన్ని మార్చగల సమర్థుడు. జట్టు బ్యాటింగ్‌కు మరోసారి కెప్టెన్ బవుమా మూల స్తంభంలా ఉన్నాడు. ఇతర బ్యాటర్ల నుంచి అతనికి తగినంత సహకారం కావాలి. రికెల్టన్, జోర్జిలకు తగినంత అనుభవం లేకపోగా... ఓపెనర్‌గా మార్క్‌రమ్ రాణించడం జట్టుకు అవసరం. పేసర్లు యాన్సెన్, బాష్ కూడా భారత్‌పై ప్రభావం చూపించగలరు.

> ఒకటే మ్యాచ్‌కు కెప్టెన్‌గా అంటే చేసేదేముంటుంది. అయితే దేశానికి నాయకత్వం వహించడం అంటే గర్వపడాల్సిన క్షణం. నాకు అవకాశం ఇచ్చిన బీసీసీఐకి కృతజ్ఞతలు. వ్యూహాల్లో కెప్టెన్‌గా సాంప్రదాయ శైలిని అనుసరించడంతో పాటు కొత్త తరహాలో కూడా ఆలోచిస్తాను. ఆటగాళ్లకు స్వేచ్ఛనిస్తూనే జట్టు కోసం సరైన నిర్ణయాలు తీసుకోగలననే నమ్మకం ఉంది.
>
> **-రిషభ్ పంత్, భారత జట్టు 38వ టెస్టు కెప్టెన్**

**ముందు టీ విరామం, ఆ తర్వాత లంచ్...**

ఈశాన్య రాష్ట్రం అసోంలోని వాతావరణ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని టెస్టు మ్యాచ్ సమయాల్లో స్వల్ప మార్పు చేశారు. ఇక్కడ సాయంత్రం తొందరగా చీకటి పడిపోతుంది. దాంతో మ్యాచ్‌ను ఉదయం 9 గంటల నుంచి మొదలుపడుతున్నారు. తొలి సెషన్ తర్వాత 11 గంటలకు టీ విరామం ఇస్తారు. 1:20కి లంచ్ బ్రేక్ అవుతుంది. సాయంత్రం 4 గంటలకు ఆట ముగుస్తుంది.

**పిచ్, వాతావరణం**

కోల్‌కతాతో పోలిస్తే మెరుగైన పిచ్ అని అందరూ అంగీకరించారు. ఆరంభంలో బౌన్స్, బ్యాటింగ్‌కు అనుకూలిస్తూ ఆ తర్వాత స్పిన్ ప్రభావం కనిపించవచ్చు. అయితే ఇక్కడ తొలి టెస్టు కాబట్టి ఎవరికీ స్పష్టత లేదు. మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశం లేదు.

**తుది జట్ల వివరాలు (అంచనా)**

**భారత్:** పంత్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సుదర్శన్, జురేల్, జడేజా, సుందర్, అక్షర్/నితీశ్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్.

**దక్షిణాఫ్రికా:** బవుమా (కెప్టెన్), మార్క్‌రమ్, రికెల్టన్, ముల్డర్/ బ్రెవిస్, జోర్జి, స్టబ్స్, వెరీన్, బాష్, యాన్సెన్, హార్మర్, మహరాజ్.

# 'సూపర్ ఓవర్'లో ఓడిన భారత్ 'ఎ'

**రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ ఫైనల్లో బంగ్లాదేశ్ 'ఎ'**

దోహా: రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ టి20 టోర్నీలో భారత 'ఎ' జట్టు కథ సెమీఫైనల్లో ముగిసింది. శుక్రవారం ఆసక్తికరంగా సాగిన తొలి సెమీఫైనల్లో బంగ్లాదేశ్ 'ఎ' జట్టు 'సూపర్ ఓవర్' ద్వారా భారత్‌ను ఓడించింది. సూపర్ ఓవర్లో ఆడిన 2 బంతుల్లో 2 వికెట్లు కోల్పోయిన భారత్ '0'కే పరిమితం కాగా... బంగ్లాదేశ్ 1 పరుగు చేసి విజయాన్నందుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. హబీబుర్ రహమాన్ (46 బంతుల్లో 65; 3 ఫోర్లు, 5 సిక్సులు) అర్ధసెంచరీ సాధించగా, మెహ్రాబ్ హుసేన్ (18 బంతుల్లో 48 నాటౌట్; 1 ఫోర్, 6 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించాడు. గుర్‌జీప్‌నీత్ సింగ్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు సరిగ్గా 194 పరుగులే సాధించింది. ప్రియాన్ష్ ఆర్య (23 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సులు), వైభవ్ సూర్యవంశీ (15 బంతుల్లో 38; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), జితేశ్ శర్మ (23 బంతుల్లో 33; 1 ఫోర్, 2 సిక్స్‌లు), నేహల్ వధేరా (29 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. చివరి 2 ఓవర్లలో భారత్ విజయానికి 21 పరుగులు అవసరం కాగా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిపాన్ మోండోల్ (1/35) ఐదు పరుగులే ఇచ్చాడు. ఆఖరి ఓవర్లో 16 పరుగులు చేయాల్సిన భారత్ తొలి 5 బంతుల్లో 12 పరుగులు రాబట్టింది. ఆఖరి బంతికి హర్ష్ దూబే, వధేరా కలిసి కష్టంగా 2 పరుగులు పూర్తి చేశారు. అయితే కీపర్ అక్బర్ ఘోర వైఫల్యంతో భారత్‌కు మూడో పరుగు కూడా వచ్చింది.

**సూపర్ ఓవర్లో ఇలా...**

భారత్ ఆశ్చర్యకరంగా వైభవ్‌ను కాదని జితేశ్, రమణ్‌దీప్‌లతో ఓపెనింగ్ చేయించింది. మోండోల్ వేసిన తొలి బంతికి జితేశ్, రెండో బంతికి అశుతోష్ అవుట్ కావడంతో ఇన్నింగ్స్ 'సున్నా' వద్ద ముగిసింది. ఆ తర్వాత తొలి బంతికి వికెట్ తీసిన సుయాశ్ శర్మ, తర్వాతి బంతిని వైడ్‌గా వేయడంతో బంగ్లాదేశ్ గెలిచింది. రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్ 'ఎ' ఐదు పరుగుల తేడాతో శ్రీలంక 'ఎ'పై నెగ్గి ఆదివారం జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్ 'ఎ'తో పోటీపడనుంది.

## ఫైనల్లో జోష్నా, అనాహత్

ఇండోర్: ఇండియన్ ఓపెన్ అంతర్జాతీయ స్క్వాష్ టోర్నమెంట్ టైటిల్ భారత క్రీడాకారిణి ఖాతాలోకి వెళ్లనుంది. భారత నంబర్‌వన్, రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్, వెటరన్ స్టార్ జోష్నా చినప్ప టైటిల్ పోరుకు అర్హత సాధించారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో టాప్ సీడ్ అనాహత్ 11-4, 10-12, 9-11, 11-6, 11-4తో మూడో సీడ్ హనా క్రెయిగ్ (ఐర్లాండ్)పై... జోష్నా చినప్ప 7-11, 11-5, 11-7, 11-7తో రెండో సీడ్ నాదీన్ ఎల్‌హమామీ (ఈజిప్ట్)పై గెలిచారు.

**'యాషెస్' తొలి టెస్టు తొలి రోజే 19 వికెట్లు**

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

## క్లుప్తంగా...

### ‘ప్రత్యేక అర్హత’ పరీక్ష ఫలితాలు విడుదల

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని సాంకేతిక విద్యాశాఖలో నాన్ టీచింగ్ విభాగం నుంచి లెక్చరర్లుగా పదోన్నతి పొందిన వారికి నిర్వహించిన ప్రత్యేక అర్హత పరీక్ష ఫలితాలను ఏపీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంచినట్టు ఓ ప్రకటనలో తెలిపింది.

### 24 నుంచి చివరి విడత మాన్యువల్ కౌన్సెలింగ్

**బీఎస్సీ అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీలో మిగిలిన సీట్ల భర్తీ కోసం**

**సాక్షి, అమరావతి:** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు చివరి విడత మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ఎంవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గానూ బైపీసీ విభాగంలో ఏపీ ఎంసెట్–2025 ర్యాంకుల ద్వారా ఈ సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం https://angrau.ac.in/ వెబ్‌సైట్‌ను వీక్షించాలన్నారు.

### 26న స్టూడెంట్స్ అసెంబ్లీ

**నియోజకవర్గానికి ఒకరు చొప్పున 175 మంది ఎంపిక**

**సాక్షి, అమరావతి:** రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న ప్రభుత్వం స్టూడెంట్స్ అసెంబ్లీ నిర్వహించనుంది. ఇందుకోసం వివిధ పోటీలు నిర్వహించి.. ప్రతి నియోజకవర్గం నుంచి ఒకరు చొప్పున మొత్తం 175 మందిని అసెంబ్లీ సభ్యులుగా విద్యాశాఖ ఎంపిక చేసింది. మరో 25 మంది విద్యార్థులను మార్షల్స్‌గా ఎంపిక చేసినట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ నిర్వహణపై వీరికి ఈ నెల 24, 25 తేదీల్లో విజయవాడలో శిక్షణ ఇస్తారు. 26వ తేదీన 175 మంది సభ్యులతో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తారు.

# మార్చి 16 నుంచి ‘పది’ పబ్లిక్ పరీక్షలు

**ఏప్రిల్ 1 వరకు నిర్వహణ**

**ఉదయం 9.30 నుంచి పరీక్షలు ప్రారంభం**

**సాక్షి, అమరావతి:** పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఎస్సెస్సీ–2026 పరీక్షలు మార్చి 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 30వ తేదీ వరకు ప్రధాన పరీక్షలు, ఏప్రిల్ 1 వరకు ఓరియంటల్ పరీక్షలు జరుగుతాయి. 100, 70 మార్కుల పేపర్లకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, 50 మార్కుల పేపర్లకు ఉదయం 9.30 నుంచి 11.30 గంటలకు వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు రాష్ట్ర పరీక్షల విభాగం శుక్రవారం పేపర్ కోడ్ సహా షెడ్యూల్ విడుదల చేసింది.

**ఈ నెల 25 వరకు ఫీజు చెల్లింపునకు గడువు**

పదో తరగతి మార్చి–2026 పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం ఉంది. రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 3వ తేదీ వరకు, రూ.200 రుసుముతో 10 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 15 వరకు అవకాశం కల్పించారు. ఈ తేదీల్లో ఏవైనా ప్రభుత్వ సెలవు దినాలు ఉంటే తదుపరి పని దినాన్ని గడువు తేదీగా పరిగణిస్తారు.

### ఇదీ పది పరీక్షల షెడ్యూల్

| తేదీ | పరీక్ష |
|---|---|
| 16-3-2026 | తెలుగు (గ్రూప్-ఏ), కాంపోజిట్ కోర్సు పేపర్-1 |
| 18-3-2026 | సెకండ్ లాంగ్వేజ్ |
| 20-3-2026 | ఇంగ్లీష్ |
| 23-3-2026 | మ్యాథమెటిక్స్ |
| 25-3-2026 | ఫిజికల్ సైన్స్ |
| 28-3-2026 | బయాలజికల్ సైన్స్ |
| 30-3-2026 | సోషల్ స్టడీస్ |
| 31-3-2026 | కాంపోజిట్ ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2, ఓఎస్ఎస్‌సీ మెయిన్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) |
| 01-4-2026 | ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్/ ఎస్సెస్సీ ఒకేషనల్ కోర్సు థియరీ) |

# పీజీ పరీక్షల నిర్వహణలో బాధ్యతారాహిత్యం

**ఏఎన్‌యూ పీజీ ప్రశ్నాపత్రంలో మూడుచోట్ల ఒకే ప్రశ్న**



Section-B 5 X 8 = 40 M

Answer the following Questions

2. (a) Discuss the background and evolution of taxation law in India.

(or)

(b) Explain how agricultural income is separated from other income for computation purposes.

3. (a) Explain how agricultural income is separated from other income for computation purposes.

(b) Explain the procedure to calculate the annual value of house property for tax purposes.

4. (a) Explain how agricultural income is separated from other income for computation purposes.

ప్రశ్నాపత్రంలో మూడుచోట్ల ఉన్న ఒకే ప్రశ్న

**ఏఎన్‌యూ(పెదకాకాని):** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) పీజీ పరీక్షల నిర్వహణలో అధికారుల బాధ్యతారాహిత్యం మరోసారి బట్టబయలైంది. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన పరీక్షల నిర్వహణలో వరుసగా లోపాలు తలెత్తుతున్నా వాటిని సరిదిద్ది పకడ్బందీగా నిర్వహించడంపై సంబంధిత అధికారులు కనీసం దృష్టి సారించడం లేదనేది శుక్రవారం జరిగిన ఘటనతో స్పష్టమవుతోంది. ప్రశ్నాపత్రంలో ఒకే ప్రశ్న మూడుచోట్ల ఇవ్వడంతో విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. తర్జనభర్జనల తరువాత గంట ఆలస్యంగా మరో ప్రశ్నాపత్రం ఇచ్చి పరీక్షలు రాయించారు. శుక్రవారం ఎం.కామ్ మూడో సెమిస్టర్ కామర్స్ పేపర్‌లో ఒకే ప్రశ్నను 2బీ, 3ఏ, 4ఏగా ఇచ్చారు. దీన్ని చూసి విద్యార్థులు ఆశ్చర్యపోయారు. సమస్యను ఇన్విజిలేటర్‌కు వివరించారు. ప్రశ్నాపత్రాన్ని పరిశీలించిన ఇన్విజిలేటర్ జరిగిన తప్పిదాన్ని పీజీ కో–ఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో గంట ఆలస్యంగా మరో ప్రశ్నాపత్రం ఇచ్చి పరీక్ష రాయించారు.

# డిజిటల్ అరెస్టు పేరిట రూ.23 లక్షల దోపిడీ

**వ్యవసాయ శాస్త్రవేత్తకు సైబర్ నేరగాళ్ల టోకరా**

**నెల్లూరు (క్రైమ్):** సీబీఐ అధికారుల పేరిట ఓ వ్యక్తిని డిజిటల్ అరెస్టు అంటూ భయభ్రాంతులకు గురిచేసిన సైబర్ నేరగాళ్లు అతని నుంచి రూ.23 లక్షలు కొల్లగొట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు రూరల్ మండలంలో వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త ఉంటున్నారు. ఆయనకు ఈ నెల 17న బెంగళూరు అశోక్‌నగర్ పోలీసుస్టేషన్ సీఐని అంటూ ఓ వ్యక్తి ఫోన్‌చేసి మహిళలకు అసభ్యకర ఫొటోలు పంపుతున్నట్లు కేసు నమోదైందని చెప్పాడు. సీబీఐ అధికారులతో మాట్లాడుతున్నట్లు వీడియో కాల్‌లో చూపించి ఆధార్ నంబర్ ఆధారంగా అరెస్టు వారెంట్ జారీ అయిందని భయపెట్టాడు. 18న సీబీఐ అధికారి దయానాయక్ అనే వ్యక్తి ఫోన్‌చేసి మాట్లాడాడు. సబాత్‌ఖాన్ అనే నేరస్తుడు ఇచ్చిన వాంగ్మూలంలో మీ పేరు ఉందని, సుప్రీంకోర్టులో కేసు ఉందని భయపెట్టారు. నిర్దోషి అని నిరూపించుకోవాలంటే తక్షణమే సుప్రీంకోర్టు రిజర్వ్ ఫండ్‌కు రూ.30 లక్షలు డిపాజిట్ చేయాలంటూ శాస్త్రవేత్తను ఒత్తిడికి గురిచేశారు. రెండ్రోజుల పాటు డిజిటల్ అరెస్టుచేసి అతని నుంచి రూ.23,00,117 నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు 1930కు ఫిర్యాదు చేశారు. అలాగే, వేదాయపాళెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆర్టీసీ స్కూల్ బస్సులో మంటలు

**ఉదయగిరి మండలంలో ఘటన**

**ఉదయగిరి రూరల్:** విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నడుపుతున్న ఆర్టీసీ స్కూల్ బస్సులో పొగలు రావడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం బండగానపల్లె పంచాయతీ కొట్టాలు సమీపంలో జరిగింది. ఉదయగిరి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు విద్యార్థులను తీసుకుని సా.5 గంటల సమయంలో గంగులవారి అయ్యవారిపల్లెకి బయల్దేరింది. కొట్టాలు గ్రామానికి రాగానే బస్సులో డ్రైవర్ వద్ద ఉన్న స్విచ్ బోర్డు షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు, పొగలు రావడంతో డ్రైవర్ బస్సును ఆపేశారు. దీంతో విద్యార్థులు బస్సు నుంచి కిందకు దూకి పరుగులు తీశారు. డ్రైవర్ మంటలను అదుపుచేశారు.

# కాకినాడ జీజీహెచ్‌లో ఘోరం

- పడని ఇంజక్షన్ చేయడంతో గర్భిణి మృతి
- మధ్యాహ్నం చనిపోతే అర్ధరాత్రి వరకు చెప్పలేదని మృతురాలి బంధువుల ఆవేదన
- వైద్యుల ఒత్తిడితో అర్ధరాత్రి 12 గంటలకు మృతదేహం తరలింపు

తల్లిని కోల్పోయిన చిన్నారిని పట్టుకొని ఏడుస్తున్న కుటుంబీకులు (ఇన్‌సెట్) మృతిచెందిన మల్లీశ్వరి(ఫైల్)

**కాకినాడ క్రైం:** రోగుల మరణాలతో తరచూ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్న కాకినాడ జీజీహెచ్‌లో తాజాగా మరో ఘోరం జరిగింది. వైద్యుల నిర్లక్ష్యానికి ఒక గర్భిణి బలైపోయింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ సమీపంలోని చినవలసలకు చెందిన మల్లేష్, మల్లీశ్వరి దంపతులు. వీరికి ఐదేళ్ల కుమార్తె ఉంది. మళ్లీ ఎనిమిదోనెల గర్భవతి అయిన మల్లీశ్వరి సాధారణ పరీక్షల కోసం ఈ నెల 14న కాకినాడ జీజీహెచ్‌లో చేరింది. ఆ సమయంలో తనకు పడని మందుల జాబితాను వైద్యులకు ఇచ్చింది. ఆరోగ్యం పట్ల అంత అప్రమత్తంగా ఉన్న మల్లీశ్వరిని అక్కడి వారు అభినందించారు. ఆమెకు సరిపడని మందుల వివరాలు కేస్ షీటులో రాసుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఆమె తనకు పడదని రాసిచ్చిన పాంటాప్రాజోల్ ఇంజక్షన్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో బాధితురాలి వదిన, ఏఎన్ఎం అయిన ధనలక్ష్మి ఆ ఇంజక్షన్ మల్లీశ్వరికి పడదని, చేయవద్దని అడ్డుపడ్డారు. అయినా వినకుండా డాక్టరు ఆ ఇంజక్షన్ చేశారు. కొద్దిసేపటికే మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కుప్పకూలిన మల్లీశ్వరిని జీఐసీయూకు తరలించారు. మధ్యాహ్నం మూడుగంటల సమయానికి ఆమె గర్భంలోని శిశువు గుండె ఆగిపోయిందని కుటుంబ సభ్యులకు వైద్యులు చెప్పారు. అప్పటికే ఆమె అపస్మారకస్థితికి చేరుకుంది. వైద్యులు ఆమెకు అరగంటకు ఒకసారి సీపీఆర్ చేశారు. దీంతో ధనలక్ష్మి.. మల్లీశ్వరికి ఏమైందో చెప్పాలని, తమవారిని పిలుస్తానని చెప్పారు. ఎవ్వరినీ పిలవొద్దని, బీపీ కాస్త అసాధారణంగా ఉందని వైద్యులు తెలిపారు. చివరకు రాత్రి 11గంటల సమయంలో మల్లీశ్వరి చనిపోయిందని చెప్పారు. మల్లీశ్వరి మధ్యాహ్నం చనిపోతే కావాలనే వైద్యులు దాచిపెట్టారని, ఎవరూ రారని, ఎటువంటి సహాయమూ లభించే అవకాశం లేదని, ప్రశ్నించి నిలదీసే ఆస్కారం ఉండదనే ఉద్దేశంతోనే అర్ధరాత్రి చెప్పారని మల్లీశ్వరి భర్త మల్లేష్, వదిన ధనలక్ష్మి విలపించారు. వైద్యులు చేసిన ఇంజక్షన్ సీసాను తీసుకుంటుంటే సిబ్బంది అడ్డగించారని తెలిపారు. గొడవేమీ చేయవద్దని, అలా చేస్తే కేసు నమోదవుతుందని, పోస్టుమార్టం చేసి గర్భిణి దేహాన్ని కోయాల్సి ఉంటుందని భయపెట్టారని చెప్పారు. నిస్సహాయస్థితిలో మల్లీశ్వరి మృతదేహాన్ని అర్ధరాత్రి వేళ కాకినాడ నుంచి ఇంటికి తీసుకెళ్లాల్సి వచ్చిందని కన్నీరుమున్నీరయ్యారు.

# మయన్మార్ నుంచి స్వదేశానికి సైబర్ బాధితులు

**సాక్షి, అమరావతి:** మయన్మార్ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లో ఇరుక్కుపోయిన 370 మంది భారతీయులను శుక్రవారం అధికారులు మూడు విమానాల్లో స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చారు. ఇందులో 55 మంది విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన వారున్నారు. ఇప్పటి వరకు 78 మంది సైబర్ బాధితులను ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్టీఎస్) మయన్మార్ నుంచి రాష్ట్రానికి చేర్చింది.

Toyota Mobility Service — Conversion | Fleet | Leasing — TOYOTA TRUST — TOYOTA FINANCIAL SERVICES

**Lakshmi Toyota**
Guntur: 7331100607
Machilipatnam: 7331100729; Ongole: 7331100717
Vijayawada: 7331100748; Visakhapatnam: 8977738142

**Harsha Toyota**
Anantapur, Kadapa, Kurnool, Nellore, Tirupati: 8008202248, 08776682121

**Mody Toyota**
Srikakulam, Visakhapatnam: 8096012222

**Pruthvi Toyota**
Kakinada: 7330836668
Rajamahendravaram: Lalacheruvu: 7330826668
4th Bridge Road: 9063766650
Vijayawada: 9996664264, 8712628427


Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ఆకర్షిస్తున్న తాటిపూడి అందాలు

తాటిపూడి రిజర్వాయర్‌లో జలవిహారం

బోటు ఎక్కుతున్న పర్యాటకులు

రిజర్వాయర్‌లో ఫ్లోటింగ్ జెట్టీ

విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలోని గొర్రిపాటి బుచ్చి అప్పారావు రిజర్వాయర్ (తాటిపూడి) అందాలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. బోటు షికారు కొత్త అనుభూతిని పంచుతోంది. రిజర్వాయర్ అందాలు తిలకించేందుకు, ఇక్కడ ఉన్న కాటేజీల్లో విడిది చేసేందుకు సందర్శకులు క్యూ కడుతున్నారు.

- సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

రిజర్వాయర్ ముఖ ద్వారం

రిజర్వాయర్‌లో బోటు షికారు

## ఏపీలో ఎర్రచందనం పరిరక్షణకు రూ. 39.84 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో అటవీ సంపద పరిరక్షణ కోసం జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) భారీగా నిధులు విడుదల చేసింది. ఎర్రచందనం పరిరక్షణ, అభివృద్ధి కోసం మొత్తం రూ.39.84 కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో రూ.38.36 కోట్లను ఏపీ అటవీ శాఖకు, రూ.1.48 కోట్లను ఏపీ జీవవైవిధ్య మండలికి బదిలీ చేశారు. ఎర్రచందనం కలప విక్రయాలు, వేలం ద్వారా వచ్చిన ఆదాయంలో వాటాను తిరిగి ఆ వృక్షజాతి పరిరక్షణకే వెచ్చించారు. దీంతో దేశవ్యాప్తంగా ఎన్‌బీఏ కింద విడుదలైన నిధుల మొత్తం రూ.110 కోట్లు దాటింది. ఈ నిధులను అటవీ సిబ్బంది, ఫ్రంట్‌లైన్ ఫోర్స్‌ను బలోపేతం చేయడం, ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకోవడానికి పటిష్ట రక్షణ చర్యలు, అడవుల శాస్త్రీయ నిర్వహణ, దీర్ఘకాలిక పర్యవేక్షణ, బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి వినియోగిస్తారు. మరోవైపు, అటవీయేతర ప్రాంతాల్లో కూడా ఎర్రచందనం సాగును ప్రోత్సహించేందుకు ఎన్‌బీఏ 'లక్ష ఎర్రచందనం మొక్కల పెంపకం' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఏపీలోని 198 మంది రైతులకు రూ.3 కోట్లు, తమిళనాడులోని 18 మంది రైతులకు రూ.55 లక్షల మేర ప్రోత్సాహకాలను పంపిణీ చేసింది.

## కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలి: డీవైఎఫ్‌ఐ

సాక్షి, అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు తక్షణమే శిక్షణ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్న శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 2022 నవంబరు 28న 6,100 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. అర్హత పరీక్షలో 95,208మంది అర్హత సాధించారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం 2025 జనవరి, ఫిబ్రవరిలో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించిందని, అందులో 40 వేల మంది అర్హత సాధించారని తెలిపారు. జూన్‌లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించి ఆగస్టులో రిజల్ట్స్ ఇచ్చారన్నారు. మెడికల్ టెస్ట్‌లు సైతం నిర్వహించి రెండు నెలలకుపైగా అయ్యిందన్నారు. ఇప్పటికే అభ్యర్థులు మానసిక ఒత్తిడికి గురౌతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆర్భాటం కోసం నిరుద్యోగులను ఇలా బలి చేయడం సరి కాదన్నారు. తక్షణమే ట్రైనింగ్ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలని, లేని పక్షంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని రాము, రామన్న హెచ్చరించారు.

## హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి: సీపీఐ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దాదాపు 16వేల మంది హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలోని హోంగార్డులకు రోజుకు రూ.1,124 వేతనం ఇవ్వాలని, యూనిఫామ్, వాషింగ్, కవాతు అలవెన్స్, టీఏ, డీఏలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలన్నారు. హోంగార్డుల కుటుంబాలకు 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాల మంజూరుతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పదవీ విరమణ చేసిన హోంగార్డులకు రిటైర్మెంట్ బెనిఫిట్ తోపాటు పెన్షన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు.

### స్థానిక ఎన్నికల్లో పోటీకి సీపీఐ సన్నద్ధం

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీపీఐ శ్రేణులు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. విజయవాడలో జరిగిన పార్టీ నగర కార్యవర్గ సమావేశంలో శుక్రవారం ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్నందున విజయవాడ నగరంలోని డివిజన్లతోపాటు మున్సిపల్, పంచాయతీల్లోనూ పోటీకి సన్నద్ధం కావాలన్నారు.

## మిథున్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ 24కు వాయిదా

విజయవాడ లీగల్: పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు వీలుగా బెయిల్ షరతులను సడలించాలంటూ ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను ఏసీబీ కోర్టు ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. అలాగే మద్యం అక్రమ కేసులో చెరుకూరు వెంకటేశ్‌నాయుడు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్లపై విచారణను ఈనెల 25వ తేదీకి వాయిదా వేస్తూ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు ఉత్తర్వులిచ్చారు.

## ఇద్దరు మైనర్ మావోయిస్టులకు రిమాండ్

విజయవాడ లీగల్: ఇటీవల విజయవాడ శివారు కానూరు ఆటోనగర్‌లో అరెస్టయిన మావోయిస్టులలో ఇద్దరు మైనర్లను పోలీసులు శుక్రవారం విజయవాడ జువైనల్ న్యాయస్థానంలో హాజరుపరిచారు. వారిలో బాలికను విజయవాడ జువైనల్ హోమ్‌కు.. బాలుడిని వైజాగ్ జువైనల్ హోమ్‌కు తరలించారు. న్యాయమూర్తి వీరికి వచ్చేనెల 2 వరకు రిమాండ్ విధించారు.

## దేవ్‌జీ, రాజిరెడ్డిలు పోలీసుల అదుపులో ఉన్నారనే ఆధారాల్లేవ్: హైకోర్టు

సాక్షి, అమరావతి: మావోయిస్టు పార్టీ అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారనేందుకు ప్రస్తుతానికి తమ ముందు ఎలాంటి ప్రాథమిక ఆధారాలను ఉంచలేదని, అందువల్ల ఇందుకు సంబంధించి దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై తాము ఎలాంటి సానుకూల ఉత్తర్వులు ఇవ్వడం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆధారాలున్నప్పుడు తిరిగి కోర్టును ఆశ్రయించేందుకు వెసులుబాటునిస్తూ పిటిషన్ విచారణను ముగించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ తుహిన్ కుమార్ ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిలను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, వారిని కోర్టు ముందు హాజరుపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దేవ్‌జీ సోదరుడు తిప్పిరి గంగాధర్, రాజిరెడ్డి కుమార్తె స్నేహలత దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.

## మద్యం అక్రమ కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ లీగల్: మద్యం అక్రమ కేసులో నిందితుల రిమాండ్ శుక్రవారంతో ముగియడంతో విజయవాడ జైలులో ఉన్న రాజ్ కేసిరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేష్ నాయుడు, బూనేటి చాణక్య, అనిల్ చోక్రా.. గుంటూరు జైలులో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలను శుక్రవారం ఏసీబీ న్యాయస్థానం ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి నిందితులకు వచ్చే నెల 5వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరితోపాటు ఇదే కేసులో బెయిల్‌పై ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి, పైలా దిలీప్ కూడా న్యాయస్థానంలో హాజరయ్యారు.

## పీఎస్ హెచ్‌ఎం/ఎస్‌ఏలను స్కూల్ అసిస్టెంట్లుగానే కొనసాగించండి

**విద్యాశాఖకు ఏపీపీఎస్ హెచ్‌ఎం ఫోరం విజ్ఞప్తి**

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం/ఎస్‌ఏ పోస్టుల కేడర్‌లో చేరిన స్కూల్ అసిస్టెంట్లను యూడైస్‌లో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా కేడర్ మార్చడాన్ని ఏపీపీఎస్ హెచ్‌ఎం ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. పీఎస్ హెచ్‌ఎం/ఎస్‌ఏ పోస్టును కోరుకున్న వారందరినీ స్కూల్ అసిస్టెంట్లుగానే యూడైస్‌లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలా కానిపక్షంలో డిజిగ్నేషన్ పీఎస్ హెచ్‌ఎం/ఎస్‌ఏగానే యూడైస్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్జీటీ నుంచి పదోన్నతి పొందిన వారందరినీ పీఎస్ హెచ్‌ఎం/ఎస్‌ఏగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండా యూడైస్‌లో డిజిగ్నేషన్ మార్పు చేయొద్దని కోరారు. ఈ విధానంపై ఫ్యాప్టో, జాక్టో ఉమ్మడి వేదికలు, ఇతర ఉపాధ్యాయ సంఘాలు స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నాకు భద్రత కల్పించేలా ఆదేశాలివ్వండి

**హైకోర్టులో పాత్రికేయుడు శ్రీనివాసులు పిటిషన్**

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో రూ.72వేల విలువైన 900 డాలర్ల చోరీ కేసులో సీఐడీ దర్యాప్తు కోరుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన తనకు ప్రాణహాని ఉందని, తగిన భద్రతను కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ తిరుపతికి చెందిన తిరుపతి వార్తపత్రిక సంపాదకుడు ఎం.శ్రీనివాసులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై స్పందించాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను శనివారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినందుకు తనకు బెదిరింపులు వస్తున్నాయని, అందువల్ల తగిన భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 15న పోలీసులకు వినతిపత్రం ఇచ్చానని శ్రీనివాసులు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పోలీసులు ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. అందుకే భద్రత కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశానని తెలిపారు.

## పారదర్శకంగా రీ సర్వే జరగాలి

**శాసన సభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామకృష్ణరాజు**

మహారాణిపేట(విశాఖ జిల్లా): పదేపదే తలెత్తుతున్న భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమగ్ర ప్రణాళికతో కార్యాచరణ రూపొందించాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డులు, రెవెన్యూ శాఖ అధికారులను రాష్ట్ర శాసన సభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు ఆదేశించారు. సభ్యులు కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజులతో కలిసి శుక్రవారం విశాఖ జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమగ్ర భూ రీసర్వే, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, రికార్డుల నిర్వహణ, సరిహద్దుల గుర్తింపు, అభ్యంతరాల స్వీకరణ, సమస్యల పరిష్కారంలో కలెక్టర్, జేసీ, ఆర్డీవో, తహసీల్దార్ల పాత్ర, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల వర్గీకరణ, సర్వే ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుల కమిటీ చైర్మన్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే ప్రక్రియ మొత్తం సాగాలన్నారు.

## చిన్నారుల కోసం కొత్తగా 15 న్యూట్రిషన్ కేంద్రాలు

**మంత్రి సత్యకుమార్**

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ముఖ్యమైన 15 ప్రభుత్వాసుపత్రుల్లో 'న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్స్' (ఎన్.ఆర్.సి.లు) త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లలోపు వయస్సు కలిగిన చిన్నారులకు ఈ కేంద్రాల ద్వారా సేవలందుతాయి. వీటిలో 11 కేంద్రాలు గిరిజన ప్రాంతాల్లో వస్తాయని పేర్కొన్నారు. వీటన్నిటిలో కలిపి 115 పడకలు చిన్నారులకు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. అల్లూరి జిల్లా అరకు ఏరియా ఆసుపత్రి, ముంచంగిపుట్టు, చింతపల్లి సీహెచ్‌సీల్లో వచ్చే ఈ సెంటర్లలో 10 చొప్పున పడకలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా ఆస్పత్రి, బాపట్ల, పల్నాడు ఏరియా ఆసుపత్రులు, పల్నాడు జిల్లా నరసరావుపేట ఏరియా ఆసుపత్రి, నంద్యాల జిల్లా నంద్యాల బోధనాసుపత్రి, సున్నిపెంట ఏరియా ఆసుపత్రిలో వచ్చే కేంద్రాల్లో కూడా 10 చొప్పున పడకలతో పాటు ప్రతి ఆసుపత్రిలో ప్రత్యేకంగా వార్డులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

## బీజేపీ నేతలకు 25 నుంచి శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీజేపీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు రాష్ట్ర పార్టీ జోన్ల వారీగా మండల, ఆ పైస్థాయి పార్టీ నేతలకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 25న నెల్లూరులో కోస్తాంధ్ర జోన్, 27న రాజమహేంద్రవరంలో గోదావరి జిల్లాల జోన్, 28న విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర జోన్, 29న కడపలో రాయలసీమ జోన్ శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించింది.

## 'లేబర్ కోడ్‌లపై నేడు రాష్ట్ర వ్యాప్త నిరసన'

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను నోటిఫై చేయడాన్ని సీఐటీయూ ఏపీ కమిటీ తీవ్రంగా ఖండించింది. దీనికి నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా నోటిఫై కాపీలను దహనం చేయాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపు ఇచ్చారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్‌ల కోసం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారని ఆరోపించారు.

## డిసెంబర్‌లో తమిళనాడు, కేరళ సందర్శనకు మత్స్యకారులు: పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మత్స్యకారులను డిసెంబర్‌లో తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు తీసుకువెళ్లి అక్కడ విజయవంతమైన కృత్రిమ రీఫ్ కల్చర్, కోస్టల్ టూరిజం యూనిట్ల సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ జిల్లా మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల ప్రణాళికను అమలు చేసేందుకు రోడ్ మ్యాప్ తుది దశకు చేరిందని పేర్కొన్నారు.

## అప్రూవర్లుగా మారతాం.. ముందస్తు బెయిలివ్వండి

**హైకోర్టులో వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ పిటిషన్లు**

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసులో నిందితులుగా ఉన్న తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ పూర్వ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎక్సైజ్ శాఖ మాజీ స్పెషల్ ఆఫీసర్ దొడ్డా వెంకట సత్యప్రసాద్‌లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప శుక్రవారం విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ఈ కేసులో పిటిషనర్లు అప్రూవర్లుగా మారడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పూర్తి వివరాలను సమర్పించడానికి సమయం ఇవ్వాలని ఏపీపీ కోరడంతో విచారణను కోర్టు ఈ నెల 28కి వాయిదా వేసింది.

## మీ ప్రేమ కోసం.. రెక్కలు కట్టుకు వచ్చేశాం!

హాయ్.. గుర్తున్నామా?. మేమేనండీ.. వలస విహంగాలం. మా పుట్టిల్లు ఐరోపా ఖండం. వీసా..పాస్ పోర్టు.. తనిఖీలు.. ఇలాంటి ప్రతిబంధకాలేమీ మాకు లేవు. అందుకే మెట్టినింటి లాంటి పులికాట్ సరస్సుకు రెక్కలు కట్టుకుని.. రివ్వున ఎగిరి.. ఖండాంతరాలు దాటి వచ్చేశాం. పులికాట్ సరస్సే మా విడిది. ఆటా..పాటా.. తిండీ తిప్పలు అన్నీ ఇక్కడే.. అన్నట్లు విదేశీ వలస విహంగాలు సందడి చేస్తున్నాయి.

- సూళ్లూరుపేట, తిరుపతి జిల్లా



సాక్షి ప్లస్
శనివారం। 22-11-2025

పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేసే మేడిపల్లి ఓసీపీ క్వారీ

ఓసీపీల్లో బొగ్గు వెలికితీస్తున్న షావల్

# విశ్వవిపణిలో సింగరేణి

**రెండు కీలక కార్పొరేషన్లకు శ్రీకారం • ముమ్మర కసరత్తు చేస్తున్న యాజమాన్యం • ఈ ఏడాది చివరికి తుదిరూపు వచ్చే చాన్స్**

గోదావరిఖని: విశ్వవిపణిలో వ్యాపార విస్తరణకు సింగరేణి బొగ్గు గనుల సంస్థ శ్రీకారం చుట్టింది. దీనికోసం రెండు కీలక కార్పొరేషన్లను ఏర్పాటు చేసేందుకు పావులు కదుపుతోంది.. సింగరేణి అంటేనే బొగ్గు గనుల సంస్థ.. దీనికి సమాంతరంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయిలో విస్తరించాలని యోచిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి కార్పొరేషన్లకు తుదిరూపు రానున్నట్లుగా తెలుస్తోంది.

**బొగ్గు గనులకు ప్రసిద్ధి..**

సింగరేణి బొగ్గు గనుల తవ్వకంలో ప్రసిద్ధి గాంచింది. దేశంలో పది రాష్ట్రాలతోపాటు ఇక అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాల నిర్వహణకు కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ క్రమంలోనే సింగరేణి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (పునరుత్పాదక విద్యుత్ రంగం), సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ (అంతర్జాతీయ మైనింగ్, ఖనిజ అన్వేషణ) కోసం అనుబంధ సంస్థలు ఏర్పాటు చేస్తోంది. సింగరేణి గ్రీన్ఎనర్జీ ద్వారా సుమారు 5,000 మెగావాట్ల రీన్యూవబుల్ విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ ద్వారా అంతర్జాతీయంగా ఖనిజ అన్వేషణ, మైనింగ్ – విదేశీ పెట్టుబడులు పొందడం లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

**హైదరాబాద్‌లో కార్యాలయం**

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో సింగరేణి అంతర్జాతీయ కార్యాలయం ఏర్పాటుకు సిద్ధమైంది. అరుదైన ఖనిజాల(లిథియం, టైటానియం) అన్వేషణ, అంతర్జాతీయ ఒప్పందాల కేంద్రంగా ఇది పనిచేస్తుంది. ప్రణాళికలు, కార్మిక సంక్షేమం, కొత్త కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంతోపాటు దేశానికి సాంకేతికత, ఉపాధి, పెట్టుబడులు రానున్నాయి.


సింగరేణి థర్మల్ ప్లాంట్

**కార్పొరేషన్ ఏర్పాటుతో ప్రయోజనాలు..**

సింగరేణిలో కార్పొరేషన్ల ఏర్పాటుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని అధికారులు అంటున్నారు. లాభాల వివరాల విస్తరణ, పొరుగు రాష్ట్రాలు, విదేశాలు, అంతర్జాతీయ మార్కెట్లలో కూడా కార్యకలాపాలు నిర్వహించవచ్చు. దీనిద్వారా కొత్త ఆదాయ మార్గాలు రానున్నాయి.

**బహుళ రంగాల్లో ప్రవేశం**

బొగ్గు తవ్వకంతో పాటు రీన్యూవబుల్ ఎనర్జీ, మైనింగ్, పవర్ జనరేషన్ వంటి రంగాల్లో ఉద్యోగాలు, ఆదాయం పెరుగుతాయి. ఉత్పత్తి వ్యయాల్లో తగ్గింపు, పాత సాంకేతికతకు స్వస్తి పలికి పోటీకి అనుగుణంగా కొత్త టెక్నాలజీ, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు కార్పొరేట్ విధానాలు ఉపయోగపడతాయి. లాభాలు పెరిగితే ఉద్యోగుల సంక్షేమానికి, ఆయా ప్రాంతాల్లో హాస్పిటల్, స్కూల్, హౌసింగ్ వంటి వాటిలో పెట్టుబడులు పెరుగుతాయి.

**ఈ ఏడాది చివరినాటికి తుదిరూపం**

సింగరేణి గ్రీన్ఎనర్జీ లిమిటెడ్ ద్వారా ఇప్పటికే సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. భవిష్యత్‌లో హైడల్, హైడ్రో, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టనుంది. ప్రస్తుతం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న సింగరేణి.. సంప్రదాయ విద్యుదుత్పత్తిపై దృష్టి సారించింది. సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ కార్పొరేషన్ ద్వారా అంతర్జాతీయస్థాయిలో ఖనిజ అన్వేషణ, మైనింగ్ ఏర్పాటు చేస్తారు. ఈ రెండు కార్పొరేషన్ల ఏర్పాటుకు ఇప్పటికే ప్రణాళికలు పూర్తయ్యాయి. ఈ ఏడాది చివరి నాటికి వీటికి తుదిరూపు వస్తుందని సీఎండీ ఎన్.బలరాం ఇటీవల వెల్లడించారు.

**నీతి ఆయోగ్‌లో సింగరేణికి చోటు**

కీలక ఖనిజ రంగానికి గుర్తింపు ఇస్తూ కేంద్రప్రభుత్వం నీతి ఆయోగ్‌లో సింగరేణికి సభ్యత్వం కల్పించింది. ఈ క్రమంలో సంస్థ సీఎండీ బలరాం నీతి ఆయోగ్‌లో సభ్యత్వం పొందారు. ఇప్పటికే ఆస్ట్రేలియా, రష్యా వంటి విదేశాలతో ఖనిజ వ్యాపార విస్తరణ అవకాశాలపై చర్చలు జరుపుతున్నారు.

### అంతర్జాతీయంగా విస్తరణ

సింగరేణిలో రెండు కార్పొరేషన్ల ఏర్పాటు ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విస్తరణ జరుగు తుంది. పెట్టుబడులు పెరుగుతాయి. భవిష్యత్‌లో బహుళ రంగాల్లో విస్తరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

– ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి

## నిఖత్ జరీన్‌కు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ 9 స్వర్ణ పతకాలను సాధించడం పట్ల కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణ తేజం నిఖత్ జరీన్ స్వర్ణ పతకం గెలుచుకోవడం పట్ల ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది భారత క్రీడాకారులకు ఒక స్ఫూర్తిదాయక విజయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన విజేతలందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## నిఖత్ జరీన్ తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణం

**గోల్డ్ మెడల్ సాధించిన బాక్సర్ నిఖత్ జరీన్‌ను అభినందించిన డీజీపీ**

సాక్షి, హైదరాబాద్: ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో తెలంగాణ స్పెషల్ పోలీస్ డీఎస్పీ, బాక్సర్ నిఖత్ జరీన్ బంగారు పతకం సాధించడంపై డీజీపీ శివధర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. మహిళల 51 కేజీల ఫైనల్ పోటీలో నిఖత్ తన ప్రత్యర్థిపై 5–0 తేడాతో ఘన విజయం సాధించడం ఆమె సామర్థ్యానికి, అంకితభావానికి నిదర్శనమని డీజీపీ ప్రశంసించారు. 'గోల్డ్ మెడల్ సాధించి, తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిన నిఖత్ జరీన్‌కు అభినందనలు. క్రీడల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన నిఖత్ విజయం ఇతర క్రీడాకారులకు ఆదర్శం'అని డీజీపీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ పోలీస్ కుటుంబం తరఫున నిఖత్ జరీన్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీజీపీ ఆకాంక్షించారు.

## దిగజారుడు మాటలు సమంజసం కాదు

**రాజమౌళి వ్యాఖ్యలను ఖండించిన వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ బాలస్వామి**

సాక్షి, హైదరాబాద్: ఆంజనేయుడి విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రముఖ దర్శకుడు రాజమౌళి స్థాయిని మరిచి ప్రవర్తించారని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి విమర్శించారు. తాను నాస్తికుడినని, దేవుడిపై విశ్వాసం లేదంటూనే ఆంజనేయ స్వామి ప్రస్తావన తీసుకువచ్చి హిందుత్వాన్ని కించపరిచేలా మాట్లాడటంతో తన స్థాయిని తాను తగ్గించుకున్నాడని పేర్కొన్నారు. ఇటీవల వారణాసి సినిమా పేరు ప్రకటన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంజనేయస్వామిని విమర్శించినట్టు మాట్లాడి హిందువుల మనోభావాలను గాయపరిచారన్నారు. ఆంజనేయ స్వామి భక్తులకు, హిందూ సమాజానికి రాజమౌళి వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# కథ ముగిసింది... కల చెదిరింది...

**• మావో దాడుల్లో హిడ్మాది ప్రత్యేక శైలి**

**పారా మిలిటరీకి సవాల్‌గా నిలిచిన హిడ్మా • 'హిడ్మా' వల్లే ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు**

**• ఆయన మరణంతో సాయుధ పోరాటంపై సన్నగిల్లుతున్న ఆశలు**

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏపీలో ఇటీవల జరిగిన ఎదురుకాల్పుల్లో హిడ్మా మృతితో విప్లవ శ్రేణుల్లో తీవ్ర నైరాశ్యం అలముకుంది. రాజ్యాంగ పరిధిలోని కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి కగార్‌ను ఆపేయాలంటూ లేఖ విడుదల చేశాయి. సాయుధ పోరాటం మరో కొత్త రూపం తీసుకుంటుందని చెబుతూ.. రాబోయే మార్పునకు ముందస్తు సంకేతాలను విప్లవ శ్రేణులు అందిస్తున్నాయి. ఇదే సమయాన హిడ్మా మరణంతో దేశంలో మావోయిస్టులది ముగిసిన అధ్యాయమేనంటూ కమ్యూనిస్టు వ్యతిరేకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా కగార్ మొదలయ్యాక జరిగిన నష్టాలన్నీ ఒక ఎత్తయితే.. హిడ్మా మరణం మరో ఎత్తు అన్నట్టు ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయి.

### మావో బాటలో గెరిల్లా వార్

మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ హోదాలో నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మరణం, పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు ఆయుధాలతో సహా లొంగిపోగా.. మరో అగ్రనేత తక్కళ్లపల్లి వాసుదేవరావు ఏకంగా 210 మంది అనుచరులతో అడవిని వీడాడు. ఇలా వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నా విప్లవ శ్రేణుల్లో ఆశలు కొడిగట్టిపోకుండా ఉండడానికి ప్రధాన కారణం మడ్వి హిడ్మా. ఆయన ఉంటే చాలు సాయుధ పోరాటం మళ్లీ గాడిన పడుతుందనే నమ్మకం వారిలో ఉండేది. మార్క్స్, లెనిన్ తదితర విప్లవ గురువులు చెప్పిన కమ్యూనిజం గురించి హిడ్మాకు పెద్దగా తెలియదంటూ మాజీ మావోలు, ఛత్తీస్‌గఢ్ పోలీస్ బాస్‌లు, స్థానిక ఆదివాసీ నేతలు బహిరంగంగానే విమర్శలు చేసేవారు. అయినప్పటికీ హిడ్మాపై విప్లవకారులు నమ్మకం కోల్పోలేదు. ఎందుకంటే మావో సేటూంగ్ చూపిన గెరిల్లా యుద్ధతంత్రాన్ని అమలుచేస్తూ సాయుధ పోరాటాన్ని దండకారణ్యంలో మరో ఎత్తులకు తీసుకెళ్లింది హిడ్మానే. అందుకే ఆయన మరణంతో సాయుధ పోరాటం రూపురేఖలు, దశాదిశ మారిపోయే పరిస్థితి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**మీడియాకు హాట్ టాపిక్**

హిడ్మాకు ముందు తరం మావోయిస్టులు.. పోలీసులు, అటవీ శాఖతోనే ఎక్కువగా పోరాడగా, ఏకంగా పారా మిలిటరీ సైన్యానికే సవాల్ విసిరిన చరిత్ర హిడ్మాది. అంబూష్ దాడులు చేసి జవాన్లనే బందీలుగా పట్టుకున్న తీరు ఇప్పటికీ ఆశ్చర్యకరమే. ఈ బందీలను విడిపించేందుకు మరోసారి అడవిలోకి వెళ్లే సాహసం పారా మిలిటరీ బలగాలే చేసేవి కావు. మీడియా ప్రతినిధుల ద్వారానే బందీలను విడిపించుకునేవి. అందుకే మీడియా వర్గాలకు హిడ్మా ఒక హాట్ టాపిక్‌గా మారాడు. దీంతో టాస్క్‌ఫోర్స్, జాయింట్ టాస్క్‌ఫోర్స్, బస్తర్ ఫైటర్స్, కోబ్రా వంటి ప్రత్యేక దళాల అవసరం పడింది. బీఎస్ఎఫ్, ఐటీబీటీల వంటి మిలిటరీ విభాగాలను రంగంలోకి దించాల్సిన పరిస్థితి ఎదురైంది. అయినా పట్టు దొరక్క.. మాజీ మావోయిస్టులతో ఏర్పడిన డీఆర్‌జీ వంటి లోకల్ దళాలు కూడా యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో భాగమయ్యాయి.

**మిలిటరీ అయినా జాగ్రత్తలు తప్పలేదు**

హిడ్మా నేతృత్వాన చేసిన దాడులతోనే పీఎల్‌జీఏకు భారీ ఎత్తున ఆధునిక ఆయుధాలు సమకూరాయి. ఆయన అండతోనే దక్షిణ బస్తర్ సబ్‌జోన్‌గా పేర్కొనే సుక్మా, బీజాపూర్ జిల్లాల సరిహద్దులో జనతన సర్కార్లు ఏర్పాటయ్యాయి. ఈ సర్కార్లను నిర్వీర్యం చేసేందుకు జోన్‌లో ప్రతీ నాలుగు కిలోమీటర్లకు ఒక క్యాంపు వంతున ఏర్పాటు వ్యూహాన్ని బలగాలు అమలు చేశాయి. అయితే, దేశంలో మిగిలిన క్యాంప్‌లతో పోలిస్తే అత్యంత కట్టుదిట్టమైన రక్షణ చర్యలు ఇక్కడ తీసుకోవాల్సి వచ్చింది. ప్రతీ క్యాంపు చుట్టూ ప్రహరీ, అవతల ట్రెంచ్‌తో పాటు మూడు వరుసల ముళ్ల కంచెలు ఉంటాయి. ప్రతీ క్యాంప్ చుట్టూ నలువైపులా రెండు ఎకరాలకు విస్తీర్ణానికి తగ్గకుండా చుట్టూ దట్టంగా ఉన్న అడవిని నరికి మైదాన ప్రాంతంలా మార్చి, నలువైపులా రాత్రి పూట స్పష్టంగా కనిపించేలా ఫ్లడ్ లైట్లు వెలిగేలా ఏర్పాట్లు చేశారు. రాకెట్ లాంచర్లతో దాడి జరిగితే నష్టాన్ని తగ్గించేందుకు వీలుగా క్యాంప్‌లో ఉండే రేకుల షెడ్డు బ్యారక్‌లపైన ఇనుప జాలీలను ఏర్పాటు చేశారు. రాత్రివేళ దాడులను అరికట్టేందుకు ఆకాశంలో వెలుతురు విరజిమ్మే ఫ్లేవర్ బాంబులను అందుబాటులో పెట్టారు. దాడుల్లో గాయపడిన జవాన్లకు సత్వర వైద్యసాయం అందించేందుకు వీలుగా ప్రతీ క్యాంప్‌లో ఒక హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. డ్రోన్ల సాయంతోనే కూంబింగ్‌లు చేపట్టారు. మందుపాతరలను కనిపెట్టేందుకు స్నైపర్ డాగ్స్‌ను కూంబింగ్‌లో తోడుగా తీసుకెళ్తున్నారు.

## టెంపుల్ టౌన్ జాబితాలో మరో ఆలయం

**మహోజ్వలిత చరితకు మారుపేరు... మంత్రపురి దేవాలయాలు**

- ప్రపంచంలోనే ఏకైక సత్యసాయి సుందరమందిరం
- దక్షిణ భారతదేశంలోనే పశ్చిమ ముఖం గల శివలింగం
- తాజాగా టీటీడీ నూతన ఆలయాల్లో మంథనికి చోటు

అష్టభుజ వినాయకుడి దేవాలయం

మంథని: ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచిన మంత్రపురి వేదాలకు పుట్టినిల్లు. వేయి సంవత్సరాలకు పైగా మహోన్నత చరిత్ర కలిగిన మంత్రపురి దేవాలయాలకు నిలయమై టెంపుల్ టౌన్‌గా కూడా ప్రసిద్ధికెక్కింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా అష్టభుజ వినాయకుని గుడి, దక్షిణ భారతదేశంలో ఏకైక పశ్చిమముఖ శివలింగం పెద్దపల్లి జిల్లా మంథనిలోనే దర్శనమిస్తాయి. మంథనిలో ఒక్క వేంకటేశ్వర స్వామి ఆలయం మినహా అన్నిదేవతల ఆలయాలను పురాణకాలంలోనే నిర్మించారు. ఇటీవల మరిన్ని దేవాలయాలు వెలిశాయి. తాజాగా గురువారం తెలంగాణలో కొత్తగా మూడు దేవాలయాలు నిర్మించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ ప్రకటించారు. ఇందులో కరీంనగర్, దుబ్బాక, మంథనికి చోటు కల్పించారు. కాగా మంథని మండలం కన్నాల గ్రామంలో సెంటిమెంట్ టెంపుల్‌గా పేరున్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఉంది. కానీ, టీటీడీ దేవాలయ నిర్మాణంలో మంథనిలో అన్ని దేవాలయాలకు ప్రసిద్ధిగా పరిఢవిల్లనుంది.

**అన్ని దేవతామూర్తుల ఆలయాలు**

ప్రసిద్ధి గాంచిన మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయంతోపాటు కన్యకా పరమేశ్వరి, లలితాదేవి, సరస్వతీ అమ్మవారి దేవాలయాలు ఇక్కడ కొలువై ఉన్నాయి. అలాగే 11 పురాతన హనుమాన్ దేవాలయాలతో పాటు నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయం.. దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా పశ్చిమ ద్వారం, పశ్చిమ ముఖం కలిగిన శివలింగం మంథనిలో మాత్రమే ఉంది. మరో ఐదు శివాలయాలు ఉన్నాయి. మంథని పట్టణానికి ఉత్తర ముఖంలో వెలసిన మహాగణపతి ఆలయం భక్తులకు అభయమిస్తూ పూజలు అందుకుంటోంది. పూజల్లో మొదటి ఆదిదేవుడైన గణపతినే కొలుస్తారు. ఇక్కడ గణపతికి ప్రత్యేకంగా దేవాలయం ఉంది.

**పశ్చిమ ముఖ శివలింగం**

దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా పశ్చిమ ద్వారం, పశ్చిమ ముఖం కలిగిన శివలింగం మంథనిలో మాత్రమే ఉంది. భిక్షేశ్వరాలయంగా పిలిచే ఈ ఆలయంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రీలేశ్వర– సిద్ధేశ్వర దేవాలయం, సురాబాండేశ్వరుడు, గౌతమేశ్వరుడు, ఓంకారేశ్వరుడు కొలువై ఉన్నారు. వీరబ్రహ్మంగారి దేవాలయం, షిరిడీసాయి ఆలయం, అయ్యప్ప దేవాలయం, రేణుకా ఎల్లమ్మ దేవాలయం, బలవీర హనుమాన్ ఆలయం, నాగదేవత ఆలయం, కాళికాదేవి, గంగాదేవి, బద్దిపోచమ్మ ఆలయాలు ఉన్నాయి. ప్రాచీన చరిత్ర కలిగిన మంథనిలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారని అనడానికి మంత్రపురిలోని ఆలయాలే ప్రత్యక్ష సాక్ష్యాలు..

**గౌతమేశ్వరుడు**

మంథని పట్టణ సమీపంలో ప్రవహిస్తున్న గోదావరి నది పక్కన ఎత్తయిన ప్రదేశంలో ప్రాచీన కళ ఉట్టిపడుతుండేదే గౌతమేశ్వరాలయం. శతాబ్ద కాలం క్రితం ఈ దేవాలయాన్ని వొజ్జల కిష్టయ్య అనే వ్యక్తి పునరుద్ధరించినట్లు తెలుస్తోంది. ఈ దేవాలయం ఎన్నోసార్లు గోదావరి నది ఆటుపోట్లకు గురైనా చెక్కు చెదరకుండా ఉంది. దేవాలయ ప్రాంగణంలోని పురాతన ఆలయాలు కొంత మేరకు దెబ్బ తిన్నాయి. ఈ ప్రాంగణంలో శివపంచాయనం, రామాలయం, సరస్వతి, లక్ష్మీదేవిల ఆలయాలు ఉన్నాయి.

**దత్తాత్రేయ ఆలయం**

మంథని పట్టణ సరిహద్దులో నిర్మించిన దత్తాత్రేయ ఆలయం ఈ ప్రాంత భక్తులకు కొంగుబంగారమైంది. అరవై ఏళ్ల క్రితం మంథనికి చెందిన దోమల రాధమ్మ శిష్యుడైన అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ప్రధానమంత్రి మహారాజా కిషన్ ప్రసాద్ సహాయంతో ఈ దేవాలయం రూపుదిద్దుకున్నట్లు చరిత్ర చెబుతోంది. ఏటా ఈ ఆలయంలో దత్తాత్రేయ జయంతి వేడుకలను, నవరాత్రులను అంగరంగ వైభవంగా జరిపిస్తారు.

**శీలేశ్వర – సిద్ధేశ్వర ఆలయం**

పట్టణ నడిబొడ్డున వెలసిన శీలేశ్వర–సిద్ధేశ్వరాలయం మంథని చరిత్రకు ప్రత్యక్షసాక్ష్యంగా నిలుస్తోంది. కాకతీయ సైన్యాధీశుడు శీలప్పనాయుడు, సిద్ధప్పనాయుడుల జ్ఞాపకార్థం ఈ దేవాలయాన్ని ప్రోలరాజు నిర్మించినట్లు తెలుస్తోంది. మంథనికి చెందిన లోకె రామన్న రామానాంద్ర సరస్వతీ స్వామిగా సన్యాసం స్వీకరించి 1942లో ఆలయాన్ని పునరుద్ధరించారు. సుందరమైన శిల్పసంపదతో నిర్మించిన ఈ ఆలయంలో రెండు దేవాలయాలు ఉన్నాయి. దేవాలయంలో గర్భగుళ్లకు ఇరువైపులా నల్లరాతితో చెక్కిన నందీశ్వరులను, నాట్య మయూరిల విగ్రహాలను ఏర్పాటు చేశారు.

**చింతపండు స్వామి**

వీణవంక నుంచి చింతపండు బండ్లపై వచ్చిన లక్ష్మీనారాయణ స్వామి విగ్రహాన్ని వరదరాజ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ దేవాలయానికి మంథని చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. దేవాలయ ప్రాంగణంలో ఆంజనేయ, గరుడ విగ్రహాలు ఉన్నాయి. ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఆండాళ్ అమ్మవారు, గోదాదేవి, శ్రీకృష్ణార్జునుల విగ్రహాలు దర్శనమిస్తాయి.



## బ్యాలే డాన్సర్

బ్యాలే డాన్స్ అనేది ఇటాలియన్ నృత్యకళ. 15వ శతాబ్దంలో ఇది మొదలయ్యింది. మన రాజాస్థానాల్లో నర్తకీమణులు శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించినట్టుగా యూరప్ రాజమందిరాల్లో ఈ నృత్యాన్ని ప్రదర్శించేవారు. కేవలం సంగీతానికి నృత్యం ఉంటుంది. పాట ఉండదు. రాను రాను ఇది ఆదరణ పొందాక బ్యాలేలో తర్ఫీదు అయ్యే డాన్సర్లు కొనసాగుతున్నారు. ప్రతి ఏటా బుడాపెస్ట్ (హంగరీ)లో వివిధ దేశాల మధ్య బ్యాలే పోటీలు జరుగుతాయి. నవంబర్ 20న ఫైనల్స్‌లో సౌత్ కొరియా నుంచి కాంస్య పతకం పొందిన డాన్సర్ ఫొటో ఇది. ఒక కాలి మునివేళ్ల మీద ఎలా నిలబడిందో గమనిస్తే ఆ డాన్స్ ఎంత జటిలమైనదో అర్థమవుతుంది.

● వండర్ కిడ్

# నేపాల్‌లో లిటిల్ డైరెక్టర్

పిల్లలూ... మీరు సినిమా డైరెక్టర్‌ను చూసే ఉంటారు. గుబురు గడ్డం, అక్కడక్కడా నెరిసిన జుట్టు... సెట్ మీద 'యాక్షన్....కట్' అంటూ అరుస్తూ, అందర్నీ కంట్రోల్ చేస్తూ హడావిడిగా ఉంటాడు. మరి సినిమా అంటే అంతా డైరెక్టర్ మీదే ఆధారపడి ఉంటుంది. అందుకే అంత పెద్ద రెస్పాన్సిబిలిటీ తీసుకోవడానికి చాలా మంది జంకుతుంటారు. కానీ, మీలాంటి ఒక పిల్లాడు పూర్తి స్థాయి కమర్షియల్ సినిమాను డైరెక్ట్ చేశాడంటే నమ్ముతారా? కలలో కూడా సాధ్యపడని ఒక అసాధ్యాన్ని తన అచంచల ప్రతిభతో సుసాధ్యం చేశాడు నేపాలీ డైరెక్టర్ సౌగత్ బిస్తా.

2014లో తన ఏడేళ్ల వయసులో 'లవ్ యూ బాబా' అనే నేపాలీ చిత్రాన్ని తీశాడు బిస్తా. పలికే పదాలలో కూడా స్పష్టత ఉండని వయసులో ఎంతో నేర్పుగా, తనకు సినిమా మీదున్న ప్రేమతో, షూటింగ్ సమయంలో నటీనటులతో చక్కగా సమన్వయం చేసుకుంటూ, బిస్తా సినిమాను నడిపించిన తీరు ప్రపంచాన్ని ఆకర్షించింది. దీంతో గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ అతన్ని Youngest Director of a Professionally Made Feature Filmగా గుర్తించింది.

నేపాలీ చిత్రాల్లో నటించే తండ్రితోపాటు అప్పుడప్పుడు షూటింగ్ లొకేషన్స్‌కి వెళ్ళేవాడు సౌగత్. అలా డైరెక్షన్ మీద ఆసక్తి కలిగింది. రోజూ షూటింగ్ స్పాట్ కి వెళ్తూ, అక్కడ డైరెక్టర్, యాక్టర్స్, మూవీ స్క్రిప్ట్, లైటింగ్... ఇలా అన్నీ నిశితంగా గమనించి, రాత్రి కాగానే గూగుల్‌లో మూవీ మేకింగ్‌కి సంబంధించి మరిన్ని అంశాలను స్టడీ చేసేవాడు.

అంతటితో ఆగకుండా పేరుమోసిన నేపాలీ డైరెక్టర్లయిన నవాల్ నేపాలీ, దిభ్యరాజ్ శుభేది వంటి వారి దగ్గర అసిస్టెంట్ గా చేశాడు. అప్పటికి అతని వయసు అయిదు నుండి ఆరేళ్లు మాత్రమే. తన తండ్రి రాసిన మూవీ స్క్రిప్ట్‌కి డైరెక్టర్ దొరక్కపోవడంతో అతన్ని ఒప్పించి తానే డైరెక్ట్ చేశాడు బిస్తా. లవ్ యూ బాబా ఎన్నో అంతర్జాతీయ వేదికల మీద ప్రదర్శింపబడింది.

● కథ

# పెంపుడు పాము

అనగనగా ఓ అడవిలో రమణానంద మహర్షి ఆశ్రమం ఉండేది. ఆయన వద్ద అనేకమంది శిష్యులు విద్యాబుద్ధులు నేర్చుకునేవారు. వారిలో సునందుడు ఒకడు.

ఒకనాడు అతను ఆశ్రమంలో తోట పని చేస్తుండగా ఓ పాము పిల్ల అతని కాళ్ల సందులోనుంచి పాక్కుంటూ వెళ్లింది. ముందు అతను భయంతో అక్కడి నుంచి దూరం జరిగాడు. అనంతరం అతను నిశితంగా పరిశీలించగా ఆ పాము తోకకు గాయమైనట్లు గుర్తించాడు. దీంతో అతను మనసు కరిగిపోయింది. దాన్ని చేతుల్లోకి తీసుకొని, తోకకు మందు రాసి వదిలేశాడు. మరుసటి రోజూ ఆ పాము అక్కడక్కడే సంచరిస్తూ ఉంది. తను చేసిన సాయానికి అభిమానంతో ఆ పాము అక్కడే తిరుగుతుందని సునందుడు భావించాడు. రోజూ అతను ఆ పామును చూడటం, ఆ పాముపిల్ల అతని కాళ్ల సందుల్లోనుంచి సంచరించడం పరిపాటిగా మారింది. ఈ విషయం ఆశ్రమంలోని ఇతరులకు తెలిసింది. 'పామును అలా మచ్చిక చేసుకోవడం తగదు. అది ప్రాణాలకు ప్రమాదకరం' అని హెచ్చరించారు. అయినా అతను వినలేదు. ఆ పాముపిల్లతో స్నేహం మానలేదు.

నెలలు గడుస్తున్న కొద్దీ పాము పిల్ల పెద్దగా మారింది. అక్కడే ఓ పుట్టలో విశ్రమించేది. రోజూ దానికి తగ్గ ఆహారాన్ని సునందుడు ఇస్తుండేవాడు. దీంతో రమణానంద మహర్షి సునందుణ్ని పిలిపించారు. పామును పెంచుకున్న విషయం గురించి ప్రశ్నించారు.

'అది నా పెంపుడు పాము. దాన్ని నేను పెంచుకోవడం వల్ల ఎవరికి నష్టం?' అని సునందుడు ప్రశ్నించాడు.

సునందుడు తన మాట వినేలా లేదని మహర్షికి అర్థమైంది. అనుభవంతోనే ఏదైనా అర్థమవుతుందని అతణ్ని పంపించేశాడు.

తన పాముకు ఆహారం పెట్టడం ఆలస్యమైపోయిందని సునందుడు హడావిడిగా పుట్ట దగ్గరికి వెళ్లాడు. పాముకు ఆహారం పెడుతూ 'ఆలస్యమైంది. ఏమీ అనుకోకు' అన్నాడు. ఆహారం దొరకక ఆగ్రహంతో ఉన్న పాము అతని చేతిపై కాటు వేసింది. దీంతో సునందుడు నేలకూలాడు. వెంటనే పాము అక్కడి నుంచి జరజరా పాకుతూ ఆశ్రమ ప్రాంగణం దాటి బయటకు వెళ్లిపోయింది. తోటి విద్యార్థులు రమణానంద మహర్షిని పిలిచి జరిగిన సంగతి చెప్పారు. ఆయన సునందుడికి వైద్యం చేశారు. వారం రోజులపాటు చికిత్స పొందిన తర్వాత సునందుడు కోలుకున్నాడు.

'పామును ఎంత ప్రేమగా పెంచినా అది దాని సహజ స్వభావాన్ని వదులుకోదు. ఆ విషయం మీరు చెప్పినా పెడచెవిన పెట్టాను. నన్ను మన్నించండి' అంటూ సునందుడు గురువు కాళ్ల మీద పడి క్షమాపణలు కోరాడు.

● మన పుస్తకాలు

## అమ్మకు చిన్నారి పాప అందించే కానుక




పీనట్ అమ్మాయికి తన తల్లి పుట్టినరోజును ప్రత్యేకంగా, ఘనంగా నిర్వహించాలని ఆశ. కానీ ఈ విషయం తల్లికి తెలియకూడదు. తెలిస్తే ఇటువంటి ఏర్పాట్లు వద్దంటుంది. మరి ఏం చేయాలి? ఎవరిని సాయం అడగాలి? ఈ కథతో రూపొందిన 72 పేజీల పుస్తకం ఇది. రచయిత్రి యశోధరా లాల్ ఈ పుస్తకాన్ని అందమైన బొమ్మలతో, చక్కని కథతో పిల్లల కోసం తీసుకొచ్చారు. పిల్లలు తల్లులపై చూపే ప్రేమ ఇందులో కనిపిస్తుంది.

## నీతి బోధించే అందమైన కథలు

చిన్నారులను అలరిస్తూ, నిత్యం జీవితంలో ఎలా మెలగాలో చెప్పే కథలివి. ఇందులోని ప్రతి కథా ఒక్కో అంశాన్ని చూపుతుంది. పిల్లలకు అర్థమయ్యే రీతిలో, వారికి నచ్చేలా ఇందులో కథలు సాగుతాయి. 'నక్క–కోడి పుంజు', 'తెలివితక్కువ కాకి', 'పిల్లికి గంట కట్టేదెవరు?', 'గాడిద గారం' వంటి కథలన్నీ పిల్లలకు నీతి బోధిస్తూ కొత్త విషయాలు నేర్పుతాయి.

# ఎంతెంత దూరం

పిల్లలూ... అడవిలో సమతుల్యత చాలా అవసరం. ఏది ఎక్కువైనా తక్కువైనా ప్రాణుల సంఖ్య పెరిగిపోతుంది. కెన్యాలో నైవిషా నది ఒడ్డు అభయారణ్యాల్లో జిరాఫీల సంఖ్య పెరిగిపోవడంతో 'కెన్యా వైల్డ్ లైఫ్ సర్వీసెస్' గార్డులుఆడ జిరాఫీని పట్టుకుని బంధిస్తున్న ఫొటో ఇది. ఇక్కడ నుంచి వేరే చోటుకు తరలించడానికి జిరాఫీలను బంధించి ట్రక్కుల్లో ఎక్కిస్తారు. అయితే ఆ సమయంలో వాటి కళ్లకు గంతలు కడతారు. లేదంటే అవి అదుపు తప్పుతాయి. ఆందోళన చెందుతాయి. పర్యావరణం కోసం ఎందరో కష్టపడుతుంటారు. వారికి మనం థ్యాంక్స్ చెప్పాలి.

● హాబీ

# చిన్నారి తోటమాలి భలే లాభాలోయి

పిల్లలూ! మీ ఇంట్లో పెరట్లో మొక్కలున్నాయా? వాటిని మీరు సంరక్షిస్తున్నారా? అబ్బే, వాటితో మాకేం పని అనుకుంటున్నారా? అలా అనుకోవద్దు. తోటపని చేయడం వల్ల ఎన్నో లాభాలున్నాయని నిపుణులు అంటున్నారు. అవేంటో చూసేద్దామా!

### బుజ్జి పేరెంట్

మొక్కని నాటి, దానికి నీళ్లు పోసి, పురుగు పట్టకుండా చూసుకుంటూ కాపాడుకోవడం ఒక బాధ్యత. ఇటువంటి బాధ్యత మీరు తీసుకుంటే ఆ మొక్కకు మీరే తల్లిదండ్రి అయినట్లు. ఆ మొక్కతో మీకు ఆత్మీయ బంధం ఏర్పడుతుంది. అదెంత బాగుంటుంది!

### హ్యాపీనెస్

మనం నాటిన మొక్క పెరిగి, పెద్దయి పూలు పూస్తూ, కాయలు కాస్తూ ఎదుగుతుంటే మనకెంత ఆనందమో కదా! ఆ ఆనందమంతా తోటపనిలో మీకు దొరుకుతుంది. పచ్చని సంతోషం మీకు సొంతమవుతుంది. ఇందులో మీరొక్కరే ప్రధాన సూత్రధారి. ఎవరి అజమాయిషీ మీపైన ఉండదు.

### నో స్ట్రెస్

స్కూల్లో పాఠాలు, ఆటలు, ఇంట్లో అమ్మానాన్నలు చెప్పే పనులు..వీటి మధ్య మీరు ఒత్తిడికి గురవుతుంటారు కదా! దాన్ని దూరం చేసే ఔషధమే ఈ తోట పని. రోజూ కొంతసేపు మొక్కలతో గడిపితే ఒత్తిడి దూరమై, మనసుకు హాయిగా ఉంటుంది. మళ్లీ కొత్తగా ఉత్సాహం పుట్టుకొస్తుంది.

### ఫిజికల్ ఎక్సర్‌సైజ్

మొక్కకు పాదులు తీయడం, నీళ్లు పారించడం, అంటు కట్టడం, ఎండిన ఆకులు ఏరడం..ఎన్ని పనులు! ఇవన్నీ చేయడం వల్ల మీ శరీరం దృఢంగా తయారవుతుంది. ఆటల్లో ఎంచక్కా పాల్గొనగలుగుతారు. దీనివల్ల ఒంటికి మేలు జరుగుతుంది. ఇదంతా మీకు లాభమే కదా!

### క్లాస్‌రూమ్

మీరు తోటలోనే పాఠాలు నేర్చుకోవచ్చు. మొక్క ఎలా పెరుగుతుందో, దాని పువ్వు ఎలా పూస్తుందో, ఆకులు ఎలా వాడిపోతాయో, మళ్లీ అక్కడ కొత్త ఆకు ఎలా పుడుతుందో ఇవన్నీ పుస్తకాల్లో కాకుండా నేరుగా చూసే అవకాశం ఈ తోటపని ద్వారా మీకు అందుతుంది.

### కాన్సన్‌ట్రేషన్

రోజూ మొక్కలు, చెట్లు మధ్య తిరిగే వారికి ఏకాగ్రత పెరుగుతుందని నిపుణులు అంటున్నారు. టీవీలు, ఇతర వ్యాపకాల్లో మునిగిపోకుండా తోటపని చేయడం ద్వారా ఆరోగ్యంతోపాటు ఏకాగ్రతా పెరిగి, మీరు ఇతరుల కంటే ఎక్కువ మార్కులు సాధిస్తారు.

### కాన్ఫిడెన్స్

మీరు నాటిన మొక్క పెరిగి, మీకు ఫలాలు అందిస్తే అది మీలో ఆత్మవిశ్వాసం పెంచుతుంది. ఏదైనా సాధించగలనన్న నమ్మకాన్ని ఏర్పరుస్తుంది. దీనివల్ల మీలో చెడు ఆలోచనలు దూరమై మంచి ఆలోచనలు పెరుగుతాయి. అప్పుడు అందరూ మిమ్మల్ని చూసి గర్వపడతారు.

● మహనీయులు

# తెలుగు తెరపై తొలి నటి.. సురభి కమలాబాయి

**పిల్లలూ! మన తొలి తెలుగు నటి ఎవరో మీకు తెలుసా? ఆమె పేరు కమలాబాయి. ఆమె గురించి తెలుసుకుందాం.**

మన తెలుగువారికి 'సురభి' అనే ప్రసిద్ధ నాటక సంస్థ ఉంది. అందులోని వారంతా కుటుంబసభ్యులే. నేటికీ ఆ పరంపర కొనసాగుతూ ఉంది. వారే నాటకాల్లో పాత్రలు పోషిస్తూ ఎన్నో సంవత్సరాల నుంచి నాటక సమాజాన్ని నడిపిస్తున్నారు. ఆ సురభి నాటక కళాకారుల కుటుంబంలోనే 1907లో కమలాబాయి జన్మించారు. చిన్నవయసులో కమలాబాయి పౌరాణిక నాటకాల్లో శ్రీకృష్ణుడు, ప్రహ్లాదుడు పాత్రలు పోషించి అందర్నీ మెప్పించారు. యుక్తవయసు వచ్చాక ఆడపాత్రలు పోషించడం మొదలుపెట్టారు. 1931లో హెచ్.ఎం.రెడ్డి తొలి తెలుగు టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద' తీస్తూ అందులో ఆమెకు హిరణ్యకశిపుడి భార్య లీలావతి పాత్ర ఇచ్చారు. దీంతో ఆమె తొలి తెలుగు నటిగా గుర్తింపు పొందారు. అనంతరం 'పాదుకా పట్టాభిషేకం' సినిమాలో సీతగా, 'శకుంతల' సినిమాలో శకుంతలగా పలు పాత్రలు పోషించారు. ఆమె నటించిన 'సావిత్రి' సినిమా విజయవంతమై విశేషమైన పేరు తెచ్చింది. అందులో ఆమె సావిత్రి పాత్ర పోషించారు.

ఆ తర్వాత ఆమె బొంబాయి వెళ్లి పలు హిందీ సినిమాల్లో నటించారు. తెలుగు నటి హిందీ సినిమాల్లో నటించడాన్ని ఆ రోజుల్లో గొప్పగా చెప్పుకునేవారు. 1938లో 'భక్త జయదేవ' అనే తెలుగు సినిమాలో ఆమె కథానాయికగా నటించారు. సినిమా మధ్యలో ఆగిపోతే ఆ సినిమాకు ఆమె దర్శకత్వం వహించి, ఎడిటింగ్ కూడా చేశారు. సినీరంగంలో అతి తక్కువమంది మహిళలున్న ఆ కాలంలో ఆమె ఇలాంటి బాధ్యతలు చేపట్టడం నిజంగా విశేషం. ఆ తర్వాత 'పాతాళభైరవి', 'మల్లీశ్వరి' వంటి సినిమాల్లో ఆమె సహాయక పాత్రలు పోషించారు. 1971 మార్చి 30న కన్నుమూశారు.

## బిజినెస్ రీల్

### కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్ల విభజన

1:5 నిష్పత్తికి ఆమోదముద్ర

**న్యూఢిల్లీ:** ప్రయివేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్ల విభజన చేపడుతోంది. 1:5 నిష్పత్తిలో షేర్లను విభజించేందుకు బోర్డు ఆమోదించినట్లు బ్యాంక్ వెల్లడించింది. అంటే రూ. 5 ముఖ విలువగల ఒక్కో షేరునీ రూ. 1 ముఖ విలువగల 5 షేర్లుగా విభజించనుంది. తద్వారా బ్యాంక్ షేరులో లిక్విడిటీ పెరగడంతోపాటు.. వాటాదారులకు అందుబాటులోకి రానున్నట్లు బ్యాంక్ పేర్కొంది. దీంతో మరింత మంది రిటైల్ ఇన్వెస్టర్లు బ్యాంకు షేర్లలో పెట్టుబడులు చేపట్టేందుకు అవకాశం లభిస్తుందని వివరించింది. బ్యాంక్ 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తాజా నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంక్ తెలియజేసింది. అన్ని అనుమతులు లభించాక రెండు నెలల్లో విభజన పూర్తయ్యే వీలున్నట్లు బ్యాంక్ అంచనా వేసింది.

**ముఖ విలువ విభజన నేపథ్యంలో కొటక్ బ్యాంక్ షేరు 0.5 శాతం నీరసించి రూ. 2,087 వద్ద ముగిసింది.**

### విమానాల కొనుగోలుకి ఇండిగో సై

రూ. 7,270 కోట్ల పెట్టుబడులు

**ముంబై:** దేశీ విమానయాన కంపెనీ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ విమానాల కొనుగోలుకి సిద్ధపడుతోంది. ఇందుకు సొంత అనుబంధ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐఎఫ్ఎస్‌సీ ప్రయివేట్ లిమిటెడ్‌కు 82 కోట్ల డాలర్లు(రూ. 7,270 కోట్లు) అందించనుంది. ఇండిగో బ్రాండ్ విమాన సర్వీసుల కంపెనీ ఈక్విటీ షేర్లు, నాన్‌క్యుములేటివ్ ఆప్షనల్లీ కన్వర్టిబుల్ రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్లు(ఓసీఆర్‌పీఎస్) జారీ ద్వారా పెట్టుబడులను సమకూర్చనుంది. ఒకేసారి లేదా దశలవారీగా వీటి జారీని చేపట్టనున్నట్లు ఇండిగో తెలియజేసింది. నిధులను ప్రధానంగా విమానాల కొనుగోలుకి వినియోగించనున్నట్లు వెల్లడించింది. ఇండిగో ఇప్పటికే 411 విమానాలను కలిగి ఉంది. వీటిలో 365 విమానాలు నిర్వహణలో ఉన్నట్లు విమాన ట్రాకింగ్ వెబ్‌సైట్ ప్లేన్‌స్పాటర్.నెట్ పేర్కొంది.

**ఈ వార్తల నేపథ్యంలో ఇండిగో షేరు బీఎస్ఈలో 1% లాభంతో రూ. 5,840 వద్ద ముగిసింది.**

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-11-2025

| | |
|---|---|
| విశాఖ | 635-00 |
| చిత్తూరు | 673-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 645-00 |
| విజయవాడ | 660-00 |
| రిటైల్ ధర (డజను) | 90.00 |
| హైదరాబాద్ | 640-00 |
| వరంగల్ | 642-00 |
| రిటైల్ ధర | 7.00 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| MARUTI | 16,010.00 | 1.32 |
| TATACONSUM | 1,184.50 | 0.9 |
| MAXHEALTH | 1,179.10 | 0.87 |
| INDIGO | 5,835.00 | 0.86 |
| M&M | 3,747.00 | 0.82 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| JSWSTEEL | 1,135.90 | -2.91 |
| HINDALCO | 777.35 | -2.81 |
| TATASTEEL | 168 | -2.59 |
| BAJFINANCE | 1,005.00 | -2.29 |
| HCLTECH | 1,608.80 | -2.22 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 8,992 |
| ఎన్ఎస్ఈ | 90,836 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 4,59,848 |
| ఎఫ్ఐఐ | - 1,766 |
| డీఐఐ | + 3,162 |

### ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 57.77 (రాత్రి 11.30కు) | $ 59.00 (క్రితం ముగింపు) |
| బ్రెంట్ | 62.28 (రాత్రి 11.30కు) | $ 63.18 (క్రితం ముగింపు) |

# ఇండెక్సులలో రీట్స్‌కు చోటు

### పరిశ్రమ నిపుణులతో సెబీ చర్చలు

**న్యూఢిల్లీ:** రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు(రీట్స్)ను మార్కెట్ ఇండెక్సులలో చేర్చే యోచనలో ఉన్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా వెల్లడించింది. ఇందుకు సంబంధిత వర్గాలతో చర్చలు నిర్వహిస్తున్నట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. దీంతో రీట్స్‌కు లిక్విడిటీ భారీగా మెరుగుపడే వీలున్నట్లు తెలియజేశారు. 2025 రీట్స్, ఇన్విట్స్ జాతీయ సదస్సులో ప్రసంగిస్తూ పాండే ఇండెక్సులలో రీట్స్‌ను పొందుపరిచేందుకు పరిశ్రమ ప్రతినిధులతో చర్చిస్తున్నట్లు తెలియజేశారు. రియల్టీ రంగంలో కార్యకలాపాలు నిర్వహించే కంపెనీలు రీట్స్‌ను జారీ చేస్తాయి. తద్వారా ఇన్వెస్టర్లకు అధిక ధరల రియల్టీని ఆఫర్ చేసేందుకు వీలుంటుంది. ప్రధానంగా డివిడెండ్ ఆదాయం ఆర్జించేందుకు వీలు కల్పించడంతోపాటు.. భవిష్యత్‌లో పెట్టుబడుల వృద్ధికి సైతం రీట్స్ ఉపయోగపడతాయి. ఇండెక్సులలో చోటు లభిస్తే రీట్స్‌లో లిక్విడిటీ పెరుగుతుందని పాండే పేర్కొన్నారు. మరోపక్క రీట్స్, ఇన్విట్స్ సంబంధిత బిజినెస్‌ల సులభతర నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

#### ఎంఎఫ్ పథకాలలో..

ఇన్వెస్టర్లకు రక్షణ కల్పిస్తూనే లిక్విడ్ ఎంఎఫ్ పథకాలలో రీట్స్, ఇన్విట్స్ ఇన్వెస్ట్ చేసేందుకున్న అవకాశాలను సైతం పరిశీలిస్తున్నట్లు సెబీ చీఫ్ పాండే తెలియజేశారు. ఈ బాటలో తగిన రక్షణాత్మక విధానాలకు తెరతీయడం ద్వారా గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులలో ప్రయివేట్ ఇన్విట్స్ పెట్టుబడులు చేపట్టేందుకు అవకాశాలను అన్వేషిస్తున్నట్లు వెల్లడించారు. ఇదే విధంగా రీట్స్, ఇన్విట్స్‌లో మరిన్ని పెట్టుబడులను చేపట్టేందుకు వీలుగా సంస్థాగత ఇన్వెస్టర్లతో చర్చిస్తున్నట్లు వివరించారు. ఇందుకు అనుగుణంగా ఆర్థిక శాఖ, పలు రాష్ట్ర ప్రభుత్వాలతో పబ్లిక్ ఆస్తుల మానిటైజేషన్‌ను పెంచేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వీటిలో పెట్టుబడులపై బీమా రంగ నియంత్రణ సంస్థ, పెన్షన్ ఫండ్ నియంత్రణ, అభివృద్ధి అధీకృత సంస్థ, ఈపీఎఫ్‌వో తదితరాలతో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఎంఎఫ్‌లపై సెబీ ఆంక్షలు

### ప్రీఐపీవోలో పెట్టుబడులకు చెక్

**న్యూఢిల్లీ:** ప్రీఐపీవోలో షేర్ల కొనుగోలుపై మ్యూచువల్ ఫండ్స్‌కు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. సంబంధితవర్గాల సమాచారం ప్రకారం ఐపీవోకుముందు షేర్ల జారీ(ప్లేస్‌మెంట్స్)లో ఫండ్స్ ఇన్వెస్ట్ చేయకుండా సెబీ నిషేధం విధించింది. తద్వారా ఐపీవోలలో లిక్విడిటీని పెంచడంతోపాటు.. కంపెనీల విలువ నిర్ధారణలో పారదర్శకతకు మరింత ప్రాధాన్యత ఇవ్వనుంది. ప్రీఐపీవో షేర్ల జారీలో పాల్గొనకుండా ఆదేశించామని, అయితే యాంకర్ రౌండ్లలో ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనుమతులు కొనసాగుతాయని అధికారిక వర్గాలు తెలియజేశాయి. ఈ నెల మొదట్లో సెబీ యాంకర్ ఇన్వెస్టర్ కేటగిరీ, షేర్ల కేటాయింపులో సైతం సవరణలకు తెరతీసిన సంగతి తెలిసిందే. తద్వారా దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల విభాగంలో మ్యూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్స్‌కు మరింత చోటు కల్పించింది. ఇందుకు వీలుగా యాంకర్ పోర్షన్‌ను 33 శాతం నుంచి 40 శాతానికి పెంచిన విషయం విదితమే.

## వ్యవసాయంలో 4 శాతం వృద్ధి

వచ్చే పదేళ్ల పాటు సాధ్యమే • గోదాము వసతులు పెంచుకోవాలి • నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్‌చంద్

**న్యూఢిల్లీ:** దేశ వ్యవసాయ రంగం వచ్చే పదేళ్ల పాటు 4 శాతం వృద్ధి రేటును సులభంగానే సాధిస్తుందని నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్ ఆశాభావం వ్యక్తం చేశారు. గోదాముల వసతులను పెంచుకోవాల్సి ఉందన్నారు. పీహెచ్‌డీ సీసీఐ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ ఏటా 2.5 శాతం చొప్పున పెరుగుతున్నట్టు చెప్పారు. కనుక 4 శాతం వృద్ధి సాధ్యమేనన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో (క్యూ1) వ్యవసాయ రంగంలో వృద్ధి 3.7 శాతంగా ఉండడం గమనార్హం. ''కానీ, వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ ఈ స్థాయిలో పెరగడం లేదు. కనుక ఈ ఉత్పత్తులను పరిశ్రమలు వినియోగించాలి. లేదంటే ఎగుమతి చేయాలి. ఎగుమతి మార్కెట్‌ను గుర్తించడం మెరుగైన ఆప్షన్ అవుతుంది''అని రమేష్ చంద్ పేర్కొన్నారు. బియ్యం, గోధుమలకు కావాల్సిన నిల్వ వసతుల్లో (గోదాములు) ఎలాంటి వ్యత్యాసం లేదంటూ.. అదే మొక్కజొన్న విషయంలో మాత్రం భిన్నంగా ఉంటుందన్నారు. నిర్ణీత పరిమాణానికి మించి నిల్వ చేయకూడదన్న చట్టం ఉంటే.. అలాంటి నియంత్రణలు గోదాముల నిర్మాణంపై పెట్టుబడులను ప్రభావితం చేస్తాయన్నారు. ప్రజల్లో అనుకుంటున్నట్టు మన దేశంలో ఆహార వృధా అంత ఎక్కువ లేదని రమేష్ చంద్ చెప్పారు. పాలకు సంబంధించి వృధా కేవలం 0.5 శాతమే ఉన్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతమున్న ఆహార వృధాలోనూ చాలా వరకు అరికట్టొచ్చని చెబుతూ.. ఇలా చేస్తే అది గోదాముల్లో పెట్టుబడులకు సైతం ప్రోత్సాహకరంగా మారుతుందన్నారు.

## వాల్‌మార్ట్‌కి ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ దన్ను

**న్యూఢిల్లీ:** అమెరికన్ రిటైల్ దిగ్గజం వాల్ట్‌మార్ట్ ఇంటర్నేషనల్ మూడో త్రైమాసికంలో పటిష్టమైన ఆర్థిక ఫలితాలు సాధించడంలో భారత విభాగం ఫ్లిప్‌కార్ట్ కీలకంగా నిల్చింది. ఫ్లిప్‌కార్ట్ 'బిగ్ బిలియన్ డే' సేల్స్‌ని నిర్వహించిన సమయం తమ సంస్థ ఆదాయాల వృద్ధికి సానుకూలంగా దోహదపడిందని వాల్‌మార్ట్ తెలిపింది. ఫిబ్రవరి–జనవరి వ్యవధిని కంపెనీ ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది. దీని ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అంతర్జాతీయంగా వాల్‌మార్ట్ ఆదాయం 179.5 బిలియన్ డాలర్లుగా నమోదైంది. క్యూ3లో ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సానుకూలంగా ఉన్నప్పటికీ, క్యూ4లో వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశంఉందని వాల్‌మార్ట్ తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 2 వరకు బిగ్ బిలియన్ డేస్ సేల్ నడిచింది. 2018లో 16 బిలియన్ డాలర్లతో ఫ్లిప్‌కార్ట్‌లో వాల్‌మార్ట్ 77 శాతం వాటా కొనుగోలు చేసింది. తర్వాత దాన్ని 80 శాతానికి పెంచుకుంది.

## డార్క్ ప్యాటర్న్స్‌పై 26 సంస్థల సెల్ఫ్ డిక్లరేషన్

**న్యూఢిల్లీ:** వినియోగదారులను మోసపుచ్చేలా, తప్పుదోవ పట్టించే సమాచారం, అసమంజస వాణిజ్య విధానాలకు (డార్క్ ప్యాటర్న్స్) తమ ప్లాట్‌ఫాంలలో తావు లేదంటూ 26 టాప్ ఈ–కామర్స్ కంపెనీలు స్వచ్ఛందంగా సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చినట్లు కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ (సీసీపీఏ) వెల్లడించింది. ఇలాంటి ధోరణులను గుర్తించేందుకు, తొలగించేందుకు సదరు సంస్థలు అంతర్గతంగా లేదా బైటి ఏజెన్సీలతో ఆడిట్ నిర్వహించాయని పేర్కొంది. సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చిన సంస్థల జాబితాలో జెప్టో, బిగ్‌బాస్కెట్, జొమాటో మొదలైనవి ఉన్నాయి. ఇతర ఈ–కామర్స్ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్లు, యాప్ డెవలపర్లు కూడా నిబంధనలను పాటించడంపై దృష్టి పెట్టాలని సీసీపీఏ సూచించింది. డార్క్ ప్యాటర్న్స్ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.



# రష్యా చమురుకు రిలయన్స్ గుడ్‌బై

• ఐరోపా సమాఖ్య ఆంక్షల ఫలితం
• జామ్‌నగర్ సెజ్ యూనిట్లో ఇకపై రష్యాయేతర చమురు వినియోగం

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఎగుమతులకు ఉద్దేశించిన రిఫైనరీ యూనిట్ కోసం రష్యా చమురు దిగుమతులను నిలిపివేసినట్టు ప్రకటించింది. ఐరోపా సమాఖ్య ఆంక్షలకు అనుగుణంగా ఈ చర్య తీసుకుంది. ఇప్పటి వరకు రష్యా చమురును పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్న సంస్థల్లో రిలయన్స్ ముందుండడం గమనార్హం . జామ్‌నగర్ కాంప్లెక్స్‌లో రిలయన్స్‌కు రెండు రిఫైనరీ యూనిట్లు ఉన్నాయి. అందులో ఒకటి ప్రత్యేక ఆర్థిక మండలి రిఫైనరీ యూనిట్. ఇందులో రష్యా చమురును రిఫైనరీ చేసి యూరప్, యూఎస్, ఇతర మార్కెట్లకు ఎగుమతి చేస్తోంది. రోజువారీ 1.7–1.8 మిలియన్ బ్యారెళ్ల చమురును రష్యా నుంచి తక్కువ ధరలపై కొనుగోలు చేస్తూ వచ్చింది. జామ్‌నగర్‌లోనే ఉన్న మరొక యూనిట్‌ను దేశీ మార్కెట్ అవసరాల కోసం వినియోగిస్తోంది. అయితే, రష్యా చమురు దిగుమతి, దాంతో పెట్రోలియం ఉత్పత్తుల తయారీపై ఐరోపా సమాఖ్య ఆంక్షలు విధించడం గమనార్హం. వీటిని అనుసరిస్తూ రిలయన్స్ ఇండస్ట్రీస్ రష్యా చమురు కొనుగోళ్లను నవంబర్ 20 నుంచి నిలిపివేసినట్టు కంపెనీ అధికార ప్రతినిధి ప్రకటించారు. గతంలో కొనుగోలు చేసిన చమురు నిల్వల రిఫైనరీ పూర్తయిన అనంతరం, రష్యాయేతర దేశాల చమురునే ఇక్కడ వినియోగించనున్నట్టు తెలిపారు. డిసెంబర్ 1 నుంచి ప్రత్యేక ఆర్థిక మండలి యూనిట్ ద్వారా ఎగుమతి చేసే ఉత్పత్తులు రష్యాయేతర చమురుతో తయారైనవే ఉంటాయని స్పష్టం చేశారు. 2026 జనవరి 1 నుంచి ఐరోపా ఆంక్షలు అమల్లోకి రానుండగా, దీనికంటే ముందుగానే రష్యాయేతర చమురుకు మారిపోవడం పూర్తవుతుందన్నారు. తద్వారా ఐరోపా సమాఖ్య మార్గదర్శకాలను పాటిస్తామన్నారు.

## ఇన్‌ఫ్రా, ఇంధన రంగ నిపుణులతో ఆర్థిక మంత్రి భేటీ

### బడ్జెట్ విషయంలో అభిప్రాయాల సేకరణ

**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఢిల్లీలో మౌలిక రంగం, ఇంధన రంగాలకు చెందిన నిపుణులతో భేటీ అయ్యారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) బడ్జెట్‌పై వారి అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆఫ్కాన్స్ ఎండీ ఎస్.పరమశివన్, షాపూర్జీ పల్లోంజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాపిటల్ డైరెక్టర్ మనీష్ త్రిపాఠి, జీఎంఆర్ గ్రూప్ డిప్యూటీ ఎండీ కె.నారాయణరావు, జేఎం బక్సి గ్రూప్ డైరెక్టర్ సందీప్ వాద్వా, ఇన్‌ఫ్రా విజన్ ఫౌండేషన్ సీఈవో జగదన్‌షా తదితర కంపెనీల సారథులు ఇందులో పాల్గొన్నారు. దీనిపై కేంద్ర ఆర్థిక శాఖ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ఒక పోస్ట్ పెట్టింది. ''ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి సీతారామన్ రానున్న 2026–27 కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి 11వ ముందస్తు సమావేశాన్ని ఇన్‌ఫ్రా, ఇంధన రంగాల నిపుణులతో నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యుత్ శాఖ, షిప్పింగ్ శాఖల కార్యదర్శులు, రైల్వే బోర్డ్ చైర్మన్, కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు హాజరయ్యారు''అని ఆర్థిక శాఖ తన పోస్ట్‌లో వెల్లడించింది. కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ 2026–27 బడ్జెట్‌ను 2026 ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌కు ప్రాధాన్యం నెలకొంది. డిమాండ్, ఉపాధి కల్పనను పెంచడం, దేశ జీడీపీని 8 శాతం వృద్ధి రేటుకు చేర్చడం వంటి ప్రధాన సవాళ్లు ఆర్థిక మంత్రి ముందున్నాయి. వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, ఆరోగ్య సంరక్షణ, క్యాపిటల్ మార్కెట్ రంగాల ప్రతినిధులు, ప్రముఖ ఆర్థికవేత్తలతో ఇప్పటి వరకు బడ్జెట్ ముందస్తు సమావేశాలు నిర్వహించడం గమనార్హం.

## ఇజ్రాయెల్ స్టార్టప్‌లతో జత

• సైబర్‌సెక్యూరిటీ, మెడికల్ డివైస్‌లపై దృష్టి
• వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్

**టెల్‌అవీవ్:** భారత్, ఇజ్రాయెల్ స్టార్టప్‌లు సాంకేతిక సహకారమందించుకునేందుకు చేతులు కలపవలసి ఉన్నట్లు వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ఇక్కడ పేర్కొన్నారు. దీంతో ప్రధానంగా సైబర్ సెక్యూరిటీ, మెడికల్ పరికరాలు తదితరాలలో ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో టెక్నాలజీ, ఇన్నోవేషన్ సహకారానికి ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు. సొంత స్టార్టప్ వ్యవస్థను ప్రోత్సహించేందుకు ఇజ్రాయెల్‌తో చేతులు కలపనున్నట్లు పేర్కొన్నారు. పోటీ ధరలలో లోతైన టెక్నాలజీ, అత్యంత నాణ్యమైన ఆవిష్కరణలను అందించే లక్ష్యంతో ఉన్నట్లు వివరించారు. భారత్‌కున్న విస్తారిత వ్యవస్థల ద్వారా ఇందుకు పలు అవకాశాలున్నట్లు తెలియజేశారు. ఇజ్రాయెల్ వాణిజ్య మంత్రి నిర్ బార్కట్‌తో ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు నిర్వహించేందుకు గోయల్ ఇక్కడకు వచ్చారు.

## టెక్నాలజీ స్టార్టప్‌లపై మారుతీ దృష్టి

### రావిటీలో 7.84 శాతం వాటా కొనుగోలు

**న్యూఢిల్లీ:** టెక్నాలజీ ఆధారిత స్టార్టప్ రావిటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ 7.84 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకు మారుతీ సుజుకీ ఇన్నోవేషన్ ఫండ్ ద్వారా రూ. 2 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. రావిటీ కనెక్టెడ్ మొబిలిటీ ఇన్‌సైట్స్‌లో ప్రత్యేకతను కలిగి ఉన్నట్లు పేర్కొంది. ఈ ఫండ్ ద్వారా మారుతీ ఇంతక్రితం రెండుసార్లు దాదాపు రూ. 2 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేసింది. 2024 మార్చిలో ఏఎంఎల్‌గో ల్యాబ్స్‌లో, 2022 జూన్‌లో సోషియోగ్రాఫ్ సొల్యూషన్స్‌లోనూ వాటా కొనుగోలు చేసింది. అత్యున్నతస్థాయి ఆవిష్కరణలకు తెరతీస్తున్న స్టార్టప్‌లలో ఇన్నోవేషన్ ఫండ్ ద్వారా వ్యూహాత్మకంగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు మారుతీ తెలియజేసింది. కంపెనీ కార్యకలాపాలకు సంబంధించిన స్టార్టప్‌లవైపు దృష్టి పెడుతున్నట్లు తెలియజేసింది. కాగా.. మారుతీ పెట్టుబడుల నేపథ్యంలో ఏఐ, అనలిటిక్స్, మొబిలిటీలో కంపెనీకున్న సామర్థ్యం, నైపుణ్యాలను మరింత మెరుగుపరచేందుకు కట్టుబడి ఉన్నట్లు రావిటీ సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకుడు వికాస్ రుంగ్తా పేర్కొన్నారు.

**మారుతీ సుజుకీ షేరు బీఎస్ఈలో 1.2 శాతం బలపడి రూ. 15,980 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో గరిష్టంగా రూ. 16,150ను తాకింది.**

# ఎఫ్ఎంసీజీ అమ్మకాల వృద్ధి తగ్గుదల

• జీఎస్‌టీ మార్పుల ఫలితం
• గ్రామీణ మార్కెట్లలో మెరుగైన డిమాండ్
• నీల్సన్‌ఐక్యూ నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ:** ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల అమ్మకాల వృద్ధి సెప్టెంబర్ త్రైమాసికంలో పరిమాణం పరంగా 5.4 శాతానికి పరిమితమైనట్టు నీల్సన్‌ఐక్యూ సంస్థ తెలిపింది. జీఎస్‌టీ రేట్ల మార్పులకు ముందు నెలకొన్న పరిస్థితులను అవరోధాలుగా పేర్కొంది. అమ్మకాల విలువ మాత్రం 12.9 శాతం పెరిగినట్టు తెలిపింది. ధరల పెరుగుదల ఇందుకు అనుకూలించింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ అమ్మకాల వృద్ధి క్రితం ఏడాది క్యూ2తో పోల్చితే 8.4 శాతం నుంచి 7.7 శాతానికి తగ్గిందని.. అయినప్పటికీ వరుసగా ఏడో నెలలోనూ పట్టణాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లోనే అధిక వృద్ధి కనిపించినట్టు తన నివేదికలో నీల్సన్‌ఐక్యూ సంస్థ వెల్లడించింది. చిన్న ప్యాక్‌లకు వినియోగదారుల నుంచి ఆదరణ ఉన్నట్టు పేర్కొంది. ''ఎఫ్ఎంసీజీ అమ్మకాల్లో అధిక వాటా కలిగిన పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా చిన్న పట్టణాల్లో డిమాండ్ క్రమంగా కోలుకుంటోంది. జూన్ త్రైమాసికంతో పోల్చితే మాత్రం పట్టణాల్లో డిమాండ్ తగ్గింది.

ఇక గ్రామీణ మార్కెట్లో అందుబాటు ధరల ఆధారంగా చిన్న ప్యాక్‌ల అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయి. ఎఫ్ఎంసీజీ డిమాండ్‌లో గ్రామీణ వాటా 38 శాతంగా ఉంటుంది''అని ఈ నివేదిక తెలిపింది. సెప్టెంబర్ త్రైమాసికంలో గ్రామీణ మార్కెట్లో 7.7 శాతం వృద్ధి నమోదు కాగా, పట్టణాల్లో 3.7 శాతంగా ఉన్నట్టు వెల్లడించింది.

### మెట్రోల్లో ఈ–కామర్స్ అమ్మకాలు అధికం

మెట్రో నగరాల్లో సంప్రదాయ దుకాణాల ద్వారా ఎఫ్ఎంసీజీ అమ్మకాలు తగ్గగా, ఈ–కామర్స్ విక్రయాలు పెరిగినట్టు నీల్సన్ ఐక్యూ నివేదిక తెలిపింది. ఎనిమిది మెట్రోల్లో ఎఫ్ఎంసీజీ మొత్తం అమ్మకాల్లో ఈ–కామర్స్ వాటా పెరిగినట్టు పేర్కొంది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఓమ్ని ఛానల్ అమ్మకాలకు (ఆన్‌లైన్–ఆఫ్‌లైన్) ఈ–కామర్స్ కీలక చోదకంగా ఉందని, సంప్రదాయ రిటైల్ వాణిజ్యం సైతం తనవంతు వాటా పోషించినట్టు తెలిపింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినందున వినియోగం పట్ల ఆశావహంగా ఉన్నట్టు పేర్కొంది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రభావం వచ్చే రెండు త్రైమాసికాల విక్రయాల్లో కనిపించొచ్చని అంచనా వేసింది. ఎఫ్ఎంసీజీ పరిశ్రమ జీఎస్‌టీ 2.0 (సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి)కు మారే క్రమంలో హోమ్, పర్సనల్‌కేర్ బ్రాండ్ల విభాగంలో తాత్కాలికంగా వృద్ధి నిదానించినట్టు ఈ నివేదిక వివరించింది. ఇక ఆహారోత్పత్తుల వినియోగంలో వృద్ధి స్థిరంగా 5.4 శాతం స్థాయిలో ఉన్నట్టు తెలిపింది. ఫార్మసీల ద్వారా విక్రయించే ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల అమ్మకాల విలువ 14.8 శాతం పెరిగినట్టు, ఇందులో ధరల పెంపు రూపంలో 9.7 శాతం సమకూరినట్టు పేర్కొంది.

## కెప్టెన్‌గా మిలింద్

### ముస్తాక్ అలీ టి20 ట్రోఫీకి హైదరాబాద్ జట్టు

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో పాల్గొనే హైదరాబాద్ సీనియర్ జట్టును శుక్రవారం సెలక్షన్ కమిటీ ప్రకటించింది. 15 మంది సభ్యుల ఈ టీమ్‌కు సీవీ మిలింద్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఉన్న హైదరాబాద్ తమ మ్యాచ్‌లన్నీ కోల్‌కతాలోనే ఆడుతుంది. 7 లీగ్ మ్యాచ్‌ల్లో 3 ఈడెన్ గార్డెన్స్‌లో, 4 జాదవ్‌పూర్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరుగుతాయి. తొలి పోరులో ఈ నెల 26న మధ్యప్రదేశ్‌తో హైదరాబాద్ తలపడుతుంది. ఈ గ్రూప్‌లో మరో ఆరు జట్లు మహారాష్ట్ర, గోవా, ఉత్తర ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, బిహార్, చండీగఢ్ ఉన్నాయి.

**హైదరాబాద్ టి20 జట్టు:** సీవీ మిలింద్ (కెప్టెన్), తనయ్ త్యాగరాజన్ (వైస్ కెప్టెన్), తన్మయ్ అగర్వాల్, అమన్ రావు, హెచ్‌కే సింహా, ఆశిష్ శ్రీవాత్సవ, నితేశ్ కనాల, అజయ్‌దేవ్ గౌడ్, ప్రజ్ఞయ్ రెడ్డి (వికెట్ కీపర్), భవేశ్ సేత్ (వికెట్ కీపర్), నితిన్ సాయి యాదవ్, రక్షణ్ రెడ్డి, ఎండీ అర్ఫాజ్, రిషికేత్ సిసోడియా, రాహుల్ బుద్ధి.

స్టార్క్

# అటు స్టార్క్... ఇటు స్టోక్స్

## ఒకే రోజు 19 వికెట్లు

ఇంగ్లండ్ 172 ఆలౌట్ • 7 వికెట్లతో నిప్పులు చెరిగిన స్టార్క్
ఆస్ట్రేలియా 123/9 • 5 వికెట్లతో కట్టడి చేసిన స్టోక్స్
రసకందాయంలో 'యాషెస్' తొలి టెస్టు

స్టోక్స్

**క్రికెట్ అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన యాషెస్ సిరీస్ అనూహ్య రీతిలో ఆరంభమైంది. కిక్కిరిసిన పెర్త్ స్టేడియంలో ఆసీస్ పేసర్లు అదరగొట్టడంతో... ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేశాం అనుకుంటే... ఇంగ్లండ్ బౌలర్లు కూడా తామేం తక్కువ కాదని నిరూపించారు. స్టార్క్ ధాటికి ఇంగ్లండ్ స్వల్ప స్కోరుకే కుప్పకూలగా... బ్యాటింగ్‌లో ఆకట్టుకోలేకపోయిన ఇంగ్లండ్ సారథి బెన్ స్టోక్స్ బంతితో విజృంభించాడు. ఐదు వికెట్లతో ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బ తీశాడు. వెరసి... పర్యాటక ఇంగ్లండ్ జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో కీలకమైన ఆధిక్యం దక్కే అవకాశాలున్నాయి.**

పెర్త్: పేసర్లకు అనుకూలించే పెర్త్ పిచ్‌పై ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ బౌలర్లు నిప్పులు చెరిగారు. ఫలితంగా యాషెస్ సిరీస్ తొలి టెస్టు తొలి రోజే 19 వికెట్లు నేలకూలాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ ధాటిగా ఆడుతూ 32.5 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (61 బంతుల్లో 52; 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో రాణించగా... ఒలీ పోప్ (58 బంతుల్లో 46; 4 ఫోర్లు), జేమీ స్మిత్ (22 బంతుల్లో 33; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ 58 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా శుక్రవారం ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. అలెక్స్ కేరీ (26 బంతుల్లో 26; 3 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. ఆసీస్ పేసర్లు ఆకట్టుకున్న చోట... ఇంగ్లండ్ బౌలర్లు కూడా సత్తా చాటారు. సారథి బెన్ స్టోక్స్ 6 ఓవర్లలో 23 పరుగులే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టగా... జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్ చెరో 2 వికెట్లు తీశారు. చేతిలో ఒక వికెట్ ఉన్న ఆస్ట్రేలియా... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 49 పరుగులు వెనుకబడి ఉంది. నాథన్ లయన్ (3 బ్యాటింగ్), బ్రెండన్ డగెట్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

### తొలి ఓవర్‌లోనే వికెట్...

ఆస్ట్రేలియా గడ్డపై గత కొన్నాళ్లుగా ప్రభావం చూపలేకపోతున్న ఇంగ్లండ్ జట్టును స్టార్క్ (7/58) కెరీర్ అత్యుత్తమ గణాంకాలతో గట్టిదెబ్బ కొట్టాడు. తొలి ఓవర్ చివరి బంతికి ఓపెనర్ జాక్ క్రాలీ (0)ని అవుట్ చేసిన అతడు... చివరి వరకు అదే జోరు కొనసాగించాడు. తొలి ఓవర్‌లో వికెట్ పడగొట్టడం స్టార్క్‌కు ఇది 24వసారి. సీనియర్ బ్యాటర్ జో రూట్ (0) డకౌట్ కాగా... కెప్టెన్ బెన్ స్టోక్స్ (6) ప్రభావం చూపలేకపోయాడు. బెన్ డకెట్ 21 పరుగులు చేశాడు. పేసర్లకు సహకరిస్తున్న పిచ్‌పై సంయమనంతో బ్యాటింగ్ చేయడానికి బదులు ఇంగ్లండ్ జట్టు... తమకు అలవాటైన 'బాజ్‌బాల్' ఆటతీరును అవలంబించింది. క్రీజులోకి వచ్చిన ప్రతి బ్యాటర్ వేగంగా ఆడేందుకే ప్రయత్నించారు. దీంతో ఒకవైపు వికెట్లు పడుతున్నా... ఇంగ్లండ్ ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. అరంగేట్ర పేసర్ బ్రెండన్ డగెట్ 2 వికెట్లు తీశాడు. కామెరూన్ గ్రీన్‌కు ఒక వికెట్ దక్కింది.

### 6 ఓవర్లు వేసి 5 వికెట్లు...

తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే పరిమితమైన ఇంగ్లండ్... బౌలింగ్‌లో పట్టుదల కనబర్చింది. ఇన్నింగ్స్ రెండో బంతికే ఆసీస్ అరంగేట్ర ఓపెనర్ జేక్ వెదరాల్డ్ (0)ను ఆర్చర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. లబుషేన్ (41 బంతుల్లో 9; 1 ఫోర్) క్రీజులో పాతుకుపోయేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోగా... ఈ మ్యాచ్‌లో సారథ్యం వహిస్తున్న స్టీవ్ స్మిత్ (49 బంతుల్లో 17; 2 ఫోర్లు) కూడా ప్రభావం చూపలేకపోయాడు. ఉస్మాన్ ఖ్వాజా (2) విఫలం కాగా... ట్రావిస్ హెడ్ (21), కామెరూన్ గ్రీన్ (24) తలా కొన్ని పరుగులు చేశారు. **తొలి నాలుగు వికెట్లను ఆర్చర్, కార్స్ పంచుకోగా... ఆ తర్వాత కెప్టెన్ స్టోక్స్ మ్యాజిక్ ప్రారంభమైంది. కేవలం ఆరు ఓవర్లే బౌలింగ్ చేసిన** అతడు... వరుసగా హెడ్, గ్రీన్, స్టార్క్ (12), కేరీ, బోలండ్ (3)లను పెవిలియన్ బాట పట్టించాడు. ఇంగ్లండ్ కూడా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయినా... 5.23 రన్‌రేట్‌తో పరుగులు సాధించగా... ఆస్ట్రేలియా మాత్రం ఆ పని చేయలేకపోయింది.

**19** యాషెస్ టెస్టులో తొలి రోజే 19 వికెట్లు నేలకూలడం 1909 తర్వాత ఇదే తొలిసారి. చివరిసారిగా 1909 మాంచెస్టర్ టెస్టు తొలి రోజు ఇరు జట్లు ఆలౌటయ్యాయి.

**5** ఆస్ట్రేలియా గడ్డపై 5 వికెట్లు పడగొట్టిన ఐదో ఇంగ్లండ్ కెప్టెన్‌గా బెన్ స్టోక్స్ నిలిచాడు. చివరిసారిగా 1982లో ఇంగ్లండ్ సారథి బాబ్ విల్లీస్ బ్రిస్బేన్ టెస్టులో ఈ ఘనత సాధించాడు.

**36** బెన్ స్టోక్స్ ఐదు వికెట్లు పడగొట్టేందుకు వేసిన బంతులు. ఇంగ్లండ్ పేసర్లలో ఇది మూడో వేగవంతమైంది. గతంలో స్టువర్ట్ బ్రాడ్ 19 బంతుల్లో (ఆస్ట్రేలియాపై), 34 బంతుల్లో (న్యూజిలాండ్‌పై) ఈ ఫీట్ నమోదు చేశాడు.

**7/58** ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌కు టెస్టు క్రికెట్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన. ఆసీస్ ఆడిన గత మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై స్టార్క్ 9 పరుగులిచ్చి 6 వికెట్లు తీశాడు. టెస్టుల్లో స్టార్క్ ఐదు వికెట్లు పడగొట్టడం ఇది 17వ సారి.

**100** 'యాషెస్' టెస్టుల్లో 100 వికెట్లు తీసిన 11వ ఆస్ట్రేలియా పేసర్‌గా స్టార్క్ నిలిచాడు. 21వ శతాబ్దంలో టెస్టు అరంగేట్రం చేసిన వారిలో ఈ ఘనత సాధించిన మొదటి పేసర్ అతడే.

**0/1** యాషెస్ సిరీస్‌లో స్కోరు బోర్డుపై ఒక్క పరుగు కూడా నమోదు కాకుండా ఇరు జట్లు ఓపెనింగ్ బ్యాటర్ వికెట్ కోల్పోవడం ఇదే తొలిసారి.

**10** బెన్‌స్టోక్స్‌ను స్టార్క్ అవుట్ చేయడం ఇది పదోసారి. భారత స్పిన్నర్ అశ్విన్ 13 సార్లు స్టోక్స్‌ను పెవిలియన్ చేర్చాడు.

## 'ఫిక్సింగ్'లో అమెరికా క్రికెటర్ అఖిలేష్

### ఐసీసీ అభియోగాలు నమోదు

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌లో యూఎస్‌ఏ టీమ్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆఫ్‌స్పిన్నర్ బొడుగం అఖిలేష్ రెడ్డి అబుదాబి టి10 లీగ్‌లో ఆడుతూ ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అవినీతి నిరోధక నిబంధనలను అతను ఉల్లంఘించినట్లు వెల్లడైంది. అఖిలేష్ రెడ్డిపై మూడు వేర్వేరు అభియోగాలు నమోదు చేసిన ఐసీసీ...

అతడిపై తాత్కాలికంగా నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు అఖిలేష్‌కు 14 రోజుల గడువు ఇచ్చింది. విచారణ ముగిసిన అనంతరం అతనిపై పూర్తి స్థాయిలో చర్యలుంటాయి. అబుదాబి టి10 లీగ్‌లో అస్పిన్ స్టాలియన్స్ జట్టు తరఫున బుధ, గురువారాల్లో అతను 2 మ్యాచ్‌లు ఆడాడు. హైదరాబాద్‌కు చెందిన 25 ఏళ్ల అఖిలేష్ రెడ్డి ఈ ఏడాది ఆరంభంలో నార్త్ అమెరికా టి20 కప్‌లో యూఎస్ తరఫున అరంగేట్రం చేసి 4 మ్యాచ్‌లు ఆడాడు.

## శౌర్య సైనికి రజతం

టోక్యో: బధిరుల ఒలింపిక్స్ క్రీడల్లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. తాజాగా యువ బధిర షూటర్ శౌర్య సైని రజతం సాధించాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో శుక్రవారం జరిగిన పోటీల్లో అతను 450.6 స్కోరుతో రెండో స్థానంలో నిలిచాడు. ఇందులో జర్మనీ షూటర్ మథియస్ ఎరిక్ హెస్ 459.8 స్కోరుతో బధిరుల విశ్వక్రీడల్లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ పోటీల ఫైనల్ బరిలో నిలిచిన మరో భారత షూటర్ కుశాగ్ర సింగ్ రజావత్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అయితే 22 ఏళ్ల శౌర్య క్వాలిఫికేషన్‌లో లక్ష్యబిందువుపై కచ్చితత్వంతో కూడిన షాట్లు సంధించడంతో 584 స్కోరుతో ప్రపంచ రికార్డు (క్వాలిఫయింగ్‌లో) నమోదైంది. అతను 6 ప్రయత్నాల్లో వరుసగా 96, 100, 96, 98, 97, 97 స్కోర్లు సాధించాడు. షూటింగ్‌లో భారత్‌కిది 13వ పతకం. ఇందులో నాలుగు స్వర్ణాలు, ఆరు రజతాలు, మూడు కాంస్యాలున్నాయి.

## ఖాళీలు 73... బరిలో 277

### ఈ నెల 27న డబ్ల్యూపీఎల్ వేలం • అందరి చూపు దీప్తి వైపు

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026వ సీజన్‌కు సంబంధించిన వేలం ఈ నెల 27న జరగనుంది. ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచిన టీమిండియా స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మతో పాటు... హర్లీన్ డియోల్, ప్రతీక రావల్, పూజ వస్త్రకర్, ఉమా ఛెత్రీ, క్రాంతి గౌడ్ వంటి భారత ఆటగాళ్లతో పాటు పలువురు అంతర్జాతీయ ప్లేయర్లు వేలం బరిలో ఉన్నారు. అటు బౌలింగ్ ఇటు బ్యాటింగ్‌లో సత్తాచాటే దీప్తి కోసం ఫ్రాంచైజీలు పోటీ పడే అవకాశాలున్నాయి. మొత్తం 5 ఫ్రాంచైజీలు కలిసి ఈ వేలంలో రూ. 41.1 కోట్లు ఖర్చు చేయనున్నాయి. ఖాళీగా ఉన్న 73 స్థానాల కోసం మొత్తం 277 మంది ప్లేయర్లు పోటీపడుతున్నారు. ఇందులో 194 మంది భారత ప్లేయర్లు ఉన్నారు. వారిలో 52 మంది క్యాప్డ్ ప్లేయర్స్ కాగా... 142 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు. ఇక విదేశాల నుంచి 83 మంది పోటీ పడుతున్నారు. ఇందులో 66 మంది క్యాప్డ్ ప్లేయర్లు కాగా... 17 మంది అన్ క్యాప్డ్ ప్లేయర్లు. గరిష్ట ప్రారంభ ధర రూ. 50 లక్షలు కాగా... ఇందులో 19 మంది ప్లేయర్లు ఉన్నారు. దీప్తి, హర్లీన్, ప్రతీక, పూజ, ఉమ, క్రాంతితో పాటు సోఫీ డివైన్, అమేలియా కెర్ (న్యూజిలాండ్), సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లండ్), అలీసా హీలీ, మెగ్ లానింగ్ (ఆస్ట్రేలియా) కూడా తమ ప్రాథమిక ధరను రూ. 50 లక్షలుగా నిర్ణయించుకున్నారు. రూ. 40 లక్షల ప్రారంభ ధరతో 11 మంది, రూ. 30 లక్షల ప్రారంభ ధరతో 88 మంది ప్లేయర్లు వేలానికి రానున్నారు. 'వేలంలో 194 మంది భారత ప్లేయర్లు ఉన్నారు. 50 స్థానాల కోసం వీరు పోటీ పడుతున్నారు. 23 విదేశీ స్థానాల కోసం 83 మంది పోటీలో ఉన్నారు' అని బీసీసీఐ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

## నోర్జే పునరాగమనం

• దక్షిణాఫ్రికా టి20 జట్టులోకి పేసర్
• భారత్‌తో వన్డే, టి20 సిరీస్‌లకు సఫారీ జట్ల ఎంపిక

నోరే

జొహన్నెస్‌బర్గ్: ఏడాదిన్నర విరామం తర్వాత పేస్ బౌలర్ అన్రిచ్ నోర్జే మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టనున్నాడు. భారత జట్టుతో జరిగే వన్డే, టి20 సిరీస్‌లలో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్లను శుక్రవారం ప్రకటించారు. గత ఏడాది టి20 వరల్డ్‌కప్ తర్వాత మళ్లీ అంతర్జాతీయ మ్యాచ్‌లో బరిలోకి దిగలేకపోయిన నోర్జేకు దక్షిణాఫ్రికా టి20 జట్టులో చోటు లభించింది. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 6 వరకు భారత జట్టుతో జరిగే మూడు వన్డేల్లో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్టుకు తెంబా బవుమా కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. నవంబర్ 30న రాంచీలో తొలి వన్డే... డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో రెండో వన్డే... డిసెంబర్ 6న విశాఖపట్నంలో మూడో వన్డే జరుగుతాయి. అనంతరం డిసెంబర్ 9 నుంచి 19వ తేదీ వరకు ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ జరుగుతుంది. దక్షిణాఫ్రికా టి20 జట్టుకు మార్క్‌రమ్ సారథిగా వ్యవహరిస్తాడు. డిసెంబర్ 9న కటక్‌లో తొలి మ్యాచ్... 11న ముల్లన్‌పూర్‌లో రెండో మ్యాచ్... 14న ధర్మశాలలో మూడో మ్యాచ్... 17న లక్నోలో నాలుగో మ్యాచ్... 19న అహ్మదాబాద్‌లో ఐదో మ్యాచ్ నిర్వహిస్తారు.

**దక్షిణాఫ్రికా వన్డే జట్టు:** తెంబా బవుమా (కెప్టెన్), బార్ట్‌మన్, బ్రీట్జ్‌కీ, బ్రెవిస్, నాంద్రె బర్గర్, క్వింటన్ డికాక్, టోని డి జోర్జి, రూబిన్ హెర్మన్, మార్కో యాన్సెన్, కేశవ్ మహరాజ్, మార్క్‌రమ్, ఇన్‌గిడి, రికెల్టన్, ప్రెనెలన్ సుబ్రాయెన్.

**దక్షిణాఫ్రికా టి20 జట్టు:** మార్క్‌రమ్ (కెప్టెన్), బార్ట్‌మన్, కార్బిన్ బాష్, బ్రెవిచ్, క్వింటన్ డికాక్, టోని డి జోర్జి, డొనోవాన్ ఫెరీరా, రీజా హెండ్రిక్స్, మార్కో యాన్సెన్, జార్జి లిండె, కేశవ్ మహరాజ్, క్వెనా ఎంఫకా, డేవిడ్ మిల్లర్, ఇన్‌గిడి, అన్రిచ్ నోర్జే, ట్రిస్టన్ స్టబ్స్.

# స్మృతి WEDS పలాశ్

### రేపే భారత మహిళా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన వివాహం

• డీవై పాటిల్ స్టేడియం మధ్యలో స్మృతికి ప్రపోజ్ చేసిన పలాశ్
• కాబోయే జంటకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత్ తొలిసారి విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించిన వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన మనసిచ్చిన వాడితో రేపు మనువాడబోతోంది. ఇన్నేళ్లుగా ఒకలా రేపటి రోజు ఒకలా స్మృతి కనిపించబోతోంది. జట్టు జెర్సీతో మైదానంలో ప్యాడ్లు, గ్లౌజ్‌లు, క్యాప్‌తో ఓపెనర్‌గా క్రీజులోకి వచ్చే ఆమె... రేపు మాత్రం అరుదైన డిజైనర్ లెహెంగా, నుదుటన పాపిట బిళ్ల, బుగ్గన చుక్క, మోచేతుల దాకా గాజులు, అరచేతి నిండా పండిన గోరింటాకు, కాళ్లకు పారాణితో వధువులా ముస్తాబై కమనీయ కళ్యాణ వేదికకు రానుంది.

మధ్యప్రదేశ్‌కు చెందిన సంగీత దర్శకుడు, డైరెక్టర్ పలాశ్ ముచ్చల్‌తో స్మృతి కొన్నాళ్లుగా ప్రేమాయణం నడుపుతోంది. వీరిద్దరు త్వరలోనే ఒక్కటవుతారనే వార్తలు నెట్టింట తెగ షికార్లు చేశాయి. ప్రపంచకప్ తర్వాత ముహూర్తం ఖాయమనే ముచ్చట్లూ వినిపించాయి. చివరకు అన్నట్లే ప్రపంచకప్ ముగిసిన వెంటనే స్మృతి ఇంట పెళ్లి బాజా మోగనుంది. తన హోటల్ 'ఎస్ ఎం 18' (స్మృతి మంధాన 18 జెర్సీ నంబర్)లో భారత జట్టు సహచరుల సందడితో పెళ్లి కోలాహలం ఎప్పుడో మొదలైంది. హల్దీ, మెహందీ వేడుకల్లో సహచరుల చిందులు, చిలిపి అల్లర్లు నెట్టింట కనువిందు చేస్తున్నాయి. దీనికి సంబంధించిన వీడియోలతో పాటు డీవై పాటిల్ స్టేడియం మధ్యలో స్మృతి కళ్లకు గంతలు కట్టి పలాశ్ పిచ్ వద్దకు తొడ్కొని రావడంతోపాటు మోకాళ్లపై కూర్చొని ఆమెకు చేసిన పెళ్లి ప్రతిపాదన వీడియో కూడా నెట్టింట క్రికెట్ అభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. ఏకంగా 19 లక్షలు లైక్‌లు, 12 వేలపైచిలుకు కామెంట్లు, లెక్కలేనన్ని శుభాకాంక్షలు ఇన్‌స్టాలో వెల్లువెత్తాయి. 'ఎక్స్'లో ప్రధాని నరేంద్ర మోదీ కాబోయే జంట స్మృతి మంధాన, పలాశ్‌లకు ఆశీర్వదిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## భారీ ఆధిక్యంలో బంగ్లాదేశ్

### హసన్, షాద్‌మన్ హాఫ్ సెంచరీలు • ఐర్లాండ్‌తో రెండో టెస్టు

మిర్పూర్: సొంతగడ్డపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న బంగ్లాదేశ్ జట్టు... ఐర్లాండ్‌తో రెండో టెస్టులో భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 37 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 156 పరుగులు చేసింది. ఓపెనర్లు మహ్మదుల్ హసన్ జాయ్ (91 బంతుల్లో 60; 6 ఫోర్లు), షాద్‌మన్ ఇస్లామ్ (110 బంతుల్లో 69 బ్యాటింగ్; 5 ఫోర్లు) హాఫ్‌సెంచరీలతో రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో గావిన్ హోయ్ ఒక వికెట్ పడగొట్టాడు. నేడు ఆటకు నాలుగో రోజు కాగా... చేతిలో 9 వికెట్లు ఉన్న బంగ్లాదేశ్... ప్రస్తుతం 367 పరుగుల ఆధిక్యంలో ఉంది. షాద్‌మన్‌తో పాటు మోమినుల్ హక్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు 98/5తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ జట్టు... 88.3 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ టకర్ (171 బంతుల్లో 75 నాటౌట్; 7 ఫోర్లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకోగా... జోర్డన్ నీల్ (83 బంతుల్లో 49; 9 ఫోర్లు), స్టీఫెన్ (77 బంతుల్లో 46; 4 ఫోర్లు) చక్కటి పోరాటం కనబర్చారు. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 4 వికెట్లు పడగొట్టగా... ఖాలెద్ అహ్మద్, హసన్ మురాద్ చెరో 2 వికెట్లు తీశారు. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 476 పరుగుల భారీ స్కోరు చేయడంతో... ఆ జట్టుకు 211 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

షాద్‌మన్

మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఉదయం సెషన్‌లో భూప్రకంపనలు రావడంతో కొన్ని నిమిషాలపాటు ఆటను నిలిపి వేశారు.

# నాటి రిఖీ.. నేటి రవి చౌదరి!

అదొక అద్భుతం. బాలీవుడ్ సినిమాకు తీసిపోని వాస్తవం. పదహారేళ్ల వయసులో తలకు బలమైన గాయమై.. గతాన్ని పూర్తిగా మరిచిపోయి అదృశ్యమయ్యాడొక వ్యక్తి. చిత్రంగా అదే వ్యక్తి సరిగ్గా 45 ఏళ్ల తర్వాత.. మరో గాయంతో పాత జ్ఞాపకాలన్నీ ముసురుకుని కుటుంబాన్ని చేరుకున్నాడు. ఆయనే నాటి రిఖీ.. నేటి రవి చౌదరి.

### భారమైన బతుకుల్లో ఆనందభాష్పాలు

హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లా, నది గ్రామంలో ఇటీవల ఈ అపూర్వ కలయిక జరిగింది. కొడుకు చనిపోయాడని ఇన్నాళ్లు భారంగా బతికిన తల్లిదండ్రులు, తోబుట్టువులు.. తమ ప్రియమైన రిఖీని అతడి భార్యాబిడ్డలతో సహా చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఆరోజు.. ఆ గ్రామంలో సంగీతం, పూల వర్షం, ఆనందభాష్పాలు తప్ప మరేమీ కనిపించలేదు.

### గాయంతో పునర్జన్మ..

రిఖీ అనే యువకుడు 1980లో హరియాణాలోని యమునా నగర్‌లో ఒక హోటల్‌లో పనిచేసేవాడు. అంబాలా వెళ్లే మార్గంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అతని తలకు బలమైన గాయం తగిలింది. ఆ గాయం అతని మెదడులోని ప్రతి జ్ఞాపకాన్ని తుడిచి పెట్టేసింది. పేరు, ఊరు, కుటుంబం.. అన్నీ మరిచిపోయి జీవచ్ఛవంలా మిగిలాడు. కొత్త స్నేహితులు అతనికి రవి చౌదరి అని పేరు పెట్టారు. గతం తెలియని రవి, ముంబైకి చేరుకుని చిన్న చిన్న పనులు చేస్తూ బతికాడు. తరువాత మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్లి, అక్కడి ఒక కాలేజీలో పనిచేస్తూ స్థిరపడ్డాడు. అక్కడే సంతోషి అనే అమ్మాయిని వివాహం చేసుకుని, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకుతో కొత్త జీవితాన్ని ప్రారంభించాడు.

### మలుపు తిప్పిన మరో గాయం

కొన్ని నెలల క్రితం, అతడి జీవితాన్ని మళ్లీ మార్చే మరో సంఘటన జరిగింది. అతని తలకు మరో చిన్న గాయమైంది. అంతే.. రవికి నిద్రలో అస్పష్టమైన దృశ్యాలు కనిపించడం మొదలయ్యాయి. తన గ్రామం నదిలోని మామిడి చెట్టు, సన్నని దారులు, సటౌన్ అనే చోట ఉన్న ఇంటి పెరడు.. ఇవే రవికి పదే పదే కలలో కనిపించాయి. అవి కలలు కావు.. ఒకప్పటి జ్ఞాపకాలని తెలుసుకోవడానికి అతనికి ఎంతో సమయం పట్టలేదు. వెంటనే, అతను ఒక కాలేజీ విద్యార్థి సహాయంతో సటౌన్ వివరాల కోసం వెతకడం మొదలుపెట్టాడు. గూగుల్‌లో నది గ్రామం గురించి వెతుకుతున్నప్పుడు, వారికి ఒక కేఫ్‌కు సంబంధించిన ఫోన్ నంబర్ దొరికింది. రిఖీ ఆ నంబర్‌కు ఫోన్ చేసి, గ్రామ పెద్ద రుద్ర ప్రకాశ్‌తో మాట్లాడాడు. మాటామంతీ తర్వాత.. రిఖీ బంధువులలో ఒకరైన ఎం.కె.చౌబేకు పాత విషయాలు గుర్తుకొచ్చాయి. ఈ వివరాలన్నీ సరిపోలడంతో, చివరకు నవంబర్ 15న రిఖీ.. 45 ఏళ్ల నిరీక్షణకు తెరదించి కుటుంబ సభ్యులను కలుసుకున్నాడు.

### శాస్త్రానికి అందని అద్భుతం

'గాయం కారణంగా కోల్పోయిన జ్ఞాపకాలు తిరిగి రావడం అనేది అత్యంత అరుదుగా, అద్భుతాలలో మాత్రమే జరుగుతుంది. వైద్య పరీక్షలు, బ్రెయిన్ స్కానింగ్‌ల తర్వాతే దీనికి కచ్చితమైన కారణం తెలుస్తుంది'.. అని మానసిక ఆరోగ్య నిపుణుడు డాక్టర్ ఆదిత్య శర్మ పేర్కొన్నారు. 45 ఏళ్ల నిశ్శబ్దం, తరాల అంతరం.. వీటన్నింటినీ ఒకే ఒక్క జ్ఞాపకం ఛేదించింది. కుటుంబ బంధాన్ని తిరిగి కలిపింది. కాలం చేసిన గాయానికి వైద్యం చేసే శక్తి ప్రేమకు మాత్రమే ఉందని ఈ సంఘటన రుజువు చేసింది. రిఖీ, రవి చౌదరిగా.. ఇప్పుడు రెండు జీవితాల సారాన్ని తనలో నింపుకొన్నాడు.

- సాక్షి, నేషనల్ డెస్క్

# సముద్ర అన్వేషణకు మత్స్య-6000

## సిద్ధమవుతున్న దేశీయ సముద్రయాన వాహనం

- వచ్చే ఏడాది ఆరంభంలో సాగర మథనం
- సారథ్యం వహించబోతున్న ఇద్దరు ఆక్వానాట్స్

మత్స్య లోపల సైంటిస్టుల విజయ సంకేతం

మత్స్య-6000 లోపలి భాగం

చెన్నై: సముద్ర అంతర్భాగంలోని రహస్యాలను ఛేదించడానికి భారత ఆక్వానాట్స్ రమేశ్ రాజు, జతీందర్‌పాల్ సింగ్ సిద్ధమవుతున్నారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మిస్తున్న 'మత్స్య-6000'సముద్రయాన వాహనంలో వచ్చే ఏడాది ఆరంభంలో సాగర మథనం చేయబోతున్నారు. 28 టన్నుల బరువైన ఈ వాహనం సముద్రంలో 6000 మీటర్ల లోతు వరకు సునాయాసంగా ప్రయాణించగలదు. చెన్నై తీరంలో ప్రయాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సముద్రంలో అత్యంత లోతునకు వెళ్లి పరిశోధనలు చేసే సామర్థ్యం ప్రస్తుతం కొన్ని దేశాలకే ఉంది. ఆ జాబితాలో భారత్ సైతం చేరబోతోంది. రమేశ్ రాజు, జతీందర్‌పాల్ సింగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషియన్ టెక్నాలజీ(ఎన్ఐఓటీ)లో శిక్షణ పొందారు. 'మత్స్య-6000'కు వీరిద్దరూ సారథ్యం వహించబోతున్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న డీప్ ఓషియన్ మిషన్‌లో భాగంగానే ఈ సముద్రయానం జరుగుతోంది. రిమోట్‌తో పనిచేసే వాహనాలు, యంత్రాలను, మర మనుషులను సముద్రం లోతుల్లోకి పంపించి, అనేక పరిశోధనలు చేశారు. కొత్త విషయాల కనిపెట్టారు. కానీ, 6 కిలోమీటర్ల లోతుకు మనుషులకు పంపిస్తుండడం మాత్రం ఇదే మొదటిసారి అని ఎన్ఐఓటీ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ చెప్పారు. మన ఆక్వానాట్స్ భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. కేంద్ర ఎర్త్ సైన్సెస్ శాఖ ఆధ్వర్యంలో సముద్రయాన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. స్వయం సమృద్ధికి పెద్దపీట వేస్తూ సబ్‌మెర్సిబుల్ వాహనాన్ని సొంతంగానే నిర్మించడం విశేషం. ఇందుకోసం డీఆర్‌డీఓ, సీఎస్ఐఆర్, ఇస్రో వంటి సంస్థల సహకారం తీసుకున్నామని బాలాజీ రామకృష్ణన్ వెల్లడించారు. మనకు అవసరమైన నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం మనదేశంలోనే ఉన్నాయని చెప్పారు. యంత్రాలు కాకుండా నేరుగా మానవులే వెళ్తే మరిన్ని రహస్యాలను ఛేదించడానికి వీలుంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మానవుడి కంటికి ఏ కెమెరా కూడా ప్రత్యామ్నాయం కాదని సముద్రయాన్ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణన్ పేర్కొన్నారు. సముద్ర అంతర్భాగాన్ని మరింత విస్తృతంగా శోధించడానికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని స్పష్టంచేశారు.



చెన్నైలో ట్రయల్స్‌లో నీటి అడుగుకు వెళ్లేందుకు సిద్ధమైన మత్స్య

### నిమిషానికి 30 మీటర్ల వేగం

సముద్రాల అంతర్భాగాల్లో ఎన్నెన్నో విశేషాలు ఉన్నాయి. అత్యంత అరుదైన ఖనిజాలు, ఇంధనాలు, జీవవైవిధ్య వనరులకు అడ్డాగా చెప్పొచ్చు. అమెరికా, రష్యా, చైనా, జపాన్, ఫ్రాన్స్ దేశాలకు మాత్రమే సముద్రాల లోతుల్లోకి వెళ్లి అన్వేషించే సామర్థ్యం ఉంది. సముద్రయాన్ ప్రాజెక్టు విజయవంతమైతే ఆ ఘనత సాధించిన దేశాల జాబితాలోకి ఇండియా కూడా చేరుతుంది. భారత్‌కు 11,098 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీరం ఉంది. దేశ ప్రగతికి సముద్ర వనరులను గరిష్టంగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. ఇందుకోసమే డీప్ సీ ఓషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. మత్స్య-6000 విశేషాలను గమనిస్తే ఇది 2.25 మీటర్ల వ్యాసం కలిగిన గోళాకార వాహనం. బాయిలర్ స్టీల్‌తో నిర్మించారు. లిథియం-పాలీమర్ బ్యాటరీలతో పనిచేస్తుంది. ఈ వాహనాన్ని తొలుత 500 మీటర్ల లోతు వరకు తీసుకెళ్తారు. 2027 నాటికి దీని సామర్థ్యాన్ని 10 రెట్లు పెంచుతారు. అంటే 6,000 మీటర్ల లోతుకు వెళ్లేలా అభివృద్ధి చేస్తారు. ఇది నిమిషానికి 30 మీటర్ల వేగంతో సముద్రంలోకి దూసుకెళ్లగలదు. ఇందులో కెమెరాలు, విద్యుత్ దీపాలతో పాటు మర చేతులు ఉంటాయి. వాటితో సముద్రంలో నమూనాలు సేకరిస్తారు. కొన్ని నెలల క్రితం ఫ్రెంచ్ సబ్‌మెర్సిబుల్ వాహనం నాటైల్‌లో ఇద్దరు సైంటిస్టులు సముద్రంలో 5000 మీటర్ల లోతు వరకు ప్రయాణించారు. ఆ ప్రయోగమే మత్స్య-6000 అభివృద్ధికి స్ఫూర్తినిచ్చింది.

# మేడమ్.. బ్యాడ్ వర్డ్స్‌తో వేధిస్తున్నారు..!

## 45 నిమిషాల్లో ఐదుసార్లు టీచర్ సాయం కోరిన చిన్నారి

### జైపూర్ స్కూల్‌లో విద్యార్థిని ఆత్మహత్య ఘటన

- దర్యాప్తులో విస్తుగొలిపే అంశాలు వెలుగులోకి..

న్యూఢిల్లీ: రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో ఈ నెల ఒకటో తేదీన ఓ ప్రైవేట్ స్కూల్‌లో 4వ తరగతి చదివే విద్యార్థిని ఆత్మహత్యపై అధికారులు చేపట్టిన దర్యాప్తులో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఘటన జరిగిన రోజు చివరి 45 నిమిషాల్లో బాధిత బాలిక క్లాస్ టీచర్‌కు కనీసం ఐదు సార్లు తనను బ్యాడ్ వర్డ్స్‌తో క్లాస్‌మేట్స్ వేధిస్తున్నారనే విషయం గురించి ఫిర్యాదు చేసినట్లు సీబీఎస్ఈ ఏర్పాటు చేసిన కమిటీ దర్యాప్తులో తేలింది. ఆమె ఫిర్యాదును విన్న టీచర్ క్లాసంతా వినిపించేలా గద్దించిందే తప్ప, ఎటువంటి చర్య తీసుకోలేదు. యాజమాన్యానికి కూడా టీచర్ ఈ విషయం తెలపలేదు. దీంతో, దిక్కుతోచని స్థితిలో చిన్నారి తమ క్లాసు జరిగే గ్రౌండ్ ఫ్లోర్ నుంచి స్కూలు భవనంలో నాలుగో అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కిందికి దూకింది. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. స్థానిక నీరజా మోదీ స్కూల్‌లో చోటుచేసుకున్న ఘటనపై దర్యాప్తు చేపట్టిన సీబీఎస్ఈ స్కూలు యాజమాన్యానికి నోటీసు జారీ చేసింది. స్కూలులో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పడంలో విఫలమైందని పేర్కొంది. తోటి విద్యార్థులు పదేపదే వేధింపులకు గురిచేస్తున్న విషయాన్ని బాధిత చిన్నారి మొదటిసారిగా 2024 జూలైలో తల్లిదండ్రులకు తెలిపింది. వారు టీచర్ల దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు ఏడాదిన్నరగా ఇలా వేధింపులు ఆగకుండా కొనసాగుతుండటం, చిన్నారి స్కూలులో టీచర్లకు చెప్పడం జరుగుతూనే ఉంది. టీచర్లు సర్దుకుపోవాలంటూ బాలికను గద్దించి చెబుతున్నారే తప్ప, బాధ్యులను మందలించిన పాపానపోలేదని దర్యాప్తులో వెల్లడైంది. సెప్టెంబర్ పేరెంట్స్ మీటింగ్ రోజున కూడా తమ సమక్షంలోనే కుమార్తెను తోటి బాలురు వేధించడం చూసిన తండ్రి, టీచర్లకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాతా వేధింపులు ఆగలేదు. ఘటన జరిగిన రోజున బాధిత చిన్నారి స్కూలుకు వచ్చే వరకు హుషారుగానే కనిపించింది. ఉదయం 11 గంటల సమయంలో ఆమె వద్ద ఉన్న డిజిటల్ స్లేట్‌పై ఏదో రాయడం లేదా బొమ్మ వేయడం జరిగిందని, అది చూసిన తర్వాతే ఆమె తీవ్రంగా కలతకు గురైందని దర్యాప్తులో తేలింది. అలాంటివి రాయొద్దని వారికి చెప్పండని టీచర్‌కు ఫిర్యాదు చేసింది. అలా కేవలం 45 నిమిషాల వ్యవధిలోనే ఐదుసార్లు టీచర్ల వద్దకు వెళ్లి తన ఆవేదన తెలిపింది. తగు రీతిలో స్పందించకపోగా ఆమెపైనే కేకలు వేసింది. దీంతో ఏమీ పాలుపోని పరిస్థితుల్లో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి నాలుగో అంతస్తుకు వెళ్లి కిందికి దూకి, తనువు చాలించిందని సీబీఎస్ఈ నివేదిక వెల్లడించింది. అభ్యంతరకరమైన మాటలు, దుర్భాషలతో వేధించడం వల్లే చిన్నారి తట్టుకోలేకపోయిందని నివేదిక గుర్తించింది. ఇదొక్కటే కాదు.. స్కూలు యాజమాన్యం సీబీఎస్ఈ పలు నిబంధనలను పాటించడం లేదని గుర్తించి, నోటీసు జారీ చేసింది.

# 'స్థానికం' ముగిశాకే ఎస్ఐఆర్!

### సుప్రీంకోర్టులో కేరళ ప్రభుత్వం పిటిషన్

- డిసెంబర్ 9, 11 తేదీల్లో రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు
- పోలింగ్ రోజే ఎస్ఐఆర్ ముసాయిదా ఎలా సాధ్యమని ప్రశ్న
- ఈసీకి సుప్రీం నోటీసులు.. 26న తదుపరి విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: కేరళలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల హడావుడి ముగిసే వరకు ఈ ప్రక్రియను వాయిదా వేయాలంటూ కేరళ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చిల ధర్మాసనం ఎన్నికల సంఘం(ఈసీ)కి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 26వ తేదీకి వాయిదా వేసింది.

### అధికారులు రెండు పనులు ఒకేసారి ఎలా చేస్తారు?

కేరళ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. తాము ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వ్యతిరేకించడం లేదు.. కేవలం వాయిదా మాత్రమే కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ, ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్ ఒకే సమయంలో జరుగుతున్నాయని, దీనివల్ల ప్రభుత్వ యంత్రాంగంపై తీవ్ర భారం పడుతోందని కపిల్ సిబల్ తెలిపారు. డిసెంబర్ 9, 11 తేదీల్లో రెండు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 13న కౌంటింగ్ ఉంది. అయితే, ఈసీ షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 4 నాటికే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి. పైగా పోలింగ్ జరిగే డిసెంబర్ 9వ తేదీనే ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించాలి. ఎన్నికల విధుల్లో బిజీగా ఉండే సిబ్బంది అదే రోజు జాబితా ఎలా ప్రకటిస్తారని ఆయన పేర్కొన్నారు. ఇది పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులకు దారి తీస్తుందని వివరించారు.

### ఏకమైన రాజకీయ పక్షాలు

కేరళ ప్రభుత్వంతో పాటు, సీపీఎం, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్), కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా ధర్మాసనం ఈసీకి నోటీసులు పంపింది. ప్రభుత్వం కేవలం వాయిదా కోరుతుండగా, పార్టీలు మాత్రం ఎస్ఐఆర్ ప్రక్రియనే సవాలు చేస్తున్నాయి. తొలుత ఈ అంశంపై కేరళ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. అయితే, బిహార్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన కేసులు సుప్రీం పరిధిలో ఉన్నందున తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. దీంతో కేరళ సర్కార్ సుప్రీం తలుపుతట్టింది. బిహార్‌లో ఇప్పటికే ఈ ప్రక్రియ ముగియగా.. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు వేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. యూపీలో ఎస్ఐఆర్ చేపట్టడంపై కాంగ్రెస్ ఎంపీ తనూజ్ పునియా, పుదుచ్చేరిలో ఎస్ఐఆర్‌పై సీఎం నారాయణ స్వామి సుప్రీంలో పిటిషన్లు వేశారు.

# 'ఎమర్జెన్సీ' పెళ్లి

సాధారణంగా పెళ్లిళ్లు అంగరంగ వైభవంగా కల్యాణ మండపాల్లో జరుగుతాయి. కానీ కేరళలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డు పెళ్లి మండపంగా మారిపోయింది. తంబోలికి చెందిన వరుడు.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన తన వధువుకు అక్కడే తాళి కట్టాడు.

### పెళ్లి కూతురి ముస్తాబుకు వెళ్తూ..

ఆలప్పుజలోని కొమ్మడికి చెందిన అవని, తంబోలికి చెందిన వి.ఎం.షారన్‌ల వివాహం శుక్రవారం మధ్యాహ్నం తంబోలిలో జరగాల్సి ఉంది. అయితే, ఉదయాన్నే పెళ్లి కూతురు అవని.. అలంకరణ కోసం కుమరకోమ్ వెళ్తుండగా, ఆమె ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ఒక చెట్టును బలంగా ఢీకొట్టింది. స్థానికులు వెంటనే గాయపడిన అవనిని కొట్టాయం వైద్య కళాశాలకు తరలించారు. ఆమె వెన్నెముకకు తీవ్ర గాయం కావడంతో, ప్రత్యేక చికిత్స కోసం మధ్యాహ్నం ఎర్నాకుళంలోని వీపీఎస్ లేక్‌షోర్ ఆసుపత్రికి తరలించారు.

### ముహూర్తం ముఖ్యం!

ప్రమాద వార్త విన్న షారన్, అతడి కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. అందరూ అయోమయంలో ఉన్నా, రెండు కుటుంబాల దృష్టి ముహూర్తంపైనే ఉంది. మధ్యాహ్నం 12.15 గంటల నుండి 12.30 గంటల మధ్య పెళ్లికి శుభ ముహూర్తం నిర్ణయించారు. దీంతో, ముహూర్త సమయం మించిపోకూడదన్న గట్టి సంకల్పంతో, రెండు కుటుంబాలు వివాహాన్ని ఆసుపత్రిలోనే జరిపించాలని కోరాయి. పరిస్థితిని అర్థం చేసుకున్న ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులను సంప్రదించి ఒక సాహసోపేత నిర్ణయం తీసుకుంది. వధువు అవనికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎమర్జెన్సీ విభాగంలోనే పెళ్లికి ఏర్పాట్లు చేసింది.

### కల్యాణమంటపమైన ఆసుపత్రి

వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, అతికొద్దిమంది బంధువుల సాక్షిగా.. శుభ ముహూర్తంలో షారన్, అవని మెడలో తాళి కట్టి జీవిత సహచరిగా స్వీకరించాడు. ఆ క్షణంలో, ఆసుపత్రిలోని మెడికల్ పరికరాల శబ్దాల మధ్య.. బంధువుల దీవెనలు మారుమోగిపోయాయి. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుధీష్ కరుణాకరన్ మాట్లాడుతూ, అవని వెన్నెముకకు గాయమైనందున త్వరలోనే శస్త్రచికిత్స చేస్తామని తెలిపారు. ప్రాణం నిలవడానికి ఔషధం కావాలి, కానీ జీవితం మొదలవడానికి ముహూర్తం కావాలి.. అన్నట్లు. కత్తిరింపులు, కుట్లు, ఐవీ సెలైన్‌ల మధ్య ఈ వివాహ వేడుక జయప్రదంగా జరిగిపోయింది. జీవితంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినా.. అవని, షారన్ ఇద్దరూ కలిసి ఎదుర్కొంటారనే ధైర్యాన్ని, హామీని. అంతకుమించిన నమ్మకాన్ని ప్రపంచానికిచ్చింది.

వధువు అవనికి తాళి కట్టి బొట్టుపెడుతున్న వరుడు షారన్

- సాక్షి, నేషనల్ డెస్క్

## పంజాబ్‌లో గ్రెనేడ్ దాడులకు కుట్ర

### పట్టుబడిన ఐఎస్ఐ-ఉగ్రమాడ్యూల్ సభ్యుల వెల్లడి

లుధియానా: పంజాబ్‌లోని లుధియానాలో గురువారం పట్టుబడిన ఐఎస్ఐ ప్రేరేపిత గ్యాంగ్‌స్టర్- ఉగ్ర మాడ్యూల్ సభ్యులు కీలక విషయాలను వెల్లడించారు. వీరు ఈ సరిహద్దు రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలు సహా పలు సున్నిత ప్రాంతాల్లో గ్రెనేడ్ దాడులకు కుట్ర పన్నినట్లు తేలింది. పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో దీపక్ అలియాస్ దీపు, రామ్‌లాల్ అనే వారు గాయపడి పట్టుబడ్డారు. వీరి నుంచి రెండు గ్రెనేడ్లతోపాటు ఐదు అత్యాధునిక పిస్టళ్లు లభించాయి. రాజస్తాన్‌కు చెందిన వీరిద్దరూ లుధియానాలో రెండు రోజులు మకాం వేసి దాడులను సమన్వయం చేసేందుకు వచ్చారని పోలీస్ కమిషనర్ స్వపన్ శర్మ చెప్పారు. నేరగాళ్లతో ఉగ్రదాడులకు కుట్ర పన్నడం పాకిస్తాన్‌లో ఉన్న జస్‌వీర్ అలియాస్ చౌదరి పన్నిన కుట్రలో కొత్త కోణమన్నారు. వీరికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగుతోనూ లింకులున్నాయని చెప్పారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ మాడ్యూల్‌లోని ఫెరోజ్‌పూర్, హరియాణా, బిహార్‌లకు చెందిన ముగ్గురిని పట్టుకున్నామన్నారు. లుధియానా అరెస్టులతో భారీ ముప్పు తప్పిందని కమిషనర్ చెప్పారు.

## ఢిల్లీలో ఆటల పోటీలపై నిషేధం

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ-దేశ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్) పరిధిలో వాయు కాలుష్యం తీవ్ర రూపం దాల్చడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్కూళ్లు, కాలేజీలు, వర్సిటీలు, ఇతర క్రీడా సంస్థలు నవంబర్, డిసెంబర్ నెలల్లో ఆటల పోటీలను నిర్వహించరాదని ఉత్తర్వులు జారీ చేసింది. విపరీతమైన వాయు కాలుష్యంతో ఢిల్లీ గ్యాస్ ఛాంబర్‌లా మారిందని విద్యాసంస్థలు ఆటల పోటీలను నిర్వహించడంపై పునరాలోచన చేయాలంటూ తాజాగా సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టులు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కొద్దిరోజులుగా ఢిల్లీలో వాయుకాలుష్యం విజృంభిస్తోంది. ఇదే సమయంలో నవంబర్, డిసెంబర్ నెలల్లో అండర్-14, అండర్-16 విద్యార్థులకు ఇంటర్ జోనల్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. వాయుకాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలు ఆటలు ఆడితే వారు ఆ గాలిని పీల్చుకుని ప్రమాదంలో పడే అవకాశాలు ఉన్నాయని, కొద్దిరోజుల పాటు క్రీడాపోటీలను నిలిపివేస్తే బాగుంటుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ ప్రభుత్వం రెండు నెలల పాటు క్రీడా పోటీలపై నిషేధాన్ని విధించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఇది అమల్లో ఉంటుందని బుధవారం వెలువరించిన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

## ధర్మస్థల కేసులో కోర్టుకు సిట్ చార్జిషీట్

### నిందితులుగా ఆరుగురు వ్యక్తుల పేర్లు

మంగళూరు: ధర్మస్థల కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ శుక్రవారం కోర్టులో చార్జిషీట్ సమర్పించింది. ఆలయ పట్టణంలో జరిగిన హత్యలు, అత్యాచారాలు, ఖననాల ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న సిట్ గురువారం బెల్తంగడిలోని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌కు 3,900 పేజీల నివేదికను సమర్పించింది. ఇందులో ఆరుగురిని నిందితులుగా పేర్కొంది. ఈ కేసులో ఎఫ్ఐఆర్‌కు మద్దతిచ్చిన మహేశ్ శెట్టి తిమరోడి, గిరీష్ మట్టన్నవర్, టి.జయంత్, విఠల్ గౌడ, సుజాత భట్‌లతో పాటు ఫిర్యాదుదారు చిన్నయ్యను కూడా నిందితుడిగా పేర్కొంది. రెండు దశాబ్దాలుగా ధర్మస్థలలో లైంగిక దాడులు జరుగుతున్నాయని, మహిళల మృతదేహాలను తానే పూడ్చానని సి.ఎన్.చిన్నయ్య చేసిన ఆరోపణలు తీవ్ర సంచలనం రేపాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ ధర్మస్థలలోని నేత్రావతి నది ఒడ్డున ఉన్న అటవీ ప్రాంతాల్లోని అనేక ప్రదేశాల్లో తవ్వకాలు నిర్వహించింది. రెండు చోట్ల కొన్ని అస్థిపంజర అవశేషాలు లభించాయి.

## ఢిల్లీ పేలుడు ఘటన.. నిందితుడి పిటిషన్ కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: ఈనెల 17వ తేదీన ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో సహ నిందితుడు జసీర్ బిలాల్ వనీకి ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. లాయర్‌ను కలుసుకునేందుకు అనుమతించాలంటూ అతడు పెట్టుకున్న పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. జాతీయ దర్యాప్తు సంస్థ ప్రధాన కార్యాలయంలో విచారణను ఎదుర్కొంటున్న ఇతడు దిగువ కోర్టు ఇందుకు సంబంధించిన వినతిని తోసిపుచ్చిందని తెలిపే ఎటువంటి ఉత్తర్వులను చూపలేదని పేర్కొంది. ముందుగా పిటిషన్‌ను తిరస్కరించినట్లుగా ఉత్తర్వులు తీసుకురావాలని, దానిని ఇక్కడ సవాల్ చేయాలని పేర్కొంది.

## శ్రీనగర్ ఎరువుల దుకాణాల్లో సోదాలు

శ్రీనగర్: భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేసేందుకు శ్రీనగర్ పోలీసులు శుక్రవారం వివిధ ప్రాంతాల్లోని ఆస్పత్రులతోపాటు ఎరువులు, రసాయనాల దుకాణాలు, కారు డీలర్‌షిప్పుల్లోనూ తనిఖీలు చేపట్టారు. ముందు జాగ్రత్తగా చేపట్టిన ఈ సోదాలకు ఎస్ఎస్పీ సందీప్ చక్రవర్తి సారథ్యం వహించారు. అనధికారికంగా జరిగే అమ్మోనియం నైట్రేట్ విక్రయాలు, సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోళ్లు, డాక్టర్లు తమ లాకర్లలో ఆయుధాలను దాయడం వంటివి తనిఖీల వేళ వెలుగు చూశాయన్నారు. ఎరువుల దుకాణాల్లో రికార్డులను తనిఖీ చేశారు.

## రెండు దశాబ్దాల తర్వాత హోం శాఖను వదులుకున్న సీఎం నితీశ్

పట్నా: బిహార్ ముఖ్యమంత్రిగా పదోసారి గురువారం ప్రమాణం చేసిన నితీశ్ కుమార్ మంత్రులకు శాఖలను కేటాయించారు. అయితే, రెండు దశాబ్దాల్లో మొదటిసారిగా కీలకమైన హోం శాఖను ఇతరులకు ఇచ్చేశారు. ఆ పదవిని డిప్యూటీ సీఎం సమ్రాట్ చౌదరికి కట్టబెట్టారు. సమ్రాట్‌కు శాంతిభద్రతలు, వలస బాధ్యతల శాఖలను కూడా అప్పగించారు. డిప్యూటీ సీఎంకు ఈ దఫా మరింతగా బాధ్యతలు పెరగడం చూస్తే, బీజేపీ ప్రాధాన్యం పెరుగుతోందని పరిశీలకులు చెబుతున్నారు. మరో డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హాకు ల్యాండ్ రెవెన్యూ శాఖతోపాటు గనుల శాఖలు దక్కాయి.

## సముద్ర నౌకాశ్రయాలకు సీఐఎస్ఎఫ్ ఛత్రం

### నోడల్ ఏజెన్సీగా పారిశ్రామిక భద్రతా దళం • ఆరు నెలల్లో కార్యాచరణ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న 254 సముద్ర నౌకాశ్రయాలకు భద్రతను కట్టుదిట్టం చేసేందుకు కేంద్రం నడుం బిగించింది. ఇందులో భాగంగా దేశ సముద్ర సరిహద్దుల్లో ఉన్న చిన్న, పెద్ద నౌకాశ్రయాలకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్)ను ప్రధాన భద్రతావిభాగంగా గుర్తించింది. కేంద్ర నౌకాశ్రయాలు, ఓడలు, నౌకాయాన శాఖ ఈ మేరకు ఈ నెల 18వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా ఇంటర్నేషనల్ షిప్ అండ్ పోర్ట్ ఫెసిలిటీ సెక్యూరిటీ(ఐఎస్పీఎస్) కోడ్ ప్రకారం సీఐఎస్ఎఫ్‌కు ఇప్పుడు రికగ్నైజ్డ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్‌గా గుర్తింపు లభించినట్లయిందని సీఐఎస్ఎఫ్ డిప్యూటీ ఐజీ అజయ్ దహియా చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న నౌకాశ్రయాల్లో భద్రతను పెంచే కీలక సంస్కరణ అన్నారు.

# స్థానిక ప్రభుత్వాల పితామహుడు ఎవరు?

**స్థానిక పరిపాలనా కార్యకలాపాలను నిర్వహించే ప్రభుత్వాలను స్థానిక ప్రభుత్వాలుగా పేర్కొంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ వికాసాన్ని పెంపొందిస్తే.. స్థానిక ప్రభుత్వాలు రాజకీయ వికాసంతోపాటు సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక వికాసానికి తోడ్పడతాయి. వీటి ద్వారా అధికార వికేంద్రీకరణ జరుగుతుంది. ఈ ప్రభుత్వాలు రాజకీయ పరిజ్ఞానాన్ని, భాగస్వామ్యాన్ని పెంపొందిస్తాయి. నాయకులకు రాజకీయంగా ఎదిగేందుకు పునాదుల్లా పనిచేస్తాయి. వీటి ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిర్మించవచ్చు.**

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

## స్థానిక ప్రభుత్వాల అభివృద్ధి

భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలు చారిత్రక క్రమంలో అభివృద్ధి చెందాయి. వీటిని ప్రవేశపెట్టిన మొదటి రాజవంశం 'మౌర్యులు'. చోళులు స్థానిక ప్రభుత్వాల విషయంలో ఉన్నత మార్పులు ప్రవేశపెట్టారు. వీరి కాలంలో ఈ ప్రభుత్వాలను 'నాడులు' అని పిలిచేవారు. ఢిల్లీ సుల్తాన్ల కాలంలో గ్రామ పంచాయతీలు ఉండేవి. భూమిని కొలిచి దాని అధారంగా పన్ను వసూలు చేసే విధానాన్ని షేర్షా ప్రారంభించాడు. మొగలుల కాలంలో 'కొత్వాల్' అనే అధికారి పట్టణ పాలనను చూసుకునేవాడు.భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలు ప్రధానంగా బ్రిటిషర్ల కాలంలోనే అభివృద్ధి చెందాయి. వీరి కాలంలో మొదటగా 1687లో మద్రాస్‌లో మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. వీటి స్థానంలో 1726లో మేయర్ కోర్టులను స్థాపించారు. బ్రిటిషర్లు జిల్లాను ఒక యూనిట్ గా తీసుకొని 1772లో కలెక్టర్ పదవిని ప్రవేశ పెట్టారు. 1793 చార్టర్ చట్టం ద్వారా కలకత్తా, మద్రాస్ స్థానిక ప్రభుత్వాలకు చట్టబద్ధత కల్పించారు. 1813 చార్టర్ చట్టం ద్వారా ఈ ప్రభుత్వాలకు పన్ను విధించే, వసూలు చేసుకునే అధికారం కల్పించారు. ఎల్గిన్ మేయో, లార్డ్ రిప్పన్ స్థానిక ప్రభుత్వాల అభివృద్ధికి బాగా తోడ్పడ్డారు. మేయో 1870లో, రిప్పన్ 1887లో ఈ ప్రభుత్వాలకు సంబంధించి తీర్మానాలను ప్రవేశపెట్టారు. రిప్పన్ తీర్మానాన్ని స్థానిక ప్రభుత్వాల 'మాగ్నాకార్టా'గా పేర్కొంటారు. ఇతడిని 'స్థానిక ప్రభుత్వాల పితామహుడు' అంటారు. స్థానిక ప్రభుత్వాలు ప్రారంభంలో కొంత కాలంపాటు బాగా పనిచేసి వైఫల్యం చెందాయి. వీటిని సమీక్షించడానికి 1907లో చార్లెస్ హబ్‌హౌస్ అధ్యక్షతన రాయల్ కమిషన్‌ను నియమించారు. ఈ కమిషన్ 1909లో నివేదిక సమర్పించింది. ఈ కమిటీ సిఫారసు మేరకు 1909 మింటోమార్లే సంస్కరణల చట్టం ద్వారా స్థానిక సంస్థలకు ప్రతినిధులను ప్రత్యక్షంగా ఎన్నుకునే పద్ధతిని ప్రవేశపెట్టారు. 1919 మాంటెగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం ద్వారా స్థానిక ప్రభుత్వాలను రాష్ట్ర జాబితాలో అయిదో అంశంగా చేర్చారు. 1935 చట్టం ద్వారా ఈ ప్రభుత్వాలకు మరిన్ని అధికారాలు బదలాయించి బలోపేతం చేశారు.

భారత రాజ్యాంగంలో ఈ ప్రభుత్వాలకు సంబంధించి అధికరణ 40, 243లను చేర్చారు. కానీ వీటిని వెంటనే ఏర్పాటు చేయలేదు. ఫలితంగా గ్రామీణ సమస్యలు అధికమయ్యాయి. వీటి పరిష్కారానికి వి.టి. కృష్ణమాచారి కమిషన్ సిఫారసు మేరకు 1952 అక్టోబరు 2న 55 సమితుల్లో 'సమాజ అభివృద్ధి పథకం (CDP)' ప్రవేశపెట్టారు. దీనికి అమెరికాలోని స్వచ్ఛంద సంస్థ 'ఫోర్డు ఫౌండేషన్' సహకారం అందించింది. ఈ పథకాన్ని మూడేళ్ల కాలానికి ప్రవేశపెట్టారు. దీనికి శాశ్వత కొనసాగింపుగా 1953 అక్టోబరు 2న జాతీయ విస్తరణ పథకాన్ని ప్రవేశపెట్టారు.

సమాజ అభివృద్ధి పథకం, జాతీయ విస్తరణ పథకం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. వీటిని సమీక్షించి సమస్యల పరిష్కారానికి సూచనలు చేయడానికి 1957లో జాతీయ అభివృద్ధి మండలి 'బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ'ని నియమించింది. ఈ కమిటీ 1957 నవంబరులో నివేదిక సమర్పించింది. దీన్ని 1958లో జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించింది.

**బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫారసులు:**

- మూడంచెల పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అవి:
  1. జిల్లా పరిషత్, 2. పంచాయతీ సమితి
  3. గ్రామ పంచాయతీ
- ప్రతి అయిదేళ్లకోసారి నియమబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి.
- ఎన్నికలను పార్టీ ప్రాతిపదికన కాకుండా స్వతంత్ర ప్రాతిపదికన జరపాలి.
- గ్రామ పంచాయతీకి ప్రత్యక్షంగా, పంచాయతీ సమితి, జిల్లా పరిషత్‌కు పరోక్షంగా ఎన్నికలు నిర్వహించాలి.
- రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 1/6 వంతు నిధులను పంచాయతీలకు కేటాయించాలి.

బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫారసులను మొదటిసారిగా రాజస్థాన్ 1959 అక్టోబరు 2న నాగూర్ జిల్లాలో ప్రవేశపెట్టింది. ఆ తర్వాత 1959 నవంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేటి రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి. అనంతరం మరి కొన్ని రాష్ట్రాలు వీటిని ప్రవేశ పెట్టాయి. ఇవి కొంతకాలం పాటు ఆశాజనకంగా పనిచేసినా సకాలంలో నిధులు, విధుల పంపిణీ జరగకపోవడం వల్ల లక్ష్య సాధనలో వైఫల్యం చెందాయి.

బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫారసులను అమలు చేసినా స్థానిక ప్రభుత్వాలు లక్ష్యసాధనలో ఆశించిన ప్రగతి సాధించలేదు. వీటిని పునఃసమీక్షించి సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వడానికి 1977లో మొరార్జీదేశాయ్ నాయకత్వంలోని జనతా ప్రభుత్వం అశోక్ మెహతా కమిటీని నియమించింది. ఈ కమిటీ 1978లో నివేదిక సమర్పించింది.

**అశోక్ మెహతా కమిటీ సూచనలు:**

- మూడంచెల పంచాయతీ వ్యవస్థను రద్దు చేసి దాని స్థానంలో రెండంచెల వ్యవస్థను ప్రవేశపెట్టాలి. జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్‌ను, బ్లాక్ స్థాయిలో మండల పంచాయతీని ఏర్పాటు చేయాలి.
- 1500 నుంచి 20,000 మంది జనాభా ఉన్న కొన్ని గ్రామాలను మండల పంచాయతీగా ఏర్పాటు చేయాలి.
- రెండు స్థాయిల్లో పార్టీ ప్రాతిపదికన పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి.
- ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి.
- పంచాయతీల కాలపరిమితిని నాలుగేళ్లుగా నిర్ణయించాలి.
- ప్రత్యేక ఆడిటింగ్ అకౌంటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

ఈ కమిటీ సిఫారసులను మొదటగా 1980లో కర్ణాటక, ఆ తర్వాత 1986లో ఆంధ్రప్రదేశ్, తర్వాత మరికొన్ని రాష్ట్రాలు ప్రవేశపెట్టాయి.

బ్లాక్ స్థాయిలో ప్రణాళికీకరణపై అధ్య యనం చేయడానికి 1978లో దంత్‌వాలా కమిటీని నియమించారు. ఈ కమిటీ సర్పంచ్‌ను ప్రత్యక్షంగా ఎన్నుకోవాలని, మధ్యస్థాయిలోని బ్లాక్ వ్యవస్థకు ప్రాముఖ్యం ఇవ్వాలని, కలెక్టర్ ప్రధాన పాత్ర పోషించాలని సిఫారసు చేసింది.1984లో సి.హెచ్. హనుమంతరావు కమిటీని నియమించారు. ఇది జిల్లా ప్రణాళిక సంఘాలను ఏర్పాటు చేయాలని, దీని అధ్యక్షునిగా మంత్రి లేదా కలెక్టర్‌ను కొనసాగించాలని సూచించింది.గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, పరిపాలన ఏర్పాట్లు అనే అంశాలను పరిశీ లించడానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1985లో జి.వి.కె. రావు కమిటీని నియమించింది. ఈ కమిటీ జిల్లా అభివృద్ధికి జిల్లాను యూనిట్‌గా తీసుకోవాలని, బ్లాక్ వ్యవస్థను రద్దు చేసి జిల్లా

పరిషత్‌ను పటిష్టం చేయాలని సూచించింది.

స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయడానికి తగిన సిఫారసుల కోసం రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1986లో ఎల్.ఎం. సింఘ్వీ కమిటీని నియమించింది. ఈ కమిటీ 1987లో నివేదిక సమర్పించింది.

**సింఘ్వీ కమిటీ ప్రధాన సిఫారసులు:**

- స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలి.
- న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేయాలి.
- సకాలంలో సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలి.
- పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలి.

గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ 1988లో పి.కె.తుంగన్ అధ్యక్షతన ఉప కమిటీని నియమించింది. ఈ కమిటీ స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలని సిఫారసు చేసింది. ఎల్.ఎం. సింఘ్వీ, పి.కె. తుంగన్ కమిటీల సిఫారసుల మేరకు 1989లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం 64వ, 65వ రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టింది. 64వ సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందగా రాజ్యసభలో వీగిపోయింది. 65వ సవరణ బిల్లు చర్చ సమయంలో లోక్‌సభను రద్దు చేశారు.

స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించే ఉద్దేశంతో 1991లో పి.వి.నరసింహారావు ప్రభుత్వం 73వ, 74వ రాజ్యాంగ సవరణలు ప్రవేశపెట్టింది. ఇవి 1992లో పార్లమెంట్ ఆమోదం పొంది, 1993 నుంచి అమల్లోకి వచ్చాయి.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామీణ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి 'పంచాయతీ రాజ్ చట్టం'గా అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టాన్ని ప్రత్యేకంగా 11వ షెడ్యూల్‌లో చేర్చారు. దీని గురించి అధికరణలు 243 A నుంచి O వరకు తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా IXవ భాగంలో చేర్చారు.

74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి 'నగర పాలక చట్టం'గా అమల్లోకి తెచ్చారు. దీన్ని ప్రత్యేకంగా 12వ షెడ్యూల్‌లో చేర్చారు. ఈ చట్టం గురించి అధికరణలు 243 P నుంచి $Z_G$ వరకు తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా $IX_{(A)}$వ భాగంలో చేర్చారు.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఎవరు ఎన్నుకుంటారు?
   ఎ) ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఓటర్లు
   బి) జిల్లా పరిషత్‌కు ఎన్నికైన సభ్యులు
   సి) మండల పరిషత్ అధ్యక్షులు
   డి) జిల్లాలో ఉన్న సర్పంచ్‌లు
2. భారత్‌లో మొదటిసారిగా పంచాయతీరాజ్ వ్యవస్థను 1959 అక్టోబరులో ఎక్కడ ప్రవేశ పెట్టారు?
   ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
   సి) కేరళ డి) కర్ణాటక
3. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
   ఎ) మార్చి–24 బి) అక్టోబరు–24
   సి) ఆగస్టు–24 డి) ఏప్రిల్–24
4. బ్లాక్ లెవల్ ప్లానింగ్ (బ్లాకు స్థాయి ప్రణాళిక)ను ఏ కమిటీ సిఫారసు చేసింది?
   ఎ) జి.వి.కె. రావు కమిటీ
   బి) ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ
   సి) కె. సంతానం కమిటీ
   డి) దంత్‌వాలా కమిటీ
5. స్థానిక ప్రభుత్వాల పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
   ఎ) మహాత్మా గాంధీ
   బి) సర్దార్ పటేల్
   సి) లార్డ్ రిప్పన్ డి) ఎల్గిన్ మేయో

**సమాధానాలు**

1) బి; 2) ఎ; 3) డి; 4) డి; 5) సి.

### మాదిరి ప్రశ్నలు

1. భారతీయ ప్రముఖుల్లో ఎవరిని స్థానిక ప్రభుత్వాల పితామహుడిగా పేర్కొంటారు?
   ఎ) జవహర్‌లాల్ నెహ్రూ
   బి) మానవేంద్రనాథ్ రాయ్
   సి) మహాత్మా గాంధీ
   డి) సర్దార్ వల్లభాయ్ పటేల్
2. ఏ కమిటీ సిఫారసు మేరకు స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు?
   ఎ) బల్వంత్‌రాయ్ కమిటీ
   బి) అశోక్ మెహతా కమిటీ
   సి) జి.వి.కె. రావు కమిటీ
   డి) ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ
3. స్థానిక ప్రభుత్వాలు ప్రస్తుతం ఏ జాబితాలో ఉన్నాయి?
   ఎ) కేంద్ర జాబితా బి) రాష్ట్ర జాబితా
   సి) ఉమ్మడి జాబితా డి) అవశిష్ట అంశం
4. 'గ్రామ స్వరాజ్య సాధనకు స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలి' అని ఎన్నో అధికరణంలో పేర్కొన్నారు?
   ఎ) 243 బి) 40
   సి) 44 డి) 73
5. ప్రస్తుత పంచాయతీ రాజ్ వ్యవస్థకు మూలం ఏది?
   ఎ) అశోక్ మెహతా కమిటీ
   బి) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ
   సి) దంత్‌వాలా కమిటీ
   డి) రాజమన్నార్ కమిటీ
6. రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించేది ఎవరు?
   ఎ) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
   బి) ప్రధానమంత్రి
   సి) రాష్ట్ర గవర్నర్
   డి) భారత ఆర్థిక సంఘం
7. మండల పంచాయతీ వ్యవస్థను సిఫారసు చేసిన కమిటీ ఏది?
   ఎ) అశోక్ మెహతా కమిటీ
   బి) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ
   సి) నరసింహన్ కమిటీ
   డి) సర్కారియా కమిటీ
8. భారతదేశ చరిత్రలో స్థానిక ప్రభుత్వాలను ప్రవేశపెట్టిన మొదటి రాజవంశం ఏది?
   ఎ) మౌర్యులు బి) చోళులు
   సి) మొగలులు డి) పల్లవులు
9. బ్రిటిషర్ల కాలంలో మొదటి స్థానిక ప్రభుత్వాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?
   ఎ) బొంబాయి బి) మద్రాస్
   సి) కలకత్తా డి) మచిలీపట్నం
10. మనదేశంలో స్థానిక ప్రభుత్వాల 'మాగ్నా కార్టా'గా దేన్ని పేర్కొంటారు?
    ఎ) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ నివేదిక
    బి) అశోక్ మెహతా కమిటీ నివేదిక
    సి) 1887 రిప్పన్ తీర్మానం
    డి) 1870 ఎల్గిన్ మేయో తీర్మానం
11. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం జిల్లా పరిషత్‌ల సంఖ్య ఎంత?
    ఎ) 10 బి) 9
    సి) 22 డి) ఏదీకాదు

**సమాధానాలు**

1) డి; 2) డి; 3) బి; 4) బి; 5) బి; 6) సి; 7) ఎ; 8) ఎ; 9) బి; 10) సి; 11) బి. .

# 'చూడడమనే కళ' పాఠ్యభాగ రచయిత?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

### మాదిరి ప్రశ్నలు

1. నన్నయ ఎవరి ఆస్థాన కవి?
   1) మనుమసిద్ధి
   2) రాజరాజ నరేంద్రుడు
   3) ప్రోలయ వేమారెడ్డి
   4) మాధవ వర్మ
2. నన్నయ రాసిన శాసనం ఏది?
   1) వేంగీ శాసనం
   2) మైదవోలు శాసనం
   3) నందంపూడి శాసనం
   4) కందుకూరి శాసనం
3. భారతాంధ్రీకరణలో నన్నయకు సహకరించిన లేఖకుడు ఎవరు?
   1) గురునాథుడు 2) నారాయణభట్టు
   3) పావులూరి మల్లన
   4) గణపతి
4. దుందుభి పాఠ్య భాగంలోని ఇతివృత్తం?
   1) సంస్కృతి విలువలు
   2) పర్యావరణ ప్రాధాన్యం
   3) నైతిక విలువలు
   4) సామాజిక చైతన్యం
5. మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం ప్రాంతంలో దుందుభి నదిని ఏ పేరుతో పిలుస్తారు?
   1) జయసేన 2) హరిసేన
   3) విజయసేన 4) దేవసేన
6. కిందివాటిలో నన్నయ కవితా గుణం కానిది ఏది?
   1) అక్షర రమ్యత 2) సూక్తి వైచిత్రి
   3) నానారుచిరార్థ సూక్తి నిధిత్వం
   4) ప్రసన్న కథా కలితార్థయుక్తి
7. 'మన సంస్కృతి' పాఠ్యభాగ రచయిత?
   1) నార్ల వేంకటేశ్వరరావు
   2) కాళోజీ
   3) డాక్టర్ బిరుదురాజు రామరాజు
   4) డాక్టర్ పి. యశోరెడ్డి
8. వేంకటేశ శతక కర్త?
   1) తాళ్లపాక అన్నమయ్య
   2) తాళ్లపాక పెద తిరుమలాచార్యులు
   3) చిన తిరుమలాచార్యులు
   4) తరిగొండ వెంగమాంబ
9. 'మిత్ర సాహస్రి' శతక కర్త?
   1) అందె వెంకటరాజం
   2) ఏలూరిపాటి అనంత రామయ్య
   3) కొండూరు వీర రాఘవాచార్యులు
   4) గరికపాటి నరసింహారావు
10. 'దాశరథీ' శతకకర్త ఎవరు?
    1) ధూర్జటి 2) కంచర్ల గోపన్న
    3) దాశరథి కృష్ణమాచార్యులు
    4) రంగాచార్యులు
11. ప్రతిజ్ఞ ఖండిక శ్రీశ్రీ రాసిన ఏ గ్రంథంలోనిది?
    1) మరో ప్రస్థానం 2) ఖడ్గ సృష్టి
    3) సి.ప్రాలి 4) మహా ప్రస్థానం
12. 'హరిశ్చంద్రుడు' పాఠ్యభాగం గౌరన రచించిన ఏ గ్రంథంలోనిది?
    1) నవనాథ చరిత్ర 2) లక్షణ దీపిక
    3) హరిశ్చంద్రోపాఖ్యానం
    4) షట్చక్రవర్తుల కథ
13. గౌరన హరిశ్చంద్రోపాఖ్యానం ఏ ప్రక్రియకు చెందింది?
    1) పద్యం 2) ద్విపద
    3) మంజరీ ద్విపద 4) గేయం
14. 'అజంతా చిత్రాలు' పాఠ్యభాగ రచయిత?
    1) విద్వాన్ విశ్వం
    2) నార్ల వేంకటేశ్వరరావు
    3) సంజీవదేవ్
    4) వట్టికోట ఆళ్వారుస్వామి
15. వట్టికోట ఆళ్వారుస్వామి 'చిన్నప్పుడే' కథానికను ప్రచురించిన పత్రిక ఏది?
    1) గోల్కొండ 2) కాకతీయ
    3) తెలంగాణ 4) మీజాన్
16. ఆంధ్ర మహాభారతంలో తిక్కన రచించిన పర్వాలెన్ని?
    1) 12 2) 14 3) 15 4) 13
17. కిందివాటిలో తిక్కన కవితా గుణం కానిది?
    1) నాటకీయత 2) పాత్ర చిత్రణ
    3) తెనుగుతనం 4) అక్షర రమ్యత
18. 'సర్వేశ్వర' శతకకర్త ఎవరు?
    1) పాల్కురికి సోమన
    2) యథావాక్కుల అన్నమయ్య
    3) కూచిమంచి తిమ్మకవి
    4) బద్దెన
19. 'దుష్ట సంహార నరసింహదురిత దూర' - మకుటంతో నరసింహ శతకం రాసిన కవి?
    1) గోగుల పాటి కూర్మనాథకవి
    2) కాసుల పురుషోత్తమ కవి
    3) కాకుత్సం శేషప్పకవి
    4) మారద వెంకయ్య
20. కుమార శతక కర్త ఎవరు?
    1) బద్దెన 2) కుమార ధూర్జటి
    3) ఫక్కి అప్పల నరసయ్య
    4) ధూర్జటి
21. శ్రీ భర్గ శతక కర్త?
    1) ధూర్జటి
    2) కూచిమంచి తిమ్మకవి
    3) సర్వేశ్వర కవి 4) పాల్కురికి సోమన
22. 'ప్రబోధం' పాఠ్యభాగ రచయిత ఎవరు?
    1) రాయప్రోలు సుబ్బారావు
    2) కాళోజీ
    3) ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ
    4) కనుపర్తి వరలక్ష్మమ్మ
23. కనుపర్తి వరలక్ష్మమ్మ 'ప్రబోధం' పాఠ్యాంశం ఏ గ్రంథంలోనిది?
    1) గాంధీ దండకం 2) శారద లేఖలు
    3) మా చెట్టు నీడ ముచ్చట్లు
    4) ధర్మము నా జీవము
24. 'శారద లేఖలు' మొట్టమొదట ఏ పత్రికలో ప్రచురించారు?
    1) భారతి 2) కృష్ణాపత్రిక
    3) గృహలక్ష్మి 4) వినోదవాణి
25. 'రుబాయీలు' పాఠ్యభాగ రచయిత?
    1) డాక్టర్ దాశరథి
    2) డాక్టర్ సామల సదాశివ
    3) డాక్టర్ సి. నారాయణరెడ్డి
    4) డాక్టర్ నాగభైరవ
26. 'చూడడమనే కళ' పాఠ్యభాగ రచయిత?
    1) సామల సదాశివ
    2) నార్ల వేంకటేశ్వరరావు
    3) జిడ్డు కృష్ణమూర్తి
    4) కనుపర్తి వరలక్ష్మమ్మ
27. 'చూడడమనే కళ' పాఠ్యాంశంలో ఇతివృత్తం ఏది?
    1) సామాజిక చైతన్యం
    2) ప్రకృతి పరిశీలనం
    3) గ్రామీణ జీవనం
    4) సామాజిక స్పృహ
28. జిడ్డు కృష్ణమూర్తి 'ఏ టైమ్ లెస్ స్ప్రింగ్' ఆంగ్ల రచనకు అరుణామోహన్ చేసిన అనువాదం పేరు?
    1) గరుడయానం 2) ధ్యానం
    3) అనాదిప్రోతస్సు 4) నీవే ప్రపంచం
29. కాళోజీ 'ఈప్స' పాఠ్యభాగం ఏ ప్రక్రియకు సంబంధించింది?
    1) గేయ కవిత 2) పద్య కవిత
    3) మినీ కవిత 4) వచన కవిత
30. 'ససేమిరా' పాఠ్యభాగ రచయిత 'కొరవి గోపరాజు' ఏ శతాబ్దికి చెందినవారు?
    1) 14వ శతాబ్దం 2) 15వ శతాబ్దం
    3) 16వ శతాబ్దం 4) 13వ శతాబ్దం
31. కొరవి గోపరాజు బిరుదు ఏది?
    1) కవితా వతంస
    2) బహుభాషా ప్రవీణ
    3) చతుర్విధ కవితా శారదుడు
    4) బహుశాస్త్ర పండితుడు
32. 'బతుకు పుస్తకం' ఎవరి ఆత్మకథ?
    1) ఉప్పల లక్ష్మణరావు
    2) అబ్దుల్ కలాం
    3) నార్ల వేంకటేశ్వరరావు
    4) సావిత్రి
33. దువ్వూరి రామిరెడ్డి రాజు చేతి పాలనా దండం కంటే ఏది గొప్పదని చెప్పారు?
    1) కలం 2) నాగలి
    3) గొడ్డలి 4) గునపం
34. 'ధర్మదీక్ష' పాఠ్యభాగం పిలకా గణపతి శాస్త్రి ఏ గ్రంథంలోనిది?
    1) విశాల నేత్రాలు 2) మణిదీపిక
    3) ప్రాచీన గాథాలహరి
    4) రత్నాపహారం
35. ఎవరి జయంతిని మాతృభాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు?
    1) గురజాడ
    2) గిడుగు రామమూర్తి పంతులు
    3) వీరేశలింగం
    4) చిలకమర్తి లక్ష్మీ నరసింహం
36. బళ్లారి రాఘవ నట ప్రతిభకు ముగ్ధుడై 'రాఘవ మహారాజ్‌కి జై' అని ప్రశంసించిన వారు?
    1) రాజాజీ
    2) రవీంద్రనాథ్ ఠాగూర్
    3) గాంధీజీ 4) నెహ్రూ
37. 'నా సమాజాన్ని, సంస్కృతినీ, దేశాన్ని, ధర్మాన్ని విశ్వయవనిక మీద ఆవిష్కరించడమే నా లక్ష్యం' అని సగర్వంగా చెప్పిన చిత్రకారుడు?
    1) సంజీవదేవ్ 2) గుర్రం మల్లయ్య
    3) కాపు రాజయ్య 4) బాపు
38. మిద్దె రాములు ఒగ్గు కళాకారుడిగా మారేందుకు స్ఫూర్తినిచ్చిందెవరు?
    1) బగ్గం ఓదేలు 2) ఒగ్గరి అయిలయ్య
    3) కంబల్ల అయిలయ్య
    4) బగ్గం ఎంకటిగాడు
39. మిద్దె రాములు పొందిన కళా పురస్కారం?
    1) కళారత్న అవార్డు
    2) రాజీవ్ ప్రతిభా పురస్కారం
    3) తెలుగు విశ్వవిద్యాలయం కళా పురస్కారం
    4) పైవన్నీ
40. ఎర్రన బిరుదులేవి?
    1) కవిబ్రహ్మ, ఉభయ కవిమిత్రుడు
    2) ఆదికవి, శబ్ద శాసనుడు
    3) శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు
    4) సహజ కవి, నవీన గుణసనాథుడు
41. చిన్నయసూరిని 'సూరి' బిరుదుతో సత్కరించినవారు?
    1) సి.పి. బ్రౌన్ 2) అర్బత్‌నాట్
    3) కాల్డ్వెల్ 4) మెకాలే
42. 'బసవేశ్వరుడి పరిణయం' పాఠ్యభాగ రచయిత ఎవరు?
    1) పండితారాధ్యుడు
    2) పాల్కురికి సోమనాథుడు
    3) గౌరన
    4) యథావాక్కుల అన్నమయ్య
43. 'మాతృభావన' పాఠ్యభాగంలో ఇతివృత్తం?
    1) మానవతా విలువలు
    2) శ్రమపట్ల గౌరవం
    3) స్త్రీలపట్ల గౌరవం
    4) భారతీయ సంస్కృతి
44. 'పన్ లక్షత్ కౌన్ ఘతో' - అనే మరాఠీ పుస్తకాన్ని తెలుగులో 'అబలా జీవితం'గా అనువదించిన రచయిత?
    1) గుంటూరి శేషేంద్ర శర్మ
    2) సామల సదాశివ
    3) సి. నారాయణరెడ్డి
    4) పి.వి. నరసింహారావు
45. గత శతాబ్దంలో స్త్రీల పోరాటాలు, ఉద్యమాలు, రాణించిన రంగాల గురించి వివరించిన పాఠ్యభాగం?
    1) ధన్యుడు 2) నగర గీతం
    3) మా ప్రయత్నం 4) ధర్మదీక్ష
46. తొలి తెలుగు శతకమైన వృషాధిప శతకకర్త?
    1) బద్దెన 2) పాల్కురికి సోమన
    3) ఎలకూచి బాల సరస్వతి
    4) పోతన
47. ప్రేరణ పాఠ్యభాగ అనువాద రచయిత?
    1) పి.వి. నరసింహారావు
    2) ధన గోపాల్ ముఖర్జీ
    3) వాడ్రేవు చిన వీరభద్రుడు
    4) అరుణామోహన్
48. ఎ.పి.జె. అబ్దుల్ కలాం పూర్తి పేరేమిటి?
    1) అవుల్ పండిట్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలాం
    2) అవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలాం
    3) అబ్దుల్ ఫకీర్ జైనులాబ్దీన్ కలాం
    4) ఆవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ కలాం
49. కాశీఖండం కృతిపతి?
    1) మామిడి సింగన
    2) వల్లభ రాయుడు
    3) వీరభద్రారెడ్డి
    4) అవచి తిప్పయ్య శెట్టి
50. హరిహర బ్రహ్మదులను తన పాతివ్రత్య మహిమతో చంటి బిడ్డలుగా చేసిన సాధ్వి?
    1) సావిత్రి 2) సుమతి
    3) అనసూయ 4) సీత
51. 'కవిరాజు' బిరుదు ఉన్న శతక రచయిత?
    1) ఉత్పల సత్యనారాయణచార్యులు
    2) నంబి శ్రీధర్‌రావు
    3) వ.సు. రాయకవి
    4) శ్రీపతి భాస్కరకవి
52. ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి ఎవరు?
    1) తిక్కన 2) నన్నయ
    3) ఎర్రన 4) పోతన
53. మనుమసిద్ధి మహారాజు ఆస్థాన కవి?
    1) తిక్కన 2) శ్రీనాథుడు
    3) మారన 4) కేతన
54. నృసింహ పురాణ కృతిపతి?
    1) ప్రోలయ వేమారెడ్డి
    2) మల్లారెడ్డి
    3) అహోబిల నృసింహస్వామి
    4) రాజరాజ నరేంద్రుడు

**సమాధానాలు**

1) 2; 2) 3; 3) 2; 4) 2; 5) 4; 6) 2; 7) 3; 8) 2; 9) 3; 10) 2; 11) 4; 12) 3; 13) 2; 14) 2; 15) 4; 16) 3; 17) 4; 18) 2; 19) 3; 20) 3; 21) 2; 22) 4; 23) 2; 24) 3; 25) 2; 26) 3; 27) 2; 28) 3; 29) 4; 30) 2; 31) 3; 32) 1; 33) 2; 34) 3; 35) 2; 36) 3; 37) 3; 38) 2; 39) 4; 40) 3; 41) 2; 42) 2; 43) 3; 44) 4; 45) 3; 46) 2; 47) 3; 48) 2; 49) 3; 50) 3; 51) 2; 52) 3; 53) 1; 54) 3..

# తొలిసారిగా జీపీఎస్‌ను అభివృద్ధి చేసిన దేశం ?

## భారత అంతరిక్ష కార్యక్రమం

1. ఇస్రో ఏ దేశ సౌజన్యంతో సరళ్ అనే ఉపగ్రహాన్ని నిర్మించింది?
ఎ) ఫ్రాన్స్ బి) ఇజ్రాయెల్
సి) స్విట్జర్లాండ్ డి) అమెరికా
2. హబుల్ స్పేస్ టెలిస్కోపు తరహాలో భారత్ అభివృద్ధి చేస్తున్న ఖగోళశాస్త్ర పరిశోధన ఉపగ్రహం ఏది?
ఎ) ఆదిత్య బి) ఏస్ట్రోశాట్
సి) గెలీలియో డి) ఏదీకాదు
3. పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్లను నిర్మించే కేంద్రం ఏది?
ఎ) విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రం
బి) సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం
సి) స్పేస్ అప్లికేషన్స్ సెంటర్
డి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ & టెక్నాలజీ
4. సుదూర రోదసిలోకి ప్రయోగించే చంద్రయాన్, మంగళ్‌యాన్ లాంటి ఉపగ్రహాల నుంచి సమాచారాన్ని తీసుకోవడానికి ఉద్దేశించిన ఇండియా డీప్ స్పేస్ నెట్‌వర్క్ (IDSN) అనే గ్రౌండ్ వ్యవస్థను ఎక్కడ ఏర్పాటు చేశారు ?
ఎ) గాదంకి, తిరుపతి
బి) బైలాలు, బెంగళూరు
సి) తిరువనంతపురం
డి) హైదరాబాద్
5. మంగళ్‌యాన్ బరువు ఎంత?
ఎ) 2562 కిలోలు బి) 3333 కిలోలు
సి) 1337 కిలోలు డి) 5555 కిలోలు
6. ఇండియన్ రీజినల్ నేవిగేషనల్ శాటిలైట్ సిస్టమ్ ఇప్పటివరకు ఎన్ని ఉపగ్రహాలను ప్రయోగించింది?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
7. భారత్ తొలిసారిగా రాకెట్‌ను ఎప్పుడు ప్రయోగించింది?
ఎ) 1963 నవంబర్ 21
బి) 1975 ఏప్రిల్ 1
సి) 1969 ఆగస్టు 15
డి) 1975 ఏప్రిల్ 19
8. ఇస్రో వాణిజ్య విభాగం ఏది?
ఎ) ఇస్రో శాటిలైట్ సెంటర్
బి) స్పేస్ అప్లికేషన్స్ సెంటర్
సి) యాంట్రిక్స్ కార్పొరేషన్
డి) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్

9. యురోపియన్ యూనియన్ అభివృద్ధి చేస్తున్న ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ ?
ఎ) క్వాశీజెనిథ్ బి) బిడే
సి) గెలీలియో డి) గ్లోనాస్
10. నాసా ప్రయోగించిన ఏ ఉపగ్రహం సౌర వ్యవస్థ వెలుపల అంతర నక్షత్ర ప్రాంతానికి చేరింది?
ఎ) క్యూరియాసిటీ బి) మావెన్
సి) అట్లాంటిస్ డి) వాయేజర్
11. ఇండియన్ రీజినల్ నావిగేషనల్ శాటిలైట్ వ్యవస్థ భారత భూభాగ సరిహద్దుల నుంచి ఎంత దూరం వరకు సేవలు అందిస్తుంది?
ఎ) 1500 కి.మీ. బి) 3000 కి.మీ.
సి) 5000 కి.మీ. డి) 6500 కి.మీ.
12. ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థలో సేవలకు కనీసం ఎన్ని ఉపగ్రహాలు అవసరం?
ఎ) 1 బి) 2 సి) 4 డి) 6
13. ఇస్రో ప్రయోగించిన స్పాట్-6, స్పాట్-7 ఉపగ్రహాలు ఏ దేశానికి చెందినవి?
ఎ) ఫ్రాన్స్ బి) ఆస్ట్రేలియా
సి) జపాన్ డి) జర్మనీ
14. IRNSS-1D ఉపగ్రహం బరువు?
ఎ) 2,500 కిలోలు బి) 1425 కిలోలు
సి) 3,500 కిలోలు డి) 750 కిలోలు
15. దేశీయ క్రయోజనిక్ ఇంజన్‌ను విజయవంతంగా ప్రయోగించిన నౌక?
ఎ) పీఎస్ఎల్‌వీ సీ 27
బి) పీఎస్ఎల్‌వీ సీ 25
సి) జీఎస్ఎల్‌వీ డీ 3
డి) జీఎస్ఎల్‌వీ డీ 5
16. ఉపగ్రహ ఆధారిత విమానయానానికి ఉద్దేశించిన వ్యవస్థ?
ఎ) ఆకాశ్ బి) గగన్
సి) భువన్ డి) IRNSS
17. తొలిసారిగా జీపీఎస్‌ను అభివృద్ధి చేసిన దేశం?
ఎ) బ్రిటన్ బి) ఫ్రాన్స్
సి) అమెరికా డి) రష్యా
18. 'మార్స్ వన్' కార్యక్రమానికి భారత్ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. కిందివారిలో దీనికి ఎవరు ఎంపిక కాలేదు?
ఎ) రితికా సింఘ్
బి) అవినాష్ సక్సేనా
సి) శ్రద్ధ ప్రసాద్
డి) తరన్‌జిత్ సంఘ్ భాటియా
19. అమెరికా అభివృద్ధి చేసిన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టంలోని ఉపగ్రహాల సంఖ్య?
ఎ) 16 బి) 24 సి) 28 డి) 32
20. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఎక్కడ ఉంది?
ఎ) డెహ్రాడూన్ బి) ముంబై

### గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
### జనరల్ స్టడీస్
### సైన్స్ అండ్ టెక్నాలజీ

సి) తిరువనంతపురం డి) బెంగళూరు
21. చంద్రయాన్-1 ప్రయోగాన్ని ఎప్పుడు నిర్వహించారు?
ఎ) 2007 బి) 2008
సి) 2009 డి) 2010
22. చంద్రయాన్-1లో భారత్‌తో భాగస్వామ్యం కాని దేశం ?
ఎ) బ్రిటన్
బి) అమెరికా
సి) యురోపియన్ యూనియన్
డి) బెల్జియం
23. 4500-5000 కిలోల బరువున్న ఉపగ్రహాలను సైతం ప్రయోగించగలిగే భారత అంతరిక్ష నౌక?
ఎ) పీఎస్ఎల్‌వీ - XL
బి) జీఎస్ఎల్‌వీ - మార్క్ I
సి) జీఎస్ఎల్‌వీ - మార్క్ II
డి) జీఎస్ఎల్‌వీ - మార్క్ III
24. పీఎస్ఎల్‌వీ ఇప్పటివరకు వరుసగా ఎన్ని విజయాలను నమోదు చేసుకుంది?
ఎ) 30 బి) 29 సి) 28 డి) 27
25. ఇస్రో ఆధ్వర్యంలో పనిచేసే ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ ఎక్కడ ఉంది?
ఎ) అహ్మదాబాద్ బి) పుణే
సి) తిరువనంతపురం డి) శ్రీహరికోట
26. సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రంలో పూర్తిస్థాయిలో ఎన్ని రాకెట్ లాంచింగ్ పాడ్‌లు ఉన్నాయి?
ఎ) 1 బి) 2
సి) 3 డి) 4
27. ఇప్పటివరకు ఎన్ని జీఎస్ఎల్‌వీ ప్రయోగాలు నిర్వహించారు?
ఎ) 7 బి) 8 సి) 9 డి) 10
28. చుట్టూ స్ట్రాప్-ఆన్ మోటార్లు లేని పీఎస్ఎల్‌వీ కోర్ అలోన్ రూపం లిఫ్ట్-ఆఫ్ సమయంలో బరువు ఎంత?
ఎ) 294 టన్నులు బి) 320 టన్నులు
సి) 230 టన్నులు డి) 630 టన్నులు
29. అత్యధికంగా ఒకేసారి పది ఉపగ్రహాలను ప్రయోగించిన పీఎస్ఎల్‌వీ నౌక ఏది?
ఎ) పీఎస్ఎల్‌వీ సీ 8
బి) పీఎస్ఎల్‌వీ సీ 9
సి) పీఎస్ఎల్‌వీ సీ 10
డి) పీఎస్ఎల్‌వీ సీ 11
30. నేషనల్ అట్మాస్ఫెరిక్ రీసెర్చ్ లాబొరేటరీ ఎక్కడ ఉంది?
ఎ) హైదరాబాద్ బి) తిరుపతి
సి) చెన్నై డి) బెంగళూరు
31. ఇస్రో ప్రయోగించిన జపాన్ ఉపగ్రహం?
ఎ) టెక్సర్ బి) అజైల్
సి) యూనిబ్రైట్ డి) ప్రొ మెటరస్
32. ఇస్రో ఇప్పటివరకు కిందివాటిలో ఏ దేశ ఉపగ్రహాలను ప్రయోగించలేదు?
ఎ) అల్జీరియా బి) లక్సెంబర్గ్
సి) అర్జెంటీనా డి) నైజీరియా
33. భారత వ్యోమగామి అధికారిక పేరు?
ఎ) వ్యోమోనాట్ బి) రోదసీనాట్
సి) ఖగోళనాట్ డి) పైవేవీకావు
34. ఇస్రో ఇనర్షియల్ సిస్టం యూనిట్ ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు
బి) అహ్మదాబాద్
సి) తిరువనంతపురం
డి) ముంబై
35. అంగారక కక్ష్యలోకి విజయవంతంగా మంగళ్‌యాన్ చేరినట్లు మొదట గుర్తించింది?
ఎ) ఇండియా డీప్ స్పేస్ నెట్‌వర్క్
బి) కాన్‌బెర్రా డీప్ స్పేస్ నెట్‌వర్క్
సి) నాసా డీప్ స్పేస్ నెట్‌వర్క్
డి) యురోపియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్
36. అంగారకుడిపై ప్రధానంగా ఏ వాయువును గుర్తిస్తే జీవ సంకేతాలకు సమాచారం లభించే అవకాశముంటుంది?
ఎ) అమ్మోనియా బి) మీథేన్
సి) హైడ్రోజన్ డి) ఆక్సిజన్
37. చంద్రయాన్-1లో భాగంగా ఏ దేశానికి చెందిన పరికరం చంద్రునిపై నీటి జాడలను గుర్తించింది?
ఎ) భారత్ బి) అమెరికా
సి) బెల్జియం డి) జర్మనీ
38. ఇస్రో పీఎస్ఎల్‌వీ - సీ 18 ద్వారా ప్రయోగించిన జుగ్ను ఉపగ్రహాన్ని నిర్మించింది?
ఎ) ఐఐటీ, లక్నో
బి) ఐఐటీ, చెన్నై
సి) ఐఐటీ, కాన్పూర్
డి) ఐఐటీ, ముంబై
39. ఈశాన్య రాష్ట్రాల్లో అంతరిక్ష సేవలను విస్తరించే లక్ష్యంతో ఏర్పాటైన నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ ఎక్కడ ఉంది?
ఎ) యుమియం, మేఘాలయ
బి) పాకియాంగ్, సిక్కిం
సి) దిస్‌పూర్, అసోం
డి) అగర్తల, త్రిపుర
40. క్రయోజనిక్ ఇంజన్‌లో వినియోగించే ప్రొపెల్లెంట్?
ఎ) ద్రవ ఆక్సిజన్
బి) డై మిథైల్ హైడ్రోజన్
సి) ద్రవ హైడ్రోజన్
డి) పాలిబ్యుటాడైఈన్
41. జీఎస్ఎల్‌వీ కార్యక్రమం ఎప్పుడు మొదలైంది?
ఎ) 1990 బి) 1993
సి) 1995 డి) 1997

**సమాధానాలు**

| | | | |
|---|---|---|---|
| 1) ఎ; | 2) బి; | 3) ఎ; | 4) బి; |
| 5) సి; | 6) డి; | 7) ఎ; | 8) సి; |
| 9) సి; | 10) డి; | 11) ఎ; | 12) సి; |
| 13) ఎ; | 14) బి; | 15) డి; | 16) బి; |
| 17) సి; | 18) బి; | 19) బి; | 20) ఎ; |
| 21) బి; | 22) ఎ; | 23) డి; | 24) సి; |
| 25) ఎ; | 26) బి; | 27) బి; | 28) సి; |
| 29) బి; | 30) బి; | 31) డి; | 32) డి; |
| 33) ఎ; | 34) సి; | 35) బి; | 36) బి; |
| 37) బి; | 38) సి; | 39) ఎ; | 40) సి; |
| 41) ఎ. | | | |

# Few people practice what they...

## Model Questions

***Directions (Q. No. 1-6):*** Read the passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

It is easy for the government to control state owned companies through nods and winks. So, what really needs to be done as a first step is to put petrol pricing on a **transparent** formula. If the price of crude is x and the exchange rate y, than every month or fortnight, the government announces a **maximum** price of petrol, which anybody can work out from the x and the y. The rule has to be worked out to make sure that the oil-marketing companies can, in general, cover their costs. This will mean that if one company can innovate and cut costs, it will make greater profits. Hence, firms will be more prone to innovate and will be more efficient under this system. Once the rule is announced there should be no **interference** by the government. If, this is done for a while, private companies will reenter this market. And once a sufficient number of them are in **fray**, we can remove the rule based pricing and leave it truly to the market.

1. According to the passage an oil company can make greater profits, if a transparent pricing for petrol pricing is announced every fortnight or month, by
a) Promoting its sales
b) Undertaking innovation
c) Cutting costs
d) Selling its equity shares at higher prices
Which of the statements given above is/are correct?
1) a only 2) b & c
3) c & d 4) a, b, & d 5) c only
2. According to the passage, private oil companies reenter the market if
a) A transparent rule based petrol pricing exists
b) There is no government interference in the oil producing market
c) Subsidies are given by the government
d) Regulations of anti-trust are removed
Which of the statements given above are correct?
1) a & b 2) b & c
3) c & d 4) b & d 5) a & c
3. The synonym of **transparent** is
1) Opaque 2) Visible
3) Obscure 4) Dense
5) Thick
4. The synonym of fray is
1) Scrimmage 2) Amicable
3) Harmony 4) Accord
5) Concord
5. The synonym of interference is
1) Prying 2) Preying
3) Praying 4) Praising
5) Pricking
6. The antonym of maximum is
1) Optimum 2) Zenit
3) Pinnacle 4) Least
5) Summit

***Directions (Q. No. 7-10):*** Choose the word which is wrongly spelt from the five options given.

7. 1) servitude 2) debenture
3) promiscous 4) reminiscence
5) juvenile
8. 1) comitment 2) session
3) garage 4) gargle
5) phlegm
9. 1) rendevous 2) bourgeois
3) repertoire 4) memoir
5) aficionado
10. 1) avalanche 2) bouqet
3) boutique 4) chameleon
5) veracity

***Directions (Q.No. 11 - 20):*** Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

11. The workweek in the United States (1)/ have steadily increased to the point (2)/ that the average worker now puts in (3)/ an estimated 164 extra hours of paid labor a year. (4)/ No error (5)
12. Astronomers studying (1)/ the newly discovered star (2)/ said that it provides clues (3) / about our galaxy's origin. (4)/ No error (5)
13. Building large new hospitals (1)/ (2)/ would constitute (3)/ the wasteful use of resources. (4)/ No error (5)
14. Corporations will soon be required (1)/ to report to the government (2)/ whether they had the necessary reserves (3)/ to



## BANK EXAMS
## GENERAL ENGLISH

pay the pension benefits. (4)/ No error (5)

15. For most consumers, (1)/ the price of automobile insurance (2)/ continues (3)/ to raise annually. (4)/ No error (5)
16. Geologists believe that the warning signs from a major earthquake (1)/ may include sudden fluctuations (2)/ in local seismic activity, (3)/ tilting and other deformations of the Earth's crust. (4)/ No error (5)
17. Humans have been damaging (1)/ the environment for centuries (2)/ by overcutting trees (3)/ and farming to intensively. (4)/ No error (5)
18. If industrial pollution continues to deplete the ozone layer, (1)/ the result increase in ultraviolet radiation (2)/ will endanger human health, (3)/ causing a rise in the incidence of skin cancer and eye disease. (4)/ No error (5)
19. Ignoring the admonitions of his staff, (1)/ the chief financial officer (2)/ accepted the advice (3)/ if the consulting company. (4)/ No error (5)
20. In a plan to stop the erosion of East Coast beaches, (1)/ the Army Corps of Engineers (2)/ proposed building parallel to shore (3)/ breakwater of rocks. (4)/ No error (5)

***Directions: (Q No. 21 -25):*** Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. When I entered the room, I saw a snake crawling on the ground.
1) On the floor
2) In the ground
3) In the flooring
4) On the land
5) No correction required
22. I get a monthly allowance of hundred rupees.
1) Hundred rupees
2) A hundred rupees
3) For hundred rupee
4) Hundreds rupee
5) No correction required
23. My sister and myself are pleased to accept your invitation to dinner.
1) Ourselves 2) Mine
3) I 4) Me
5) No correction required
24. Harish has read almost each book of the college library.
1) Many books 2) All book
3) Much books 4) Every book
5) No correction required
25. He never has, and never will permit such practices in his office.
1) Permitted nor ever will permit
2) Permitted nor will ever permit
3) And will never permit
4) Nor will permit
5) No correction required

***Directions (Q.No. 26 - 35):*** Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

26. I shall acquaint you —— the facts.
1) of 2) about
3) with 4) for
5) from
27. My uncle —— speak five languages.
1) ought 2) might
3) used 4) could
5) will
28. Progressive Muslims were —— when the Prime Minister bought a bill to —— the Muslim fundamentalists.
1) Taken after… appear
2) Taken for… please
3) Taken in… impress
4) Taken back… appease
5) Taken to… amaze
29. In order to keep his position ——, the politician —— his colleague to the wolves.
1) Safely…through
2) Safety…through
3) Safe… thrown
4) Secure…threw
5) Safer… made
30. Few people practice what they ——.
1) Urge 2) Preach
3) Lecture 4) Deliver
5) Advocate
31. —— to increase in wage of labourers, many farmers were forcing their children to involve them in—— activities.
1) Owing…farm
2) Because… farming
3) As… agriculture
4) Remaining… subsequent
5) Schedule… prosperous
32. Every day, in some part of our world, a scientific —— happens.
1) Break away 2) Break off
3) Breakthrough 4) Break even
5) Break upon
33. The huge procurement —— all the more necessary with the —— of the food security act.
1) Is becoming…importance
2) Becomes… implementation
3) Became… production
4) Become… prevention
5) Becoming… propulsion
34. The problems that ——higher education in India today are low rates of enrolment and poor —— of infrastructure.
1) Confront… quality
2) Encounter… quantity
3) Belong… property
4) Come… value
5) Pursuit… rate
35. There is a —— control over food supply in India.
1) Deal 2) duel
3) dual 4) drool
5) lot

***Directions (Q. 36-40):*** Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) I was the seventh child in a family of four pairs of brothers and sisters.
B) Today perhaps your only association with the word 'polio' is the Sabin Oral Vaccine that protects children from the disease.
C) I was also considered to be the healthiest of the brood.
D) If somebody had predicted, when I was born that this would happen to me, no one would have believed it.
E) The dreaded disease, which mainly affects the brain and the spinal cord, causes stiffening and weakening of the muscles, crippling and paralysis – which is why I am in a wheelchair today.
F) Fifty five years ago, this was not so.

36. What is the FIRST sentence after rearrangement?
1) C 2) B
3) D 4) E 5) F
37. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B
3) D 4) F 5) E
38. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C
3) D 4) E 5) F
39. What is the FIFTH sentence after rearrangement?
1) B 2) A
3) D 4) E 5) F
40. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B
3) D 4) E 5) F

**Answers**

| | | | | |
|---|---|---|---|---|
| 1) 2 | 2) 1 | 3) 2 | 4) 1 | 5) 1 |
| 6) 4 | 7) 3 | 8) 1 | 9) 1 | 10) 2 |
| 11) 2 | 12) 3 | 13) 3 | 14) 3 | 15) 4 |
| 16) 1 | 17) 4 | 18) 2 | 19) 4 | 20) 5 |
| 21) 1 | 22) 2 | 23) 3 | 24) 4 | 25) 1 |
| 26) 3 | 27) 4 | 28) 4 | 29) 4 | 30) 2 |
| 31) 1 | 32) 3 | 33) 2 | 34) 1 | 35) 3 |
| 36) 2 | 37) 5 | 38) 3 | 39) 2 | 40) 5. |